www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 28-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 209 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి ఉ. 8.00 వరకు తదుపరి సప్తమి; నక్షత్రం: పూర్వాషాఢ మ.3.45 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: రా.12.20-2.03; దుర్ముహూర్తం: ఉ.8.33-9.18, రా.9.49-10.38; అమృతఘడియలు: ఉ.10.29-12.14; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.15; సూర్యాస్తమయం: 5.41 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

19 వాహనాలు బైక్‌ను తప్పించుకెళ్లాయి..

ఒక్క కావేరీ బస్సే బైక్‌ను ఈడ్చుకెళ్లింది

దీనికి డ్రైవర్ లక్ష్మయ్య నిర్లక్ష్యమే కారణం

కర్నూలు ప్రమాద ఘటనలో కొత్త కోణాలు

దర్యాప్తు కొనసాగిస్తున్న పోలీసులు

3

నేడు, రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు

మొంథా తుపాను ప్రభావం.. ఆరెంజ్ అలెర్ట్

పంటల కొనుగోళ్లపై అప్రమత్తంగా ఉండాలి

అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

నేడు, రేపు హైదరాబాద్-విశాఖపట్నం మధ్య 10 ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు

14



జూబ్లీ ఫైట్!

హీటెక్కిన ఉప ఎన్నిక ప్రచారం.. ప్రచార రంగంలోకి సీఎం

- నేడు సినీ కార్మికుల అభినందన సభ
- నియోజకవర్గంలో ఐదు రోజులు రోడ్ షోలు
- నియోజకవర్గాన్ని చుట్టేస్తున్న కేటీఆర్, హరీశ్‌రావు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల పరస్పర ఫిర్యాదులు
- సీఎం ప్రచారంపై పొన్నం ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- ఎన్నికపై మహేశ్ సమీక్ష. పాల్గొన్న భట్టి, మీనాక్షి
- ఒక్కో కాంగ్రెస్ నేతకు 100 మంది ఓటర్ల బాధ్యత
- సెగ్మెంట్లో నేడు బీజేపీ మహా పాదయాత్ర

జూబ్లీహిల్స్‌లో గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, వివేక్ కాళ్లకు బలపం కట్టుకుని మరీ నియోజకవర్గంతా ప్రచారం చేస్తున్నారు! ఇప్పుడు ఉప ఎన్నికల్లో గెలుపు కోసం నేరుగా సీఎం రేవంత్ బరిలోకి దిగుతున్నారు! ఓ భారీ సభతోపాటు 5 రోజులపాటు రోడ్ షోలు కూడా నిర్వహించనున్నారు!

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఏకంగా 400 మంది స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించారు. భారీ మెజారిటీతో గెలవాలంటూ దిశా నిర్దేశం చేశారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు జూబ్లీహిల్స్ ప్రచారాన్ని తమ భుజస్కంధాలపై వేసుకుని ఇల్లిల్లూ చుట్టేస్తున్నారు!

కార్పెట్ బాంబింగ్..! మంగళవారం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో నిర్వహించనున్న మహా పాదయాత్రకు బీజేపీ పెట్టుకున్న ముద్దు పేరు ఇది! రాష్ట్రంలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులంతా ఇందులో పాల్గొంటారు! అందుకే.. కొద్ది రోజులుగా జూబ్లీహిల్స్‌లోనే తిష్ట వేసిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మంగళవారం జరగనున్న కేంద్ర క్యాబినెట్ సమావేశానికి కూడా వెళ్లట్లేదు!!

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నికల ప్రచారం వేడెక్కింది. ఇక్కడ గెలుపు కోసం మూడు పార్టీల నేతలూ చెమటోడుస్తున్నారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తమ ప్రచారాన్ని ఉధృతం చేశారు. ఇప్పటికే మంత్రులు, కాంగ్రెస్ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. తాజాగా, మంగళవారం

మిగతా 13వ పేజీలో...



ఆటోడ్రైవర్ల బతుకులు ఆగమాగం

వారిని రోడ్డున పడేసిన కాంగ్రెస్ సర్కారు

వారికిచ్చిన హామీలు అమలు చేయాలి

ఆత్మహత్య చేసుకున్నవారి కుటుంబాలకు పరిహారమివ్వాలి

కేటీఆర్, హరీశ్‌రావు డిమాండ్

ఆటోడ్రైవర్లకు మద్దతుగా ఆటోలో ప్రయాణించిన నేతలు

కాంగ్రెస్ క్యాబినెట్ దండుపాళ్యం ముఠాయే.. పదిసార్లంటా: హరీశ్‌రావు

12



మూసీపై ముందుకు

- 734.07 ఎకరాల భూమిని కేటాయిస్తూ సీసీఎల్ఏ ఉత్తర్వులు
- వనరుల సమీకరణకు వేగంగా ముందుకు సాగుతున్న ప్రభుత్వం
- రూ.4100 కోట్ల నిధుల కోసం ఏడీబీతో కొలిక్కి వచ్చిన ఒప్పందం
- మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాస్టర్‌ప్లాన్ సిద్ధం

హైదరాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మూసీ అభివృద్ధికి సంబంధించి మరో అడుగు ముందుకు పడింది. ప్రభుత్వ రంగ సంస్థలకు గతంలో కేటాయించిన 734.07 ఎకరాల భూమిని మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు కేటాయిస్తూ భూపరిపాలన ప్రధాన కమిషనర్(సీసీఎల్ఏ) లోకేశ్ కుమార్ ఉత్తర్వు(జీవో138)లిచ్చారు. ఈసా నది సమీపంలోని గండిపేట మండలం హిమాయత్ సాగర్, కిసమత్‌పూర్, రాజేంద్రనగర్ మండలానికి చెందిన ప్రేమావతిపేట్, బుద్వేల్ ప్రాంతాల్లో ఉన్న టీఈఈఆర్ఎల్, ఐఐపీహెచ్, వాలంతరి సంస్థలకు కేటాయించిన భూములతోపాటు శంషాబాద్ మండలం కొత్వాల్ గూడ పరిధిలో హెచ్ఎండీ లేఅవుట్ కోసం కేటాయించిన భూమిని మూసీకి బదలాయించారు. ఏపీ పునర్విభజన చట్టం 10వ షెడ్యూల్ పరిధిలో ఉన్న ఈ భూముల్లో న్యాయపరమైన వివాదాలు, ఇతర నిబంధనలకు లోబడి తదుపరి చర్యలు ఉంటాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మూసీ అభివృద్ధికి బదలాయించిన భూములకు ప్రత్యామ్నాయంగా ఆయా సంస్థలకు ఫ్యూచర్ సిటీలో కేటాయింపులు జరుగుతాయని తెలిపారు. మూసీ అభివృద్ధికి ఏడీబీ నుంచి రుణం పొందేందుకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. దీంతో ప్రపంచ బ్యాంకు నుంచి కాకుండా ఏడీబీ ద్వారా రూ.4100 కోట్ల రుణం తీసుకునేందుకు పురపాలక శాఖ అధికారులు ఒప్పందం చేసుకున్నారు. సెప్టెంబరు నెలలో సీఎం రేవంత్ ఢిల్లీ పర్యటన సందర్భంగా ఏడీబీ ప్రతినిధులతో పురపాలక శాఖ అధికారులు సమావేశమై నిధుల గురించి చర్చించారు. ప్రభుత్వం కోరిన నిధులు ఇచ్చేందుకు ఏడీబీ కూడా సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. మూసీ అభివృద్ధి ప్రణాళికలపై నవంబరులో డీపీఆర్ తయారు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించే యోచనలో ప్రభుత్వం ఉంది.



బంతిని క్యాచ్ పట్టే క్రమంలో కింద పడిన శ్రేయాస్ అయ్యర్

శ్రేయాస్‌కు తీవ్ర గాయం

ఆస్ట్రేలియాతో జరిగిన చివరి వన్డేలో క్యాచ్ పట్టే క్రమంలో..

పక్కటెముకల్లో మోచేయి తగలడంతో బాధతో విలవిలలాడిన శ్రేయాస్

ఆస్పత్రికి తరలించిన జట్టు మెడికల్ సిబ్బంది, ఫిజియో.. ప్లీహానికి గాయం

రక్తస్రావం.. 2 రోజులు ఐసీయూలోనే.. సోమవారమే ప్రత్యేక వార్డుకు..

వేగంగా కోలుకుంటున్న క్రికెటర్.. వారం పాటు అబ్జర్వేషన్‌లో..

11

మూడు గంటల్లో 49 కోట్లు కొట్టేశారు

ఓ ఫైనాన్స్ సంస్థకు సైబర్ నేరగాళ్ల మస్కా

'మనీవ్యూ' యాప్‌ను టార్గెట్ చేసుకున్న ముఠా.. ఏపీఐ సిస్టమ్‌లోకి చొరబడి కోట్లు బదిలీ

ఇద్దరిని అరెస్టు చేసిన బెంగళూరు సీసీబీ పోలీసులు.. అంతర్జాతీయ గ్యాంగ్‌ను పట్టుకొనేందుకు చర్యలు

బెంగళూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత రుణాలు అందించే ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థకు చెందిన యాప్‌నకే సైబర్ నేరగాళ్లు మస్కా కొట్టారు. యాప్‌నకు చెందిన అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేజ్ (ఏపీఐ) సిస్టమ్‌లోకి చొరబడి.. 3 గంటల వ్యవధిలో రూ.49 కోట్ల మేర కొల్లగొట్టారు. హ్యాకర్లు ఏపీఐ కీని ఉపయోగించి సొమ్మును నకిలీ ఖాతాలకు బదిలీ చేసుకున్నారు. ఈ సైబర్ ఘరానా మోసానికి సంబంధించి కర్ణాటకలోని బెంగళూరుకు చెందిన సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ (సీసీబీ) పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. సీసీబీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. విజ్డమ్ అనే ఫైనాన్స్ కంపెనీ 'మనీవ్యూ' అనే యాప్‌ను నిర్వహిస్తోంది. ఆ యాప్‌ను దుబాయ్, చైనా, హాంకాంగ్, ఫిలిప్పైన్స్ దేశాల నుంచి సైబర్ నేరాలకు పాల్పడుతున్న అంతర్జాతీయ ముఠా లక్ష్యంగా చేసుకుంది. ఏపీఐ కీని ఉపయోగించి మూడు గంటల వ్యవధిలో రూ.49 కోట్ల మేర సొమ్మును వందలాది నకిలీ ఖాతాలకు బదిలీ చేశారు. దుబాయ్ కేంద్రంగా ఉండే భారత సంతతికి చెందిన ఓ వ్యక్తిని ఈ దాడికి మాస్టర్ మైండ్‌గా గుర్తించారు. ఇతను అక్కడి నుంచి సైబర్ దాడిని సమన్వయం చేశాడు. ఇందుకోసం బెళగావికి చెందిన ఇస్మాయిల్ రషీద్ అత్తార్ అనే వ్యక్తి నుంచి వర్చువల్ ప్రైవేట్ సర్వర్ల (వీపీఎస్) ఒక్కోదాన్ని రూ.2 వేల చొప్పున రెంట్‌కు తీసుకున్నారు. ఆ తర్వాత ఏపీఐ సిస్టమ్‌లోకి చొరబడేందుకు సర్వర్లను ఫ్రాన్స్‌కు చెందిన ఐపీ అడ్రస్‌తో లింక్ చేశారని అధికారులు వివరించారు.



బెంగళూరు సీసీబీ పోలీసులకు పట్టుబడిన నిందితులు

కర్ణాటక, రాజస్థాన్‌కు చెందిన ఇద్దరి అరెస్టు

ఈ సైబర్ దాడికి సంబంధించి ఇస్మాయిల్ రషీద్ అత్తార్‌తో పాటు రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు చెందిన సంజయ్ పటేల్‌ను అరెస్టు చేసినట్లు నగర పోలీసు కమిషనర్ సీమంత్‌కుమార్ సింగ్ సోమవారం మీడియాకు వెల్లడించారు. పటేల్‌కు చెందిన నకిలీ ఖాతాకు

మిగతా 2వ పేజీలో...

డిజిటల్ అరెస్టు కేసులు సీబీఐకే

దర్యాప్తును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాం: సుప్రీంకోర్టు

కేసుల వివరాలివ్వాలని రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు

డిజిటల్ అరెస్టు.. పౌరులకు పెనుముప్పు: రాష్ట్రపతి

2



10

జహీరాబాద్ పారిశ్రామిక కారిడార్

మూడేళ్లలోపే!

అక్కడ పూర్తిస్థాయి ఉత్పాదక కేంద్రాల ఏర్పాటు

భారీ పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలు సిద్ధం

మేకిన్ ఇండియాలో తెలంగాణ పాత్ర కీలకం

'ఆంధ్రజ్యోతి'తో జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి సంస్థ చైర్మన్ రజత్ కుమార్ సైనీ

టీటీడీ పరకామణిలో చోరీ కేసులో

రాజీపై సీఐడీ దర్యాప్తు

ఏపీ హైకోర్టు కీలక ఉత్తర్వులు

విచారణాధికారి, టీటీడీ బోర్డు చైర్మన్, అధికారులు, ఫిర్యాదుదారు పాత్ర తేల్చండి

డీజీ స్థాయికి తగ్గని అధికారిని దర్యాప్తు అధికారిగా నియమించాలి

నిందితుడు రవికుమార్, కుటుంబ సభ్యుల ఆస్తులపైనా విచారణ

ఏసీబీకి కూడా హైకోర్టు నిర్దేశం

14

అంగన్‌వాడీ కేంద్రంలో 4 ఏళ్ల బాలికపై బాలుడి అత్యాచారం

వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని ఓ తండాలో దారుణం

ఆలస్యంగా వెలుగులోకి ఘటన

నిందితుడు అంగన్‌వాడీ టీచర్ కొడుకే

14

తమిళనాడు, బెంగాల్‌లో ఎస్ఐఆర్!

మరో 10 రాష్ట్రాలు/యూటీల్లో కూడా

4 నుంచి రెండో దశ ఓటర్ల జాబితా సవరణ.. డిసెంబరు 4దాకా ఎస్ఐఆర్

అదే నెల 9న ముసాయిదా జాబితా

ఫిబ్రవరి 7న తుది ఓటర్ల జాబితా

అసోంలో ఎస్ఐఆర్‌కు విడిగా తేదీలు

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ వెల్లడి

ఓట్ల చోరీకి సిద్ధమైన ఈసీ: కాంగ్రెస్

ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడతాం: తృణమూల్ కాంగ్రెస్

ఈసీ నిర్ణయంపై కార్యాచరణకు వచ్చే నెల 2న అఖిలపక్ష భేటీ: స్టాలిన్

2

'ఫిల్మ్‌చాంబర్'ను కాపాడుకుంటాం

అంగుళం కూడా బయటవాళ్లకు దక్కనివ్వం.. డెవలప్‌మెంట్ పేర ఎవరికో కట్టబెడతారా?

చాంబర్ భవనాన్ని నవీకరించాలి.. టాలీవుడ్ ప్రముఖుల డిమాండ్.. కొవ్వొత్తుల ర్యాలీ

(సినిమా డెస్క్)

నిర్మాతల మండలికి ఎన్నికలు నిర్వహించాలని, తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి (ఫిల్మ్ చాంబర్)ని కాపాడుకోవాలని సినీ ప్రముఖులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫిల్మ్‌చాంబర్ ఆవరణలో పలువురు టాలీవుడ్ నిర్మాతలు సోమవారం 'సేవ్ ఫిల్మ్ చాంబర్.. బ్రింగ్ బ్యాక్ ది గ్లోరీ' అంటూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. తెలుగు చిత్రపరిశ్రమ మద్రాస్ నుంచి హైదరాబాద్‌కు

మిగతా 14వ పేజీలో...



అమ్మా.. చెల్లెను అమ్మొద్దమ్మా..

3



రూ.3 లక్షలకు కన్నబిడ్డను విక్రయించిన తల్లిదండ్రులు

అమ్మొద్దంటూ ఏడుస్తూ వారిని వేడుకున్న పెద్దకుమార్తె

నల్లగొండ జిల్లా తిరుమలగిరి మండలంలో ఘటన

వారిపై కేసు నమోదు చేసిన ఐసీడీఎస్ అధికారులు

మీ అక్కాచెల్లెళ్ల అభ్యంతరకర ఏఐ చిత్రాలను
సోషల్ మీడియాలో పెడతా

» సైబర్ నేరగాడి బెదిరింపులతో
హరియాణలో ఓ యువకుడి ఆత్మహత్య


రాహుల్ భారతి(ఫైల్)

ఫరీదాబాద్, అక్టోబరు 27: సైబర్ నేరగాళ్ల అకృత్యాలకు ఓ యువకుడు బలయ్యాడు. లక్షల్లో డబ్బులు పంపాలని లేకపోతే తన అక్కాచెల్లెళ్ల అభ్యంతరకర మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పెడతానని బెదిరించడంతో మనస్తాపానికి గురైన ఆ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హరియాణలోని ఫరీదాబాద్‌లో జరిగింది. రాహుల్ భారతి (19) అనే యువకుడి ఫోన్‌ను రెండు వారాల క్రితం సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. అందులో ఉన్న ఆ యువకుడితో పాటు అతడి ముగ్గురు అక్కాచెల్లెళ్ల ఫొటోలు, వీడియోలను ఏఐ సాంకేతికతతో మార్ఫింగ్ చేసి, ఆ చిత్రాలను ఆ యువకుడికి పంపి లక్షల్లో డబ్బులు డిమాండ్ చేశారు. ఇవ్వకపోతే వాటిని సోషల్ మీడియాలో షేర్ చేస్తామని బెదిరించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆ యువకుడు శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాహుల్ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సాహిల్ అనే వ్యక్తి ఈ బెదిరింపులకు పాల్పడినట్లు గుర్తించారు.

మిగిలిన వారూ త్వరగా లొంగిపోవాలి

» మావోయిస్టులకు అమిత్ షా పిలుపు

న్యూఢిల్లీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని కాంకర్ జిల్లాలో 21 మంది మావోయిస్టులు ఆయుధాలతో పాటు లొంగిపోవడం పట్ల కేంద్ర హోం మంత్రి అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. లొంగిపోయిన 21 మందిలో 13 మంది సీనియర్ క్యాడర్‌కు చెందినవారని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వపు పిలుపు మేరకు హింసను విడనాడి, జన జీవన స్రవంతిలో చేరినందుకు వారిని అభినందిస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికీ తుపాకులు పట్టుకుని ఉన్న మిగిలిన మావోయిస్టులు వీలైనంత త్వరగా లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు. 2026 మార్చి 31 నాటికి దేశంలో నక్సలిజాన్ని నిర్మూలించాలని తాము కృతనిశ్చయంతో ఉన్నామని అమిత్ షా ఉద్ఘాటించారు.

భారతీయుల కాళ్లు, చేతులకు సంకెళ్లు వేసి..!

» 50 మందిని వెనక్కి పంపిన అమెరికా

న్యూఢిల్లీ, అక్టోబరు 27: అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపుతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఇలాంటి వారిపై నిరంతరం నిఘా పెట్టారు. ఎప్పటికప్పుడు దేశవ్యాప్తంగా తనిఖీలు చేయిస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా 50 మంది భారతీయులను కాళ్లు, చేతులకు సంకెళ్లు వేసి మరీ వెనక్కి పంపించారు. వీరంతా అక్రమ పద్ధతుల్లో అగ్రరాజ్యానికి చేరుకున్నవారే కావడం గమనార్హం. శనివారం అర్ధరాత్రి వీరంతా ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకోగా.. పోలీసులు వారిని విచారించి, వివరాలు నమోదు చేసుకుని స్వస్థలాలకు పంపించారు. వీరిలో ఎక్కువ మంది హరియాణాలో కైతాల్, కర్నాల్, కురుక్షేత్ర జిల్లాలకు చెందిన వారే ఉన్నట్టు అధికారులు తెలిపారు. మిగిలిన వారిలో గోవా, గుజరాత్, హైదరాబాద్‌కు చెందిన వారు ఉన్నారని పేర్కొన్నారు. అక్రమంగా వలస వెళ్లివారు 20 ఏళ్ల నుంచి 30 ఏళ్ల వయసు మధ్యవారేనని తెలిపారు. ఇక, వీరిని భారత్‌కు తిరిగి పంపించడానికి ముందు కొన్ని నెలల పాటు వీరిని నిర్బంధ కేంద్రాల్లో ఉంచారు.

అమెరికాలో స్తంభించిన 8వేల విమానాలు

వాషింగ్టన్, అక్టోబరు 27: అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా విమాన సర్వీసులు స్తంభించాయి. భారీగా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది విధులకు గైర్హాజరు కావడంతో ఆదివారం ఒక్కరోజే దేశవ్యాప్తంగా 8 వేల సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్‌కు చెందిన 22 ప్రదేశాల్లో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది కొరత ఏర్పడిందని అమెరికా రవాణా కార్యదర్శి శాన్ డఫీ వెల్లడించారు. రానున్న రోజుల్లో సిబ్బంది కొరతతో విమానాల ఆలస్యం, సర్వీసుల రద్దు మరింత పెరగొచ్చని తెలిపారు. ఆదివారం రాత్రి 11 గంటల (అమెరికా కాలమానం) నాటికి 8 వేలకు పైగా విమానాల సేవలకు అంతరాయం ఏర్పడిందని ఫ్లైట్ అవేర్ వెబ్‌సైట్ తెలిపింది.

రాకేశ్‌పై కోర్టు ధిక్కార చర్యలకు అనుమతించం

» ఆ న్యాయవాదిపై కేసు నమోదుకు సీజేఐ విముఖత: సుప్రీం

న్యూఢిల్లీ, అక్టోబరు 27:సీజేఐ జస్టిస్ గవాయ్ వైపు బూటు విసిరిన న్యాయవాది రాకేశ్ కిశోర్‌పై కోర్టు ధిక్కార చర్యలను అనుమతించే ఉద్దేశం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆ న్యాయవాదిపై కేసు నమోదుకు జస్టిస్ గవాయ్ కూడా విముఖత చూపారని చెప్పింది. న్యాయవాది రాకేశ్ కిశోర్‌పై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలని కోరుతూ సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ వ్యవహారంలో కోర్టు ధిక్కార చర్యలు చేపట్టే అంశం సంబంధిత న్యాయమూర్తిపై ఆధారపడి ఉంటుందని పేర్కొంది. ధిక్కార నోటీసులు ఇస్తే ఆ న్యాయవాదికి అనవసర ప్రాధాన్యం ఇచ్చినట్లు అవుతుందని, ఘటన సహజంగా మరుగున పడేందుకు అవకాశం ఇవ్వాలని తెలిపింది.

సహజీవనంలో ఉన్న యువకుడిని మాజీ ప్రియుడితో కలిసి చంపిన యువతి

» నిందితురాలు అమృతా చౌహాన్ ఫోరెన్సిక్ విద్యార్థిని

» ఆ జ్ఞానంతోనే హత్యకు ప్లాన్..అగ్నిప్రమాదంగా చిత్రీకరణ


రాంకేశ్ మీనా, అమృత చౌహాన్

న్యూఢిల్లీ, అక్టోబరు 27: యూపీలోని మొరాదాబాద్‌కు చెందిన ఫోరెన్సిక్ విద్యార్థిని, తన మాజీ ప్రియుడితో కలిసి ప్రస్తుత సహజీవన భాగస్వామిని అతి కిరాతకంగా హత్య చేసి, ఆపై అగ్ని ప్రమాదంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించిన ఘటన ఢిల్లీలో వెలుగు చూసింది. ఢిల్లీలోని గాంధీ విహార్‌లో ఈ నెల మొదటివారంలో ఓ అపార్ట్‌మెంట్‌లో కాలిపోయిన స్థితిలో లభ్యమైన యూపీఎస్సీ ఆశావహుడైన రాంకేష్ మీనా హత్యకేసును పోలీసులు సోమవారం ఛేదించారు. ఫోరెన్సిక్ విద్యార్థిని అమృతా చౌహాన్(21), రాంకేష్ మీనా(32)తో గత మే నెల నుంచి సహజీవనంలో ఉంది. ఈ క్రమంలో తన ప్రైవేటు వీడియోలను మీనా రహస్యంగా రికార్ చేశాడని అమృత గుర్తించింది. వాటిని డిలీట్ చేయమని పదే పదే విజ్ఞప్తి చేసినా మీనా నిరాకరించడంతో.. అమృత ఎలాగైనా అతనికి బుద్ధి చెప్పాలని నిర్ణయించుకుంది. తన మాజీ ప్రియుడు సుమిత్, మరో స్నేహితుడి సాయంతో హత్యకు వ్యూహ రచన చేసింది. అమృత ఫోరెన్సిక్ సైన్స్ నేపథ్యం, క్రైం వెబ్ సిరీస్‌ల పట్ల ఉన్న ఆసక్తితో ఏ చిన్న ఆధారం దొరకకుండా హత్యకు ప్లాన్ చేసింది. సుమిత్ వంట గ్యాస్ సిలిండర్ డిస్ట్రిబ్యూటర్ కావడంతో అతని అనుభవాన్ని ఉపయోగించుకోవాలని భావించింది. ఈ కుట్రలో వారిద్దరి స్నేహితుడు సందీప్ కుమార్ కూడా చేరాడు. ముగ్గురు కలిసి అక్టోబర్ 5న మొరాదాబాద్ నుంచి ఢిల్లీలోని మీనా అపార్ట్‌మెంట్‌కు చేరుకున్నారు. మొదట మీనాను తీవ్రంగా కొట్టి, ఆపై గొంతు నులిమి చంపారు. మృతదేహంపై మంటలు వేగంగా వ్యాపించడానికి బాధితుని శరీరంపై నెయ్యి, నూనె, ఆల్కహాల్ పోశారు. సుమిత్ గ్యాస్ సిలిండర్‌కు చిన్న రంధ్రం చేసి, వాల్వ్ ఆన్ చేసి గది అంతా గ్యాస్‌తో నిండిపోయేలా చేశాడు. తర్వాత లైటర్‌తో నిప్పంటించి.. అనుమానం రాకుండా గదిని లోపలి నుంచి లాక్ చేశారు. ఆధారాలు నాశనం చేయడానికి మీనా హార్డ్‌డిస్క్, ల్యాప్‌టాప్‌లు, ఇతర వస్తువులు తీసుకుని అక్కడి నుంచి పారిపోయారు. వారు భవనం నుంచి బయలుదేరిన సుమారు గంట తర్వాత పేలుడు సంభవించింది. పోలీసులు మొదట షార్ట్ సర్క్యూట్ లేదా ఏసీ పేలుడుగా భావించినప్పటికీ, ఫోరెన్సిక్ ఆధారాలు, ఘటన జరిగిన సమయంలో అమృత మొబైల్ ఫోను లొకేషన్‌తో ఆమె ఆ ప్రాంతంలోనే ఉన్నట్లు గుర్తించి.. హత్యేనని నిర్ధారించుకున్నారు. ప్రస్తుతం నిందితులు పోలీసుల అదుపులో ఉన్నారు.

తమిళనాడు, బెంగాల్‌లో ఎస్ఐఆర్!

మరో 10 రాష్ట్రాలు/యూటీల్లో కూడా.. 4 నుంచి రెండో దశ ఓటర్ల జాబితా సవరణ

» సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ వెల్లడి


మీడియా సమావేశంలో ఎస్ఐఆర్‌పై వివరాలను వెల్లడిస్తున్న జ్ఞానేశ్‌కుమార్

న్యూఢిల్లీ, అక్టోబరు 27: దేశవ్యాప్తంగా రెండో దశ 'ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)'ను చేపట్టనున్నట్లు ఎన్నికల సంఘం (ఈసీ) ప్రకటించింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తమిళనాడు, పశ్చిమబెంగాల్ సహా 12 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతా(యూటీ)ల్లో ఈ ప్రక్రియను చేపట్టనున్నట్లు తెలిపింది. సోమవారం ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ ఈ విషయాన్ని వెల్లడించారు. తొలిదశలో బిహార్‌లో ఎస్ఐఆర్‌ను విజయవంతంగా పూర్తిచేశామన్నారు. నవంబరు 4 నుంచి డిసెంబరు 4 వరకు రెండో దశ ఎస్ఐఆర్ చేపడుతున్నట్లు తెలిపారు. డిసెంబరు 9న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేస్తామన్నారు. తుది ఓటర్ల జాబితాను ఫిబ్రవరి 7న ప్రచురిస్తామని వెల్లడించారు. రెండో దశలో అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్ చేపడుతున్నట్లు చెప్పారు. ఈ దశలో 51 కోట్ల మంది ఓటర్లు ఈ సవరణ పరిధిలోకి వస్తారన్నారు. తమిళనాడు, పశ్చిమబెంగాల్‌తో పాటు పుదుచ్చేరి, కేరళలో 2026లోనే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ప్రధానంగా మోదీకి వ్యతిరేకంగా బలమైన గళం వినిపిస్తున్న మమత, స్టాలిన్‌లు పాలిస్తున్న బెంగాల్, తమిళనాడుల్లో ఎస్ఐఆర్‌ను చేపట్టాలని నిర్ణయించడం చర్చనీయాంశంగా మారింది. అయితే, అర్హులంతా ఓటరు జాబితాలో ఉండేలా చూడడం, అనర్హులందరినీ తొలగించడమే ఎస్ఐఆర్ లక్ష్యమని సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ చెప్పారు. 1951 నుంచి ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని 8 సార్లు నిర్వహించారన్నారు. తాజాగా చేపట్టనున్న ఎస్ఐఆర్ కోసం అధికారులకు మంగళవారం నుంచి శిక్షణ ప్రారంభించనున్నట్లు తెలిపారు. బెంగాల్ ప్రభుత్వంతో తమకెలాంటి గొడవా లేదని, రాజ్యాంగ బద్ధంగా తాము విధులు నిర్వర్తిస్తున్నామని చెప్పారు. కేరళలో స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలన్న డిమాండ్లపై స్పందిస్తూ.. అక్కడ ఇంకా స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. కాగా, అసోంలో కూడా 2026లోనే ఎన్నికలు ఉన్నాయి. అయితే, అక్కడ ఎస్ఐఆర్‌పై విడిగా ప్రకటన చేస్తామని సీఈసీ చెప్పారు. "పౌరసత్వ చట్టం కింద అసోంలో పౌరసత్వానికి సంబంధించి ప్రత్యేక నిబంధనలు వర్తిస్తాయి. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో పౌరసత్వ గుర్తింపు ప్రక్రియ ఇంకా పూర్తి కావాల్సి ఉంది" అని జ్ఞానేశ్ తెలిపారు. రెండో దశ ఎస్ఐఆర్ ప్రకటనపై కాంగ్రెస్ స్పందించింది. ఈసీ ఇప్పుడు 12 రాష్ట్రాల్లో ఓట్ల చోరీకి సిద్ధమవుతోందని కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా ధ్వజమెత్తారు. మరోవైపు, 'సర్'లో ఓటరు గుర్తింపునకు 12 పత్రాలను పేర్కొనగా అందులో ఆధార్ కూడా ఉంది. వీటితో పాటుగా బిహార్‌లో 'సర్' అనంతరం ప్రచురించిన ఓటరు జాబితాను కూడా గుర్తింపు పత్రంగా ఎన్నికల సంఘం పేర్కొంది. ఒకవేళ ఎవరైనా ఈ 12 రాష్ట్రాల్లోని ఒకదాంట్లో ఓటరుగా నమోదు చేసుకోవాలని అనుకుంటే, అలాంటి వారి తల్లిదండ్రుల పేర్లు బిహార్ తాజా ఓటరు జాబితాలో ఉంటే దానిని అసలైన ధ్రువపత్రంగా పరిగణిస్తారు. అలాంటి వారు పౌరసత్వ నిరూపణ కోసం కేవలం జననధ్రువపత్రాన్ని సమర్పిస్తే సరిపోతుంది.

ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా కుట్ర: స్టాలిన్

ఎస్ఐఆర్ చేపట్టాలన్న ఈసీ నిర్ణయాన్ని ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా జరుగుతున్న కుట్రగా తమిళనాడు సీఎం స్టాలిన్ అభివర్ణించారు. బీజేపీకి సాయం చేసేందుకు ఈసీ పౌరుల హక్కులను దోచుకుంటోందని ఆరోపించారు. బిహార్‌లో పెద్ద సంఖ్యలో మహిళలు, మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీల ఓట్లను తొలగించివేశారని విమర్శించారు. వచ్చే నెల 2న చెన్నైలో అఖిలపక్షం ఏర్పాటు చేసి, ఈసీ నిర్ణయంపై తదుపరి కార్యాచరణ గురించి చర్చిస్తామన్నారు. ఓటు హక్కును కాలరాసే ప్రయత్నాలకు వ్యతిరేకంగా తమిళనాడు పోరాడి గెలుస్తుందని స్టాలిన్ చెప్పారు.

మూడు గంటల్లో 49 కోట్లు కొట్టేశారు

(మొదటి పేజీ తరువాయి)


కూడా డబ్బు బదిలీ అయింది. వారిద్దరి నుంచి ల్యాప్‌టాప్‌లు, పెన్‌డ్రైవ్‌లు సీజ్ చేశారు. అలాగే నకిలీ ఖాతాల్లోకి బదిలీ అయిన రూ.10 కోట్ల మేర అధికారులు ఫ్రీజ్ చేశారు. డబ్బును మళ్లించేందుకు నిందితులు వాడిన బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశామని కమిషనర్ సీమంత్‌కుమార్ తెలిపారు. కంపెనీ ఖాతా నుంచి సుమారు 3 వేల ఎస్‌బీ ఖాతాలకు నగదు బదిలీ చేశారని, ఆ తర్వాత నగదును ఈ ముఠా ఖాతాలకు జమ చేసుకునే వ్యూహం పన్నారని వివరించారు. సైబర్ పోలీసులు ఈ నెట్‌వర్క్‌ను గుర్తించి ఐపీ అడ్రస్‌లు, నగదు బదిలీ ఖాతాల వివరాలకు అనుగుణంగా సంజయ్ పటేల్, ఇస్మాయిల్‌లను అరెస్టు చేశారన్నారు. దుబాయ్‌లోని ముఠాతో ఇస్మాయిల్ నిరంతరాయంగా మాట్లాడేవాడని గుర్తించామన్నారు. రూ.5.5 కోట్ల నగదును హైదరాబాద్‌కు చెందిన ఎహలెన్ సైన్స్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఖాతాకు బదిలీ చేశారన్నారు. ఆ తర్వాత ఫ్లిపోపే పేరిట ఉండే ఐడీఎఫ్‌సీ బ్యాంకుకు మార్చుకున్నారని పోలీసు కమిషనర్ వివరించారు. ఈ గ్యాంగ్‌కు సంబంధించి దుబాయ్‌లో ముగ్గురు, హాంకాంగ్‌లో ఇద్దరు అనుమానితులను గుర్తించారు. వీరిని పట్టుకొనేందుకు అంతర్జాతీయ ఏజెన్సీలతో కలిసి పనిచేస్తున్నట్లు సీసీబీ పోలీసులు తెలిపారు.

నిరాశ్రయులకు వరం..

» పడకగా మారే బ్యాక్‌ప్యాక్ ఆవిష్కరణ



బెర్లిన్, అక్టోబరు 27: నిరాశ్రయులు, వీధులపై నివసించే వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు జర్మనీకి చెందిన ఓ స్టార్టప్ సంస్థ వినూత్న ఆవిష్కరణకు శ్రీకారం చుట్టింది. సాధారణమైన బ్యాక్‌ప్యాక్‌ను ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేసి, వాతావరణాన్ని తట్టుకునే పడకగా మార్చేసింది. ఈ ప్రత్యేకమైన బ్యాక్‌ప్యాక్ చూడడానికి చిన్నగా, నాజూగ్గా కనిపిస్తుంది. కానీ, విప్పగానే దానిలోని గొప్పదనం తెలుస్తుంది. ఒకవేళ రాత్రిపూట చలిగా ఉంటే, దాన్ని తట్టుకోవడానికి లోపలి పొరల్లో ప్రత్యేకమైన ఉష్ణ నిరోధక పదార్థాన్ని ఉపయోగించారు. బయటి పొర పూర్తిగా వాటర్ ప్రూఫ్ కావడంతో వర్షం నుంచి రక్షణ లభిస్తుంది. అంతేకాదు దీనికి అమర్చిన చిన్న సోలార్ ప్యానెల్ ద్వారా నిత్యం సూర్య రశ్మిని నిల్వ చేసుకోవచ్చు. ఆ శక్తితో రాత్రివేళల్లో చిన్న లైట్‌ను వెలిగించుకోవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో మొబైల్ ఫోన్‌ను చార్జ్ చేసుకోవడానికి వీలుగా యూఎస్‌బీ పోర్టును కూడా ఏర్పాటు చేశారు. ఈ వినూత్న పడకను కేవలం కొద్ది నిమిషాల్లోనే ఏర్పాటు చేసుకోవచ్చు. తిరిగి మడచి తేలికగా భుజానికి తగిలించుకోవచ్చు. ఈ స్మార్ట్ బ్యాక్‌ప్యాక్‌లు నిరాశ్రయులకు తల దాచుకునేందుకు వీలైన చిన్నపాటి గూడుగా మారుతాయని నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



లండన్‌లో భారత సంతతి యువతిపై అత్యాచారం!

» జాత్యహంకారంతో రగిలిపోయి దుశ్చర్యకు పాల్పడ్డ దుండగుడు

» బాధితురాలు 20 ఏళ్ల పంజాబీ యువతి

లండన్, అక్టోబరు 27: బ్రిటన్‌లో దారుణం జరిగింది. జాత్యహంకారంతో రగిలిపోయిన ఓ వ్యక్తి, భారత సంతతికి చెందిన 20 ఏళ్ల యువతిని తీవ్రంగా కొట్టి, ఆమెపై దారుణ అత్యాచారానికి పాల్పడ్డాడు. లండన్‌కు దగ్గర్లోని వెస్ట్ మిడ్‌ల్యాండ్స్ పరిధిలో శనివారం రాత్రి ఈ ఘటన జరిగింది. వాల్సల్‌లోని పార్క్ హాల్ ప్రాంతంలో బాధితురాలు నివసిస్తోంది. తలుపులు బద్దలు కొట్టి మరీ యువతి ఇంట్లోకి చొరబడ్డ దుండగుడు, ఆమెపై ఘోరానికి పాల్పడ్డాడు. "ఇది యువతిపై జరిగిన అత్యంత భయానకమైన దాడి" అని పోలీసులు పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకునేందుకు రంగంలోకి దిగిన ప్రత్యేక బృందం సీసీ ఫుటేజీని పరిశీలించాయి. ఈ మేరకు పొట్టి జుట్టు, నల్లని దుస్తులతో పార్క్‌లో తచ్చాడుతున్న 32 ఏళ్ల వయసున్న ఓ శ్వేత జాతీయుడిని గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి తాలూకు సీసీ ఫుటేజీని విడుదల చేశారు. బాధితురాలు పంజాబీ యువతి అని స్థానిక సిక్కు సమాఖ్య పేర్కొంది. అత్యాచార ఘటన తనను తీవ్రషాక్‌కు గురిచేసిందని ప్రవాస భారతీయురాలు, వెస్ట్ మిడ్‌ల్యాండ్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంట్ సభ్యురాలు ప్రీతికౌర్ పేర్కొన్నారు. వెస్ట్ మిడ్‌లాండ్స్‌లో పదే పదే మహిళలపై దాడులు జరుగుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. సెప్టెంబరు 9న వెస్ట్ మిడ్‌ల్యాండ్స్‌లో 20 ఏళ్ల యువతిపై జాత్యాహంకారంతో పెట్రేగిపోయిన ఓ 49 వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఆ ఘటనకు సంబంధించి బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిని, 65 ఏళ్ల మహిళను పోలీసులు అరెస్టు చేశారు.

డిజిటల్ అరెస్టు కేసులు సీబీఐకే

» దర్యాప్తును పర్యవేక్షిస్తాం: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, అక్టోబరు 27: దేశంలో ఆందోళనకరంగా మారిన డిజిటల్ అరెస్టు కేసులన్నింటి దర్యాప్తు బాధ్యతను సీబీఐకి అప్పగించేందుకు మొగ్గు చూపుతున్నట్లు సుప్రీం కోర్టు తెలిపింది. దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఇలాంటి మోసాలకు సంబంధించి వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నమోదైన కేసుల వివరాలను తమకు సమర్పించాలని ఆయా ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. హరియాణాకు చెందిన ఓ వృద్ధ దంపతులను సైబర్ మోసగాళ్లు డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరించి రూ.1.05 కోట్లు దోచుకున్న ఘటనపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం సుమోటోగా విచారణ జరుపుతోంది. మయన్మార్, థాయ్‌లాండ్ వంటి దేశాల నుంచి దుండగులు ఈ మోసాలను నడిపిస్తున్నారన్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. ఇటువంటి కేసులను దర్యాప్తు చేసేందుకు సీబీఐ తగిన ప్రణాళికతో ముందుకు రావాలని నిర్దేశించింది. ఈ దర్యాప్తును తాము పర్యవేక్షిస్తామని, ఎప్పటికప్పుడు అవసరమైన సూచనలు చేస్తామని తెలిపింది. దర్యాప్తు కోసం సైబర్ నిపుణులు వంటి మరిన్ని వనరులేమైనా అవసరమైతే చెప్పాలని సీబీఐకి సూచించింది. కాగా, డిజిటల్ అరెస్టు అనేది దేశ పౌరులకు అత్యంత భయంకరమైన ముప్పుగా పరిణమించిందని రాష్ట్రపతి ముర్ము అన్నారు. మోసగాళ్లు తాము విచారణ అధికారులమని, బ్యాంకు ఖాతాలను సీజ్ చేస్తామని బెదిరింపులకు పాల్పడతారని, కేసులను ఎదుర్కోకుండా ఉండాలంటే జరిమానా, సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలంటూ ప్రజలను మభ్యపెడతారని పేర్కొన్నారు. ఇలాంటి వాటిని అరికట్టేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

బంగ్లా మ్యాప్‌లో ఈశాన్య రాష్ట్రాలు

భారత్‌పై మరోసారి అక్కసు వెళ్లగక్కిన యూనస్.. 'ఆర్ట్ ఆఫ్ ట్రయంఫ్' పుస్తకంపై వక్రీకరించిన మ్యాప్

» ఈ పుస్తకం పాక్ జనరల్ షంషాద్ మీర్జాకు బహూకరణ


షంషాద్‌కు పుస్తకాన్ని బహూకరిస్తున్న యూనస్

న్యూఢిల్లీ, అక్టోబరు 27: బంగ్లాదేశ్ తాత్కాలిక సారథి మహమ్మద్ యూనస్ మరో దౌత్య వివాదానికి తెరలేపారు. అధికారం చేపట్టినప్పటి నుంచి భారత్‌పై విషం చిమ్ముతూనే ఉన్న ఆయన తాజాగా భారత ఈశాన్య ప్రాంత సమస్యల్లోకి అడుగుపెట్టడం ద్వారా మరోసారి తన అక్కసు వెళ్లగక్కారు. ఈశాన్య రాష్ట్రాలను బంగ్లాదేశ్‌లో భాగంగా చూపిస్తూ ఉన్న వివాదాస్పద మ్యాప్‌ను పాకిస్థాన్ జనరల్ షంషాద్ మీర్జాకు బహూకరించారు. పాక్ జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ చైర్‌పర్సన్ జనరల్ షంషాద్ మీర్జా ఇటీవల ఢాకాలో యూనస్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 'ఆర్ట్ ఆఫ్ ట్రయంఫ్' అనే పుస్తకాన్ని యూనస్.. మీర్జాకు బహూకరించారు. ఈ భేటీకి సంబంధించిన చిత్రాలను యూనస్ ఆదివారం సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అయితే ఆ పుస్తకం కవర్‌పేజీపై వక్రీకరించిన బంగ్లాదేశ్ మ్యాప్ కనిపించడం తాజా వివాదానికి కారణమైంది. ఈ మ్యాప్ భారత్‌లోని ఏడు ఈశాన్య రాష్ట్రాలను బంగ్లాదేశ్ భూభాగంలో భాగంగా చూపించడం భారత్ ఆగ్రహానికి కారణమైంది. భారత సార్వభౌమత్వానికి వ్యతిరేకంగా ఉన్న బంగ్లాదేశ్ తాత్కాలిక చీఫ్ చర్యలపై సోషల్ మీడియాలో విశ్లేషకులు, జర్నలిస్టులు విమర్శలు గుప్పిస్తున్నారు. అయితే ఈ వివాదంపై భారత విదేశాంగ శాఖ ఇంకా స్పందించలేదు.

యూనస్.. ఇదే తొలిసారి కాదు

ఈ ఏడాది ఏప్రిల్‌లో చైనా పర్యటన సందర్భంగా.. 'ఈశాన్య భారతదేశం భూపరివేష్టితమై ఉన్నందున.. వారు సముద్రానికి చేరుకోవడానికి వేరే మార్గం లేదు. కాబట్టి ఈ ప్రాంతంలో సముద్రానికి మేమే ఏకైక సంరక్షకులం' అని అన్నారు. అయితే దీనిపై భారత్ అప్పట్లోనే దీటుగా బదులిచ్చింది. భారతదేశ ఈశాన్య ప్రాంత ప్రాముఖ్యతను విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ పునరుద్ఘాటించారు. బంగ్లాదేశ్‌తోపాటు భూటాన్, నేపాల్, మయన్మార్, శ్రీలంక, థాయ్‌లాండ్ దేశాలతో సరిహద్దు సంబంధం ఉన్న ఈ ప్రాంతం బిమ్‌స్టెక్ కనెక్టివిటీ హబ్‌గా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. అలాగే బంగ్లాదేశ్ వస్తువులను భారత భూభాగం నుంచి భూటాన్, నేపాల్, మయన్మార్‌లకు తరలించడానికి అనుమతించే ట్రాన్స్‌షిప్‌మెంట్ ఒప్పందాన్ని కూడా భారత్ రద్దు చేసుకుంది.

జకీర్ నాయక్‌కు ఆహ్వానం!

ఢాకా ఉగ్రదాడి తర్వాత తొమ్మిదేళ్లకు వివాదాస్పద మతబోధకుడు, భారత్ నుంచి పరారైన జకీర్ నాయక్ నవంబరు 28నుంచి సుమారు నెల రోజులపాటు బంగ్లాదేశ్‌లో పర్యటించేందుకు యూనస్ ప్రభుత్వం అనుమతిచ్చింది. 2016లో ఢాకాలోని హోలీ ఆర్టిసన్ బేకరీ వద్ద ఉగ్రదాడి జరిగింది. యూట్యూబ్‌లో జకీర్ నాయక్ ప్రసంగాలు విని ప్రేరణ పొందానని ఆ ఉగ్రదాడి నిందితుల్లో ఒకరు దర్యాప్తు అధికారులకు వెల్లడించిన నేపథ్యంలో నాటి షేక్ హసీనా ప్రభుత్వం జకీర్ నాయక్ నేతృత్వంలోని పీస్ టీవీ ప్రసారాలను బంగ్లాదేశ్‌లో నిషేధించింది. విద్వేష ప్రసంగాలతో మతాల మధ్య చిచ్చు పెట్టారంటూ అతనిపై భారత్‌లోనూ చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం, పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి.

మా ఆదేశాలపై ఇంత నిర్లక్ష్యమా?

» కుక్కలకు ఇంజక్షన్లు వేయించాలన్నాం

» ఆగస్టు 22న ఉత్తర్వులిచ్చాం

» అధికారులు పేపర్లు చదవడం లేదా?

» 3వ తేదీన మా ముందుకు రండి

» రాష్ట్రాల సీఎస్‌లకు సుప్రీంకోర్టు ఆదేశం



న్యూఢిల్లీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నా రాష్ట్రప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సుప్రీంకోర్టు మండిపడింది. వాటిని ఎక్కడికక్కడ పట్టుకుని.. స్టెరిలైజ్ ఇంజక్షన్లు చేసి విడిచిపెట్టాలని, దీనిపై అఫిడవిట్లు దాఖలుచేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతా(యూటీ)లకు ఆగస్టు 22న ఆదేశాలు జారీచేస్తే.. తమిళనాడు, బెంగాల్, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ తప్ప మిగతా రాష్ట్రాలు, యూటీలేవీ ఇంతవరకు అఫిడవిట్లు వేయకపోవడాన్ని ఆక్షేపించింది. ఆ మిగతా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులంతా వచ్చే నెల 3వ తేదీన జరిగే విచారణ సందర్భంగా తమ ముందు హాజరుకావాలని ఆదేశించింది. జంతువుల జనన నియంత్రణ (ఏబీసీ) నిబంధనలకు అనుగుణంగా కుక్కల షెల్టర్లు, అందుబాటులో ఉన్న వెటర్నరీ డాక్టర్లు, కుక్కలు పట్టే సిబ్బంది, ప్రత్యేక వాహనాలు, బోన్లు తదితర వివరాలతో అఫిడవిట్ దాఖలుచేయాలని రాష్ట్రాలు, యూటీల పురపాలక అధికారులను ఆగస్టు 22న ఆదేశించింది. ఈ ఆదేశాలు జారీచేశాక కూడా పలు చోట్ల వీధి కుక్కల దాడులు జరిగాయని తెలిపింది. 'గత నెలలో మహారాష్ట్రలోని పుణేలో ఓ చిన్నారిపై దాడిచేశాయి. అంతకు కొన్ని రోజుల ముందు భండారా జిల్లాలో 20 కుక్కలు ఓ అమ్మాయిపై దాడిచేశాయి. గత వారం కేరళలో కన్నూర్ జిల్లాలో వీధి కుక్కలపై వీధినాటకం ప్రదర్శిస్తున్న వ్యక్తిపైనే దాడిచేశాయి. యూపీలోని లఖ్‌నవూలో ఒకే కుటుంబంలో ముగ్గురిని కరిచాయి. గత 48 గంటల్లో తెలంగాణలోని వరంగల్‌లో కూడా ఇలాంటి ఘటనే జరిగింది. అయినా రాష్ట్రప్రభుత్వాల నుంచి స్పందన లేదు. దేశంలో నిరంతరం పిల్లలు, వృద్ధులు, మహిళలు.. ఇలా అందరిపై కుక్కలు దాడులు చేస్తుంటే.. విదేశాల్లో మన దేశ ప్రతిష్ఠ దెబ్బతింటోంది. మన దేశాన్ని అంతర్జాతీయంగా చెడుగా చిత్రిస్తున్నారు. ఆగస్టు 22న మేమిచ్చిన ఆదేశాలపై విస్తృతంగా ప్రచారం జరిగింది. రెండు నెలలు గడువిచ్చినా స్పందన లేదు. అధికారులు దినపత్రికలు చదవడం లేదా? సోషల్ మీడియాలో చూడడం లేదా? పేరుపేరునా నోటీసులివ్వాలా' అని ఆగ్రహం వ్యక్తం చేసింది. కనీసం ఆయా రాష్ట్రాల తరఫు న్యాయవాదులు సైతం విచారణ సమయంలో లేకపోవడంపై ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. 3వ తేదీన సీఎస్‌లు తమ ఎదుట హాజరై వివరణ ఇవ్వకుంటే.. బహిరంగంగా కోర్టు నిర్వహిస్తామని హెచ్చరించింది. 3న అఫిడవిట్ వేస్తామని ఢిల్లీ ప్రభుత్వం తరఫు న్యాయవాది తెలుపగా.. సీఎస్ తమ ముందు హాజరు కావలసిందేనని తేల్చిచెప్పింది. 'ఆయన అఫిడవిట్ వేస్తే వేయనివ్వండి. కానీ మా ఆదేశాలపై ఎందుకు స్పందించలేదో వివరణ ఇవ్వాల్సిందే. ఆయన రాకుంటే ఖర్చులు విధించడంతో పాటు కఠిన చర్యలు ఉంటాయి' అని పేర్కొంది. కోర్టు ఆదేశాలు వీధికుక్కల పాలిట మరీ క్రూరంగా ఉన్నాయని ఓ న్యాయవాది ప్రస్తావించగా.. మనుషుల పట్ల క్రౌర్యం గురించి ఏం చెబుతారని ధర్మాసనం నిలదీసింది.

సుప్రీం తదుపరి సీజేగా జస్టిస్ సూర్యకాంత్!

» ఆయన పేరును కేంద్రానికి సూచించిన చీఫ్ జస్టిస్



న్యూఢిల్లీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ పేరును సిఫారసు చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ లేఖ రాశారు. సంప్రదాయం ప్రకారం సుప్రీంకోర్టులోని సెకండ్ సీనియర్ మోస్ట్ జడ్జిని తన వారసుడిగా ప్రస్తుత చీఫ్ జస్టిస్ ప్రతిపాదించాలి. సీజే గవాయ్ తర్వాత జస్టిస్ సూర్యకాంతే సీనియర్. ఈ నేపథ్యంలో ఆయన పేరును జస్టిస్ గవాయ్ సిఫారసు చేశారు. ఈ సిఫారసును కేంద్ర న్యాయశాఖ ఆమోదించి తత్సంబంధ ప్రక్రియను ప్రారంభిస్తే, 53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ నవంబరు 24న బాధ్యతలు చేపడతారు. దానికి ఒకరోజు ముందు, జస్టిస్ గవాయ్ పదవీకాలం ముగిస్తుంది. జస్టిస్ సూర్యకాంత్ 2019 మే 24 నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా కొనసాగుతున్నారు. అంతా అనుకున్నట్టు జరిగితే ప్రధాన న్యాయమూర్తిగా ఆ పదవిలో ఆయన 15 నెలలు కొనసాగుతారు. 2027 ఫిబ్రవరి 9వ తేదీతో ఆయన పదవీకాలం ముగిస్తుంది.

లేనిది చెక్‌పోస్టులే.. తనిఖీలు యథాతథం

- ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలతో రహదారులపై నిరంతర తనిఖీలు
- త్వరలో రంగంలోకి మొబైల్ స్క్వాడ్స్
- నిబంధనలు అతిక్రమించే వాహనాల గుర్తింపునకు ఏఎన్‌పీఆర్ కెమెరాలు
- రాష్ట్ర వ్యాప్తంగా 40 కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదన
- పైలెట్ ప్రాజెక్టుగా కామారెడ్డిలో ఇప్పటికే వినియోగం

హైదరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖలో టెక్నాలజీ వాడకం నేపథ్యంలో రహదారుల్లో వాహనదారులకు ఇబ్బందిగా ఉన్న చెక్ పోస్టులను ప్రభుత్వం ఎత్తేసింది. రాష్ట్రంలో ఉన్న 15 రవాణా శాఖ చెక్‌పోస్టులను గత బుధవారం ఎత్తేశారు. ఇతర రాష్ట్రాల నుంచి రాష్ట్రంలోకి వచ్చే వాహనాల నుంచి పన్ను వసూలు, తాత్కాలిక అనుమతులు, మోటారు వాహన చట్టం ఉల్లంఘనలను అరికట్టేందుకు ఈ చెక్ పోస్టులను వాడేవారు. ఇప్పుడు ఆ చెక్‌పోస్టులు లేవు కదా.! అని వాహనదారులు లైట్ తీసుకుంటే పొరపాటే అంటున్నారు రవాణా శాఖ అధికారులు. చెక్‌పోస్టులు లేకున్నా తమ నిఘా కొనసాగుతుందని చెబుతున్నారు. చెక్‌పోస్టుల వద్ద ఇన్నాళ్లూ నిర్వహించిన విధులను ఇకపై ఆన్‌లైన్‌లో చేస్తామని అంటున్నారు. అంతేకాక, వాహనాల్లో నిషేధిత వస్తువుల తరలింపు, పరిమితికి మించి సరుకు రవాణా, అనుమతులు లేని వాహనాలను గుర్తించేందుకు చేసే తనిఖీలు మాత్రం యథాతథంగా కొనసాగుతాయని చెప్పారు. ఈ తనిఖీల కోసం ఇప్పటివరకు జిల్లాల్లో ఉన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల్ని ఉపయోగిస్తున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు జిల్లాల్లో తమ పరిధిలోని రహదారులపై తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై చర్యలు తీసుకుంటున్నాయి. అయితే, ఈ తనిఖీల కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు కాకుండా త్వరలో మొబైల్ స్క్వాడ్‌లను రంగంలోకి దింపేందుకు రవాణా శాఖ సిద్ధమవుతోంది. వాహనాలు, సహాయక సిబ్బంది నియామకం కోసం ఇప్పటికే ఆర్థికశాఖకు ప్రతిపాదనలు పంపింది. ఆర్థిక శాఖ ఆమోదం లభించిన వెంటనే మొబైల్ స్క్వాడ్స్‌ను రంగంలోకి దించనున్నారు.

ఉల్లం'ఘనుల'పై ఏఎన్‌పీఆర్ నిఘా

నిబంధనలు అతిక్రమించి రహదారులపై వాహనాలు నడిపే వారిని గుర్తించి చర్యలు తీసుకునేందుకు రవాణా శాఖ ఏఎన్‌పీఆర్(ఆటోమేటిక్ నెంబర్ ప్లేట్ రీకగ్నిషన్) కెమెరాలను వినియోగించేందుకు సిద్ధమవుతోంది. రోడ్లపై తిరిగే ప్రతి వాహనం రిజిస్ట్రేషన్ నెంబరు ఆధారంగా పూర్తి సమాచారం కేంద్ర సర్వర్‌లో నమోదై ఉంటుంది. సరుకు రవాణా చేసే వాహనాలకు సంబంధించిన సమాచారం, అనుమతులు, బీమా ఇలా అన్ని విషయాలు ఎప్పటికప్పుడు నమోదు అవుతుంటాయి. ఏదైనా వాహనం నిబంధనలు అతిక్రమించి రోడ్లపై తిరుగుతుంటే ఏఎన్‌పీఆర్ కెమెరాలు గుర్తించి స్థానిక రవాణా శాఖ అధికారులకు సమాచారం అందిస్తాయి. ఆ సమాచారం మేరకు అధికారులు సంబంధిత వాహనాన్ని అడ్డుకుని చర్యలు తీసుకుంటారు. తెలంగాణ రోడ్లపై మొత్తం 40 ఏఎన్‌పీఆర్ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు రవాణా శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. పైలెట్ ప్రాజెక్టుగా ఇప్పటికే కామారెడ్డి రహదారిలో ఏఎన్‌పీఆర్ కెమెరాను వినియోగిస్తోంది. దశలవారీగా మిగతా కెమెరాల్ని ఏర్పాటు చేయనుంది.

విద్యా సంస్థల్లో ఆత్మహత్యల నివారణకు గతంలో తాము ఇచ్చిన మార్గదర్శకాలను అమలు చేయాలని సోమవారం సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. ఎనిమిది వారాల్లో నివేదిక సమర్పించాలని ఆదేశాలు ఇచ్చింది. తదుపరి విచారణను జనవరి నెలకు వాయిదా వేసింది.

19 వాహనాలు బైక్‌ను తప్పించాయి!

ఒక్క కావేరీ బస్సే బైకును ఈడ్చుకెళ్లింది.. దీనికి డ్రైవర్ లక్ష్మయ్య నిర్లక్ష్యమే కారణం

- కర్నూలు బస్సు ప్రమాద ఘటనలో పలు విషయాలపై పోలీసుల సందేహం
- తెల్లవారుజామున 2:45 సమయంలో డివైడర్‌ను ఢీకొట్టిన ద్విచక్ర వాహనం
- రోడ్డుకు అడ్డంగా పడిన శివశంకర్ బైక్
- తర్వాత అదే దారిలో లారీలు, బస్సులు
- బైక్‌పై నుంచి వెళ్లింది కావేరి బస్సు ఒక్కటే
- బైకు కనిపించలేదా? లేక ఏం జరిగింది?
- విచారణలో కూపీ లాగుతున్న పోలీసులు



కర్నూలులో తమిళనాడు వాసి ప్రశాంత్ మృతదేహానికి అంత్యక్రియలు

కర్నూలు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గత శుక్రవారం తెల్లవారు జామున 2:45 గంటల సమయంలో పల్సర్ బైక్‌పై డోన్‌కు వెళ్తున్న శివశంకర్, ఎర్రిస్వామిలు కర్నూలులోని చిన్నటేకూరు దగ్గర డివైడర్‌ను ఢీకొట్టారు. బైకర్ శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందగా ఎర్రిస్వామి గాయాలతో బయటపడ్డారు. బైక్ రోడ్డు మధ్యలో పడిపోయింది. అదే రోడ్డులో అర్ధరాత్రి 2:55 నుంచి 3 గంటల మధ్య బెంగళూరు వైపు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్ బస్సు డ్రైవర్ రోడ్డు మధ్యలో పడి ఉన్న బైక్‌ను గుర్తించకుండా ఆ బైక్ పైనుంచి వాహనాన్ని నడిపించడంతో మంటలు చెలరేగి 19 మంది ప్రయాణికులు అగ్నికి ఆహుతయ్యారు. అంటే.. ఈ రెండు ఘటనల మధ్య 10-15 నిమిషాల వ్యవధి ఉంది. అయితే.. ఈ స్వల్ప వ్యవధిలో అదే మార్గంలో 19కి పైగా బస్సులు, లారీలు రోడ్డుపై పడిన బైక్‌ను గుర్తించి.. దానిని తప్పించుకొని ముందుకుసాగాయి. మరి కావేరీ బస్సు డ్రైవర్ లక్ష్మయ్యకు రోడ్డుపై పడి ఉన్న బైకు కనిపించలేదా? లేక నిర్లక్ష్యంగా ఆయన బస్సును డ్రైవ్ చేశారా? అనేది కీలక ప్రశ్న. కాగా, ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ లక్ష్మయ్యను అదుపులోకి తీసుకొని విచారిస్తే.. ఒక్కొక్కసారి ఒక్కొక్క రకంగా చెప్పినట్లు పోలీసులు చెబుతున్నారు. మొదట్లో బైకర్ ఎదురుగా వచ్చి బస్సును ఢీకొట్టాడని, ఆ తర్వాత ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొనడం వల్ల ప్రమాదం జరిగిందని చెప్పారు. తర్వాత, శివశంకర్, ఎర్రిస్వామిలు ఓ బంకులో పెట్రోలు పోయించుకున్న సీసీ కెమెరా ఫుటేజీ వెలుగులోకి వచ్చాక రోడ్డుపై పడిన నల్లరంగు బైక్‌ను గుర్తించకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని లక్ష్మయ్య వెల్లడించినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో పోలీసులు లక్ష్మయ్యను మరింత లోతుగా విచారిస్తున్నారు.

వారికి బైక్ ఎలా కనిపించింది?

"ప్రమాదం జరిగిన సమయంలో వర్షం పడుతోంది. రోడ్డుపై పడి ఉన్న బైక్ నలుపు రంగులో ఉంది. చీకట్లో దూరం నుంచి బైక్‌ను గుర్తించలేకపోయాను. దగ్గరకు వచ్చాక బైక్ కనిపించిందని, సడెన్ బ్రేక్ వేస్తే.. వెనుకాల వచ్చే వాహనాలు మా బస్సును ఢీకొట్టి భారీ ప్రమాదం జరిగే అవకాశం ఉందని భావించి తప్పని పరిస్థితుల్లో బైక్ పైనుంచి బస్సును పోనిచ్చా." అని డ్రైవర్ లక్ష్మయ్య పోలీసుల విచారణలో వెల్లడించినట్లు తెలిసింది. కానీ, అంతకుముందు అదే దారిలో 19కి పైగా బస్సులు, లారీలు రోడ్డుపైపడి ఉన్న బైకును తప్పించుకుని ముందుకు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. అంతే కాదు.. ఆ దారిలో వెళ్లిన నలుగురు బస్సు లారీల డ్రైవర్లను గుర్తించి విచారించగా.. "ఓ బైక్ రోడ్డుపై అడ్డంగా పడి ఉంది. స్పృహ లేకుండా పడిపోయిన ఓ యువకుడిని మరో వ్యక్తి పక్కకు లాగుతున్నట్లు గుర్తించాం. బైక్‌ను తప్పించుకొని ముందుకు వెళ్లిపోయాం." అని పోలీసులకు వివరించారు. అయితే, ఆ డ్రైవర్లకు కనిపించిన బైకును కావేరిట్రావెల్స్ బస్సు డ్రైవర్ లక్ష్మయ్య గుర్తించ లేకపోయానని చెప్పడం ఎంత వరకు నిజం? అనే దిశ గా పోలీసులు విచారణ సాగిస్తున్నారు. బస్సు ప్రమాదానికి లక్ష్మయ్య నిర్లక్ష్యమే కారణమని అనుమానిస్తున్నారు.

నివేదికలు వస్తే కొలిక్కి

కర్నూలు బస్సు ప్రమాదంపై రోడ్డు రవాణా, అగ్నిమాపక శాఖ, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్(ఎఫ్ఎస్ఎల్) నుంచి నివేదికలు కోసం పోలీసులు ఎదురు చూస్తున్నారు. ఆయా శాఖల అధికారులకు ఇప్పటికే లేఖలు రాశారు. వారి నుంచి నివేదికలు రాగానే దర్యాప్తు ఓ కొలిక్కి వస్తుందని పోలీసు అధికారి ఒకరు చెప్పారు.

తమిళ వాసి మృత దేహానికి కర్నూలులో అంత్యక్రియలు

- గుండెలవిసేలా రోదించిన తండ్రి

బస్సు ప్రమాదంలో చనిపోయిన వారిలో ఒకరు తమిళనాడుకు చెందిన ప్రశాంత్ రాజన్. డీఎన్‌ఏ సరిపోల్చి 18 మంది మృతదేహాలను ఆదివారం కుటుంబీకులు, బంధువులకు అప్పగించారు. తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లా జిత్తన్‌దహళ్లికి చెందిన 29 ఏళ్ల యువకుడు ప్రశాంత్ రాజన్ మృతదేహాన్ని సోమవారం ఉదయం 10 గంటలకు కర్నూలు జీజీహెచ్ ఫోరెన్సిక్ వైద్యులు, పోలీసులు తండ్రి రాజన్‌కు అప్పగించారు. స్వస్థలం ధర్మపురి జిల్లా జిత్తన్‌దహళ్లికి వెళ్లాలంటే 550 కిలోమీటర్లకు పైగా ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఎంత తక్కువ కాదన్నా 10-11 గంటలు ప్రయాణించి రాత్రి 8-9 గంటలకు చేరుకోవాల్సి వస్తుంది. ఇప్పటికే మరణించి నాలుగు రోజులు కావడం, దూరం ఎక్కువగా ఉండడంతో మృతుడి తండ్రి రాజన్, బంధువులు కర్నూలు నగరంలోని జమ్మిచెట్టు వద్ద ఉన్న శ్మశాన వాటికలో సంప్రదాయ బద్ధంగా అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కాగా, 'నా కొడుకు ఎక్కడో తమిళనాడులో పుట్టి ఊరుగాని ఊరు కర్నూలులో చివరి మజిలీ ముగించాల్సి వచ్చింది. వందల కిలోమీటర్ల దూరం ఉండడంతో అందరూ ఉన్నా అనాథలా అంత్యక్రియలు నిర్వహించాల్సి వస్తోంది దేవుడా..' అంటూ తమిళంలో తండ్రి రాజన్ గుండెలవిసేలా రోదించారు.

అంత్యక్రియలకు వచ్చి.. ప్రమాదం బారిన

కర్నూలు బస్సు ప్రమాదంలో మృతి చెందిన ఒకే కుటుంబంలోని గోళ్ల రమేశ్, అనూష, వీరి బిడ్డలు శశాంత్, మన్వితల అంత్యక్రియలు సోమవారం నెల్లూరు జిల్లా వింజమూరు మండలం గోళ్లవారిపల్లెలో జరిగాయి. అయితే, ఈ కార్యక్రమంలో పాల్గొని బంధువులు తిరిగి వెళ్తుండగా కారు టైరు పంక్చరై అదుపు తప్పి గోడను ఢీకొట్టింది. దీంతో ఐదుగురు గాయపడ్డారు.

కర్నూలు ఘటన నేపథ్యంలో ...
143 కేసులు నమోదు

- ఉల్లంఘనలపై రూ.3.06 లక్షలు జరిమానా

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కర్నూలులో బస్సు అగ్ని ప్రమాద ఘటన నేపథ్యంలో రవాణా శాఖ అధికారులు తనిఖీలు విస్తృతం చేశారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నగరానికి రాకపోకలు చేసే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులతోపాటు ట్యాక్సీ నంబర్ ప్లేట్లున్న కార్లనూ తనిఖీ చేస్తున్నారు. 25 నుంచి 27 వరకు నిర్వహించిన తనిఖీల్లో 143 కేసులు నమోదు చేసినట్లు రవాణా శాఖ సంయుక్త కమిషనర్ రమేష్ చిదుర తెలిపారు. రూ.3.06 లక్షలు కాంపౌండింగ్ ఫీజుగా వసూలు చేశారు. అనుమతి లేని, ఉల్లంఘనలున్న 5వాహనాలను సీజ్ చేశారు. బస్సుల్లో నిబంధనల ప్రకారం సీట్లున్నాయా? నిప్పునార్పే పరికరాలు, సుత్తులు, ప్రథమ చికిత్స కిట్లు, సామగ్రి తరలించే చోట ప్రమాదకర వస్తువులు నిల్వ చేశారా..? అన్నది పరిశీలిస్తున్నారు. బస్సులకు అనుమతి, ఫిట్‌నెస్ ఉందా..? డ్రైవర్లు అనుభవజ్ఞులేనా..? ప్రమాదం సంభవిస్తే అత్యవసర పరిస్థితుల్లో ఏం చేయాలన్న దానిపై ప్రయాణానికి ముందు అవగాహన కల్పిస్తున్నారా..? అని తెలుసుకుంటున్నారు.

డ్రైవర్లూ.. అప్రమత్తంగా ఉండండి
ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి

ఇటీవల ప్రైవేట్ ట్రావెల్ బస్సు అగ్ని ప్రమాదానికి గురైన నేపథ్యంలో టీజీఎస్ ఆర్టీసీ అందిస్తున్న సురక్షిత రవాణా సేవలను ఎండీ వై.నాగిరెడ్డి తనిఖీ చేశారు. సోమవారం మియాపూర్-1 డిపోలోని లహరి స్లీపర్, లహరి ఏసీ స్లీపర్ కం సీటర్, రాజధాని, సూపర్ లగ్జరీ బస్సుల్లో అమర్చిన ఫైర్ డిటెక్షన్ అలారం, అగ్నిమాపక పరికరాల పనితీరును పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణికులను సురక్షితంగా బయటకు తెచ్చే విధానాలను సమీక్షించారు. ప్రయాణ సమయంలో జాగ్రత్తలపై డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. బస్సులన్నింటిలో అత్యవసర ద్వారాలు, అద్దాలను పగలగొట్టేందుకు తగినన్ని బ్రేకర్లు, అగ్నిమాపక పరికరాలు అన్ని వేళల్లో అందుబాటులో ఉంచాలన్నారు.

అమ్మా.. చెల్లెను అమ్మొద్దమ్మా..

రూ.3 లక్షలకు కన్నబిడ్డను విక్రయించిన తల్లిదండ్రులు.. అమ్మొద్దంటూ ఏడుస్తూ వారిని వేడుకున్న పెద్దకుమార్తె

- నల్లగొండ జిల్లా తిరుమలగిరి మండలంలో ఘటన
- గతంలోనూ ఒక శిశువును విక్రయించినట్లు ఆరోపణ
- వారిపై కేసు నమోదు చేసిన ఐసీడీఎస్ అధికారులు



శిశు విక్రయంపై అసిస్టెంట్ సీడీపీవో సువర్ణ విచారణ

తిరుమలగిరి (సాగర్), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కడుపున పుట్టిన ఆడపిల్లను కన్నవారే డబ్బుకు ఆశపడి అమ్మేశారు! 'అమ్మా చెల్లెను విక్రయించొద్దమ్మా' అంటూ పెద్ద కూతురు ఏడుస్తూ వేడుకున్నా కరగలేదా కర్కశ హృదయాలు!! నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బంది, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని ఎల్లాపురంతండాకు చెందిన కొర్ర బాబుకు పెద్దవూర మండలం ఊరబావితండాకు చెందిన పార్వతికి పదేళ్ల క్రితం వివాహమైంది. ఆ దంపతులు జీవనోపాధి నిమిత్తం నల్లగొండకు వెళ్లి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పార్వతికి మొదటి కాన్పులో కుమారుడు జన్మించి అనారోగ్యంతో వెంటనే చనిపోయాడు. అనంతరం ఇద్దరు కుమార్తెలు జన్మించటంతో నల్లగొండలోనే ఉంటూ చిన్నారులను చదివించుకుంటున్నారు. ఆ చిన్నారుల్లో ఒకరి వయసు ఆరేళ్లు కాగా.. మరొకరికి ఏడేళ్లు. ఇదిలా ఉండగా.. ఈ నెల 10వ తేదీన పార్వతి నల్లగొండ జిల్లా హాలియాలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఆడ శిశువును ప్రసవించింది. ఇప్పటికే ఇద్దరు ఆడపిల్లలు ఉండగా.. మళ్లీ పాప పుట్టడంతో పోషణ భారంగా భావించి, ఆ శిశువును విక్రయించాలని భార్యాభర్తలు నిర్ణయించుకున్నారు. పార్వతి తల్లిదండ్రుల సహకారంతో.. మధ్యవర్తుల ద్వారా ఏపీలోని ఏలూరు జిల్లాకు చెందిన దంపతులకు రూ.3లక్షలకు విక్రయించేందుకు సిద్ధమయ్యారు. అయితే.. ఈ తతంగమంతా ఫోన్ సంభాషణల ద్వారానే సాగడంతో.. చెల్లిని అమ్మేస్తున్న విషయం పెద్ద పిల్లలిద్దరికీ అర్థమైంది. దీంతో బాబు, పార్వతిల పెద్ద కుమార్తె నక్షత్ర ఈ విషయాన్ని నాయనమ్మకు తెలియజేసి, శిశువును విక్రయించకుండా అడ్డుకోవాలని కోరింది.

కనికరమైనా లేక..

విక్రయానికి ఏర్పాట్లు పూర్తి కావడంతో.. శిశువును తీసుకుని తల్లి పార్వతి తన పుట్టింటికి వెళ్లే సమయంలో పెద్ద కుమార్తె నక్షత్ర అడ్డుకుని చెల్లిని విక్రయించవద్దని భోరున విలపించింది. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. మనవరాలిని అమ్మొద్దని బాబు తల్లి కూడా వేడుకుంది. పెద్ద బిడ్డ ప్రాధేయపడ్డా, తల్లి వేడుకున్నా.. బాబు హృదయం కరగలేదు. ఆయన తన భార్య పార్వతి, నవజాత శిశువుతో కలిసి ఈ నెల 23న తన అత్తవారి ఊరైన ఊరబాయితండాకు చేరుకున్నారు. దీంతో.. బాబు తల్లి తన పెద్ద కుమారుడు సురేశ్‌కు ఫోన్ చేసి విషయం చెప్పారు. సురేశ్ తన తమ్ముడు బాబుకు ఫోన్ చేసేందుకు యత్నించగా అందుబాటులోకి రాలేదు. పాపను తానైనా పెంచుకుంటానని చెప్పినా, డబ్బులకు ఆశపడి ఇతరులకు అమ్ముతున్నారని పేర్కొంటూ సురేశ్ తన సన్నిహితుల వద్ద ఆవేదన చెందడంతో విషయం బయటకు పొక్కింది.

కేసు నమోదు

శిశువును తీసుకుని ఈ నెల 23న ఊరబాయితండాకు వెళ్లిన పార్వతి, బాబు దంపతులు ఆ రాత్రికి అక్కడే ఉన్నారు. భార్యను, పాపను అక్కడే వదిలి బాబు తిరిగి నల్లగొండకు వచ్చాడు. శిశువును కొనుగోలు చేసిన దంపతుల నుంచి డబ్బు అందిన తర్వాత, 25వ తేదీ ఉదయం నాగార్జునసాగర్ సమీపంలోని సమ్మక్క, సారక్క దేవాలయం వద్ద.. పార్వతి తమ పాపని ఆ దంపతులకు అప్పగించినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు, నల్లగొండ జిల్లా ఐసీడీఎస్ అధికారులు అప్రమత్తమై విచారణ చేపట్టారు. బాబు పరారీలో ఉండడంతో, అతని సోదరుడు సురేశ్‌తో మాట్లాడి, శిశువును విక్రయించిన విషయాన్ని నిర్ధారించుకుని కేసు నమోదు చేశారు. కాగా.. బాబు, పార్వతి దంపతులు శిశువును విక్రయించడం ఇదే మొదటిసారి కాదని.. మూడో కాన్పులో జన్మించిన కుమార్తెను సైతం విక్రయించారని తండావాసులు ఆరోపిస్తున్నారు.

తదుపరి దర్యాప్తు అక్కర్లేదు

- ప్రత్యేక కోర్టులో వివేకా హత్య కేసు నిందితుల వెల్లడి
- కోర్టు ఆదేశిస్తే విచారణ జరుపుతామన్న సీబీఐ

హైదరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ చిన్నాన్న వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తదుపరి దర్యాప్తు చేయాల్సిన అవసరం లేదని ఈ కేసులో నిందితులుగా ఉన్న గంగిరెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే సీబీఐ మాత్రం కోర్టు ఆదేశిస్తే తదుపరి దర్యాప్తు చేస్తామని పునరుద్ఘాటించింది. తన తండ్రి హత్య కేసు దర్యాప్తును సీబీఐ అసంపూర్ణంగా వదిలేసిందని.. తదుపరి దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ వివేకా కుమార్తె నర్రెడ్డి సునీతారెడ్డి సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై సీబీఐ కోర్టు స్పెషల్ ప్రిన్సిపల్ జడ్జి టి.రఘురాం సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఎస్.గౌతమ్ వాదనలు వినిపించారు. సునీత పిటిషన్‌పై తేల్చడానికి సుప్రీంకోర్టు సమయం నిర్దేశించిన నేపథ్యంలో ఈ నెల 27లోపు కౌంటర్లు దాఖలు చేయాలని నిందితులు టి.గంగిరెడ్డి (ఏ1), సునీల్ యాదవ్(ఏ2), ఉమాశంకర్‌రెడ్డి(ఏ3), దస్తగిరి (ఏ4-అప్రూవర్), దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి (ఏ5), గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డి(ఏ6), వైఎస్ భాస్కర్‌రెడ్డి (ఏ7), కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి (ఏ8)తోపాటు సీబీఐకి కూడా కోర్టు ఈ నెల 23న ఆదేశాలు జారీచేసింది. అయితే గంగిరెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి మాత్రమే తదుపరి దర్యాప్తు అవసరం లేదని కౌంటర్లు దాఖలు చేశారు. కోర్టు ఆదేశిస్తే తదుపరి దర్యాప్తు చేస్తామని సీబీఐ తెలిపింది. ఈ అంశంపై కౌంటర్ దాఖలు చేయబోమని.. మెమో దాఖలు చేస్తామని సీబీఐ తరఫు న్యాయవాది వెల్లడించారు. వాదనలు విన్న న్యాయమూర్తి విచారణను బుధవారానికి వాయిదా వేశారు.

బీఎస్సీ(హానర్) కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తు గడువు 29

హైదరాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రొ. జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల్లో బీఎస్సీ (హానర్) అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశం కోసం ఈ నెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ గురుకుల విద్యాసంస్థల సొసైటీ(ఎంజేపీ) కార్యదర్శి బడుగు సైదులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్(బైపీసీ) లేదా దానికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణతతో పాటు టీజీ ఈఏపీసెట్-2025లో అర్హత సాధించిన వెనుకబడిన తరగతుల విద్యార్థులు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ నెల 21 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమయిందని, పూర్తి వివరాలు http://ug.mjptbcwreis.net వెబ్‌సైట్‌లో చూడొచ్చని లేదా 040-23328266 హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని ఎంజేపీ కార్యదర్శి పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మృత్యుశకటాలు


కర్నూలు ఘోరప్రమాదానికి కారణమైన ఆ ప్రైవేటు బస్సు మూడు రాష్ట్రాల్లో తన రూపురేఖలు మార్చుకొని మూడుమార్లు రిజిస్టరైందని అధికారులు అంటున్నారు. డ్రైవర్ చదువు అర్హతల నుంచి యజమాని బాధ్యతారాహిత్యం వరకూ రోజుకో కొత్త అంశం వెలుగు చూస్తోంది. పందొమ్మిదిమంది ప్రయాణికులు నిస్సహాయస్థితిలో సజీవంగా తగలబడిపోయిన ఈ ఘోర దుర్ఘటనకు డ్రైవర్ నుంచి రవాణాశాఖ వరకూ ప్రతీ ఒక్కరూ బాధ్యులే. దీనికి పదిరోజుల ముందే, రాజస్థాన్ జైసల్మేర్‌లో ఇటువంటి ఘోరమే జరిగింది. బస్సులో అమర్చిన చవుకబారు ఎయిర్ కండిషనర్ నిప్పురాజేసిన కారణంగా భారీ ప్రాణనష్టం సంభవించింది. మొన్న ఆదివారం ఆగ్రా–లక్నో ఎక్స్‌ప్రెస్ హైవేమీద ఒక బస్సు పూర్తిగా తగలబడి, ప్రయాణికులు అదృష్టవశాత్తూ బతికిబయటపడ్డారు. వేర్వేరు ఘటనలే అయినప్పటికీ, ఉల్లంఘనల్లో ఆరితేరిన ప్రైవేటు బస్సుల విషయంలో పర్యవేక్షక వ్యవస్థల ఉదాసీనతకు ఇవన్నీ తార్కాణాలు.

నగరాలు, మహానగరాలు ఉద్యోగ ఉపాధి అవకాశాల కేంద్రాలుగా వృద్ధిచెందుతున్నక్రమంలో, నల్లగా మెరిసే పలువరుసల జాతీయరహదారులమీద పరుగులుతీసే ఈ 'లగ్జరీకోచ్'ల సంఖ్య కూడా అతివేగంగా పెరుగుతూ వచ్చింది. రాత్రివరకూ ఉద్యోగం చేసుకొని, తెల్లారేసరికల్లా ఊళ్ళో వాలగలిగే వీలు వీటితో ఉంది. కొద్దిగంటల్లోనే గమ్యస్థానానికి చేర్చడం, అంతవరకూ సుఖంగా నిద్రించగల సదుపాయం ఉన్నందున ప్రయాణికులు సైతం సౌకర్యాన్ని పరిగణిస్తున్నారే తప్ప ఈ లగ్జరీ బస్సుల అతివేగాన్నీ, ప్రమాదావకాశాలను పెద్దగా పట్టించుకోవడం లేదు. గంటకు 80కిలోమీటర్లు కూడా దాటని ఆర్టీసీ బస్సుల్లో అధిక సమయం పట్టడమే కాదు, ఎక్కడపడితే అక్కడ ఆగవు, ప్రైవేటు బస్సుల మాదిరిగా హంసతూలికాతల్పాలూ హంగులూ ఆర్భాటాలూ కూడా వాటిలో కనబడవు. మిగతా కంపెనీ బస్సులతో పోటీపడేందుకూ, అధికసంపాదనకూ వీలుగా ప్రైవేటు బస్సులన్నీ ప్యాసింజర్ల కంఫర్ట్ పేరిట సీట్లు, రగ్గుల నుంచి, నాజూకైన కిటికీ తెరలవరకూ అన్నింటికీ భగ్గునమండే మెటీరియల్‌నే వాడతాయి. బస్సులో ఏసీలు, టీవీలు, మొబైల్ చార్జింగ్ యూనిట్ల వంటివి కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఒక చిన్న నిప్పురవ్వను కార్చిచ్చుగా మార్చేందుకు కూడా ఇవన్నీ దోహదం చేస్తున్నాయి. ఇక, ప్రైవేటు బస్సు గర్భంలో ఏ విష రసాయనాలు దాగివున్నాయో, ఏ విస్ఫోటక పదార్థాలు పేలడానికి సిద్ధపడుతున్నాయో ఎవరికీ తెలియదు. భూమికి అంత ఎత్తున ఉండే ఈ లగ్జరీ కోచ్‌ల ఇరుకైన నిర్మాణం ప్రమాదం జరిగినవెంటనే తప్పించుకొనేందుకు అవకాశం ఇవ్వదు. రాకపోకలకు ఒకే రాజమార్గం తప్ప, ఎమర్జెన్సీ ఎగ్జిట్లు, అగ్నిమాపకయంత్రాలు, అద్దాలుబద్దలు కొట్టే హేమర్లు ఉండవు. ఉన్నా కూడా, నిద్రలోంచి మేలుకొని, ఏదో జరిగిందని గుర్తించేలోగానే విషవాయువులు కమ్ముకుంటాయి. ఊపిరాడని ఆ స్థితిలో తోపులాటల మధ్యన ప్రయాణికులు ప్రాణాలు వదిలేయాల్సి వస్తోంది.

లాభమే ప్రైవేటుకు పరమావధి కనుక అన్ని విధాలైన ఉల్లంఘనలూ జరుగుతున్నాయి. ఫ్యాక్టరీ ప్రమాణాలకు, రిజిస్ట్రేషన్ నిబంధనలకు పూర్తి భిన్నంగా డిజైన్, సీటింగ్, బాడీ ఇత్యాదివన్నీ మారిపోతున్నాయి. బయలుదేరేటప్పుడు అనేకచోట్ల ఆగుతూ, ఆలస్యంగా ప్రయాణం మొదలెట్టే ఈ లగ్జరీకోచ్‌లు గమ్యస్థానాన్ని మాత్రం ఎంతోముందు చేరుకుంటాయి. గమ్యం కాదు, వేగమే వీటి లక్ష్యం కనుక, నిర్లక్ష్యంగా నడిపేవారినీ, మద్యానికి అలవాటుపడ్డవారినీ, తగిన అనుభవం లేని వారిని డ్రైవర్లుగా కూచోబెట్టడానికి కూడా యజమానులు సందేహించరు. కనీస విశ్రాంతి ఇవ్వకుండా వారితో గొడ్డుచాకిరీ చేయించుకోవడానికీ వెనుకాడరు. ఏఐ నుంచి అత్యాధునిక సాంకేతికతలవరకూ హైవేలమీద వేటిని వినియోగించినా, ప్రయాణికుల ప్రాణాలపట్ల బస్సు యజమానులకు కాస్తంత ప్రేమ, బాధ్యత లేనిదే ఈ ప్రమాదాలను నివారించడం అసాధ్యం. భద్రతకంటే లాభార్జనకే ప్రాధాన్యం ఇచ్చే ఈ వ్యవస్థను దాడులు, తనిఖీలు, నిరంతర పర్యవేక్షణతోనే నియంత్రించడం సాధ్యం. ఆర్టీసీ తరహాలో స్పీడ్‌లాక్ అమలు చేసి, నిబంధనలను ఉల్లంఘిస్తున్నవారిని కఠినంగా శిక్షించాలి. విమానాల్లో మాదిరిగా ప్రయాణికులకు క్షేమంగా బయటపడే మార్గాలను ముందుగా తెలియచెప్పాలి. ప్రతీ ప్రమాదానికీ మానవనిర్లక్ష్యమే కారణం. ప్రతీ తప్పిదం మనకు ఒక పాఠం కావాలి. ప్రజాభద్రత ప్రభుత్వాల బాధ్యత. దానిని నష్టపరిహారాలకు పరిమితం చేయడం సరికాదు.

సమాజాన్ని చక్కదిద్దడమే 'సోషల్ వర్క్'!

వందేళ్ల స్వాతంత్ర్యానికి దగ్గర పడుతున్నా నేటికీ సమాజంలో అనేక రుగ్మతలు పట్టి పీడిస్తూనే ఉన్నాయి. ప్రభుత్వాలు తమవంతు ప్రయత్నం చేస్తున్నా, సమాజంలో ఏదో ఓ మూలన విభిన్నమైన అలజడులు, ఆందోళనలు, హత్యలు, లైంగిక దాడులు జరుగుతూనే ఉన్నాయి. అయిదేళ్ల పాప నుంచి వివాహిత మహిళల వరకూ ఇందుకు మినహాయింపు లేదు. ఈ మధ్య పోక్సో కేసులు అధికం అయ్యాయంటే సమాజంలో నరరూప రాక్షసులు ఎంతగా పెరిగిపోయారో అర్థం చేసుకోవచ్చు. ఇటువంటి అనేక సమస్యలు మానవ సమాజాన్ని మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. వీటిని నిరోధించడానికి ఇప్పటికే అనేక సంస్థలు పని చేస్తున్నా, పూర్తి స్థాయిలో నిర్మూలన జరగడం లేదు. ఇటువంటి అనేక గత్తరల నుంచి సమాజాన్ని చక్కదిద్దడానికి కృషి చేయాల్సిన అవసరం ఉంది. అందులో భాగంగా సామాజిక సేవ (సోషల్ వర్క్) చదివిన వారికి ఆయా సంస్థల్లో అవకాశాలు ఇవ్వడం వల్ల పరిస్థితులను అదుపులోకి తీసుకురావొచ్చు.



పెరిగిన సాంకేతికతోనూ, స్మార్ట్ ఫోన్ వల్ల యువత అనేక దారుణాలకు కారణం అవుతోంది. ఆన్‌లైన్ బెట్టింగ్‌తో ప్రాణాలు తీసుకుంటున్నారు. వివాహ బంధాలు సైతం సరైన అవగాహన లేక క్షణికావేశంతో విడాకులకు దారి తీస్తున్నాయి. ఇటువంటి అనేక రుగ్మతలను రూపుమాపాల్సిన అవసరం ఉంది. క్షేత్రస్థాయి పరిశీలనతో కూడిన సోషల్ వర్క్ చదివిన విద్యార్థులను ఇందుకు ఉపయోగించుకోవచ్చు. వీరు మానవ జీవితానికి సంబంధించిన అనేక విషయాలను ఈ కోర్సులో నేర్చుకుంటారు. ఇప్పటికే వీరు హెచ్‌ఐవీ బాధితుల కోసం కౌన్సిలర్లుగా పనిచేస్తూ, వారిలో మానసిక స్థైర్యం నింపేలా కృషి చేస్తున్నారు. ఈ విధానాన్ని అన్ని రంగాల్లో అమలు చేస్తే సమాజంలో మరింత గుణాత్మక మార్పు తీసుకురావొచ్చు.

దేశవ్యాప్తంగా పలు విద్యా సంస్థల్లో విద్యార్థుల మరణాలు కలవరపెడుతున్నాయి. ఈ సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. మరోపక్క విపరీతంగా పెరిగిపోతున్న సోషల్ మీడియా... దానివల్ల జరిగే మోసాలతో యువత, విద్యార్థులు మానసిక కుంగుబాటుకు గురవుతున్నారు. ఈ సోషల్ మీడియా ప్రభావం వల్ల యువత చిన్న వయసులోనే నేరాలకు పాల్పడుతున్న ఘటనలు ఉన్నాయి. విద్యార్థుల బలవన్మరణాలు కలవరపెడుతున్న తరుణంలో, వీటిపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని 'పాఠశాలలు, విద్యాలయాల్లో మానసిక కౌన్సిలర్లను నియమించాలి' అని ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీన్నిబట్టి సామాజిక కార్యకర్తల, కౌన్సిలర్ల ఆవశ్యకతను ప్రభుత్వాలు అర్థం చేసుకోవాలి. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో విద్యార్థుల మానసిక దృఢత్వం కోసం కౌన్సిలర్లను ఏర్పాటు చేయడానికి సోషల్ వర్కర్లను నియమించాలి. తద్వారా ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థుల మరణాలను అడ్డుకోవచ్చు. ఆ దిశగా ప్రభుత్వాలు ఆలోచించి, సోషల్ వర్క్ విద్యనభ్యసించిన వారితో ఈ పోస్టులను భర్తీ చేయాలి.

– సంపత్ గడ్డం

బాలలకు 'కృత్రిమ మేధ' అవసరమా?

వచ్చే విద్యా సంవత్సరం (2026–27)లో పాఠశాల విద్యలో మూడవ తరగతి నుంచి కృత్రిమ మేధ (ఏఐ) పాఠ్యాంశాలను ప్రవేశపెట్టనున్నట్టు కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ప్రకటించింది. డిజిటల్ టెక్నాలజీల ఏకీకరణతో రూపొందే ఆర్థిక వ్యవస్థ అవసరాలకు అనుగుణంగా భావి శ్రామికశక్తిని తీర్చిదిద్దే లక్ష్యంతో పాఠశాల స్థాయి నుంచి ఏఐ పాఠ్య ప్రణాళికను అమలు పరచనున్నట్టు కేంద్రం వెల్లడించింది. ఈ నిర్ణయాన్ని అనుసరించి రాష్ట్రాల విద్యా మంత్రిత్వశాఖలు కూడా ఏఐ పాఠ్య ప్రణాళికలను రూపొందించేందుకు పూనుకున్నాయి.



విద్యార్థులకు ఏఐ పరిజ్ఞానాన్ని బోధించేందుకు కేంద్ర ప్రభుత్వం జులై 2025లో 'SOAR Initiative (Skilling for AI Readiness)'ను ప్రారంభించింది. దీని ద్వారా సీబీఎస్ఈ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్)కు అనుబంధంగా ఉన్న దాదాపు 18 వేల పాఠశాలల్లో ఆరవ తరగతి నుంచి ఏఐను ఒక 'నైపుణ్య విషయం'గా బోధిస్తున్నారు. 6, 7, 8 తరగతులకు మూడు విభిన్న '15 గంటల' బోధనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కృత్రిమ మేధపై బాలలకు అవగాహన కలిగించడం, దానిని ఆచరణాత్మకంగా అనువర్తింప చేయడం, ఏఐ వినియోగంలో ఉత్పన్నమయ్యే సామాజిక చిక్కులను పిల్లలు అర్థం చేసుకోవడమే ఈ కార్యక్రమాల లక్ష్యంగా ఉన్నది. ఇక 9, 10, 11, 12 తరగతులకు '150 గంటల' ఎలెక్టివ్ కోర్సుల (విద్యార్థులు తమ వ్యక్తిగత ఆసక్తులు, భావి వృత్తి జీవిత లక్ష్యాలు లేదా తమ ప్రధాన పాఠ్యాంశాలతో సంబంధం లేకుండా కొత్త విషయాలను అధ్యయనం చేయడం ఆధారంగా ఎంచుకునే ఐచ్ఛిక కోర్సులు)ను బోధిస్తున్నారు. చాలా కొద్ది విశ్వవిద్యాలయాలు ఈ ఏడాది సైన్స్, ఇంజనీరింగ్ విద్యార్థులకు ఏఐ కోర్సులను తప్పనిసరి చేశాయి. సమస్త విద్యా విభాగాలకు ఏఐ బోధన తప్పనిసరి కాదు. కనుక ఆలోచనాపరులు ఒక ప్రశ్న అడిగి తీరాలి: పాఠశాలల్లో ఏఐ బోధనకు ఇంత తొందర ఎందుకు? కృత్రిమ మేధ మన జీవితాలను పలు విధాలా ప్రభావితం చేయనున్నదనడంలో సందేహం లేదు. 'ప్రపంచ ఏఐ ప్రమాణాలను రూపొందించడంలోను, ఏఐ సాంకేతికతల అభివృద్ధి, అనువర్తనాలలోను ప్రధాన పాత్ర వహించాలని భారత్ ఆకాంక్షిస్తోంది. దీనిపై ఎవరికీ రెండో అభిప్రాయం లేదు. అయితే ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఏఐ బోధన తప్పనిసరా?

డిజిటల్ అంతరాలను తగ్గించేందుకు, గ్రామీణ ప్రాంతాల; వనరులు తక్కువగా ఉన్న సామాజిక వర్గాల విద్యార్థులకు అవకాశాలను అందించేందుకు 'SOAR Initiative' ఇతోధికంగా తోడ్పడుతుందని ప్రభుత్వ ప్రకటన పేర్కొంది. డిజిటల్ సాధనాలను ఉపయోగించనివారు, అసలు వాటిని ఎలా ఉపయోగించాలో తెలియని విద్యార్థులు, ఉపాధ్యాయులే మన విద్యారంగంలో అత్యధికంగా ఉన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో డిజిటల్ అంతరాలను తగ్గించడమనే లక్ష్యం నెరవేరుతుందా? ఒక సాదృశ్యంతో ఈ విషయాన్ని మరింత వివరంగా పరిశీలిద్దాం. గత మూడు దశాబ్దాలుగా మొబైల్ ఫోన్ మన జీవితాలను అనేక రీతుల్లో అమితంగా ప్రభావితం చేస్తోంది. మన వైయక్తిక జీవితాలనే కాకుండా సమాజాన్ని, ఆర్థిక వ్యవస్థను మౌలికంగా మార్చివేసింది. అంతమాత్రాన 'మొబైల్ ఫోన్ ఎలా పనిచేస్తుంది?' అనే అంశాన్ని బాలలకు మూడవ తరగతి నుంచే బోధించి తీరాలా? మొబైల్ ఫోన్‌ను ఉపయోగించాల్సిన తీరుతెన్నులను పాఠశాల బాలలకు బోధించాలి. అయితే ఎప్పుడు? ఆ సాంకేతికతను మెరుగ్గా అర్థం చేసుకుని, ఉపయోగించుకోగల సామర్థ్యాన్ని అలవరచుకున్నప్పుడు. భద్రంగా, బాధ్యతాయుతంగా ఉపయోగించడాన్ని బాలలకు పాఠశాలలు నేర్పాలి. అది సమకూర్చే విద్యా ప్రయోజనాలను బాలలు పొందగలిగేలా చూడాలి.

'పాఠశాలల్లో ఏఐ బోధన' అనే మాటను పలువురు పలు విధాలుగా ఉపయోగిస్తున్నారు. ఉద్దేశించిన అర్థాల వెనుక ఉన్న గణనీయమైన గందరగోళాన్ని ఆ మాట దాచిపెడుతోంది. 'ఏఐ అక్షరాస్యత' అని కొంత మంది అస్పష్టంగా నిర్వచిస్తుండగా మరికొంత మంది తరగతి గదుల్లో ఏఐ సాధనాలను మరింత ఎక్కువగా ఉపయోగించాలనే అర్థంలో ఆ మాటను వాడుతున్నారు. ఉపాధ్యాయుల బోధనా కౌశలాలు, ఇతర విధుల నిర్వహణా సామర్థ్యాలను పెంపొందించేందుకు ఏఐను ఉపయోగించుకోవాలనే అర్థంలో వాడుతున్నారు. వ్యక్తిగతీకరించిన అభ్యాసం (Personalised learning- ప్రతి విద్యార్థి ప్రత్యేక అవసరాలు, ఆసక్తులు, సామర్థ్యాలను తీర్చడానికి బోధనా పద్ధతులు, బోధనాంశాలను అనుకూలంగా చేసే విద్యా విధానం) గురించి ఏఐని అభివృద్ధిపరుస్తున్న నిపుణులు మాట్లాడుతున్నారు. ప్రభుత్వం కూడా విద్యార్థి వ్యక్తిగత విద్యా పురోగతి గురించి మాట్లాడుతోంది. ఈ అయోమయ పరిస్థితిలో సమగ్ర అవగాహనతో ఏఐ సాధనాలను ఉపయోగించడాన్ని బాలలకు ఏఐని బోధించడం నుంచి తప్పనిసరిగా వేరు చేయాలి.

> కృత్రిమ మేధ బలీయమైన ఆకర్షణ గల అధునాతన సాంకేతికత. దాన్ని వినియోగించుకునే అలవాటు వదిలించుకోలేని వ్యసనంగా మారుతుంది. భావి పౌరులను తీర్చిదిద్దే విద్యాలయాలలో ఈ నవ సాంకేతికతను ఉపయోగించడంపై నిర్ణయాలను నిష్పాక్షిక వివేచన, సమగ్ర అవగాహన, నిశిత అంతర్దృష్టితో కూడిన సామాజిక వివేకంతో తీసుకోవల్సివుంది. మరి మనం అటువంటి జ్ఞానశీలురమేనా?

ప్రస్తుతం అమలుపరుస్తున్న ఏఐ పాఠ్య ప్రణాళికను నిశితంగా పరిశీలిద్దాం. ప్రాథమికోన్నత పాఠశాల ఏఐ పాఠ్య ప్రణాళిక మూడు ఏఐ సాంకేతిక విభాగాలను ప్రవేశపెట్టింది. అవి: కంప్యూటర్ విజన్, సహజ భాషా ప్రాసెసింగ్, స్టాటిస్టికల్ డేటా. ఏడవ తరగతి పాఠ్య పుస్తకం సుస్థిరాభివృద్ధికి పరిస్థితులను అనుకూల పరచడంలోను, సామాజిక అభివృద్ధి సాధనలోను ఏఐ వినూత్న పాత్ర గురించి ప్రముఖంగా ప్రస్తావించింది. ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, సిస్టమ్స్ థింకింగ్ (సమస్యల పరిష్కారానికి సమగ్రమైన రీతిలో ఆలోచించడం), సిస్టమ్స్ మ్యాప్స్ (ఒక సంక్లిష్ట వ్యవస్థ భాగాలు ఎలా పరస్పరం అనుసంధానమై ఉన్నాయో వివరించే దృశ్య ప్రాతినిధ్యాలు) మొదలైన భావనలకు కూడా ప్రాధాన్యమిచ్చింది. 8వ తరగతి విద్యార్థులు 'ఏఐ ప్రాజెక్టులు', 'ఏఐ నైతికత, బాధ్యతాయుతమైన ఏఐ ఆచరణలు' గురించి నేర్చుకుంటారు. 9వ తరగతి పుస్తకం ఏఐకు అవసరమైన గణితం, జెనరేటివ్ ఏఐ గురించి చర్చించింది. 10వ తరగతి పాఠ్యపుస్తకంలో పర్యవేక్షిత, పర్యవేక్షించని అభ్యాస నమూనాలు, క్లస్టరింగ్ (సారూప్యత ద్వారా డేటాను సమూహపరచడానికి పర్యవేక్షితంకాని అభ్యాస పద్ధతి), న్యూరల్ నెట్‌వర్క్‌లు (సంక్లిష్ట నమూనాను గుర్తించేందుకు తోడ్పడే శక్తిమంతమైన సాధనాలు) మొదలైన అంశాలు ఉన్నాయి. ప్రశ్న ఏమిటంటే ఈ అంశాలన్నిటినీ పాఠశాల స్థాయి బాలలు అర్థం చేసుకోగలరా? వాటి సారాన్ని గ్రహించగలరా? సాఫ్ట్‌వేర్ వ్యవస్థలలో ఏకీకరణ ప్రక్రియ ద్వారా పొందుపరిచి ఉండే అభ్యాస నమూనాలను వారు అవగాహనతో అనుసరించగలుగుతారా? తాము నేర్చుకుంటున్న గణితం, సైన్స్‌తో వీటిని వారు ఎలా జోడించగలుగుతారు? 'సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, సామాజిక అభివృద్ధి' అనే అంశాలను బాలలు ఎలా అర్థం చేసుకుంటారు? సిస్టమ్ మ్యాప్స్‌ను వారు ఎలా ఉపయోగించగలుగుతారు? ఈ భావనలు, పద్ధతులను అర్థం చేసుకునేందుకు మానసిక పరిణతి అవసరం. మరి వాటిని బాలలకు సుబోధకం చేసేందుకు ఎటువంటి బోధనాశాస్త్ర విధానాలు అవసరమవుతాయి?

సీబీఎస్ఈ ఏడవ తరగతి ఏఐ పాఠ్య ప్రణాళికలోని ఈ ప్రశ్నను పరిశీలనలోకి తీసుకోండి: 'జెండర్ సమానత్వం, మహిళల, బాలికల సాధికారతను ఏఎస్‌డీజీ (సుస్థిరాభివృద్ధి లక్ష్యం) స్పష్టంగా నిర్దేశించింది? (1) ఎస్‌డీజీ–3; (2) ఎస్‌డీజీ–5; (3) ఎస్‌డీజీ–8; (4) ఎస్‌డీజీ–10'. సదరు ఎస్‌డీజీ సంఖ్య ఏదనేది అంత ముఖ్యమా? అలాగే, ఏఐ ఎలా పనిచేస్తుందో విద్యార్థులు అవగాహన చేసుకోవాలి. ఈ అభ్యసన ప్రక్రియ కృత్రిమ మేధను ఉపయోగించడంపై బాలల్లో విమర్శనాత్మక దృక్పథాన్ని పెంపొందించాలి. అయితే పైన ప్రస్తావించిన 'ప్రశ్న పద్ధతి' అటువంటి మేధో ప్రావీణ్యాన్ని బాలల్లో వికసింపజేస్తుందా? విజ్ఞాన శాస్త్రాల బోధన ద్వారా విమర్శనాత్మకంగా ఆలోచించడాన్ని విద్యార్థులకు అలవర్చడంలో మనం పెద్దగా సఫలం కాలేదు. మరి ఏఐ అక్షరాస్యత ద్వారా విమర్శనాత్మక వివేచనను వికసింపజేయడమనేది అవాస్తవిక ఆశాభావం అవుతుంది. పాఠశాలల్లో ఏఐ బోధనకు సంబంధించిన ప్రశ్న 'అవును లేదా కాదు' అనే సమాధానం వచ్చే రీతిలో వేయవలసిన ప్రశ్న కాదు. అంతకంటే వివరణాత్మక సమాధానాన్ని చెప్పవలసిన రీతిలో ఆ ప్రశ్న ఉండి తీరాలి. మరింత స్పష్టంగా చెప్పాలంటే విద్యాపరమైన శిక్షణకు సంబంధించిన ప్రశ్నగా ఉండాలి. జ్ఞాన/ నైపుణ్యాల సముపార్జనకు దోహదం చేసే అంశాలు అన్నిటినీ సమగ్రంగా పరిగణనలోకి తీసుకునే ప్రశ్నగా ఉండాలి. అభ్యసన ప్రక్రియల్లో బాలల మానసిక సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకోవడం చాలా ముఖ్యం.

ఏఐ బోధన విషయమై కొన్ని ఇతర అంశాలనూ పరిగణనలోకి తీసుకోవల్సి ఉన్నది. కృత్రిమ మేధ కేవలం 'తాత్కాలిక నవ సాంకేతికతా సంచలనమే' అని కొంతమంది వాదిస్తున్నారు. గత శతాబ్ది తుదినాళ్ల 'డాట్ కామ్ బబుల్'తో కూడా దీనికి పోలిక తెస్తున్నారు. పాఠశాలలు జ్ఞాన/ నైపుణ్యాల సముపార్జనా నెలవులు. భవిష్యత్తుకు దృఢమైన పునాదులు నిర్మాణమయ్యే ప్రదేశాలవి. కొట్టివేయలేని ఈ వాస్తవం దృష్ట్యా నవ సాంకేతికతల విజృంభణ (టెక్నాలజికల్ బూమ్) ఒత్తిడితో పాఠశాలల విధులను నిర్దేశించడం లేదా ప్రభావితం చేయడం విద్యారంగ దీర్ఘకాలిక లక్ష్యాల సాధనకు దోహదం చేయదు. సమాజానికి మేలు జరగదు. కృత్రిమ మేధ బలీయమైన ఆకర్షణ గల అధునాతన సాంకేతికత. అంతేకాదు, దాన్ని వినియోగించుకునే అలవాటు వదిలించుకోలేని వ్యసనంగా మారుతుంది. భావి పౌరులను తీర్చిదిద్దే విద్యాలయాలలో ఈ నవ సాంకేతికతను ఉపయోగించడంపై నిర్ణయాలను నిష్పాక్షిక వివేచన, సమగ్ర అవగాహన, నిశిత అంతర్దృష్టితో కూడిన సామాజిక వివేకంతో తీసుకోవల్సివుంది. మరి మనం అటువంటి జ్ఞానశీలురమేనా?

▪ ఆర్. రామానుజం
అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం, బెంగళూరు
(ఇండియన్ ఎక్స్‌ప్రెస్)

బీసీ రిజర్వేషన్లకు స్త్రీలూ ఉద్యమించాలి

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్‌తో బీసీ సమాజం రోడ్లపైకి వచ్చింది. అది కూడా సైనికులుగా మాత్రమే, సేనానులుగా కాదు. ఈ పోరాటంలో మహిళల పాత్ర ఎందుకు పరిమితంగా ఉందనేదే మౌలిక ప్రశ్న.

ఈ ఆందోళనలో మహిళల పాత్ర సపోర్టివ్ రోల్‌గానే! ఉదాహరణకు– బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో వ్యతిరేకత వ్యక్తం అయిన క్రమంలో కొద్దిమంది మహిళలు ఎమోషనల్ స్పీచ్‌లకే పరిమితం అయ్యారు. సోషల్ మీడియాలో మాత్రమే బీసీ రిజర్వేషన్ల గురించి చర్చ చేశారు. కానీ ఇది వ్యక్తిగత ఆవేదనే. ప్రత్యేకంగా ప్రజాందోళనలు నిర్వహించడంలో గానీ, పోరాట రూపాలను లేదా నిర్ణయాలు తీసుకోవడంలో గానీ బీసీ మహిళలు ముందు వరుసలో లేరు. బీఆర్ఎస్ నాయకురాలు, ధనిక వర్గానికి చెందిన కవిత మాత్రమే బీసీల ఆందోళనలకు మద్దతు ప్రకటించారు. ప్రగతిశీల, సామాజిక ప్రజాస్వామిక దృష్టి, అవగాహన గల మహిళలు అక్కడక్కడ మాత్రమే కనిపించారు. అయితే, బీసీ మహిళలు మూడు రకాల అణచివేతలకు గురవుతున్నారు– అవి: వర్గం, కులం, లింగం. పురుష నాయకుల ఆందోళనకు ముందుండి నడిపిస్తే, మహిళల పాత్ర ఎమోషనల్ సపోర్ట్, హౌస్‌హోల్డ్ మద్దతే. ఇది బీసీ మహిళల మార్పునకు లేదా మహిళా విప్లవానికి అడ్డంకి. మహిళలు లేకుండా సామాజిక న్యాయం అసంపూర్ణం.

మహిళల పాత్ర అభివృద్ధి కాకపోవడానికి ప్రధాన కారణం పితృస్వామిక కుటుంబ వ్యవస్థ. బీసీ సమాజాల్లో మహిళలు ఇంటి పనులు, పిల్లల పెంపకం, ఆర్థిక బాధ్యతల్లో మునిగిపోయి ఉంటారు. ఆందోళనలు నిర్వహించే సంఘాలు (జేఏసీ) పురుషుల ఆధిపత్యంలో ఉండటం వల్ల, మహిళలకు లీడర్‌షిప్ అవకాశాలు ఇవ్వడం లేదు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, కమ్యూనిస్టులు మహిళలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నారే గాని వారిని విప్లవశక్తిగా మార్చడానికి యత్నించడం లేదు. మహిళలను అణచివేస్తే, విప్లవం బలహీనమవుతుంది. పాలక వర్గాలు మహిళలను డిజైడ్ చేస్తాయి, వారి పాత్రను పరిమితం చేస్తున్నాయి.

బీసీ ఆందోళనల్లో మహిళల చొరవ లేకపోవడానికి చాలా కారణాలు ఉన్నాయి. పైన పేర్కొన్న వాటితో పాటు సామాజిక భయాలూ ఉన్నాయి. ఆందోళనల్లో పాల్గొంటే కుటుంబం, సమాజం నుంచి వ్యతిరేకత ఎదురవుతుంది. మహిళలకు విద్య, ఆర్థిక స్వాతంత్ర్యాలు లేవు. బీసీల్లో మహిళల అక్షరాస్యత రేటు తక్కువ. ఆందోళనల్లో పాల్గొన్న మహిళలను మీడియా, సమాజం 'అసాధారణం'గా చూస్తుంది. ఇది మహిళల్లో ఆసక్తిని అణచివేస్తుంది. వీటిని ఛేదించి, సామాజిక విప్లవంలో మహిళల పాత్రను పెంచాలి. బీసీ సంఘాలు (జేఏసీ) మహిళలకు 50 శాతం లీడర్‌షిప్ పోస్టులు ఇవ్వాలి. మహిళలు చొరవగా, ఆందోళనల్లో పాల్గొనాలి. అప్పుడు మాత్రమే బీసీ రిజర్వేషన్ల 42 శాతంలో 50 శాతం మహిళా రిజర్వేషన్ సాధ్యమవుతుంది.

– పి. రేణుక భూంపల్లి

మొబైల్ లేకుండా ఒక రోజు

ఒకప్పుడు మనం గడియారాన్ని చూసేవాళ్లం, పత్రిక చదివేవాళ్లం, మనుషులతో మాట్లాడేవాళ్లం. ఇప్పుడు మనం స్క్రీన్ చూస్తున్నాం, స్క్రోల్ చేస్తున్నాం, మెసేజ్‌లకు బానిసలమయ్యాం. మన అసలైన జీవనానుభూతిని కోల్పోతున్నాం. ఈ నేపథ్యంలో 'ఒక రోజు చరవాణి లేకుండా జీవించగలమా?' అనే ప్రశ్నను మనకు మనమే వేసుకోవాల్సిన సమయం ఇది.

ఒక రోజు మొబైల్‌ను పక్కన పెట్టి జీవించడమంటే మొదట్లో భయంగా అనిపించవచ్చు. కాని కంగారు పడాల్సిన అవసరం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో ఒక రోజు మొబైల్ లేకుండా ఉండటం వల్ల ఎదురయ్యే సమస్యలు– యూపీఐ చెల్లింపులు, అత్యవసర కాల్స్. వీటికి పరిష్కారంగా కొంత నగదు చేతిలో ఉంచుకోవటం, సమీప వ్యక్తులతో కనెక్ట్ అవ్వడం, ముందుగా ముఖ్యమైన కొన్ని నంబర్లు రాసి ఉంచడం లాంటివి చేస్తే సరిపోతుంది. మొబైల్‌ను పక్కన పెట్టిన తరువాత పుస్తకాన్ని తిరగేయడం మొదలవుతుంది, కుటుంబంతో మాట్లాడే సమయం పెరుగుతుంది, మనసు ప్రశాంతంగా అనిపిస్తుంది. మొబైల్ వాడకం తగించమన్నాం కదా అని టీవీకి అతుక్కుపోకూడదు. ప్రతి నిమిషం స్క్రీన్‌కి అంకితమవ్వాల్సిన అవసరం లేదు. మన జీవితంలో 'నిశ్శబ్దం' కూడా ఒక విలువైన అనుభవం. పాఠశాలలు, కళాశాలలు నెలలో ఒక రోజు 'నో మొబైల్ డే'గా పాటించాలి, విద్యార్థులకు డిజిటల్ డిటాక్స్ గురించి అవగాహన కల్పించాలి. ఇంట్లో కుటుంబంగా కలిసి గడిపే సమయాన్ని ప్రోత్సహించాలి. ఐస్ బకెట్ ఛాలెంజ్, మూడు మొక్కలు నాటే సవాల్ లాగా, 'నో మొబైల్ డే' కూడా ఒక ఉద్యమంగా మారాలి. ఈ చిన్న ప్రయోగం ఒక పెద్ద మార్పునకు నాంది కావచ్చు. మనం మనల్ని తిరిగి కనుగొనాలంటే, కొన్నిసార్లు టెక్నాలజీని పక్కన పెట్టాల్సిందే. మొబైల్ లేకుండా ఒక రోజు... ఒక కొత్త జీవనానుభూతికి మొదటి అడుగు కావచ్చు.

– ఆచార్య శివకుమార్ నన్నపనేని

సహకార స్ఫూర్తితోనే దేశ శ్రేయస్సు

తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను ఆ రాష్ట్ర గవర్నర్ తొక్కి పెట్టడంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, దానిపై భారత రాష్ట్రపతి సుప్రీంకోర్టుకు లేఖ రాయడం వంటివి ఇటీవల కేంద్ర–రాష్ట్ర సంబంధాలను మరోసారి చర్చనీయాంశం చేశాయి. ఈ వివాదాన్ని మరింత పెంచాయి. పహల్గాం ఉగ్రదాడి తరువాత దేశమంతా రాజకీయాలకు అతీతంగా, ఐక్యంగా నిలబడింది. కానీ కశ్మీర్‌లో కేంద్ర హోం మంత్రి జరిపిన సమీక్షా సమావేశానికి మాత్రం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని పిలవకపోవడం 'ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలకు మోదీ ప్రభుత్వం ఇస్తున్న విలువ'కు అద్దం పడుతోంది. దేశ సంపదను కొద్దిమంది కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టే నయా ఉదారవాద ఆర్థిక విధానాలు అమలు కావాలంటే ఏకీకృత మార్కెట్, జీఎస్టీ ఏక పన్ను వంటి కేంద్రీకృత విధానాలు అవసరం. రాష్ట్రాలు వేర్వేరు విధానాలు అవలంబించడం వీటి అమలుకు ప్రతిబంధకంగా ఉంటుంది.

కేంద్రం, రాష్ట్రాలు పరస్పర విభేదాలతో కాకుండా సహకారంతో పనిచేయాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేర్కొన్నారు. భారత రాజ్యాంగం ఫెడరల్ వ్యవస్థ అయినా, అమెరికా, కెనడా వంటి క్లాసికల్ ఫెడరల్ వ్యవస్థలతో పోలిస్తే భిన్న స్వభావం కలిగి ఉంది. ఇది సహకార ఫెడరలిజం అనే భావనపై ఆధారపడినా, ఆచరణలో కేంద్రాధిపత్యంగా మారింది. ఈ కారణంగా కాలక్రమంలో కేంద్ర–రాష్ట్ర సంబంధాల్లో విభేదాలు, వివాదాలు, ఆర్థిక అసమానతలు, గవర్నర్ల రాజకీయ పాత్ర వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

నేడు రాష్ట్రాల అభివృద్ధి ప్రాధాన్యాలకు విరుద్ధంగా మోదీ ప్రభుత్వం తన విధానాలను అమలు చేస్తోంది. రాష్ట్రాలను సంప్రదించకుండానే వాటి పరిధిలోని సహకార రంగం, ఉమ్మడి జాబితాలోని విద్య, వైద్యం వంటి రంగాలలో ఏకపక్ష నిర్ణయాలు చేస్తోంది. అంతర్ రాష్ట్ర మండలి అటకెక్కింది. ప్లానింగ్ కమిషన్ రద్దయి, దాని స్థానంలోని నీతీ ఆయోగ్ పూర్తిగా ఏకపక్ష సంస్థగా రూపుదిద్దుకుంది.

రాష్ట్ర ప్రభుత్వాలు నడిపే పథకాలకు కేంద్ర నిధులు నిలిపివేయడం లేదా రాజకీయ ప్రేరణతో ఆలస్యం చేయడం వంటివి సాధారణమయ్యాయి. రాజ్యాంగంలోని ఫైనాన్స్ కమిషన్ సిఫార్సులు, నీతీ ఆయోగ్ సాయంతో వచ్చే నిధుల పంపిణీ పక్షపాత ధోరణితో ఉన్నాయి. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలు తాము ఎక్కువ పన్ను వసూలు చేస్తున్నా, తమకు కేంద్రం నుంచి తక్కువ నిధులు వస్తున్నాయని విమర్శిస్తున్నాయి. రాష్ట్రాల అధికారాలను నామమాత్రం చేసి, మోదీ ప్రభుత్వం పెత్తనం చెలాయిస్తోంది. ఫైనాన్స్ కమిషన్ ప్రతి అయిదేళ్లకోసారి కేంద్ర–రాష్ట్ర ఆదాయాన్ని పంచుతుంది. జనాభా ఆధారంగా దీనిని పంచడంతో, జనాభా నియంత్రణ పటిష్టంగా పాటించిన తమకు నష్టం జరుగుతోందని దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలు వంటి కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలలో రాష్ట్రాల వాటాను మోదీ ప్రభుత్వం ఏకపక్షంగా పెంచడం వల్ల పేద రాష్ట్రాలకు భారమవుతోంది. జీఎస్టీ పరిహారం నిలిపివేయడం కూడా రాష్ట్రాల ఆర్థిక స్వాతంత్ర్యంపై ప్రభావం చూపుతోంది. ఈడీ, సీబీఐ, ఐటీ, ఎన్ఐఏ వంటి కేంద్ర సంస్థలు రాష్ట్ర అనుమతి లేకుండా దర్యాప్తులు, అరెస్టులు చేయడం ద్వారా రాజకీయ దుర్వినియోగం జరుగుతోంది.

> కేంద్ర–రాష్ట్ర సంబంధాలు భారత ప్రజాస్వామ్యానికి గుండెకాయ వంటివి. నేడు అవి అత్యంత బలహీనంగా, అపనమ్మకాలతో ఉన్నాయి. రాష్ట్రాలు బలంగా ఉంటేనే దేశం బలంగా ఉంటుంది. అందుకే రాజ్యాంగం ఉద్దేశించిన 'సహకార ఫెడరలిజం' స్ఫూర్తిని అమలు చేయడం, రాజకీయ అవసరాలకు గవర్నర్ పదవిని వాడుకోకుండా ఉండడం, ఆర్థిక సమానత సాధించడం అత్యవసరం.



గవర్నర్ పదవిని రాజ్యాంగం 'రాష్ట్ర నామమాత్ర ప్రధాన అధికారి'గా పేర్కొన్నప్పటికీ, వాస్తవంలో అది కేంద్రానికి అనుబంధమైన రాజకీయ సాధనంగా మారింది. కేంద్రం నియమించిన గవర్నర్, చాలాసార్లు ప్రతిపక్ష రాష్ట్ర ప్రభుత్వాలతో విభేదిస్తూ పనిచేస్తున్నారు. బిల్లులను దీర్ఘకాలం అడ్డుకోవడం, సభలో మెజారిటీ నిరూపణపై జోక్యం, ప్రభుత్వం ఏర్పాటు, రద్దు విషయాల్లో రాజకీయ ప్రభావం వంటి వివాదాస్పద నిర్ణయాలకు గవర్నర్లు కేంద్రంగా మారారు. ఇటీవల తమిళనాడు, కేరళ, తెలంగాణ, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలలో ఇటువంటి ఉదాహరణలు కనిపించాయి.

రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉండేలా గవర్నర్లను నియమించాలని, రాజకీయ నియామకాలు తగ్గించాలని 1983లో సర్కారియా కమిషన్ సిఫార్సు చేసింది. కానీ అవి ఆచరణలోకి రాలేదు. తరువాత సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మదన్ మోహన్ పుంఛీ సారథ్యంలో ఏర్పడిన కమిషన్ 2010లో నివేదిక సమర్పించింది. ఈ నివేదికలో దాదాపు 273 సిఫార్సులు చేసింది. నేటి సమస్యకు అవి పరిష్కారం చూపుతాయి.

ఆ సిఫార్సుల ప్రకారం... గవర్నర్ నియామకానికి, సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రి సూచనను కేంద్రం పరిగణనలోకి తీసుకోవాలి. గవర్నర్‌ను 'కేంద్ర ప్రతినిధి'గా కాకుండా రాష్ట్ర రాజ్యాంగ అధికారిగా చూడాలి. జాతీయ భద్రత, ఉగ్రవాదం, అంతర్గత భద్రత వంటి అంశాలపై కేంద్ర–రాష్ట్రాల సహకారం బలపరచాలి. అంతర్రాష్ట్ర మండలిని స్థిరమైన సంస్థగా చేయాలి. ఇది కేంద్ర–రాష్ట్రాల మధ్య సమన్వయ వేదికగా ఉపయోగపడాలి. దీని సమావేశాలు క్రమబద్ధంగా జరగాలి. ఆర్థిక వనరుల పంపకాన్ని న్యాయంగా చేయాలని, రాష్ట్రాలకు మరింత పన్నుల వాటా ఇవ్వాలని ఈ కమిషన్ సూచించింది. ఫైనాన్స్ కమిషన్ సిఫార్సులు, ప్రాంతీయ అసమానతల దృష్ట్యా పునఃపరిశీలన చేయాలి. కేంద్ర పథకాల రూపకల్పనలో రాష్ట్రాల భాగస్వామ్యాన్ని పెంచాలి. కేంద్ర బలగాలను రాష్ట్రాలకు పంపేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వ అంగీకారం తప్పనిసరని పేర్కొంటూ, ఉగ్రవాదం, వలసలు, జాతీయ భద్రత వంటి అంశాలు 'కాన్కరెంట్ లిస్ట్'లోకి తేవాలని కమిషన్ సూచించింది. కేంద్రం–రాష్ట్రాల మధ్య వివాదాలు త్వరగా పరిష్కరించడానికి ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని చెప్పింది.

కేంద్ర–రాష్ట్ర సంబంధాలు భారత ప్రజాస్వామ్యానికి గుండెకాయ వంటివి. నేడు అవి అత్యంత బలహీనంగా, అపనమ్మకాలతో ఉన్నాయి. రాష్ట్రాలు బలంగా ఉంటేనే దేశం బలంగా ఉంటుంది. అందుకే రాజ్యాంగం ఉద్దేశించిన 'సహకార ఫెడరలిజం' స్ఫూర్తిని అమలుచేయడం, రాజకీయ అవసరాలకు గవర్నర్ పదవిని వాడుకోకుండా ఉండడం, ఆర్థిక సమానత సాధించడం అత్యవసరం. కేంద్రం, రాష్ట్రాలు ఒకదానికొకటి ప్రతిబంధకంగా కాకుండా, భాగస్వామిగా చూడాలి.

వీటిని దృష్టిలో ఉంచుకుని సర్కారియా కమిషన్, పుంఛీ కమిషన్ వంటివి చేసిన సిఫార్సులు అమలుకాకపోవడం విచారకరం. రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా కేంద్ర పెత్తనం పెరుగుతూ, రాష్ట్రాల హక్కులు కుంచించుకుపోతూ సహకార ఫెడరలిజానికి భిన్నంగా కేంద్రాధిపత్యం పెరుగుతోంది. దీన్ని సరిచేసి, అసలైన ఫెడరల్ స్ఫూర్తికి అనుగుణంగా విధానాలు మారాలి. అప్పుడు మాత్రమే దేశ శ్రేయస్సు, అభివృద్ధి, ఐక్యత సాధ్యం.

• ఎ. అజశర్మ
ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక



వరంగల్ అర్బన్ (హనుమకొండ) జిల్లా మద్యం దుకాణాలకు డ్రా తీస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

లక్కు చిక్కింది..

- వరంగల్ అర్బన్, రూరల్‌లో 124 మద్యం షాపులకు డ్రా తీసిన కలెక్టర్లు
- నర్సంపేటలో భార్యాభర్తలను వరించిన అదృష్టం
- ఎస్సీ రిజర్వేషన్‌లో మహిళను రెండోసారి వరించిన అదృష్టం
- అర్బన్‌లో అత్యధికంగా కడిపికొండ, రూరల్‌లో అత్యల్పంగా కమలాపూర్‌కు పోటీ
- రూరల్‌లో అత్యధికంగా నడికూడకు, అత్యల్పంగా పరకాలకు పోటీ

వరంగల్ క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మద్యం షాపుల లక్కీ డ్రా కార్యక్రమం క్షణ క్షణం ఉత్కంఠ రేపింది. దరఖాస్తుదారులు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఉదయం నుంచి పడిగాపులు కాశారు. ఇష్టదైవానికి పూజలు చేసి ఉదయం 9 గంటల వరకే లక్కీ డ్రా వేదికల వద్దకు ఎంట్రీ పాసులతో చేరుకున్నారు. వరంగల్ అర్బన్ (హనుమకొండ) జిల్లాలో అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన లక్కీ డ్రాకు దరఖాస్తు చేసుకున్న 3175 మందితో పాటు వారి స్నేహితులు, బంధువులు తోడు రావడంతో అంబేద్కర్ భవన్ ఏరియా సందడిగా కనిపించింది. సుబేదారి పోలీస్‌లు బందోబస్తు నిర్వహించారు. ఉదయం 11గంటలకు డ్రా తీయాల్సి ఉండగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ గంటన్నర ఆలస్యంగా రావడంతో ఉదయం 9 గంటలకే హాల్‌కు వచ్చిన దరఖాస్తుదారులు అబ్కారీ అధికారులు అసహనం వ్యక్తం చేశారు. కలెక్టర్ వచ్చిన అనంతరం డ్రా తీసి షాపులు అలాట్ అయిన 67 మంది వ్యక్తుల నుంచి లైసెన్స్ ఫీజు తీసుకొని షాపులు కేటాయించారు. కాజీపేట పీఎస్ పరిధిలోని కడిపికొండ వైన్‌షాపుకు 116 మంది పోటీపడగా, కమలాపూర్ మద్యం షాపుకు 21 మంది పోటీపడ్డారు.

వరంగల్ రూరల్‌లో డబుల్ సంతోషం..

వరంగల్ రూరల్ జిల్లాలో 57 మద్యం షాపులకు 1958 దరఖాస్తులు రాగా హంటర్‌రోడ్డులోని నాని గార్డెన్‌లో లక్కీ డ్రా నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి లక్కీ డ్రా తీశారు. నర్సంపేటకు చెందిన గంప రాజేశ్వర్, సాంబలక్ష్మీ దంపతులకు చేరో షాపు దక్కడంతో సంతోషంలో (మిగతా 6లో..)

- కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పేరిట ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రుల్లో తిష్ట
- అనుమతులు లేకున్నా ఇష్టారాజ్యంగా ఔట్‌సోర్సింగ్‌లో భర్తీ
- లేని ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నట్లుగా కొన్ని ఏజెన్సీల బురిడీ
- నకిలీల పేరుతో కోట్లు కొల్లకొడుతున్న కేటుగాళ్లు
- పీఎఫ్‌లు మాయం.. ఆరేడు నెలలకు ఒకసారి వేతనాలు
- అర్హులైన ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను గుర్తించే పనిలో సర్కారు
- ఉమ్మడి జిల్లాలో 25 వేల మందికి పైగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు



'ఔట్‌సోర్సింగ్' అక్రమార్కులకు చెక్

ప్రభుత్వ శాఖల్లో బోగస్ ఉద్యోగులపై ప్రభుత్వం నజర్

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రుల్లో తిష్ట వేసిన నకిలీ ఉద్యోగులపై సర్కారుపై దృష్టి పెట్టింది. ఉద్యోగులు లేకున్నా.. ఉన్నట్లుగా బోగస్ రికార్డులు చూపించి వేతనాలు డ్రా చేసుకుంటున్న ఏజెన్సీలు ఉన్నాయి. పని భారం తగ్గించుకునేందుకు అనవసరంగా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కొంతమంది అధికారులు బినామీ ఉద్యోగులను నియమించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో కోట్లాది రూపాయలు వేతనాల రూపంలో పక్కదారి పడుతున్నట్లుగా ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో నకిలీ ఉద్యోగులపై నజర్ వేసింది. నకిలీలను గుర్తించేందుకు ఆయా ఉద్యోగుల ఆధార్ కార్డు, బ్యాంకు, పాన్‌కార్డు తదితర వాటిని సమర్పించాల్సిందిగా ఆయా శాఖల ఉన్నతాధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో బినామీ పేర్లతో ఏళ్ల తరబడి కోట్లు కొల్లగొట్టిన ఏజెన్సీల్లో గుబులు మరువైంది.

కార్యాలయాల్లో ఔట్ సోర్సింగ్ సేవలు

ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు కార్యాలయాల్లో సిబ్బంది కొరతను తీర్చేందుకు ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ విధానంలో ఏజెన్సీల ద్వారా ఉద్యోగ నియమాకాలు చేపడుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వైద్యశాఖతో పాటు రెవెన్యూ, మునిసిపాలిటీ, కార్పోరేషన్‌లు, విద్యాశాఖ, పంచాయతీరాజ్, మహిళ, శిశు సంక్షేమ శాఖ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, డీఆర్‌డీఏ తదితర శాఖలతో పాటు వరంగల్ ఎంజీఎం, సీకేఎం ఆస్పత్రులు, అన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 25వేల మందికి పైగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారని అంచనా.

ఆయా శాఖల్లో ఏళ్ల తరబడి ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవటం, కావాల్సినంత రెగ్యులర్ ఉద్యోగులు లేకపోవటంతో తాత్కాలిక ప్రతిపాదికన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వీరిలో ఎక్కువగా కంప్యూటర్ ఆపరేటర్లు, జూనియర్ అసిస్టెంట్లు, స్వీపర్లు, స్టాఫ్ నర్సులు, ఆశ వర్కర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, డ్రైవర్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఆయాలు తదితర విభాగాల్లో పొరుగు సేవలు అందిస్తున్నారు. వీటిలో అత్యధికంగా వైద్యశాఖలోనే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. అయితే వీరిలో వరంగల్ నగరంలోనే 70శాతం మంది పనిచేస్తున్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు దీటుగా సేవలు అందిస్తున్నప్పటికీ అరకొర వేతనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఔట్‌సోర్సింగ్‌తో అక్రమ దందా

ప్రభుత్వం ప్రతీ నెలా కోట్లాది రుపాయలు ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనాల రూపంలో చెల్లిస్తోంది. అయితే అనేక కార్యాలయాల్లో అవసరానికి మించిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉండటం.. ఉద్యోగులు లేకున్నా ఉన్నట్లుగా బినామీ రికార్డులు సృష్టించి కోట్లాది రుపాయలు వేతనాల రూపంలో విత్‌డ్రా చేసుకుంటున్న సంఘటనలు వెలుగులోకి (మిగతా 7లో..)

జల్సాలకు అలవాటుపడి చోరీలు

- నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు ● మూడు ద్విచక్రవాహనాల సీజ్

హసన్‌పర్తి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : గంజాయి మత్తులో జల్సాలకు అలవాటుపడి దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద 4 ద్విచక్రవాహనాలు, 3 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏసీపీ అరెస్టు వివరాలు వెల్లడించారు. ఏసీపీ కథనం ప్రకారం... హనుమకొండ జిల్లా కాజీపేట మండలం బాపూజీ నగర్‌కు చెందిన కలుగుల సాయిచందు, రెడ్లమ్ రాకేష్, మడికొండకు చెందిన గంపల సాయి, వైఎస్సార్ నగర్‌కు చెందిన ఆలకుంట అనిల్ ఆలియాస్ ముద్దంగుల అనిల్ గంజాయికి అలవాటు పడ్డారు. కూలి ద్వారా వచ్చే డబ్బులు జల్సాలకు సరిపోక దొంగతనాలకు పాల్పడేవారు. గతంలో వీరు పలు ప్రాంతాల్లో పలు నేరాలు చేసి జైలు జీవితాన్ని గడిపారు. మరికొన్ని కేసులు విచారణలో ఉన్నట్లు తెలిపారు. సోమవారం పోలీసులు రెండు బృందాలుగా పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సీతంపేట రైస్‌మిల్లు వద్ద అనుమానాస్పదంగా నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా నేరాలను అంగీకరించినట్లు తెలిపారు. చోరీ చేసిన నాలుగు బైక్‌లు, 3 గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన కానిస్టేబుళ్ల క్రాంతి, వెంకట్‌కు నగదు రివార్డును అందించి ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు, ఎస్సై గోవర్ధన్, దేవేందర్ పోలీసు బృందాన్ని ఏసీపీ అభినందించారు.



నిందితుల అరెస్టు చూపుతున్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ఏసీ బస్సులు

హనుమకొండ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బస్టాండ్ నుంచి హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు ఏసీ రాజధాని బస్ సర్వీస్ ఏర్పాటు చేసినట్లు వరంగల్ -1 డిపో మేనేజర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ బస్టాండ్ నుంచి సాయంత్రం 4 గంటలకు బయల్దేరి రాత్రి 7.30 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు చేరుకుంటుందని ఒక్కరి చార్జి రూ.700 కాగా ఉదయం 5 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరి ఉప్పల్ మీదుగా హనుమకొండ, భూపాలపల్లి వరకు వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ కోసం www.tgsrtcbus.in వెబ్‌సైట్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవాలని ప్రయాణికులకు ప్రకటన ద్వారా తెలిపారు.

బాలికపై బాలుడి అత్యాచారం

నిందితుడు అంగన్‌వాడీ టీచర్ కుమారుడు

ఖానాపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల బాలికపై 16 ఏళ్ల బాలుడు అత్యాచారానికి పాల్పడిన సంఘటన వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలో ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపురం మండలంలోని ఓ తండాకు చెందిన వివాహిత బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌లో నివసిస్తోంది. తన నాలుగేళ్ల కూతురు మండలంలోని ఓ తండాలో గల అమ్మమ్మ వద్ద ఉంటూ అదే తండాలో గల అంగన్‌వాడీ కేంద్రానికి వెళుతోంది. ఈ క్రమంలో రోజువారిలాగే గత శనివారం సైతం బాలిక అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లింది. కాగా అంగన్‌వాడీ టీచర్ కొద్ది సేపు విధులు నిర్వహించిన అనంతరం బయటకు వెళ్లింది. ఇదే సమయంలో అంగన్‌వాడీ టీచర్ కుమారుడు (16 ఏళ్ల బాలుడు)అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి బాలికను పక్కగదిలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం బాలిక ఇంటికి వెళ్లింది. మరుసటి రోజు ఉదయం బాలిక అమ్మమ్మ బాలికకు స్నానం చేయించేందుకు దుస్తులు తొలగించగా వాటిపై రక్తపు మరకలు కనిపించాయి. బాలిక ప్రైవేట్ పార్ట్స్‌పై గాయాలు ఉండడంతో ఇదే విషయాన్ని ఆమె హైదరాబాద్‌లో ఉంటున్న బాలిక తల్లికి ఫోన్‌లో తెలిపింది. సోమవారం ఉదయం బాలిక తల్లి తండాకు చేరుకుని బాలికను తీసుకుని పోలీసులను ఆశ్రయించి జరిగిన విషయంపై ఫిర్యాదు చేసింది. పోలీసులు రంగంలోకి దిగి వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. కాగా బాలుడు తరచుగా అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి చిన్న పిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తించేవాడని స్థానికులు చెబుతున్నారు.



కాశిబుగ్గ శివాలయంలో శివ లింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

వెల్లివిరిసిన కార్తీక శోభ

మొదటి సోమవారం సందర్భంగా ఆలయాల్లో పండుగ సందడి

సామూహిక రుద్రాభిషేకాలు, అనఘాష్టమి వ్రతాలు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శివ కేశవులకు ప్రీతికరమైనది కార్తీక మాసం. ఈ మాసంలో మొదటి సోమవారం ఆలయాల్లో పండుగ సందడి నెలకొంది. భక్తి పారవశ్యంతో ఓం నమశివాయ.. పంచాక్షరి నామస్మరణలతో ఆలయాలు మారుమోగాయి. ఉదయం బ్రాహ్మీముహూర్తంలో సుప్రభాత సేవతో ఆలయాల్లో గణపతి పూజ అనంతరం శివ లింగాలకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. కార్తీక మాసం తొలి సోమవారం కావడంతో సామూహికంగా భక్తులు శివాలయాల్లో అభిషేకాలు నిర్వహించారు. కాశిబుగ్గలోని శివాలయం, రామన్నపేటలోని శ్రీరామలింగేశ్వర దేవాలయంలో ఉదయం 4 గంటల నుంచి సామూహికంగా అభిషేకాలను ఆచరించారు. స్టేషన్‌రోడ్డులోని కాశీ విశ్వేశ్వరాలయం, భోగేశ్వరాలయం, ములుగు రోడ్‌లోని శ్రీవరద దత్తక్షేత్రంలో సచ్చిదానందేశ్వర సదాశివుడికి, రంగంపేటలోని భవాని శంకర ఆలయంలో, నగరంలోని అన్ని శివాలయాల్లో అభిషేకాలు జరిగాయి. చారిత్రక భద్రకాళి అమ్మవారి దేవాలయంలోని తేజోలింగమైన శ్రీభద్రేశ్వర స్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలను నిర్వహించారు. సాయంత్రం దీపోత్సవాలను నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా కేదారీశ్వర వ్రతాలతో పాటు ఇంటింటా దీపాలను వెలిగించారు. యేటా శివనగర్‌లోని శ్రీరామాలయంలో కార్తీక మాసం సోమవారం రోజున సామూహికంగా అనఘాష్టమి వ్రతాలను ఆచరిస్తారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులతో దత్త ప్రచారక్ రాజేంద్రప్రసాద్ నేతృత్వంలో వ్రతాలను నిర్వహించారు. కార్తీక మాసం శివాలయాల్లో అభిషేకాలు, దీపోత్సవాలతో పండుగ వాతావరణం నెలకొంది. పూజ అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎలాంటి ఆహారం తీసుకోకుండా రాత్రి సమయంలో చుక్కలు చూసిన అనంతరం దీపాలు వెలిగించి కార్తీక పురాణం పారాయణం చేసి భోజనాలు చేశారు. పలు దేవాలయాల్లో సాయంత్రం భోజన ప్రసాదాలను ఏర్పాటు చేశారు.

HIGH COURT FOR THE STATE OF TELANGANA AT HYDERABAD

W.P.NO. 8308 Of 2021

BETWEEN:
Thatikonda Chinapeeraiah,
S/o Late Ramaiah,
Bhadradri Kothagudem Dist. ...Petitioner
And
1. Sri Katam Keertana,
D/o. Subba Reddy, R/o. H.No: 2-5/1,
Laxmipuram Village, Burgampadu Mandal,
Bhadradri Kothagudem Dist (R-9)
2. Uyyala Rekha, D/o. Sadanandam,
R/o. H.No.23-1-94, New Sayampet,
Hanumakonda, Warangal Dist
3. Katam Jaya Sai Vardhana Reddy, S/o. Keerthana
R/o. H.No: 2-5, Laxmipuram Village,
Burgampadu Mandal, Bhadradri Kothagudem ...Respondents

PERSONAL NOTICE

The Petitioner Above Filed Writ Petition No. 8308/2021 questioning three Registered Sale Deeds Transferring the Assigned lands in your Favour. Telanagana High Court Directed Notices. Notices Returned Un-Served. In I.A.No.1/2025 the High Court permitted the Counsel to serve alternative Service by Publication in Andhra jyothi by order Dt. 17.10.2025. Accordingly Publication is being made. The Matters will be listed on 31.10.2025. Hence this Notice is Published in the Press as per the Directions, you can Appear in Person or Represent Through Counsel, Otherwise the Matter will be decided Unilaterally in your absence

// By Order of the Honorable Court //
Dt.26-10-2025

Sd/-P.V. RAMANA , Advocate
H.No.6-3-656, Plot No.1, Banjara Sangeeth Apts., Kapadiya line, Somajiguda, Hyderabad. Cell: 9441929324

బహిరంగ ప్రకటన

ICICI Bank సమోదిత కార్యాలయం : ICICI బ్యాంక్ టవర్, చక్లి సర్కిల్ సమీపాన, పాత పద్రా రోడ్, వడోదర - 390 007
కార్పొరేట్ కార్యాలయం : ICICI బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, ముంబాయి 400 051.

బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన

ICICI బ్యాంక్ లిమిటెడ్ ("ICICI బ్యాంక్") [illegible] నవంబర్ 07, 2025న [illegible] ICICI బ్యాంక్ [illegible] మ.12.30 గం. నుండి మ.3.30 గం.ల మధ్య https://igold.samil.in లో [illegible]

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: భైంసా	
395562004099	[illegible]
శాఖ పేరు: భూపాలపల్లి	
440062000367	[illegible]
శాఖ పేరు: గద్వాల్	
092062015331	[illegible]
శాఖ పేరు: హైదరాబాద్ - జూబ్లీహిల్స్ రోడ్ 45	
754162000414	[illegible]
శాఖ పేరు: హైదరాబాద్ - ఆర్‌టీసి క్రాస్‌రోడ్	
194262001559	[illegible]
శాఖ పేరు: జగిత్యాల	
280862009787	[illegible]

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: ఖమ్మం - గాంధీ చౌక్	
130805006550	[illegible]
శాఖ పేరు: [illegible]	
222262000588	[illegible]
శాఖ పేరు: కొత్తగూడెం	
068562009270	[illegible]
శాఖ పేరు: మణికొండ, తెలంగాణ	
322262001813	[illegible]
శాఖ పేరు: మెదక్	
069062025259	[illegible]
069062025264	[illegible]
శాఖ పేరు: పెద్దపల్లి	
068362020736	[illegible]

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: కుత్బుల్లాపూర్	
130462002498	[illegible]
130462002563	[illegible]
శాఖ పేరు: సత్తుపల్లి	
792562000373	[illegible]
శాఖ పేరు: సిరిసిల్ల, తెలంగాణ	
363262008011	[illegible]
శాఖ పేరు: [illegible]	
222462000879	[illegible]
శాఖ పేరు: [illegible]	
221362001676	[illegible]
శాఖ పేరు: [illegible]	
062362001384	[illegible]

తేది : 28.10.2025
ప్రదేశం: హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, మెదక్, పెద్దపల్లి, జగిత్యాల, జోగులాంబ (గద్వాల్), వనపర్తి, నిజామాబాద్, ఖమ్మం, నిర్మల్, రాజన్న (సిరిసిల్ల), భద్రాద్రి (కొత్తగూడెం), జయశంకర్ (భూపాలపల్లి), సూర్యాపేట

సం/- అధీకృత అధికారి, ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున



భద్రకాళి దేవాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

భద్రకాళి ఆలయంలో కార్తీక దీపోత్సవం

● భద్రేశ్వరుడికి లక్ష పుష్పార్చన

వరంగల్ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లోని చారిత్రక భద్రకాళి దేవస్థానంలో కార్తీక మాసం మొదటి సోమవారం సాయంత్రం సందర్భంగా కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. తేజో లింగమైన భద్రేశ్వరుడికి లక్ష పుష్పార్చన నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున దీపోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వినతులు వెంటనే పరిష్కరించాలి

● ప్రజావాణిలో కలెక్టర్ స్నేహ శబరీష్



బాధితుల నుంచి సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వచ్చే ప్రజల వినతులు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యలపై 112 వినతులు వచ్చాయి. ప్రజల నుంచి కలెక్టర్ స్నేహ శబరీష్ వినతులు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులను పిలిచి వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌వో వైవీ గణేష్, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

రుద్రేశ్వరాలయంలో ఘనంగా కార్తీక వేడుకలు



రుద్రేశ్వరుడి సన్నిధిలో కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ సుబ్రమణ్యం

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయం సోమవారం భక్తులతో కిటకిట లాడింది. కార్తీక మాసంలో శివప్రీతికర తొలి సోమవారం కావడంతో రుద్రేశ్వరుడిని దర్శించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం సుప్రభాత సేవ, ఉత్తిష్ట గణపతికి ఆరాధన, రుద్రేశ్వరుడికి పాశుపద రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో 200 మంది భక్తులచే రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ సుబ్రమణ్యంతోపాటు రాష్ట్ర శాఖ సూపరింటెండెంట్ నిహాల్‌దాస్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ కృష్ణ చైతన్య, జోగులాంబ ఆలయ కన్జర్వేటర్ అసిస్టెంట్ మల్లేశం, అజిత్‌లు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో గార్డెనింగ్, సెంట్రల్ లైటింగ్ సిస్టం, భూగర్భ డ్రెయినేజీల ఏర్పాటుకు ప్రత్యేక ప్రణాళికలు ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ సుబ్రమణ్యం చెప్పారు. తుమ్మలపల్లి మఠాధిపతి కృపానంద మహేశ్వరస్వామి కూడా పాల్గొని రుద్రేశ్వరుడి సన్నిధిలో అభిషేకం చేశారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశానుసారం భక్తులకు కార్తీక దీపాలు వెలిగించుకోవడానికి ప్రదోశకాల సమయంలో అవకాశం ఇచ్చినట్లు ఈవో అనిల్‌కుమార్ చెప్పారు.

నిజాయితీగా సమస్యలు పరిష్కరించాలి

» జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

» 98 దరఖాస్తులు స్వీకరించిన కమిషనర్



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి ద్వారా వచ్చే ఫిర్యాదులపై అధికారులు నిజాయితీగా పరిష్కారం చూపాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ(జీడబ్ల్యూఎంసీ) కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మహా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజలనుంచి దరఖాస్తులు స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు కమిషనర్ అందజేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఇటీవల ఒకే ప్రాంతంలో ఫిర్యాదులు తరుచుగా వస్తున్నాయని, సమస్యలు పునరావృతం కాకుండా అధికారులకు చొరవ చూపాలన్నారు. ప్రధానంగా శానిటేషన్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, పన్నుల విభాగాలపై ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. మలేరియా విభాగం సిబ్బంది నగరంతో పాటు విలీన గ్రామాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా నివారణ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి 98 ఫిర్యాదులు స్వీకరించినట్టు కమిషనర్ వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఎస్ఈ సత్యనారాయణ, డిప్యూటీ కమిషనర్లు సమ్మయ్య, ప్రసన్నరాణి, వెటర్నరీ అధికారి గోపాల్‌రావు, పన్నుల అధికారి రామకృష్ణ, డీఎఫ్‌వో శంకర్‌లింగం, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు స్వీకరించిన ఫిర్యాదులు

ఇంజనీరింగ్	-	22
హెల్త్, శానిటేషన్	-	11
ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ	-	12
టౌన్ ప్లానింగ్	-	49
మంచినీటి సరఫరా	-	03
హార్టికల్చర్	-	01
మొత్తం		61

ప్రజల ఫిర్యాదులు ఇలా..

● గ్రేటర్ వరంగల్ 17వ డివిజన్ వసంతాపూర్‌లో బొడ్రాయి నుంచి ఎస్సీకాలనీ వరకు రూ.60 లక్షల వ్యయంతో ఆరు మాసాల క్రితం సీసీరోడ్డు, డ్రైనేజీ పనులు ప్రారంభించారు. కానీ, అప్పటి నుంచి ఇప్పటి వరకు పనులు ముందుకు సాగడం లేదని ఫిర్యాదు చేశారు.

● వరంగల్ 26వ డివిజన్ గిర్మాజీపేటలో కొందరు వ్యక్తులు రోడ్లను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను తొలగించి రోడ్లు వెడల్పు చేసి సీసీరోడ్లు వేయాలని స్థానిక కార్పొరేటర్ బాలిన సురేష్ విజ్ఞప్తి చేశారు.

● హనుమకొండ ములుగురోడ్డు గోడిసవారి బాబా దర్గా సమీపంలో ఇటీవల గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు చేపలు విక్రయిస్తూ వ్యర్థాలను అక్కడే పడేసి వెళుతున్నారు. చాలా కాలంగా రోడ్లపై విక్రయాలు జరుపుతూ పరిసరాలను కలుషితం చేస్తున్నారు. దీనిపై అధికారులు చర్య తీసుకోవాలని దేవర రమేష్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు.

● గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థలో శానిటేషన్ విభాగంలో పనిచేసే సిబ్బంది నాలుగు సార్లు హాజరు వేయాలంటే చాలా ఇబ్బందిగా ఉందని అంతే కాకుండా కార్మికుల వేతనం విషయంలో అధికారుల వైఖరి సరిగా లేదని సీఐటీయూ నాయకులు కమిషనర్‌ను కలిశారు. ఖమ్మం, కరీంనగర్ మాదిరిగా పెంచిన వేతనాలను ఇక్కడ కూడా ఇవ్వాలని కమిషనర్‌ను కోరారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య



కనకమ్మ (ఫైల్)

దామెర, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మనస్తాపం చెందిన ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగరాజుపల్లి గ్రామానికి చెందిన ఉప్పుల కనకమ్మ(80) కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ తన చిన్న కుమారుడు ఉప్పుల రమేష్ వద్ద కాలం వెళ్లదీస్తోంది. సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తమ ఇంటి ఆవరణలో ఉన్న చేద బావిలో పడి ఆత్మహత్య చేసుకుంది. గతంలో పెద్ద కుమారుడు, కోడలు మృతి చెందారు. ఇంకా ఇద్దరు కుమార్తెలు, చిన్న కుమారుడు రమేష్ ఉన్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

వరంగల్ క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాబోయే రెండు రోజులు భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో టీజీ ఎన్పీడీసీఎల్‌లోని విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈ యంఆర్‌టీ, కన్‌స్ట్రక్షన్‌లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ఖమ్మం, కొత్తగూడెం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ ప్రాంతాల్లో భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో విద్యుత్ సమస్యలు ఏర్పడితే వెంటనే పునరుద్ధరణ చర్యలు తీసుకులా సిద్ధంగా ఉండాలన్నారు. ఏజెన్సీలు, బ్రేక్ డౌన్ టీంలు సిద్ధంగా ఉండేటట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్ వెహికల్ చార్జింగ్ స్టేషన్‌లు పెట్టుకోవడానికి అనుమతులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ వి. మోహన్‌రావు, టి. మధుసూదన్, సీఈలు, జీఎంలు పాల్గొన్నారు.

దంపతులను హత్య చేసిన కేసులో ఒకరికి జీవిత ఖైదు, జరిమానా

వరంగల్ లీగల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాల కోసం దంపతులను హత్య చేసిన వ్యక్తికి యావజ్జీవ కారాగారా శిక్ష, రూ.3500 జరిమానా విధిస్తూ హనుమకొండ రెండవ అదనపు జిల్లా సేషన్స్ జడ్జి కం ఫ్యామిలీ కోర్టు జడ్జి బి.శ్రీదేవి సోమవారం తీర్పుచెప్పారు. కేసు వివరాలిలా ఉన్నాయి. హసన్‌పర్తి మండలకేంద్రానికి చెందిన గడ్డం దామోదర్, పద్మ దంపతులు హసన్‌పర్తిలో కిరాణం షాపు నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారు వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడడంతో వీరిద్దరు హసన్‌పర్తిలో ఉంటున్నారు. అదే గ్రామానికి చెందిన కామారపు ప్రశాంత్ తరచుగా వీరి షాపు వద్దకు వచ్చి కూర్చొనే వాడు. అదేవిధంగా అవసరం ఉన్నప్పుడు చిన్నచిన్న పనులు చేసిపెట్టేవాడు. ఈ క్రమంలో దంపతుల వద్ద ఉన్న బంగారం, డబ్బులను కాజేయాలని ఆలోచన రావడంతో 2018 జూన్ 18న రాత్రి 10 గంటల తర్వాత ఇంట్లోకి ప్రవేశించి గడ్డం దామోదర్, పద్మ దంపతులను ఒకరి తర్వాత ఒకరిని కత్తితో పొడిచి హత్యచేశాడు. అనంతరం ఇంట్లోని డబ్బు, బంగారు ఆభరణాలు తీసుకొని పరారయ్యాడు. హైదరాబాద్‌లో ఉంటున్న వీరి కుమారుడు గడ్డం పున్నంచందర్‌కు విషయం తెలియగానే హసన్‌పర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితుడిపై పోలీసులు హత్యానేరం నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడు ప్రశాంత్‌కు జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ వలబోజు రవీందర్ సాక్షులను ప్రవేశపెట్టగా, లైజన్ అధికారి ఏఎస్సై కె.పరమేశ్వరి కేసు పర్యవేక్షించారు. దర్యాప్తు అధికారిగా సీఐ వి.చేరాలు వ్యవహరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీందర్‌రావు కేసు వాదించారు.



హనుమకొండ అంబేద్కర్ భవన్‌లో మద్యం షాపుల డ్రాలో టెండర్‌దారులు

లక్కు చిక్కింది..

(5వ పేజీ తరువాయి)

మునిగి తేలారు. సాంబలక్ష్మికి జనరల్‌లో నర్సంపేటలోని 5వ షాపు రాగా రాజేశ్వర్‌కు గౌడ్ రిజర్వేషన్‌లో ఆత్మకూర్‌లోని 38 నెంబర్ షాపు దక్కింది. అదే విధంగా తడుగుల కృపావతికి రెండో సారి అదృష్టం వరించింది. గతంలో ఎస్సీ రిజర్వేషన్‌లో చెన్నారావు షాపు దక్కగా, ఈ లక్కీ డ్రాలో నల్లబెల్లి షాపు దక్కింది. అత్యధికంగా నడికూడ షాపుకు 100 మంది పోటీపడగా, అత్యల్పంగా పరకాల షాపునకు 16 మంది పోటీపడ్డట్లు ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. డ్రాలో పేరొచ్చిన వ్యక్తుల నుంచి లైసెన్స్ ఫీజును 6 వంతులుగా విభజించి అందులో ఒక వంతు ఫీజును తీసుకొని షాపును కేటాయించారు.



వరంగల్ నాని గార్డెన్‌లో మద్యం షాపుల డ్రాలో పాల్గొన్న టెండర్‌దారులు

జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడలు ప్రారంభం

● నాలుగు రోజుల పాటు ఉమ్మడి జిల్లా స్థాయిలో ఎంపికలు

● తొలి రోజు 430 మంది బాలబాలికలు హాజరు



టగ్ ఆఫ్ వార్‌లో తలపడుతున్న క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్‌ఐ) అండర్-19 ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్ఎస్)లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్-19 బాలబాలికల ఎంపిక పోటీలు జోరుగా ప్రారంభమయ్యాయి. సోమవారం జేఎన్ఎస్ వేదికగా నిర్వహిస్తున్న ఈ ఎంపిక పోటీలను ఉమ్మడి వరంగల్ జిల్లా జూనియర్ కళాశాలల ఎస్‌జీఎఫ్ఐ స్పోర్ట్స్ కోఆర్డినేటర్, సంగెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కాకా మాధవరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో సత్తా చాటాలని హితవు పలికారు. క్రీడల్లో గెలుపోటములు సమానంగా తీసుకున్నప్పుడే అనుకున్న లక్ష్యాన్ని అందిపుచ్చుకుంటారన్నారు. ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 క్రీడా పోటీల నిర్వహణ జిల్లా కార్యదర్శి నరెడ్ల శ్రీధర్ మాట్లాడుతూ... ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు జేఎన్ఎస్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో వివిధ క్రీడాంశాల్లో నగరంలోని పలు క్రీడా మైదానాల్లో ఎంపిక పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. తొలి రోజు నిర్వహించిన కరాటే, యోగా, బాస్కెట్‌బాల్, టగ్ ఆఫ్ వార్, టేబుల్ టెన్నిస్, సాఫ్ట్ టెన్నిస్, మార్షల్ ఆర్ట్స్‌లో ఉమ్మడి జిల్లాల నుంచి 430 మంది బాలబాలికలు పాల్గొనడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పీడీలు బరుపాటి గోపి, సతీష్, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్(ఎస్ఏపీఈటీఏ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.ప్రభాకర్‌రెడ్డి, కుమార్, గౌరవ అధ్యక్షులు దేవేందర్, ఎస్ఏపీఈటీఏలు తినబోతుల రవీందర్, రాముడు, జన్ను బాబు, ప్రేంప్రసాద్, తెలంగాణ రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడు, జాతీయ స్థాయి వాలీబాల్ పూర్వపు క్రీడాకారుడు మర్కాల యాదిరెడ్డి పాల్గొన్నారు.

లోన్ మంజూరైందని రూ.2.28 లక్షలు టోకరా

● సైబర్ కేసు నమోదు

ఆత్మకూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రూ.20 లక్షల లోన్ మంజూరైందని ముందుగా రూ.2.80 లక్షలు పంపాలని ముద్ర ఫైనాన్స్ పేరుతో బాధితుడికి ఫోన్ వచ్చింది. రూ.2.28 లక్షలు పంపి మోసపోయిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. సీఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగమడుగుపల్లి గ్రామానికి చెందిన దుడ్డ శ్రీనివాస్ 4 రోజుల క్రితం ముద్ర ఫైనాన్స్ బ్యాంకులో రూ.20 లక్షల లోన్ మంజూరైందని ముందుగా రూ.2.80 లక్షలు పంపాలని అపరిచితుడు చెప్పాడు. శ్రీనివాస్ విడతల వారీగా రూ.2.28 లక్షలు పంపాడు. అనంతరం బాధితుడు శ్రీనివాస్ ముద్ర బ్యాంకు అధికారులమంటూ ఫోన్ చేసిన నెంబర్‌కు తిరిగి ఫోన్ చేయగా స్పందన లేకపోవడంతో శ్రీనివాస్ సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నేడు కేయూ ఆంగ్ల విభాగంలో కాన్ఫరెన్స్

కేయూ క్యాంపస్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కేయూ ఆంగ్ల విభాగంలో అక్టోబరు 28న మంగళవారం ఉదయం 11.30 గంటలకు సెమినార్ హాల్‌లో విభాగం కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు విభాగాధిపతి డాక్టర్ ఆర్.మేఘనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్‌ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, డీన్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, ఈసీ మెంబర్లు డాక్టర్‌మల్లం నవీన్, డాక్టర్ బి.సుకుమారి, కాన్ఫరెన్స్ కన్వీనర్ పి.నిర్మల, ఆంగ్ల విభాగం అధ్యాపకులు డాక్టర్ బి. దీపాజ్యోతి, వర్సిటీ పరిధిలోని ఇంగ్లీష్ విభాగం ఇన్‌చార్జిలు పాల్గొంటారని తెలిపారు.

కుక్కల బెడదను తొలగిస్తాం

న్యూశాయంపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లోని 31వ డివిజన్ న్యూశాయంపేటలో కుక్కల బెడదను తొలగిస్తామని స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు అన్నారు. ఇటీవల కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన టైగర్ హిల్స్ కాలనీకి చెందిన సతీష్-సుస్మితల కూతురు క్రితికను వెటర్నరీ ఆఫీసర్‌తో పాటు కార్పొరేటర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యూశాయంపేటలోని కుక్కలను పట్టుకొని కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించాలని మున్సిపాల్ శాఖ సిబ్బందిని కోరినట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

నేడు కేయూ రెజ్లింగ్ టీం సెలక్షన్

కేయూ క్యాంపస్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అక్టోబరు 28న మంగళవారం హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఉదయం 8.30 గంటలకు కేయూ రెజ్లింగ్ టీం సెలక్షన్ ఎంపికలు నిర్వహిస్తామని కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలక్షన్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఆల్ ఇండియా ఇంటర్ వర్సిటీ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌ను కేయూ తరుపున ఎంపిక చేస్తామని వెల్లడించారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

● స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

● ముప్పారంలో ధాన్యం కొనుగోలు కేంద్రం షురూ



ముప్పారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీహరి

ధర్మసాగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రైతులను ఇబ్బంది పెట్టొద్దని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని ముప్పారంలో సోమవారం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యవసాయం, సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. రైతులు నష్టపోవద్దని రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ధాన్యం డబ్బులతో పాటు, సన్న వడ్లకు సంబంధించిన బోనస్‌ను రైతుల ఖాతాలో జమ చేస్తుందన్నారు. ధాన్యంలో 17శాతం తేమ ఉండేలా రైతులు చూసుకోవాలన్నారు. బస్తాకు 41 కేజీలు ఉండేలా తూకం వేయాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం తడువ కుండా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. మహిళా సంఘాలను బలోపేతం చేయడానికే మహిళా సంఘాలకు కొనుగోలు కేంద్రాలను కేటాయించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని రైతులు విక్రయించాలన్నారు. క్వింటాల్‌కు ఏ-గ్రేడ్‌కు రూ.2,389, బీ-గ్రేడ్‌కు 2,369 చెల్లించడం జరుగుతుందన్నారు. దళారులకు ధాన్యం అమ్మి నష్టపోవద్దని సూచించారు. గత ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి నియోజకవర్గ అభివృద్ధికి 1,388 కోట్ల నిధులు తీసుకొచ్చినట్లు తెలిపారు. నారాయణగిరి నుంచి కొత్తకొండ వరకు రూ.24.25 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణానికి మంజూరైనట్లు వెల్లడించారు. సంక్షేమం కోసం పాటుపడుతున్న కాంగ్రెస్‌కు అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ శ్రీనివాస్, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్ కుమార్, ఏవో రాజేష్, నాయకులు పెద్ది శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రసాద్, రమేష్‌రెడ్డి, ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

● టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవీందర్‌రావు, రైతులు

ఐనవోలు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. నందనం రైతుసేవా సహకార సంఘం ఆధ్వర్యంలో రాంనగర్‌లో ఏర్పాటుచేసిన ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. 25లక్షల మంది రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ చేసి, 9 రోజుల్లో రూ.9వేల కోట్లు రైతులకు పెట్టుబడి సాయం అందించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. సన్నాలకు రూ.500ల బోనస్, వ్యవసాయానికి ఉచిత నాణ్యమైన కరెంట్ ఇలా అనేక పథకాలతో రైతాంగానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ధాన్యం కొనుగోలుకు రూ.23వేల కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. సీజన్‌కు రూ.4 నుంచి 6వేల కోట్ల నష్టాన్ని భరిస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు ఎంఎస్పీ మద్దతు ధరను అందిస్తుందన్నారు. రైతులు తాము పండించిన ధాన్యం, మొక్కజొన్నలను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి లబ్ధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ టి.చందర్‌రావు, డైరెక్టర్లు చిరంజీవి, పద్మ, ఏలేంద్ర, బాబు, బుచ్చిరెడ్డి, రాంచంద్రయ్య, ఏసోబు, కుమార్, సమ్మయ్య, సంపత్‌రావు, కుమార్, సీఈవో సంపత్, నాయకులు పాల్గొన్నారు.



వరంగల్ ఎస్ఆర్ఆర్ తోటలోని ఓడీసీఎమ్మెస్ కార్యాలయ భవనం

ఓడీసీఎమ్మెస్ కనుమరుగేనా?

సహకార రంగంలో నాలుగు దశాబ్దాల ప్రస్థానం

- అన్నదాతలకు అండగా విలువైన సేవలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ. 200 కోట్ల ఆస్తులు
- ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన సొసైటీ
- ప్రభుత్వ విలీన నిర్ణయం పట్ల రైతుల్లో ఆందోళన

హనుమకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : నాలుగు దశాబ్దాల చరిత్ర కలిగిన ఓరుగల్లు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (ఓడీసీఎంఎస్) త్వరలో కనుమరుగు కానున్నదా ? సహకార రంగంలో తనదైన ప్రత్యేకతను నిలుపుకుంటూ లక్షలాది మంది రైతులకు సేవలు అందించిన ఈ సొసైటీ తన ఉనికిని కోల్పోనున్నదా ? ఉమ్మడి వరంగల్ జిల్లాలో విశిష్టమైన చారిత్రక నేపథ్యాన్ని కలిగిన ఓడీసీఎంఎస్ ఒకప్పుడు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబి)తో సమానంగా పోటీ పడింది. డీసీసీబీ అన్నదాతలను రుణాల పరంగా ఆదుకుంటే డీసీఎంఎస్ ఎరువులు, విత్తనాలను అందజేయడం, పంట ఉత్పత్తులను మద్దతు ధరకు కొనుగోలు చేయడం ద్వారా వెన్నుదన్నుగా నిలిచింది. ఓడిసిఎమ్మెస్ ఒక దశలో ఒక వెలుగు వెలిగింది. రాజకీయ నాయకులు ఓడీసీఎంఎస్‌కు చైర్మన్‌గా ఉండడం గొప్ప గౌరవంగా భావించేవారు. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఓడీసీఎంఎస్‌కు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ. 200 కోట్లకుపైగా ఆస్తులుఇప్పటికీ ఉన్నాయంటే ఈ సంస్థ గత ప్రాభవం ఏమిటో, సహకార వ్యాపార రంగంలో అది నిర్వహించిన క్రియాశీల భూమిక ఏమిటో అర్థం చేసుకోవచ్చు. రైతుల దగ్గర నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లింగ్ చేయడానికి జిల్లా చరిత్రలో తొలి సారి రైస్ మిల్లును సమకూర్చుకున్న ఘనత దీనికి ఉంది. ధాన్యాన్ని మరాడించి బియ్యాన్ని సరఫరా చేయడం ద్వారా అటు వ్యాపార పరంగా లాభాలు గడించడమే కాకుండా ఇటు రైతులను పరోక్షంగా ఆదుకున్న సహకార మార్కెటింగ్ సొసైటీ ఇది. మారిన పరి స్థితులు, సహకార రంగంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా తనను తాను నిలదొక్కుకోలేక క్రమంగా నష్టాల్లో కూరకుపోయి నప్పటి కీ తర్వాత నిలదొక్కుకొని తిరిగి లాభాల్లోకి రాగలిగింది. ప్రస్తుతం లాభాల బాటలో నడుస్తున్న ఓడీసీఎంఎస్ ప్రభుత్వం తీసుకోబోతున్న నిర్ణయంతో కాల గర్భంలో కలిసిపోనుండడం అన్నదాతలను ఆవేదనకు గురి చేస్తోంది.

విలీనం

వ్యవసాయ శాఖకు అనుబంధంగా ఉండి గుడిబండలా మారిన కార్పొరేషన్లను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చే చర్యల్లో భాగంగా కొన్నింటిని విలీనం, అవసరం లేనివాటి రద్దుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ ప్రక్రియలో ముందుగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఆగ్రోస్), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలు (డీసీఎమ్మెస్‌లు) కనుమరుగుకానున్నది.ఈ క్రమంలో ఓరుగల్లు జిల్లా సహకార మార్కెట్ సొసైటీ సైతం విలీనం ఖాయంగా కనిపిస్తోంది. విలీన ప్రక్రియకు ప్రతిపాదనలు పంపాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఇటీవల అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో డీసీఎమ్మెస్‌లు ఉన్నాయి. వీటి మూసివేతకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది.

గతంలోనే విలీనం ఆలోచన

ఆ తర్వాత ఓడీసీఎంఎస్ పుంజుకున్నది. స్వంతంగా వ్యాపార కార్యకలాపాలను నిర్వహించ సాగింది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు (పీఏసీఎస్) పోటీగా మారింది. ఈ క్రమంలో పీఏసీఎస్‌ల మనుగడ కోసం ఓడీసీఎంఎస్‌తో పాటు మరికొన్ని డీసీఎంఎస్‌లను మార్క్‌ఫెడ్ లో విలీనం చేయాలనే ఆలోచన అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది. ఎందుకో ఆ తర్వాత ఇది ఆచరణలోకి రాలేదు. తాజా ఇప్పుడు మరో సారి విలీన ప్రతిపాదన తెరమీదికి వచ్చింది. రాష్ట్రంలో ఏవో కొన్ని డీసీఎమ్మెస్‌లు నష్టాల్లో నడుస్తున్నాయన్న, రైతులకు వాటి అవసరం లేదన్న కారణంతో ఓడీసీఎంఎస్‌తో సహా అన్నిటిని విలీనం చేయాలని నిర్ణయం తీసుకోవడం పట్ల రైతుల్లో వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. డీసీఎమ్మెస్‌లు మొదట్లో విత్తనాలు, ఎరువుల సరఫరా, పంటల కొనుగోళ్లు చేపట్టేవి. ఆ తర్వాత పౌరసరఫరాల సంస్థ ధాన్యంకు ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం అప్పగించింది. మార్క్‌ఫెడ్ మక్కలు, పప్పు ధాన్యాలు, నూనే గింజలు కొనుగోలు చేస్తోంది. దీంతో డీసీఎమ్మెస్‌లకు చైర్మన్లు, డైరెక్టర్ల నియామకం, గౌరవ వేతనం, వాహనాలు, ఇంటి అద్దెలు తదితరాలు చెల్లిస్తుండడంతో నిర్వహణ వ్యయం భారీగా పెరిగినందు వల్ల ప్రభుత్వ ఆదేశం మేరకు రాష్ట్ర సహకార శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. మిగతా డీసీఎమ్మెస్‌ల కన్నా ఓడీసీఎమ్మెస్ పరిస్థితి భిన్నం. దీని కింద ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ.200 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. ఒక్క వరంగల్ ఎస్ఆర్‌తో టలోనే రెండెకరాల స్థలం ఉంది. దీని విలువనే రూ. 50 కోట్లకు పై చేస్తుంది. ఓడీసీఎమ్మెస్‌కు ప్రస్తుతం ఎలాంటి అప్పులు లేవు. 40 కేంద్రాల ద్వారా ఓడీసీఎమ్మెస్ ధాన్యం కొనుగోలు చేసి ప్రతీ సీజన్‌లో కమిషన్ రూపంలో సుమారు రూ 30 లక్షలు, ఎరువుల అమ్మకం ద్వారా రూ. 15లక్షల వరకు ఆదాయం ఆర్జిస్తోంది. ఈ సంస్థలో ప్రస్తుతం ఆరుగురు ఉద్యోగులు పని చేస్తున్నారు.

నలభై ఏళ్ళ క్రితం..

సహకార రంగంలో ఒకప్పుడు రెండంచెల వ్యవస్థ ఉండేది. రైతులకు పంటలు, వ్యవసాయ పని ముట్లు కొనుగోలు తదితర వాటి కోసం భూ తనఖా బ్యాంకులు (ఎల్ఎంబీ), ప్రాథమిక సహకార సంఘలు (పీఏసీఎస్) ఉండేవి. ఎల్ఎంబీలు ఆ తర్వాత వ్యవసాయాభివృద్ధి బ్యాంకులుగా (ఎల్‌డీబీ) మారాయి. పీఏసీఎస్‌లు స్వల్పకాలిక రుణాలు ఇస్తే ఎల్ఎంబీలు దీర్ఘకాలిక రుణాలు ఇచ్చి రైతులను ఆదుకునేవి. తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి ముఖ్య మంత్రి ఎన్‌టీ రామారావు 1987లో సహకార వ్యవస్థలో సంస్కరణలను ప్రవేశపెట్టారు. ఏకగవాక్ష విధానం (సింగిల్‌విండో) తీసుకువచ్చారు. రైతులకు కావలసిన పంట రుణాలు, ఎరువులు, విత్తనాలు ఇతర ముడిసరుకుల పంపిణీ సింగిల్ విండో ద్వారానే జరిగేలా మార్పులు చేశారు. ఇందులో భాగంగా ఎల్ఎంబీలను డీసీసీబీలో విలీనం చేసి దీర్ఘ, స్వల్పకాలిక రుణాలను దీని ద్వారానే వితరణ జరిగేలా చూశారు. దీనితో మార్కెటింగ్ కార్యకలాపాలకు, పీఏసీఎస్‌లకు సంబంధం లేకుండా పోయింది. అప్పట్లో పాత తాలూకాల్లో ఉన్న సహకార మార్కెటింగ్ సొసైటీ (సీఎంఎస్)లను విలీనం చేసి జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లను ఏర్పాటు చేశారు. అలా మొదట్లో వరంగల్ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డబ్ల్యుడీఎమ్మెఎస్) ఏర్పాటయింది. డబ్లుడీఎమ్మెఎస్ తీవ్ర నష్టాల్లో కూరుకుపోవడంతో దానిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి లాభాల్లో ఉన్న వరంగల్, నర్సంపేట, మహబూబాబాద్ సీఎంఎస్‌లను విలీనం చేసి ఓరుగల్లు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (ఓడీసీఎమ్మెఎస్)గా మార్చారు. అలా 1987లో ఏర్పాటయింది. ఆ తర్వాత కాలంలో పరకాల సీమ్మెఎస్‌లు కూడా ఓడీఎమ్మెస్ పరిధిలోకి వచ్చాయి. జనగామ పీఏసీఎస్ ఆదీనంలోకి వెళ్లిపోయింది.

ఆస్తి కోసం బతికుండగానే చంపేశారు..

- తప్పుడు పత్రాలతో రూ.20కోట్ల ఆస్తి రిజిస్ట్రేషన్
- కలెక్టర్‌ను, పోలీసులను ఆశ్రయించిన వృద్ధుడు


రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద రిజిస్ట్రేషన్ పత్రాలు చూపిస్తున్న బాధితుడు

హనుమకొండ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తండ్రి బతికుండగానే మరణించినట్లు తప్పుడు పత్రాలు చూపి ఆస్తిని తన వారసులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఓ తండ్రి అధికారులకు ఫిర్యాదు చేసిన ఘటన హనుమకొండలో చోటు చేసుకుంది. బాధితుడు సయ్యద్ జమాలొద్దీన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండకు చెందిన జమాలొద్దీన్‌కు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. జమాలొద్దీన్ వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. తనకు ఉన్న అపార్టుమెంట్‌లలో ఫ్లాట్లు, ఇళ్లు, ఇంటి స్థలాలకు సంబంధించిన సుమారు రూ. 20 కోట్ల విలువైన ఆస్తులను గత సంవత్సరం 2024 మార్చి 18న తాను మరణించినట్లుగా చూపించి అప్పటి రిజిస్ట్రేషన్ అధికారి తప్పుడు పత్రాలతో తన ఆస్తిని కుమారుడు, కుమార్తెలు మోసపూరితంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వాపోయాడు. వృద్ధాప్యంలో తనను ఎవరు పట్టించుకుంటారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్‌ను కలిసి తన గోడు వెళ్లబోసుకున్నట్లు తెలిపారు. అనంతరం హనుమకొండ వడ్డెపల్లి రోడ్డులోని జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న పత్రాలతో ఆందోళన వెలిబుచ్చాడు.ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. 2025 మార్చి 26నసుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేసినా తనకు న్యాయం జరుగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధాప్యంలో తనను పట్టించుకోని కూతుళ్లు, కుమారుడు రిజిస్ట్రేషన్ చేసుకున్న తన ఆస్తిని అధికారులు రద్దు చేసి తన ఆస్తి తనకు దక్కేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరాడు. భార్య అనారోగ్యంతో మృతి చెందగా రెండో వివాహం చేసుకున్నానని తెలిపారు.

కవి పొట్లపల్లికి నబారా స్మారక పురస్కారం ప్రదానం


పురస్కారం అందుకుంటున్న పొట్లపల్లి శ్రీనివాసరావు

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కవి పోషకుడు, న్యాయవాది నమిలికొండ బాలకిషన్‌రావు జ్ఞాపకంగా ఏర్పాటు చేసిన నబారా పురస్కారం -2025ను ప్రముఖ కవి పొట్లపల్లి శ్రీనివాసరావు అందుకున్నారు. శ్రీ రాజరాజ నరేంద్ర భాషా నిలయంలో జరిగిన కార్యక్రమంలో నబారా సొసైటీ అధ్యక్షులు నమిలికొండ పాంచాలరాయ్ అతిథు లు మధ్య పొట్లపల్లికి పురస్కారం అందజేశారు. తెలంగాణ రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, కవి బిల్ల మహేందర్ అధ్య క్షత వహించగా కవి, విమర్శకులు ఆచార్య బన్న అయిలయ్య మాట్లాడుతూ బాలకిషన్ రావు అనేక సాహితీ సంస్థలను ఏర్పాటుచేసి కవితా సంపుటాలను, సంకలనాలు ప్రచురించడమే కాకుండా ఎలాంటి లాభాపేక్ష లేకుండా ప్రసారిక అనే పత్రికను స్థాపించి ఎందరో కవులను ప్రోత్సహించారని అన్నారు. ప్రముఖ కవులు ఎన్‌వీఎన్.చారి, నిధిలు బాలకిషన్‌రావు, పొట్లపల్లి శ్రీనివాసరావు కవిత్వం, వారి వ్యక్తిత్వాలను సమగ్రంగా ఆవిష్కరించి కొనియాడారు. పొట్లపల్లికి నబారా పురస్కారంతో పాటు జ్ఞాపిక, శాలువ, రూ. 5116 నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు గిరిజా మనోహర్ బాబు, విఆర్.విద్యార్థి, కవులు, పి.చందు, వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, సముద్రాల శఠగోపాచార్యులు, మోత్కూరు మనోహర్, శర్మ, కోడం కుమారస్వామి, తాడిచెల్ల రవి, తదితరులు పాల్గొన్నారు.


మానవహారం చేస్తున్న విద్యార్థులు

స్కాలర్‌షిప్పులు వెంటనే విడుదల చేయాలి

కేయూ క్రాస్‌రోడ్డులో ఏబీవీపీ మానవహారం

కేయూ క్యాంపస్ అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం గత మూడేళ్ళగా విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8500 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేస్తూసోమవారం కేయూ క్రాస్ రోడ్డు జంక్షన్‌లో ఏబీవీపీ నేతృత్వంలో నిరసనగా మానవహారం చేపట్టారు. ఫీజులు చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీచేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. బకాయిలు చెల్లించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర సెక్రటరీ మాచర్ల రాంబాబు, కేయూ అధ్యక్షుడు ఉబ్బటి హరికృష్ణ, పూర్వరాష్ట్ర కార్యదర్శి అంబాల కిరణ్, కేయూ ఇన్‌చార్జి నిమ్మల రాజేశ్, సెక్రటరీ జ్ఞానేశ్వర్, ఫణీంద్ర, శివ, అబి. మెరగు సాయికుమార్ పాల్గొన్నారు.

మహా జాతరకు సన్నద్ధం కావాలి

- ఏర్పాట్లను అధికారులు వేగవంతం చేయాలి
- భక్తులకు సౌకర్యాలు మెరుగపర్చాలి
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క


మేడారంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

తాడ్వాయి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మేడారం మహాజాతరకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో ఏర్పాట్లను అధికారులు ప్రారంభించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. భక్తులకు సౌకర్యాలను మెరుగు పరుస్తూ మహాజాతరకు సన్నద్ధం కావాలని ఆదేశించారు. మంత్రి సీతక్క మేడారంలో సోమవారం సాయంత్రం పర్యటించారు. మేడారంలో జరుగుతున్న వనదేవతల దేవస్థానం పునరుద్ధరణ పనులను ఎస్పీ శబరీశ్, ఇతర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. వందల ఏళ్ల నిలిచేలా శాశ్వత పనులను ప్రభుత్వం చేపడుతున్న నేపథ్యంలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.

ఏర్పాట్లపై సమీక్ష

వనదేవతలను దర్శించుకున్న మంత్రి సీతక్క తల్లుల గద్దెలకు మొక్కులు చెల్లించుకున్నారు. పూజారులు తల్లుల ప్రసాదాలను మంత్రికి అందజేశారు. దేవస్థానం సమీపంలోని ఐటీడీఏ అతిథి గృహంలో ఏపీవో వసంతరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా జాతర ఏర్పాట్ల సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. జాతీయ రహదారులపై చేపట్టిన మల్లంపల్లి, కటాక్షపూర్ వంతెనల నిర్మాణాలను జాతరలోగా పూర్తి చేసి భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాలను కల్పించాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. అడవి ప్రాంతాల్లో విద్యుద్దీకరణ మరమ్మతు పనులను చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులతో అన్నారు. అడవి ప్రాంతాల్లోని రహదారుల వెంబడి విద్యుత్ లైట్లు, సీసీ కెమెరాలు, నెట్‌వర్క్ టవర్లు ఏర్పాటు చేసుకునేందుకు ప్రత్యేక ఎల్‌టీ లైన్లను ఏర్పాటు చేయాలన్నారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతూ జంపన్నవాగులో భక్తులకు చేప ట్టాల్సిన బీవోటీ, బాతింగ్‌గాడ్స్, సుందరీకరణ పనులు వెంటనే చేపట్టాలని అన్నారు. ప్రధానంగా పారిశుధ్య పనులపై పంచాయతీరాజ్ అధికా రులు దృష్టి పెట్టాలన్నారు. మహా జాతరలో ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల భద్రత, ప్రమాదాల నివారణ ప్రోటోకాల్ దర్శనాలు, పార్కింగ్‌లు, రోడ్డు భద్రతా నియమాలు తదితర అంశాలపై ఎస్పీ శబరీశ్‌తో మంత్రి చర్చించారు. గతంలో మాదిరిగా కాకుండా దేవస్థానం సమీపం వరకు భక్తులు చేరుకునేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. మేడారంలో ప్రకృతి ప్రతి బించేలా స్మృతివనం, దేవస్థానం, జంపన్న వాగు, మూజియం పరిసరాల్లో వివిధ రకాల చెట్లను పెంచాలని దానికి అటవీ అధికారులకు సూచించారు. అనంతరం భూనిర్వాసితులతో మంత్రి సీతక్క సమావేశమయ్యారు. భూములు కోల్పోతున్న ప్రతి రైతుకూ న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఆర్డీవో వెంకటేశ్, డీఎస్పీ రవీందర్, పూజా రుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'ఔట్‌సోర్సింగ్' అక్రమార్కులకు చెక్

(5వ పేజీ తరువాయి)

వస్తున్నాయి. వరంగల్ ఎంజీఎంలో ఔట్‌సోర్సింగ్ విధానం అస్తవ్యస్తంగా మారింది. ఓ ఏజెన్సీ ఉద్యోగులు లేకున్నా ఉన్నట్లుగా రికార్డుల్లో బినామీ పేర్లను చేర్చి వేతనాల రూపంలో పెద్ద మొత్తంలో కాజేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఎంజీఎంలో వివిధ విభాగాల్లో పనిచేయకున్నా.. చేసినట్లుగా నకిలీ రికార్డులు తయారు చేశారనే ఆరోపణలు వినిపించాయి. ఆరు నెలల కిందట ఇదే విషయం తెలుకున్న అధికారులు.. సదరు ఏజెన్సీకి వేతనాల బిల్లులు ఇవ్వకుండా నెలల తరబడి నిలిపివేశారు. ఆ తరువాత తన పలుకుబడిని ఉపయోగించి నిలిపివేసిన వేతనాల బిల్లులను సదరు ఏజెన్సీ డ్రా చేసుకున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇక ఆయా శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులే బినామీ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీని రిజిస్ట్రేషన్ చేయించుకుని అక్రమ దందాకు దిగుతున్నారు. జనగామ మెడికల్ కాలేజీలో వైద్యశాఖ ఉద్యోగికి చెందిన బినామీ ఏజెన్సీకే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ నియామకాలకు అవకాశం ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తుండటంతో ఏదో ఒకరోజు రెగ్యులర్ అవుతుందనే ఆశతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. నిబంధనల ప్రకారం ఆయా శాఖల్లో ఖాళీ అయినా పోస్టులను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాల్సి ఉంటుంది. అయితే చాలావరకు గుట్టు చప్పుడు కాకుండా ఏజెన్సీలు, సంబంధిత శాఖ అధికారులు కుమ్మక్కై పోస్టులను బేరం పెట్టి, భర్తీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కొక్క పోస్టుకు రూ.2లక్షల నుంచి రూ.3లక్షలకు పైగా ఆయా ఉద్యోగాన్ని బట్టి కొన్ని ఏజెన్సీలు వసూళ్లు చేస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అయితే ఏళ్ల తరబడి చాలిచాలని వేతనాలతో ఉద్యోగం చేస్తున్నప్పటికీ పర్మినెంట్ కాకపోవటంతో మధ్యలోనే ఉద్యోగానికి బైబై చెబుతున్న వారు కూడా ఉన్నారు. ఇవే కాకుండా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రావాల్సిన పీఎఫ్‌లు, ఈఎస్ఐలు అందకుండా పోతున్నాయి. నిబంధనల ప్రకారం ప్రభుత్వం వేతనాలు ఇవ్వకపోయినా ఆయా ఏజెన్సీలే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ తదితర వాటిని చెల్లించాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చాలా ఏజెన్సీలు ప్రభుత్వం నుంచి నిధులు రావటం లేదని నెలల తరబడి వేతనాలు ఇవ్వటం లేదు. అంతేకాదు పీఎఫ్, ఈఎస్ఐ వంటివి కూడా చెల్లించటం లేదు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన పీఎఫ్‌లు కూడా ఏజెన్సీలు మాయం చేస్తున్నాయనే ఆరోపణలున్నాయి.

అక్రమార్కుల్లో గుబులు

ఔట్‌సోర్సింగ్ నకిలీలను ఏరివేసేందుకు అన్ని జిల్లాల్లో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలను సేకరించాలని ప్రభుత్వం ఆయా శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. ఆయా శాఖల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆధార్ కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు పాస్ బుక్‌లు సేకరించాలని ఆదేశించింది. ఒక్కొక్క ఉద్యోగికి ఒక్కో యూనిక్ నెంబరు కేటాయించి నేరుగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఖాతాలో వేతనం జమచేసే ప్రయత్నంలో ప్రభుత్వం ఉన్నట్లుగా సమాచారం. ఇంటిగ్రేటెడ్ ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టం (ఐఎఫ్ఎంఐఎస్) పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ పోర్టల్‌లో నమోదు చేసిన ఉద్యోగులకే ప్రభుత్వం వేతనాలు ఇచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. దీంతో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల బినామీ దందాకు చెక్ పెట్టడంతో పాటు పని చేసే వారికే నేరుగా రెగ్యులర్‌గా వేతనాలు చెల్లించనున్నారు. మరోవైపు ఇన్నాళ్లు బినామీ పేర్లతో.. తప్పుడు రికార్డులతో వేతనాలు మాయం చేసిన కొన్ని ఏజెన్సీల నిర్వాహకుల్లో గుబులు మొదలైంది.

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 25వేల మందికి పైగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు ఉండగా, వీరిలో ఎంతమంది నకిలీలు ఉన్నారనేది ఆసక్తికరంగా మారింది. అంతే కాకుండా ఎంతమంది బినామీ పేర్లతో సర్కారు సొమ్ముకు కన్నం వేశారో కూడా బయటకు రానుంది.

అకాల వర్షాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

- పంట నష్టం జరగకుండా చూడాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తుఫాను కారణంగా కురిసే అకాల వర్షాలతో పంట నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి పత్తి, ధాన్యం, మొక్క జొన్న వంటి పంటల కొనుగోలుపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, సీఎస్ కే రామక్రిష్ణారావు, ఇతర రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి ఉత్తమ్ కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే రెండు రోజుల పాటు తుఫాను ప్రభావంతో మన రాష్ట్రంలో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నారు. జిల్లాలో ఉన్న వరి, పత్తి, మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాల వద్ద నష్టం వాటిల్లకుండా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు సిద్ధం చేయాలని అన్నారు. నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం 100 శాతం ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరవాలని మంత్రి కలెక్టర్లను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతుల కొరత ఎక్కడైనా ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకొని రావాలని అన్నారు. పంట కొనుగోలు విషయంలో ఏ చిన్న తప్పు జరిగినా కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో రాబోయే రెండు రోజులు వర్షాలు పడే అవకాశం ఉన్నందు వల్ల పంట కోతలు వాయిదా వేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. కోతలు చేసిన మొక్కజొన్న, వరి వంటి పంటలు నాణ్యతా ప్రమాణాలు ఉంటే వెంటనే కాంటా వేసి కొనుగోలు చేయాలని, పంట తరలింపునకు వాహనాల సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా రైతుల కల్లాల వద్ద తేమ శాతం పరిశీలించి నాణ్యత ప్రమాణాలు ఉంటేనే కొనుగోల కేంద్రాలకు పంట తీసుకొని వచ్చేలా చూడాలని అన్నారు. సీఎస్ కె. రామక్రిష్ణారావు మాట్లాడుతూ రాబోయే 45 రోజుల నుంచి రెండు నెలల కాలంలో ధాన్యం కొనుగోలు ఉధృతంగా జరుగనుందని, అధికారులు అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ సజావుగా కొనుగోలు జరిగేలా చూడాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీవో మేన శ్రీను, డీసీవో సంజీవరెడ్డి, డీపీవో రవీంద్ర సింగ్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నేపాల్ రుద్రాక్షల ఎగ్జిబిషన్ ప్రారంభం

బాలసముద్రం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన నేపాల్ రుద్రాక్షల ఎగ్జిబిషన్‌ను సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.దుర్గాప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో ఏకముఖి నుంచి 21ముఖాల రుద్రాలక్షలతో పాటు స్ఫటిక, తులసి, నవరత్న, కరుంగళి, పంచముఖి రుద్రాక్ష మాలలు, సాలీగ్రాములు, మర్కట శివలింగాలు, దైవికమైన వస్తువులు సరసమైన ధరలకు లభిస్తాయన్నారు. ఈ ప్రదర్శన ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి రాత్రి 9గంటల వరకు ఉంటుందని తెలిపారు. నవంబరు 5 వరకు రుద్రాక్షల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. సంస్థ డైరెక్టర్ జి. పద్మలత, బొట్ల నాగరాజు గురుస్వామి పాల్గొన్నారు.


రుద్రాక్షలను ప్రదర్శిస్తున్న నేపాల్ రుద్రాక్షల ఎండీ డాక్టర్ దుర్గాప్రసాద్



నగదు రివార్డును అందుకుంటున్న మణితేజ

మణితేజకు రాష్ట్రస్థాయి మొదటి బహుమతి

రూ. లక్ష నగదు రివార్డు

హసన్‌పర్తి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న గోసేవా విభాగం తెలంగాణ వారు హైదరాబాద్‌లోని కేశవ్ మెమోరియల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నారాయణగూడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి గోసేవా పరీక్షలు-2025లో హసన్‌పర్తి గ్రీన్‌వుడ్ హైస్కూల్ విద్యార్థి తాళ్లపెల్లి మణితేజ ప్రథమ బహుమతి సాధించినట్లు ఆ స్కూల్ డైరెక్టర్ భరద్వాజనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి సుమారు 2,200 మందికి పైగా ఈ పోటీలో పాల్గొనగా 9వ తరగతికి చెందిన మణితేజ మొదటి బహుమతిని సాధించడమే కాకుండా రూ. లక్ష నగదు, మెమెంటో, మెరిట్ సర్టిఫికెట్‌ను కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్ చేతుల మీదుగా తీసుకోవడం హర్షణీయమన్నారు. అలాగే 6వ తరగతికి చెందిన బయన అశ్రిత్‌సాగర్ కన్సోలేషన్ ప్రైజ్ కింద రూ.1వేయి నగదు, మెమెంటో, సర్టిఫికెట్‌లు పొందినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన సన్మాన సభకు జీఎం ప్రభుకుమార్, ప్రిన్సిపాళ్లు నవీన్‌కుమార్, టి.పవన్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, అకడమిక్ కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించినట్లు తెలిపారు.

హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా నూతన కమిటీ



ఆదాం, చక్రపాణి

హనుమకొండ చౌరస్తా, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధ) హనుమకొండ జిల్లా నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ 2వ మహాసభలో నూతన కమిటీని ప్రకటించారు. హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా బొచ్చు ఆదాం, ప్రధాన కార్యదర్శిగా బొట్ల చక్రపాణి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సంగాల మొగిలి, కోశాధికారిగా దాసరి రవీందర్, ఉపాధ్యక్షులుగా పుల్ల అశోక్, ల్యాదల విజేందర్, పోషణపల్లి రవి, దొగ్గల కరుణాకర్, ఇనుముల కృష్ణకర్, తిరుపతి, సహాయ కార్యదర్శులుగా ఉచిత తిరుపతి, కమల్, బొక్క రవి, దద్దు రాజు, మంతపురి సదానందం, స్వామితో పాటు మరో 21మందిని జిల్లా కార్యవర్గంలోకి ఎంపిక చేశారు.

మెడికల్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నూతన కార్యవర్గం



యాదనాయక్, సుధాకర్

హనుమకొండ చౌరస్తా, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ప్రకటించారు. సోమవారం హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో తెలంగాణ యునైటెడ్‌మెడికల్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ మహాసభ నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ. ఫసీయుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ మహా సభలో యూనియన్ హనుమకొండ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. అధ్యక్షుడిగా కె.యాదానాయక్, ప్రధాన కార్యదర్శిగా జే. సుధాకర్, కోశాధికారిగా జే. సరోజతో పాటు 21మంది కమిటీ సభ్యులు, 12మంది ఆఫీస్ బేరర్లకు నూతన కమిటీలో చోటు కల్పించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యాదానాయక్, సుధాకర్‌లు మాట్లాడుతూ.. మెడికల్ శాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్‌కు వేతనాలు పెంచాలన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ. ఫసీయుద్దీన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఏఎన్ఎంల పని భారం తగ్గించాలని, 1930, ఏఎన్ఎం పోస్టులు, 2300 నర్సింగ్ ఆఫీసర్స్, 1284 ఎల్‌టీ, 735 ఫార్మసిస్ట్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నవంబరు 18న రంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించే యూనియన్ రాష్ట్ర మహాసభలకు యూనియన్ సభ్యులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బలరాం, మామిడి ఆదిత్య, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పలయ్య, రమేష్, యూనియన్ నాయకులు, అర్బన్ హెల్త్ సెంటర్, ఆయూష్ ఉద్యోగులు, ఏఎన్ఎంలు, 104, 108, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన అతివేగం

- లారీని ఢీకొట్టిన బైక్..
- యువకుడి మృతి.. మరో యువకుడి పరిస్థితి విషమం


సంజయ్ (ఫైల్)

లింగాలఘణపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): యూటర్న్ తీసుకుంటున్న లారీని బైక్ ఢీకొట్టడంతో యువకుడు దుర్మరణం చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం నెల్లుట్ల గ్రామ శివారు ఆర్టీసీ కాలనీ వద్ద జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... రఘునాథపల్లి మండలం కంచనపల్లికి చెందిన రాగి వెంకటయ్య, మల్లమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. చిన్నకుమారుడు రాగి సంజయ్(19), లింగాలఘణపురం మండలం నవాబుపేటకు చెందిన ప్రసాద్ ఇద్దరు స్నేహితులు. వీరు జనగామలో డిగ్రీ మొదటి సంవత్సరం చదవుతున్నారు. ఇద్దరు నెల్లుట్ల నుంచి జనగామకు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై అతివేగంగా వస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి వస్తున్న లారీ సూర్యాపేట వైపునకు వెళ్లేందుకు ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్డు మీదుగా వచ్చి యూటర్న్ తీసుకుంటున్నారు. బైక్ నడుపుతున్న సంజయ్ అతివేగంగా వస్తూ లారీని గమనించక బలంగా ఢీకొట్టాడు. హెల్మెట్ లేకపోవడంతో సంజయ్, ప్రసాద్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఆస్పత్రికి తరలిస్తుండగా సంజయ్ మృతి చెందాడు. ప్రసాద్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. హెల్మెట్ ధరించి ఉంటే సంజయ్ బతికేవాడని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

బాలసముద్రం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భవన నిర్మాణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ ఆధ్వర్యంలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ వినీతకు సోమవారం వినతి పత్రం ఇచ్చారు. డిజిటల్ హాజరు, ఆధార్ అప్‌డేట్ తదితర సమస్యలను డిప్యూటీ కమిషనర్‌తో చర్చించారు. కార్మికులకు రావాల్సిన విద్య, క్రీడా, సాంకేతిక, వృత్తి నైపుణ్యాల ప్రోత్సాహకాలు, ఉపాధి కల్పన లాంటి పథకాలను పునరుద్ధరించాలని కోరారు. ఆధార్‌లో జనవరి 1వ తేదీని కాకుండా డిసెంబరు 31ని ప్రామాణికంగా తీసుకోవాలని కార్మిక చట్టాలు పటిష్టంగా అమలయ్యేలా చర్యలు చేపట్టి దళారి వ్యవస్థను నిలువరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉడుదుల వెంకటేష్, రాష్ట్ర సమితి సభ్యురాలు లావణ్య, తదితర కార్మిక నాయకులు పాల్గొన్నారు.

రైతు సంతోషంగా ఉంటేనే సుభిక్షం

- అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- మార్కెట్లో మార్క్‌ఫెడ్, సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రైతులు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో పత్తి, మక్కజొన్న రైతులకు మద్దతు ధర లభించేందుకు మార్క్‌ఫెడ్, సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో వరి వేస్తే ఉరేనని నాటి సీఎం కేసీఆర్ చెప్పాడని, అలాంటిది ఈ ప్రజా ప్రభుత్వం వచ్చాక వరికి రూ.500ల బోనస్ కూడా ఇస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో విస్తృతంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి పాలనలో రైతులకు ఉచిత విద్యుత్, సబ్సిడీపై పరికరాలు, విత్తనాలు అందించారని, అదేవిధంగా ఈ ప్రభుత్వం కూడా రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటుందని అన్నారు. పత్తి రైతులు ఇబ్బందులు పడకుండా సీసీఐ చేత పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. రైతులు నాణ్యమైన పత్తిని కపాస్ కిసాన్ యాప్ ద్వారా దగ్గరలోని మిల్లులో స్లాట్ బుక్ చేసుకున్న తరువాత పత్తిని మిల్లుకు తరలించి అమ్ముకోవాలని సూచించారు. తేమ శాతం 8లోపు ఉంటేనే క్వింటాకు రూ.8110లు ధర పలుకుతుందని, అంతకంటే ఎక్కువగా ఉంటే ఒక శాతం తేమకు సుమారు రూ.80లు ధర తగ్గుందని.. అది కూడా 12 శాతం లోపు తేమ ఉంటేనే సీసీఐ కొనుగోలు చేస్తుందని అన్నారు.


పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కొండా సురేఖ

సీసీఐకి పత్తి అమ్మిన రైతులకు నాలుగైదు రోజుల్లో వారి బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు జమ అవుతాయన్నారు. వరంగల్ పరిధిలో 23 మిల్లుల ద్వారా పత్తి కొనుగోలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, సీసీఐ జనరల్ మేనేజర్ మోహిత్‌శర్మ, మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, డీఎంవో సురేఖ, సీసీఐ పర్చేసింగ్ అధికారి కృష్ణారెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, గ్రేడ్ 2 కార్యదర్శులు రాము, అంజిత్‌రావు, ఏఎస్. రాజేందర్, నాయకులు గోపాల నవీన్‌రాజ్, మీసాల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతున్న ఆర్. శ్రీనివాస్, ఎం. అంజిరెడ్డి

ఏపీఆర్‌జేసీ స్వర్ణోత్సవాలను

జయప్రదం చేయాలి

పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధి రామక శ్రీనివాస్

వడ్డెపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్‌లోని విజయపురి సౌత్‌లో డిసెంబరు 13, 14 తేదీల్లో నిర్వహించే ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ (ఏపీఆర్‌జేసీ) స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధి రామక శ్రీనివాస్, కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ మారెళ్ల అంజిరెడ్డి కోరారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరులసమావేశంలో వారితో పాటు పూర్వ విద్యార్థి, పరకాల ఆర్డీవో కన్నం నారాయణ మాట్లాడారు. 1975లో అప్పటి ముఖ్యమంత్రి, పూర్వ దేశ ప్రధాని పీవీ నర్సింహరావు ప్రోత్సాహంతో నాగార్జున సాగర్‌లో ఏపీఆర్‌జేసీని స్థాపించినట్లు తెలిపారు. ఎంతో మందిని తీర్చిదిద్దిన ఈ కళాశాల స్వర్ణోత్సవాల్లో పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో పూర్వ విద్యార్థులు, చంచల్ అగర్వాల్, శర్మాకి స్వామి, డాక్టర్ పల్లె రాజు పాల్గొన్నారు.

మెట్లబావిని సుందరంగా తీర్చిదిద్దాం

మంత్రి కొండా సురేఖ


మెట్లబావి వద్ద పూజ చేస్తున్న మంత్రి కొండా సురేఖ

ఖిలావరంగల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చారిత్రక ప్రసిద్ధి గాంచిన కాకతీయుల కాలంనాటి మెట్లబావిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దామని, స్థానిక ప్రజలు, పర్యాటకులకు ఆహ్లాదాన్నిచ్చే విధంగా సుందరీకరించామని రాష్ట్ర అటవీ, పర్యాటక, దేవాదాయశాఖా మంత్రి కొండా సురేఖ అన్నారు. గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రూ.50లక్షలతో తీర్చిదిద్దిన మెట్లబావిని ఆమె సోమవారం రాత్రి పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 15 సంవత్సరాల క్రితం మెట్లబావిని పునరుద్ధరించేందుకు ఎమ్మెల్యే నిధులను కేటాయించానన్నారు. అనంతరం మేయర్ నిధుల ద్వారా మెట్లబావిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. అనంతరం మూడు అంతస్థులుగా ఉన్న మెట్లబావిలోనికి దిగి నాటి కట్టడాలు, రాళ్ళు అమర్చిన విధానాన్ని చూసి అశ్చర్యం వ్యక్తం చేశారు. ఇలాంటి కట్టడాలను పరిరక్షించి ముందుతరాలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ చహత్ బాజ్‌పాయి, 34వ, డివిజన్ కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్‌రాజ్, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, చిట్టిమళ్ళ శ్రీనివాస్, శామంతుల శ్రీనివాస్, పగడాల సతీష్, సారా సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా రామాలయంలోని శివా లయంలో మంత్రి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు మల్లయ్య, ప్రధాన కార్యదర్శి మంచా ల కృష్ణమూర్తి, శ్రీరాం రాజేష్, సాదుల దామోదర్, బత్తుల నవీన్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భార్యపై దాడి చేసిన భర్త

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది, వివిధ గ్రామాల నుంచి రిజిస్ట్రేషన్స్ కోసం వచ్చిన వారి ఎదుటనే కట్టుకున్న భార్య పైన ఓ భర్త దాడిచేసిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం హనుమకొండ జిల్లా రాంపూర్‌కు చెందిన కొత్తపల్లి కుమార్-లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. గత కొన్నేళ్ల క్రితం రాంపూర్‌లో ఉన్న భూమిని విక్రయించడంతో వచ్చిన డబ్బులతో పాంనూర్‌లో భూమిని కొనుగోలు చేశారు. కొన్ని నెలల క్రితం కుమార్ పాంనూర్‌లో కొంత భూమిని విక్రయించి డబ్బులను వృథా చేశాడు. దీనిపై కుటుంబ సభ్యులు నిలదీయడంతో గొడవలు జరిగాయి. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు వదిలివేసి ఘన్‌పూర్‌లో ఉంటూ జల్సాలు చేస్తున్నాడు. భార్య లక్ష్మి కూలీనాలి చేస్తుండగా కుమారుడు రమేష్ ఆటోనడుపుతూ కుటుంబానికి అండగా ఉంటున్నాడు. కొన్ని రోజుల క్రితం కుమార్ కొందరు రియల్టర్లను పట్టుకొని పాంనూర్‌లో ఉన్న మిగితా భూమిని తక్కువ ధరలకు విక్రయించడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. రిజిస్ట్రేషన్ చేస్తున్నాడని తెలుసుకున్న అతని భార్య, పిల్లలు తహసీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చి అడ్డుపడ్డారు. సోమవారం కుమార్ భూమి రిజిస్ట్రేషన్ చేయడానికి సిద్ధమైనట్లు తెలుసుకున్న లక్ష్మి తహసీల్దార్ కార్యాలయానికి రావడంతో గమనించిన కుమార్ ఎలాగైన అడ్డుపడుతుందని భావించిన అతను అందరి ముందర విచక్షణరహితంగా ఆమెను కొడుతూ ఆమెపై పిడిగుద్దులతో దాడి చేశాడు. అక్కడే ఉన్న రెవెన్యూ సిబ్బంది, అక్కడికి వచ్చిన వారు కుమార్‌ను నిలువరించే ప్రయత్నం చేశారు. ఆమె రోదిస్తూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తలదాచుకున్నట్లు తెలిసింది.


భార్య పైన దాడి చేస్తున్న కుమార్‌ను అడ్డుకున్న సిబ్బంది


ప్రెస్ క్లబ్ ఆవరణలో స్వీట్లు పంపిణీ చేసుకుంటున్న టీయూడబ్ల్యూజే నేతలు

వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో సంబురాలు

వడ్డెపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఎన్నికల్లో టీయూడబ్ల్యూజే ప్యానల్ విజయం సాధించిన నేపథ్యంలో బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించుకున్నారు. బాణసంచా పేల్చి స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు, రాష్ట్ర హౌసింగ్, వెల్ఫేర్ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, నాయకులు కంకణాల సంతోష్, గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, పీవీ మదన్ మోహన్, గడ్డం కేశవమూర్తి, పిన్న శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఎంజీఎంలో సరైన వైద్య సదుపాయాలు కల్పించాలి'

కేయూ క్యాంపస్ అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పేదల వైద్య సహాయం అందించే ఎంజీఎంలో సరైన వైద్య సౌకర్యాలు కల్పించాలని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ తిరుణహరిశేషు డిమాండ్ చేశారు. సోమవారం సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన సమావేశంలో శేషు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వానికి, జిల్లా అధికార యంత్రాంగానికి ఎంజీఎంపై నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. ఎంజీఎంలో వైద్య సదుపాయాలు కల్పించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని ఎంజీఎంను చక్కదిద్దాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దారబోయిన సతీశ్, ఎర్రబొజ్జ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'హెడ్మాస్టర్‌పై కానిస్టేబుల్ దాడిని ఖండిస్తున్నాం'

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తప్పుడు ధృవపత్రం ఇవ్వాలని దూషిస్తూ హెడ్మాస్టర్‌పై పోలీస్ కానిస్టేబుల్ దాడిచేయడాన్ని ఖండిస్తున్నట్లు బీసీ టీచర్స్ అసోసియేషన్, టీపీటీఎఫ్ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు సోమవారం వరంగల్, హనుమకొండ జిల్లాల్లో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో పలు పాఠశాలల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మహబూబ్‌నగర్ జిల్లా రేపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్‌పై కానిస్టేబుల్ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అమాయకులైన ఉపాధ్యాయులపై అన్యాయాలను అరికట్టాల్సిన పోలీసులు దాడిచేయడం హేయమైన చర్య అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీసీటీఏ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు తిరుపతి, సురేష్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అశోక్, వీరాచారి, ప్రవీణ్‌కుమార్, సునిల్ కుమార్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

మడికొండ పీఎస్‌లో ఓపెన్ హౌస్

మడికొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల సంస్మరణలో భాగంగా సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు మడికొండలో ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ ఆధ్వర్యంలో సోమవారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. మడికొండ బాలుర, బాలికల పాఠశాలలు, గురుకులాల విద్యార్థులను పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి ఓపెన్ హౌస్ చేసి చూపించారు. కార్యక్రమంలో మడికొండ ఎస్సైలు రాజ్ కుమార్, రామ్మోహన్, పోలీసు ఇబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మడికొండ పీఎస్‌లో ఓపెన్ హౌస్‌లో పాల్గొన్న విద్యార్థులు

ప్రీ రిపబ్లిక్ డే క్యాంపునకు వలంటీర్ల ఎంపిక

కేయూ క్యాంపస్ అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు 31 నుంచి నవంబరు 9 వరకు గుజరాత్ పఠాన్‌లోని నార్త్ గుజరాత్ వర్సిటీలో నిర్వహించే ప్రీ రిపబ్లిక్‌డే క్యాంపునకు కాకతీయ యూనివర్సిటీ తరుపున ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎంపికయ్యారు. ఈ మేరకు కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ సోమవారం ప్రకటించారు. ఎంపికయిన వారిలో మంద సంజయ్, (కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల, వరంగల్), ఉప్పుల శివ (కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమకొండ), అయిళ్ళ సామ్రాట్, (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిర్పూర్ కాగజ్‌నగర్), ఎమ్డీ సన (ప్రభుత్వ పింగళి డిగ్రీ కళాశాల, వడ్డెపల్లి, హనుమకొండ), సీహెచ్. అక్షయశ్రీ (కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల, హనుమకొండ), చింతల ప్రీతి (వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల, మనుమకొండ)లు ఎంపికైనట్లు నారాయణ వెల్లడించారు. వీరికి కంటిజెంట్ లీడర్‌గా సుబేదారి పీజీ కళాశాల పీవో డాక్టర్ కె.కవిత వ్యవరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణలు అభినందించారు.

డెంగీతో బాలిక మృతి


మోక్షిత

గీసుగొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): డెంగీ జ్వరంతో బాలిక మృతిచెందిన ఘటన వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని మనుగొండ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మనుగొండ గ్రామానికి చెందిన మోక్షిత(3) వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతోంది. మొదట పీఎంపీ వద్ద చికిత్స అందించారు. ఆయన సూచనల మేరకు మందులు వాడుతున్నారు. అయిన ప్పటికీ జ్వరం తగ్గకపోవడంతో పాటు బాగా నీరసించిపోవడంతో సోమవారం ఎంజీఎంకు తరలించారు. బాలికకు డెంగీ వచ్చినట్లు వైద్యులు నిర్ధారించి చికిత్స అందించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మృతిచెందింది. చిన్నారి మృతిచెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.


రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో విజేతగా నిలిచిన వరంగల్ జిల్లా జట్టును అభినందిస్తున్న స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ మాధవరావు

జిల్లా వాలీబాల్ జట్టుకు అభినందనలు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 25, 26 తేదీల్లో భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ బాలుర కళాశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) అండర్-19 ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నీలో ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి విజేతగా నిలిచారు. ఈ మేరకు సోమవారం హనుమకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలోని హ్యాండ్‌బాల్ కోర్టులో వరంగల్ జిల్లా జట్టు సభ్యులను ఉమ్మడి వరంగల్ జిల్లా జూనియర్ కళాశాలల ఎస్‌జీఎఫ్ఐ స్పోర్ట్స్ కోఆర్డినేటర్, సంగెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కాకా మాధవరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 క్రీడా పోటీల నిర్వహణ జిల్లా కార్యదర్శి నరేడ్ల శ్రీధర్, సీనియర్ పీడీలు బరుపాటి గోపి, సతీష్, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, కుమార్, దేవేందర్, పాల్గొన్నారు.

శ్యామల చెరువు సర్వే పనులు ప్రారంభం

హసన్‌పర్తి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భీమారం శ్యామల చెరువు కబ్జా భూములు, అక్రమ కట్టడాలపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. ఈ మేరకు మండల సర్వేయర్ సుజాత పర్యవేక్షణలో సోమవారం చెరువుపై డిజిటల్ సర్వే పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వే బృందం చెరువు హద్దు రాయిని గుర్తించి డిజిటల్ మిషన్‌తో పాయింటింగ్ తీసుకున్నారు. అనంతరం మ్యాపింగ్ ద్వారా చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, నాలా, పంట కాలువలు గుర్తించి నివేదిక ఇవ్వనున్నట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. అక్రమ నిర్మాణాలపై అధికారులు ఏ చర్యలు తీసుకుంటారోనని స్థానికులు చర్చించుకుంటున్నారు.

మీకు తెలుసా?



వీటితో కాలేయ కొవ్వు

ధూమపానం, మద్యపానం కాలేయ కొవ్వును పెంచుతాయనే విషయం అందరికీ తెలిసిందే! అయితే ఆరోగ్యకరమైన ఆహారంగా భావించే కొన్ని పదార్థాలు కూడా ఇందుకు దోహదపడుతూ ఉంటాయి. కాలేయ కొవ్వును పెంచే ఆ పదార్థాలు ఇవే!

- **కొవ్వు తొలగించని పాల ఉత్పత్తులు:** పాలు, చీజ్, మీగడ పెరుగు పోషకభరితమైనవే! అయితే వీటి పరిమితి మించితే కాలేయానికి చేటు తప్పదు. కొవ్వు తొలగించని పాల ఉత్పత్తులకూ కాలేయ కొవ్వుకూ సంబంధం ఉంటుందనే ఒక అధ్యయనం తాజాగా అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్‌లో ప్రచురితమైంది.
- **బేక్ ఉత్పత్తులు:** ఎక్కువ శాతం బేకరీ ఉత్పత్తులన్నీ శుద్ధి చేసిన పిండి, శుద్ధి చేసిన చక్కెరలతోనే తయారవుతాయి. వీటిలో పోషకాలతో నిండిన పైపొర కొరవడుతుంది. కాబట్టి వీటితో తయారయ్యే బ్రెడ్, పేస్ట్రీలు, మఫిన్లు.. నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ ముప్పును పెంచుతాయి. అన్నం, బ్రెడ్, నూడుల్స్ వల్ల జపాన్ మహిళల్లో కాలేయ కొవ్వు పెరిగినట్టు, క్లినికల్ న్యూట్రిషన్‌లో ఒక అధ్యయనం ప్రచురితమైంది.
- **ప్రొటీన్ బార్స్:** నట్స్, సీడ్స్, ఖర్జూరాలు, ఓట్స్.. ఇలా ఆరోగ్యకరమైన పదార్థాలతో తయారయ్యే ప్రొటీన్ బార్స్‌లో కూడా హై ఫ్రక్టోజ్ కార్న్ సిరప్ లాంటి అనారోగ్యకరమైన తీపిని ఉపయోగిస్తారు. కాబట్టి ప్రొటీన్ బార్స్‌ను అతిగా తినడం వల్ల కాలేయ కొవ్వు ముప్పు కూడా పెరుగుతుంది.
- **నట్స్:** అఫ్లాటాక్సిన్ మౌల్డ్ అనే విషపూరిత ఫంగస్ వేడిగా, తేమగా ఉండే వాతావరణాల్లో వృద్ధి చెందుతుంది. వేరుసెనగ, బాదం, పిస్తా, వాల్‌నట్స్, క్వినోవాల్లో ఈ ఫంగస్ పెరిగే అవకాశం ఎక్కువ. కాబట్టి ఈ నట్స్‌ను కొన్న రెండు నెలల్లోపే తినడం మంచిది. అలాగే తినే ముందు వీటిని నీళ్లలో నానబెట్టడం ఉత్తమం.
- **తీపి పానీయాలు:** పండ్ల రసాలు ఆరోగ్యకరమే! కానీ సీసాల్లో దొరికే రెడీమేడ్ పండ్ల రసాల్లో చక్కెరలు అధిక మోతాదుల్లో ఉంటాయి కాబట్టి ఇవి కాలేయ కొవ్వును పెంచుతాయనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి.
- **ఎండిన పండ్లు:** ఎండుద్రాక్ష, ఎండు ఆప్రికాట్స్, ఎండుఖర్జూరాల్లో చక్కెరలు ఎక్కువగా ఉంటాయి. ఫలితంగా కాలేయ కొవ్వు పెరిగే అవకాశం ఉంటుంది కాబట్టి వీటిని పరిమితంగా తినాలి.

ఫుట్ కేర్



ముఖం మీద కనబరిచినంత శ్రద్ధ పాదాల మీద కనబరచం. మరీ ముఖ్యంగా కాలి గోళ్లలో చోటుచేసుకునే మార్పులు, సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ ఉంటాం. కానీ కాలి గోళ్ల ఇన్‌ఫెక్షన్లను అశ్రద్ధ చేయడం అత్యంత ప్రమాదకరం అంటున్నారు పోడియాట్రిక్ సర్జన్, డాక్టర్ నరేంద్రనాథ్ మేడ.

కాలి గోళ్ల సమస్యలు

గుంభనంగా...

గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు.. ఇలా మనందరం ప్రధానమైన అవయవాల ఆరోగ్యం మీదే దృష్టి పెడుతూ ఉంటాం. కానీ కాలి గోళ్ల మీద మనకెప్పుడూ ఆసక్తి ఉండదు. భరించలేని నొప్పి వేధించినప్పుడు, నడక ఇబ్బందికరంగా మారినప్పుడు మాత్రమే మన దృష్టి కాలిగోళ్ల వైపు మళ్లుతుంది. కానీ ఆరోగ్యం గోళ్లలో ప్రతిబింబిస్తూ ఉంటుందని ఎంతమందికి తెలుసు? రంగు మారడం, మందంగా మారిపోవడం లేదా ఆకారంలో మార్పులు చోటుచేసుకోవడం లాంటివి పలు రకాల ఇన్‌ఫెక్షన్లు, కంటికి కనిపించని రుగ్మతలను సూచిస్తాయి.

రంగు మారితే...

ఆరోగ్యకరమైన గోళ్లు నునుపుగా, లేత గులాబీ రంగులో మెరుస్తూ ఉండాలి. అయితే కాలి గోళ్లు పసుపు, గోధుమ రంగు, ఆకుపచ్చగా మారితే వాటిలో ఏదో సమస్య మొదలైందని అర్థం. గోళ్లు రంగు మారడానికి, వాటికి సోకే ఫంగల్ ఇన్‌ఫెక్షన్లే ప్రధాన కారణం. ప్రత్యేకించి గంటల తరబడి బూట్లు వేసుకునే వాళ్లు, లేదా జిమ్స్, ఈత కొలనుల దగ్గరి తడి వాతావరణంలో ఎక్కువ సమయాలు గడిపే వాళ్లలో ఈ సమస్య ఎక్కువ. అయితే గోళ్లు రంగు మారితే దాన్నొక తీవ్రమైన సమస్యగా పరిగణించేవారు ఎంతో తక్కువ. నెయిల్ పాలిష్ వల్ల గోళ్లు రంగు మారి ఉంటాయని కొందరు సర్దుకుపోతూ ఉంటారు. కానీ ఇదే సమస్యను నిర్లక్ష్యం చేస్తే, ఈ ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు మరింత పెరిగి గోళ్లు మరింత మందంగా, పెళుసుగా మారిపోతాయి. కొన్ని తీవ్రమైన పరిస్థితుల్లో ఆ ఇన్‌ఫెక్షన్ గోళ్ల నుంచి, చుట్టూరా ఉన్న చర్మానికి వ్యాపించి, నడక, బూట్లు ధరించడం కష్టమైపోతుంది.

గోరు లోపలకు పెరిగితే...

అత్యంత సాధారణంగా కనిపించే మరొక సమస్య ఇది. గోరు మూలలు కాలి వేలి లోపలకు పెరుగుతూ ఉంటాయి. సాధారణంగా బొటనవేలి గోళ్లలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తూ ఉంటుంది. బిగుతైన బూట్లు, గోళ్లను సక్రమమైన తీరులో కత్తిరించుకోకపోవడం, గోటికి దెబ్బ తగలడం వల్ల గోరు లోపలకు పెరగడం మొదలుపెడుతుంది. మొదట్లో వేలు కందిపోయి, ఎర్రగా మారి నొప్పి పెట్టడం మొదలుపెడుతుంది. గోరు లోపలకు పెరిగేకొద్దీ, వేలు మొత్తం వాచిపోతుంది. చీము పట్టి, నడక కష్టమైపోతుంది. మధుమేహం, రక్త ప్రసరణ తగ్గడం లేదా వ్యాధినిరోధకశక్తి బలహీనపడడం లాంటి సమస్యలు తీవ్రమైన పరిణామాలకు దారి తీస్తాయి. కొన్ని సందర్భాల్లో గోళ్లలో కొంత భాగాన్ని తొలగించవలసి వస్తుంది. అరుదుగా కొందర్లో పూర్తి వేలునే తొలగించవలసి రావచ్చు.

గోళ్ల సమస్యల పట్ల నిర్లక్ష్యం ఎందుకు?

చాలా మంది గోళ్ల సమస్యలను గృహవైద్యాలతో సరిదిద్దే ప్రయత్నం చేస్తూ ఉంటారు. నొప్పి, అసౌకర్యాల నుంచి ఉపశమనం కోసం వెనిగర్‌లో పాదాలను నానబెట్టడం లేదా గోళ్లను కత్తిరించుకోవడం లాంటివి చేస్తూ ఉంటారు. అయితే వీటితో కొంతమేరకు ఉపశమనం లభించవచ్చు. కానీ అసలు సమస్య పరిష్కారం అవక, మరింత తీవ్రమవుతుంది. గోళ్ల ఇన్‌ఫెక్షన్లు వాటంతట అవే మానిపోవనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలి. వాటికి సరైన వ్యాధినిర్ధారణ, చికిత్సలు అవసరమవుతాయి. గోళ్ల సమస్యలను వైద్యుల దృష్టికి తీసుకువెళ్లకపోవడానికి మరొక కారణం కూడా ఉంది. కొందరు రంగు మారిన గోళ్లను వైద్యులను చూపించడానికి సిగ్గుపడి, సొంత చికిత్సలతో సరిపెట్టుకుంటూ ఉంటారు. చివరకు సమస్య తీవ్రమైన తర్వాత తప్పనిసరి పరిస్థితుల్లోనే వైద్యులను కలుస్తూ ఉంటారు. అయితే గోళ్లకు సోకే ఇలాంటి సమస్యలను సరిదిద్దడం కోసమే పోడియాట్రిస్ట్‌లు ఉంటారనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి.

> **గోళ్లలో మార్పులు అందుకే...**
>
> గోళ్లు... కాలి వేళ్లకు రక్షణ కల్పించడంతో పాటు, మన ఆరోగ్యాన్నీ, జీవనశైలినీ ప్రతిబింబిస్తాయి. పలు రకాల అనారోగ్య సమస్యలు గోళ్లలో ప్రతిఫలిస్తూ ఉంటాయి. కాబట్టి ఈ దిగువ మార్పుల మీద ఓ కన్నేసి ఉంచాలి
>
> - **క్లబ్ నెయిల్స్:** సరిపడా ఆక్సిజన్ అందక, గోళ్లు ఉబ్బెత్తుగా మారే సమస్య ఇది. దీన్ని గుండె సమస్యకు సూచనగా భావించాలి
> - **పెళుసుబారితే:** పాదాలకు రక్తప్రసరణ తగ్గినప్పుడు గోళ్లు పెళుసుబారిపోతాయి. కాబట్టి దీన్ని కూడా గుండె సమస్యగా భావించవచ్చు
> - **పసుపు గోళ్లు:** కామెర్ల వ్యాధిలో ఈ లక్షణం కనిపిస్తుంది
> - **నలుపు రంగు గోళ్లు:** ఫంగల్ ఇన్‌ఫెక్షన్లకు సూచన



ఈ జాగ్రత్తలు పాటించాలి

- **పొడిగా, శుభ్రంగా:** ప్రతి రోజూ పాదాలను శుభ్రంగా కడిగి, వేళ్లు, గోళ్ల దగ్గర తడి లేకుండా పొడిగా తుడుచుకోవాలి
- **గోళ్లు కత్తిరించాలి:** మూలలను గుండ్రంగా కత్తిరించుకోకుండా, నేరుగా కత్తిరించుకోవాలి
- **గాలి చొరబడేలా:** పాదాలకు సౌకర్యంగా ఉండేలా, గాలి చొరబడేలా ఉండే బూట్లనే ఎంచుకోవాలి
- **సాక్స్‌లు:** ప్రతి రోజూ సాక్సులు మార్చుకుంటూ ఉంటే, ఫంగస్ వృద్ధి చెందదు
- **నడక:** బహిరంగ ప్రదేశాల్లో చెప్పులు లేకుండా నడవడం మానేయాలి. మరీ ముఖ్యంగా ఈత కొలనులు అక్కడి లాకర్ రూమ్స్‌లో చెప్పుల్లేకుండా నడవడం వల్ల ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు సోకే ముప్పు ఉంటుంది
- **వైద్యులను కలవాలి:** వాపు, నొప్పి కనిపించిన వెంటనే వైద్యులను కలవాలి
- **పెడిక్యూర్ :** మధుమేహులు, గోళ్లకు ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు సోకినవారు, మెడికేటెడ్ పెడిక్యూర్ కోసం పోడియాట్రిస్ట్‌లను మాత్రమే ఆశ్రయించాలి
- **నెయిల్ ఎక్స్‌టెన్షన్లు:** వీటిలో జిగురు వల్ల గోళ్లకు ఇన్‌ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉంటుంది. కాబట్టి గోళ్ల సమస్యలు ఉన్నవాళ్లు వీటికి దూరంగా ఉండాలి
- **రక్తం గడ్డకడితే:** ఆరోగ్యవంతులకు గోళ్ల అడుగున ఏర్పడే చిన్నపాటి రక్తపు గడ్డలతో ప్రమాదం ఉండదు. అయితే సమస్య తీవ్రమైనప్పుడు వైద్యులను కలవడానికి వెనకాడకూడదు. అయితే మధుమేహులు గోళ్లకు దెబ్బలు తగిలి, రక్తం గడ్డలు ఏర్పడితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను కలవడం మంచిది.

పోడియాట్రిస్ట్ అంటే?

పాదాలు, గోళ్లు, దిగువ అవయవాలకు సోకే ఇన్‌ఫెక్షన్లు, వ్యాధులను నిర్ధారించి చికిత్స చేసే వైద్య నిపుణులనే పోడియాట్రిస్ట్ అంటారు. సాధారణ వైద్యులకు భిన్నంగా పోడియాట్రిస్ట్‌ల దగ్గర ప్రత్యేకించి పాదాలు, గోళ్లకు సంబంధించిన రుగ్మతలను నయయం చేసే అధునాతన వైద్య పరికరాలు, చికిత్సలు అందుబాటులో ఉంటాయి. ఫంగల్, బ్యాక్టీరియల్...వీటిలో గోళ్లకు సోకిన సమస్య ఏదన్నది వీళ్లు మాత్రమే కనిపెట్టగలుగుతారు. దెబ్బ తగలడం వల్ల గోరు దెబ్బ తిందా లేదంటే, దీర్ఘకాల మధుమేహం వల్ల దెబ్బ తిందా అన్నది కూడా ఈ వైద్యులే కనిపెట్టగలుగుతారు. వ్యాధి సోకిన గోళ్లకు యాంటీఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ మందులతో, సున్నితమైన గోటి చికిత్సలతో, లేజర్ థెరపీతో సరిదిద్దుతారు. లోపలకు పెరిగిన గోళ్లను నేర్పుగా కత్తిరించి సమస్యను సరిదిద్దగలుగుతారు. అలాగే సమస్య రాకుండా తీసుకోవలసిన ముందు జాగ్రత్త చర్యలను కూడా సూచిస్తారు.

డాక్టర్ నరేంద్రనాథ్ మేడ,
హెచ్ఒడి అండ్ సీనియర్ కన్సల్టెంట్ వాస్క్యులర్ అండ్ ఎండోవ్యాస్క్యులర్ సర్జన్,
పోడియాట్రిక్ సర్జన్,
కిమ్స్ హాస్పిటల్, హైదరాబాద్



మానసిక ప్రశాంతత

ధ్యానం... అమోఘం!

ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడి సహజం. ఫలితంగా చికాకు, విసుగు, అనాసక్తత ఆవరించి జీవన నాణ్యత దెబ్బతింటుంది. కాబట్టి వీటిని వదిలించుకోవాలంటే మానసిక ప్రశాంతత చేకూర్చుకోవాలి. ఇందుకు అనువైన మార్గం 'ధ్యానం'!

ధ్యానం చేయమంటే, కదలకుండా కూర్చుని చేసే ధ్యానంతో ఒరిగేదేముంది? అనిపిస్తుంది. అసలు అందరూ అలా ఎలా మౌనంగా, నిశ్చలంగా ధ్యానం చేయగలుగుతున్నారు? అందులో ఆనందం ఏముంటుంది? అనే అనుమానమూ వస్తుంది. అయితే ధ్యానం అనేది కదలికలతో కూడుకున్న వ్యాయామం, కార్యక్రమం, చర్య కాదు. మనసు పెట్టి చేయవలసిన క్లిష్టమైన పని అంతకన్నా కాదు. అదొక విశ్రాంత స్థితి. నిద్రను మించిన లోతైన నిద్రావస్థ స్థితి. ఈ స్థితిలో మనసు స్థిరంగా, నిశ్చలంగా, ప్రశాంతంగా ఉంటుంది. ఒత్తిడులు, ఆందోళనలు తొలిగి మనసు నిర్మలమవుతుంది. ఆ స్థితికి చేరుకోవడాన్నే 'ధ్యానం' అంటారు. వినడానికి తేలికగానే అనిపించినా ఆ స్థితికి చేరుకోవడం అంత తేలిక కాదు. మనసులో చెలరేగే ఆలోచనలను ఆపలేని నిస్సహాయులం మనం. అంతగా మన జీవితాలు లోక సంబంధ అంశాల చుట్టూ తిరుగుతూ ఉంటాయి. ఆలోచనల సంకెళ్లు మన మనసును స్థిమితంగా ఉండనివ్వవు. కాబట్టి ధ్యాన స్థితికి చేరుకోవలంటే మనసులో చెలరేగే ఆలోచనలను బంధించే సహనం, సాధన అవసరం.

ధ్యాన స్థితికి ఎందుకు చేరుకోలేం?

ధ్యానం ప్రారంభించిన మొదట్లో ముందుకు వెళ్లలేకపోతున్న భావన కలగడం సహజం. ఇందుకు కారణం ధ్యానం మీద మనసు లగ్నం కాకపోవడమే! ఆ లోతైన నిద్రావస్థ స్థితిని ఎలా చేరుకోవాలో అర్థం చేసుకోలేకపోవడమే! అయితే ధ్యానంలోకి చేరుకోవడానికంటే ముందు రెండు అంశాలను అర్థం చేసుకోవాలి. మన మనసు రెండు పనులు చేస్తూ ఉంటుంది. మొదటిది 'గ్రహింపు', రెండవది 'ఆచరింపు'. ధ్యానంలో ఆచరింపు అనే అంశాన్ని నెమ్మదింపజేసి, గ్రహింపును ఉత్తేజితంగా ఉంచాలి. చాలామంది ఈ రెండు అంశాల గురించిన అవగాహన లేకుండానే ధ్యానం సాధన చేయడం మొదలు పెడతారు. ధ్యానం కోసం సిద్ధపడేముందు ఈ విషయాలను తెలుసుకోగలిగితే, అందుకోసం మనసు నిశ్చలంగా మారి, ధ్యాన ప్రక్రియ సులువవుతుంది. గాఢమైన నిద్రావస్థ ధ్యాన స్థితికి చేరుకోవడానికి కొన్ని చిట్కాలు పాటించాలి. అవేంటంటే...

- **సన్నద్ధం:** ధ్యానం చేయడం కంటే అందుకు సన్నద్ధమవడం కష్టం. అయితే ధ్యానానికి ముందు అందుకు మనసు, శరీరాలను సిద్ధం చేయడం వల్ల ధ్యానం తేలికవుతుంది అని నిపుణులు చెబుతారు.
- **ఊపిరి, శరీరాలను నెమ్మదించాలి:** శ్వాస, మనసు, శరీరం అంతర్గతంగా ఒకదానితో మరొకటి అనుసంధానమై ఉంటాయి. శరీరాన్ని విశ్రాంతంగా ఉంచి, శ్వాసను నెమ్మదింపజేస్తే, మనసూ నిశ్చలంగా మారుతుంది. ఈ స్థితిలో నాడీ వ్యవస్థ ప్రేరేపితమవుతుంది. ఫలితంగా ఒత్తిడి తగ్గడం మొదలవుతుంది.

> **మనసు ఆనందంగా :** బాధను మరిచి, ఆనందాన్ని సొంతం చేసుకోవడమే మన మెదడు ప్రధాన ధ్యేయం. ధ్యానం చేసే సమయంలో కూడా ఇదే సూత్రాన్ని అనుసరించాలి. అంతా సవ్యంగానే ఉందనే భావన మనసులో నింపుకుంటే ధ్యానంలోకి పయనం సాధ్యపడుతుంది. అందుకోసం మీ జీవితంలో జరిగిన మంచి విషయాలను మననం చేసుకోవాలి. అంతా మంచే జరుగుతుందన్న సంతుష్టకరమైన భావన మనసులో నింపుకోవాలి. భగవన్నామస్మరణ కూడా ధ్యానానికి మేలు చేస్తుంది. అలాగే ధ్యానం కోసం నిశ్శబ్దమైన ప్రదేశాన్ని ఎంచుకోవాలి. ఫోన్లు, పెంపుడు జంతువులు, పిల్లల వల్ల ధ్యానానికి భంగం కలిగే వీలు లేని ప్రదేశాన్ని ధ్యానానికి కేటాయించాలి.



- **ధ్యానం తేలికగా:** ధ్యాన ముద్రలో కూర్చుని 5 సార్లు ఊపిరి పీల్చి వదలాలి. ముక్కుతో గాలి లోపలికి పీల్చుకుని, నోటి ద్వారా బయటకు వదలాలి. ఊపిరి లోతుగా, దీర్ఘంగా కొనసాగాలి. ఊపిరి పీల్చుకునే సమయంలో వర్తమానంతో కూడిన స్పృహ కలిగి ఉండాలి. ఊపిరి బయటకు వదిలేటప్పుడు కండరాలన్నిటినీ రిలాక్స్ చేయాలి. ఆ సమయంలోనే ఒత్తిడిలు, ఆందోళనలు బయటకు వెళ్లిపోతున్న భావన కలగాలి. ఇలా చేస్తున్నప్పుడు ప్రత్యేకంగా నాలుక, దవడ, కంఠం, నుదుటి మీద మనసు పెట్టాలి.
- **సక్రమ పద్ధతి:** ధ్యానానిక ముందు కొన్ని యోగాసనాలు వేసి శరీరాన్ని తేలికపరచవచ్చు. ధ్యానానికి ఉపకరించే ఆసనాలు... శేతుబంధాసనం, ధనురాసనం, బాలాసనం, అధోముఖ శవాసనం, అర్థ మత్స్యేంద్రాసనం, ఉత్తనాసనం, శుప్త మత్స్యేంద్రాసనం, పద్మాసనం, శవాసనం. ఈ ఆసనాలు వేసే సమయంలో ఊపిరి పీల్చుకున్నదానికంటే ఎక్కువ సమయంపాటు బయటకు వదలాలి అనే విషయం గుర్తు పెట్టుకోవాలి. ఊపిరి పీల్చుకోవడానికి నాలుగు సెకండ్లు పడితే, వదలడానికి ఎనిమిది సెకండ్ల సమయం తీసుకోవాలి. ఉచ్ఛ్వాసనిశ్వాసాలు నెమ్మదిగా సాగాలి.
- **కోరిక బలంగా:** ధ్యానం ఎందుకు చేయదలచుకున్నారో, ఎలాంటి ఫలితం కోరుకుంటున్నారో జ్ఞప్తికి తెచ్చుకోవాలి. ధ్యానానికి ముందు ఇలాంటి లోతైన ఆలోచన ధ్యాన బలాన్ని పెంచుతుంది. మీ కోరిక మానసిక ప్రశాంతత కాబట్టి, ఆ ఆలోచన దృఢంగా కొనసాగాలి. ముందున్న కొంత సమయాన్ని నేను ధ్యానం మీదే మనసు కేంద్రీకరిస్తాను అనుకోవాలి. ఆ సమయంలో నేను చేయవలసిన పనులు, ఆలోచించదగిన విషయాలు ఏమీ లేవు అని అనుకోవాలి. నేను ధ్యానం మొదలు పెట్టబోతున్నాను. నన్ను ఇబ్బంది పెట్టవద్దు అని మనసుకి చెప్పుకోవాలి.
- **ఉన్నది ఉన్నట్టు స్వీకరించాలి:** ప్రారంభంలో మనసులో ఆలోచనలు చెలరేగి ధ్యానానికి భంగం కలగవచ్చు. ఆ సమయంలో మిమ్మల్ని మీరు విమర్శించుకోకుండా ఆ ఆలోచనలను అంగీకరించి, వాటిని దూరం చేసుకోవడం మీద పట్టు సాధించాలి. స్వీయనింద ధ్యానాన్ని కొనసాగనివ్వదు. కాబట్టి ఉన్నది ఉన్నట్టు స్వీకరించి మెరుగైన ధ్యానం కోసం ఆలోచనల మీద పట్టు సాధించాలి. మనసు మీద పట్టు సాధించేటందుకు సమయం ఇవ్వాలి. మీతో మీరు సహనంతో మసలుకోవాలి.
- **ఏకాగ్రతను అభినందించాలి:** ఏదైనా వస్తువును ఉపయోగిస్తే మనసు లగ్నమవడం తేలికవుతుంది. అలా చేయడం పొరపాటు కాదు. మనసు కేంద్రీకృతమయ్యేవరకూ ఏ వస్తువు మీదైనా మనసు లగ్నం చేయవచ్చు. అయితే ఆ సమయంలో మనసులో చోటుచేసుకునే నెమ్మదితనాన్ని గమనించాలి. ఏకాగ్రత కోసం మనసుకు శిక్షణ ఇచ్చే సమయంలోనే ఆనందాన్ని గ్రహించేలా కూడా మనసు శిక్షణ పొందుతుంది. కాబట్టి ధ్యానంలో పట్టు సాధించడం కోసం ఏదైనా వస్తువును ఉపయోగించుకోవచ్చు. అయితే అది వెలుగు విరజిమ్మేలా ఉండాలి.
- **ధ్యానం నుంచి బయటకు:** ధ్యానం ముగిసిన తర్వాత దాన్లో నుంచి నెమ్మదిగా బయటకు రావడం కూడా నేర్చుకోవాలి. ధ్యానంలో తొందరపాటు తగదు. మనసు విశ్రాంతి పొందనివ్వాలి. మెడ, వేళ్లు కదిలించాలి. ఆ తర్వాత నెమ్మదిగా కళ్లు తెరవాలి.
- **రాతల్లో పెట్టాలి:** ధ్యానం ముగిసిన తర్వాత అనుభవాన్ని అక్షరబద్ధం చేయాలి. అలా చేయడం ద్వారా పురోగతి తెలుస్తుంది. ఎంత సేపు కూర్చుని ఉన్నారు? ధ్యానం ముగిసిన తర్వాత ఎలాంటి అనుభూతి పొందారు? ధ్యానం చేస్తున్నప్పుడు మనసు ఎలా స్పందించింది? అనే విషయాలను కూడా రాయాలి. ధ్యానం ప్రారంభంలో మనసులోకి ఎలాంటి ఆలోచనలు వచ్చాయి? వాటిని మీరెలా అధిగమించారు? అనే విషయాలను రాసుకోగలిగితే, ఆ మెలకువను ఎలా కొనసాగించవచ్చో అర్థమవుతుంది.

అధ్యయనం

గాలి కాలుష్యంతో 'డిమెన్షియా'

గాలి కాలుష్యం వల్ల 2000 నుంచి 2023 మధ్య కాలంలో భారతదేశంలో మరణాల సంఖ్య 14 లక్షలకు పెరిగింది. ఈ ముప్పు గురించిన మరిన్ని ఆసక్తికరమైన వివరాలు...



గాలి కాలుష్యం కేవలం శ్వాసకోస సమస్యలకే పరిమితం కాదని, దీంతో డిమెన్షియా ముప్పు కూడా పొంచి ఉంటుందనీ స్టేట్ ఆఫ్ గ్లోబల్ ఎయిర్ 2025 నివేదిక వెల్లడిస్తోంది. గాలి కాలుష్యం ఫలితంగా 2023లో ఆరున్నర లక్షల మంది డిమెన్షియా బారిన పడినట్టు, ప్రపంచవ్యాప్త డిమెన్షియా మరణాలు 29 శాతానికి చేరుకున్నట్టు ఈ నివేదిక పేర్కొంటోంది. ప్రపంచవ్యాప్తంగా మెరుగైన వైద్య విధానాలు, పెరిగిన ఆయుర్దాయాల ఫలితంగా, మరీ ముఖ్యంగా వృద్ధులు, గాలిలోని సూక్ష్మ అణువులకు బహిర్గతమవుతూ ఊపిరితిత్తులు, గుండె, మెదడు సంబంధిత సమస్యల బారిన పడుతున్నారు. ఈ సూక్ష్మ కలుషితాలు ఊపిరితిత్తుల ద్వారా రక్తప్రవాహంలోకి చొరబడి, అంతిమంగా మెదడుకు చేరుకుంటున్నాయి. అక్కడకు చేరుకున్న ఈ కలుషితాలు ఇన్‌ఫ్లమేషన్, ఆక్సిడేటివ్ స్ట్రెస్‌లను ప్రేరేపిస్తూ, మెదడు కణజాలాన్ని దెబ్బతీస్తూ, నాడీక్షీణతను పెంచుతున్నాయి. ఈ ప్రక్రియ అల్జీమర్స్, వ్యాస్క్యులర్ డిమెన్షియాల ముప్పును పెంచుతోంది. వీటి వల్ల జ్ఞాపకశక్తి క్రమేపీ క్షీణించి, ఇతరుల మీద ఆధారపడే పరిస్థితి పెరుగుతుంది. గాలి కాలుష్యానికి బహిర్గతం అవడం మూలంగా పిల్లల మెదడు ఎదుగుదల, పనితీరు కూడా కుంటుపడుతుందని నివేదిక పేర్కొంటోంది. ఫలితంగా ఆటిజం లాంటి నాడీసంబంధ రుగ్మతలతో పాటు, ఆందోళన, కుంగాబాటు లాంటి మానసిక సమస్యలు కూడా వేధిస్తాయని నివేదిక పేర్కొంటోంది. ధూమపానం, పోషకాహార లోపాలే డిమెన్షియాకు ప్రధాన కారణాలు అయినప్పటికీ, ఇందుకు గాలి కాలుష్యం కూడా దోహదపడుతుందని పరిశోధకులు అంటున్నారు.

సిద్ధాంతం

క్యాన్సర్ కొత్త సిద్ధాంతం... బ్రో హైపోథిసిస్

బిగుతైన బ్రాసరీలతో లింఫ్ స్రావాలకు అంతరాయం ఏర్పడి, రొమ్ముల్లో సమస్యలు తలెత్తవచ్చనే 'బ్రో హైపోథిసిస్' అనే కొత్త సిద్ధాంతం ఇప్పుడు తెరపైకొచ్చింది. దీని గురించి తెలుసుకుందాం!



బిగుతైన లోదుస్తులకూ లింఫ్ స్రావాల అవరోధాలకూ మధ్య సంబంధం ఉందనే 'బ్రో హైపోథిసిస్' అనే ఒక సిద్ధాంతం, క్యాన్సర్ ప్రివెన్షన్ స్టడీ జర్నల్‌లో ప్రచురితమైంది. దీనికి రుజువులు పరిమితంగానే ఉన్నప్పటికీ, ఆకర్షణీయంగా కనిపించే క్రమంలో మహిళలు బిగుతైన, సింథటిక్ డిజైన్లను కలిగిన బ్రాసరీలను ఎంచుకోవడంలో దాగి ఉన్న ఆరోగ్య సమస్యలకు సంబంధించి పలు చర్చలు జరిగాయి. లోదుస్తుల వస్త్రాల్లో హార్మోన్లను అస్తవ్యస్థపరిచే థాలేట్స్, ఫార్మాల్డిహైడ్, సింథటిక్ రంగులు, బిస్ఫినాల్స్ మొదలైన రసాయనాలు దాగి ఉంటాయి. ఇవి దీర్ఘకాలంలో క్యాన్సర్ ముప్పుకు దారి తీస్తాయి. సాధారణంగా బ్రాసరీల తయారీ కోసం పాలియస్టర్, నైలాన్, స్పాండెక్స్ వస్త్రాలనే ఉపయోగిస్తూ ఉంటారు. వీటన్నింట్లో ఈ విషపూరిత రసాయనాలు దాగి ఉంటాయి. ఈ ముప్పు నుంచి తప్పించుకోవడం కోసం, కాటన్, వెదురు, సేంద్రీయ పదార్థాలతో తయారైన బ్రాసరీలనే ఉపయోగించాలి.

అవగాహన

హృద్రోగులు గుడ్లు తినొచ్చా?

వారానికి ఏడు చొప్పున గుడ్లను మితంగా తినడం వల్ల ఆరోగ్యకరమైన వ్యక్తుల్లో గుండె, రక్తనాళాల సమస్యలు పెరగవనే ఒక విశ్లేషణ మాయో క్లినిక్‌లో ప్రచురితమైంది. మరిన్ని వివరాలు....



సమతులాహారంలో భాగంగా కూరగాయలు, పొట్టు తీయని ధాన్యాలు, ఆరోగ్యకరమైన కొవ్వులతో పాటు గుడ్లను కూడా తీసుకోవచ్చు. పీచు, అన్‌శాచురేటెడ్ కొవ్వులతో పాటు గుడ్లను మితంగా తిన్నంత కాలం గుండె జబ్బులు దరి చేరే అవకాశాలు తక్కువని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ కూడా మరొక విశ్లేషణను ప్రచురించింది. అయితే వారానికి 12 అంతకంటే ఎక్కువ గుడ్లను తినడం వల్ల గుండె జబ్బు ముప్పు కచ్చితంగా పెరుగుతుంది. ప్రత్యేకించి చెడు కొలెస్ట్రాల్ మోతాదులు ఎక్కువగా ఉన్న వ్యక్తుల్లో ఈ ముప్పు మరింత ఎక్కువగా ఉంటుంది. నిజానికి గుడ్డుతో గుండెకు రక్షణ కల్పించుకోవచ్చు. గుడ్డు జోలికి వెళ్లని వాళ్లతో పోల్చితే, వారానికి పరిమితంగా ఒకటి నుంచి మూడు గుడ్లు తినే వాళ్లలో గుండె జబ్బుల ముప్పు ఎంతో తక్కువగా ఉంటున్నట్టు సూచించే ఒక అధ్యయనం కూడా గ్రీస్‌కు చెందిన యూరోపియన్ జర్నల్ ఆఫ్ ప్రివెంటివ్ కార్డియాలజీలో ప్రచురితమైంది. ఆరోగ్యం కేవలం ఒక పదార్థం మీదే ఆధారపడి ఉండదనీ, పరిపూర్ణ ఆరోగ్యానికి ఆహార, జీవనశైలులు, పోషకాలు దోహదపడతాయని వైద్యులు ఈ అధ్యయనంలో పేర్కొంటున్నారు. ప్రాసెస్ చేసిన పదార్థాలకు బదులుగా గుడ్లను తినడం ద్వారా ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. కానీ గుడ్లను, శాచురేటెడ్ కొవ్వులతో కలిపి తిన్నప్పుడు ఆరోగ్యం మీద ప్రతికూల ప్రభావం పడుతుందనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి.

ముగ్గురు పోలీసు అధికారులకు ఐపీఎస్ హోదా

హైదరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ముగ్గురు సీనియర్ పోలీసు అధికారులకు కేంద్ర ప్రభుత్వం ఐపీఎస్ (ఇండియన్ పోలీసు సర్వీసు) హోదా కల్పించింది. ఈ మేరకు కేంద్ర హోం శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2024 సెలెక్ట్ లిస్టుకు సంబంధించి ఎస్.శ్రీనివాస్, కె.గుణశేఖర్, డి.సునీతలకు ఐపీఎస్‌లుగా పదోన్నతి కల్పించింది. ఎస్.శ్రీనివాస్ గతంలో సీఎం భద్రతా విభాగం చీఫ్‌గా పని చేశారు.

ఎల్ఐసీ సొమ్ము అదానీకి ధారాదత్తం: కూనంనేని

హైదరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎల్ఐసీ సొమ్మును పారిశ్రామికవేత్త అదానీకి ధారాదత్తం చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. సోమవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో జరిగిన పార్టీ ప్రజా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద ప్రజలు ఎల్ఐసీకి రూ.33 వేల కోట్ల డిపాజిట్ చేస్తే, ఆదానీ కంపెనీ సంక్షోభంలో ఉందని, దాన్ని ఆదుకునేందుకు ప్రజల డబ్బును ఇస్తున్నారని ఆరోపించారు. మోదీ పాలనలో దేశం తిరోగమనానికి వెళ్లిందన్నారు. అధికారం లేకున్నా పేదల పక్షాన పోరాడే పార్టీ సీపీఐ అని చెప్పారు. డిసెంబరు 26న ఖమ్మం వేదికగా జరిగే సీపీఐ శత వసంతాల ముగింపు సభ చారిత్రక ఘట్టంగా నిలిచిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కమ్యూనిస్టుల పని అయిపోయిందని ప్రచారం చేసే వారి నోళ్లు మూతపడేలా ముగింపు సభ ఉంటుందని చెప్పారు. 40 దేశాల నుంచి కమ్యూనిస్టు ప్రతినిధులు వస్తున్నారని, 5 లక్షల మందితో సభ జరుగుతుందని కూనంనేని పేర్కొన్నారు.

నేటి నుంచి గిరిజన కెనోస్ప్రింట్ జాతీయ పోటీలు

» హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్‌లో నిర్వహణ

హైదరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28 నుంచి 30 వరకూ హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్‌లో జాతీయస్థాయి గిరిజన కెనో స్ప్రింట్ నేషనల్ చాంపియన్ షిప్ - 2025 పోటీలు జరుగుతాయి. భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా జన జాతీయ గౌరవ వర్ష్‌లో భాగంగా కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖ మార్గ దర్శకత్వంలో గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ పోటీలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ లోగో ఆవిష్కరణ

» ఫిర్యాదుల స్వీకరణకు టోల్ ఫ్రీ నంబరు 14432

» నవంబరు 2 వరకు విజిలెన్స్ అవగాహనా వారోత్సవం

హైదరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిక లోగోను విజిలెన్స్ కమిషనర్ ఎంజీ గోపాల్, రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ శిఖా గోయల్ ఆవిష్కరించారు. విజిలెన్స్ అవగాహనా వారోత్సవం సందర్భంగా బీఆర్‌కే భవన్‌లో సోమవారం సంస్థ లోగోను ఆవిష్కరించారు. ప్రజా సేవలో నిజాయితీ, పారదర్శకత, బాధ్యతను ప్రతిబింబించేలా నూతన లోగోను రూపొందించారు. ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు టోల్ ఫ్రీ నంబరు 14432తోపాటు సోషల్ మీడియా వేదికలు ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌ల్లో ఖాతాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ కమిషనర్ ఎంజీ గోపాల్ మాట్లాడుతూ సమిష్టి బాధ్యతతో నిజాయితీని పెంపొందించుకోవడం అవసరమన్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ శిఖా గోయల్ మాట్లాడుతూ.. తప్పులు జరక్కుండా నివారించడమే విజిలెన్స్ అని చెప్పారు.

పీజీఎల్‌సెట్ ప్రవేశాల షెడ్యూల్ విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): టీజీ పీజీఎల్‌సెట్-2025 (ఎల్ఎల్ఎం) కోర్సుల రెండో, తుది దశ ప్రవేశాల షెడ్యూల్‌ను కన్వీనర్ జె.పాండురంగారెడ్డి సోమవారం విడుదల చేశారు. ఫేజ్-1లో నమోదు కాని అభ్యర్థులు ఈనెల 28-30వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లింపు, సర్టిఫికెట్ల అప్‌లోడ్ పూర్తి చేయవచ్చని తెలిపారు. 31న అర్హుల జాబితా విడుదల చేస్తామని వివరించారు. కళాశాల వారీగా తాత్కాలికంగా ఎంపికైన అభ్యర్థుల జాబితా నవంబరు 5న వెబ్‌సైట్‌లో ఉంచుతామని తెలిపారు.

మూడేళ్లలోపే జహీరాబాద్ పారిశ్రామిక కారిడార్!

అక్కడ పూర్తిస్థాయి ఉత్పాదక కేంద్రాలు ఏర్పాటవుతాయి.. భారీ పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు సిద్ధం

'ఆంధ్రజ్యోతి'తో జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి సంస్థ చైర్మన్ రజత్ సైనీ

న్యూఢిల్లీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని జహీరాబాద్ పారిశ్రామిక కారిడార్‌లో మూడేళ్లలోపే పూర్తిస్థాయి ఉత్పాదక కేంద్రాలు ఏర్పాటు కానున్నాయని జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి సంస్థ చైర్మన్ రజత్‌కుమార్ సైనీ చెప్పారు. ఈ కారిడార్‌లో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మేకిన్ ఇండియా కలను సాకారం చేయడంలో తెలంగాణ కీలక పాత్ర పోషించనుందని తెలిపారు. సోమవారం ఆయన ఢిల్లీలో 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడారు. రేవంత్ ప్రభుత్వం క్రియా శీలక చర్యలు తీసుకుంటోందన్నారు. త్వరలోనే ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్(ఈపీసీ) కాంట్రాక్ట్ ఖరారవుతుందని, ఆ తర్వాత పెద్దఎత్తున పరిశ్రమలను ఏర్పాటు చేస్తారని చెప్పారు. ప్రధాని మోదీ 'ప్రగతి' పేరిట దాదాపు ప్రతి నెలా దేశవ్యాప్తంగా కారిడార్ల అభివృద్ధిని సమీక్షిస్తుంటారన్నారు. ఈ సమీక్షా సమావేశాలు ఇప్పటికి 50 సార్లు జరిగాయని తెలిపారు. ఏకంగా ప్రధానమంత్రే సమీక్షిస్తున్నారంటే పనులు ఎంత వేగంగా జరుగుతాయో అర్థం చేసుకోవచ్చన్నారు. చిన్నచిన్న సమస్యలు కూడా వెంటనే పరిష్కారం అవుతాయని చెప్పారు. 3,245 ఎకరాల్లో రూ.2361 కోట్లతో చేపడుతున్న ఈ కారిడార్‌లో రూ.10 వేల కోట్లకు పైగా పెట్టుబడులు వస్తాయని సైనీ తెలిపారు. 1.74 లక్షల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఇప్పటికే ఇక్కడ రూ.8285 కోట్ల వ్యయంతో 675 ఎకరాల్లో హ్యూండయ్ గ్లోబల్ ఇన్నోవేషన్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ నెలకొల్పారని తెలిపారు. తెలంగాణ క్యాడర్ అధికారిగా ఈ కారిడార్‌ను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్న ఆసక్తి తనకుందని సైనీ చెప్పారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు వేగంగా తీసుకున్న చర్యల వల్ల కృష్ణపట్నం, ఓర్వకల్, కొప్పర్తి పారిశ్రామిక కారిడార్లు మరో మూడేళ్లలోపే పూర్తి స్థాయిలో ఉత్పాదక కేంద్రాలుగా రూపొందనున్నాయని తెలిపారు. పారిశ్రామికవేత్తలు భారీగా పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్ ప్రభుత్వం ఉన్నంతకాలం ఈకారిడార్లపై దృష్టి సారించలేదని.. టెండర్లకే మూడేళ్ల పట్టిందని చెప్పారు. హైదరాబాద్- బెంగళూరు పారిశ్రామిక కారిడార్ కింద 2621 ఎకరాల్లో అభివృద్ధి చెందుతున్న ఓర్వకల్ నోడ్ ఇతర రెండు పారిశ్రామిక కారిడార్లను అనుసంధానం చేస్తుందని, కృష్ణపట్నం రేవుకు ఈ కారిడార్ ముఖ ద్వారంగా ఉంటుందని సైనీ తెలిపారు.

అట్టహాసం.. అపహాస్యం!

ఆదర్శగ్రామంలో అసంపూర్తిగా ఇందిరమ్మ ఇళ్లు.. అ'ధనం'గా 2 లక్షలిచ్చినా.. పునాదులకే పరిమితం

» లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంట్రాక్టర్లు

చంద్రుగొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సొంత గూడు కోసం నిరీక్షిస్తున్న రాష్ట్రంలోని నిరుపేదలకు కొండంతా భరోసా నింపేలా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మొదలు పెట్టిన కార్యక్రమం ఇందిరమ్మ ఇండ్లు. అందులోనూ.. పూర్తిస్థాయిలో గిరిజన గ్రామమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బెండాలపాడు గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో పైలట్ ప్రాజెక్టుగా గుర్తించింది. తొలివిడతలో భాగంగా 310 ఇళ్లను మంజూరు చేసింది. అంతేకాకుండా ముఖ్యమంత్రి స్వయంగా లబ్ధిదారులతో కలిసి సాముహిక గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సీఎం చేతుల మీదుగా అట్టహాసంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రస్తుతం ఆ గ్రామంలో అపహాస్యంగా మారింది. అక్కడ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ఊపందుకోవడం లేదు. ముఖ్యమంత్రి పర్యటన సమయానికి 74 ఇళ్ల స్లాబులు పూర్తి కాగా.. నేటికీ అదే పరిస్థితి ఉందని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టాలంటే ఎంతో కొంత మొత్తంలో అయినా డబ్బు అవసరం. ఇంటి నిర్మాణం చేపట్టాక బిల్లులు వస్తాయో.. రావో అన్న ఆందోళనలో ఉన్న లబ్ధిదారులకు కాంట్రాక్టర్లతో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయిస్తామని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సహా పలువురు ఉన్నతాధికారులు హామీలు ఇచ్చారు. అయితే ముఖ్యమంత్రి పర్యటన వరకు ఆ గ్రామంలో ఇళ్ల నిర్మాణం చకచకా సాగిపోయింది. కానీ ఆ తర్వాత పట్టించుకునే నాథుడే కరువైన పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న రీతిలో ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయి.



బెండాలపాడులో కాంట్రాక్టుకు తీసుకుని వదిలేసిన పునాదుల్లో ఉన్న నిర్మాణం

పాత మరుగుదొడ్లకు రంగులద్ది ముఖ్యమంత్రికే మస్కా

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి బచ్చల రమణ, బచ్చల నర్సమ్మ అనే ఇద్దరు లబ్ధిదారల ఇళ్లను అధికారులు ఎంపిక చేశారు. అయితే ఆ ఇళ్ల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టరు తూతూమంత్రంగా ఇళ్లను పూర్తి చేసినట్లు ప్రకటించి.. ఆ మేరకు సీఎంతో ప్రారంభింపచేశారు. ఆ రెండు ఇళ్లు నేటికీ అసంపూర్తిగానే ఉండడం గమనార్హం. బచ్చల రమణకు సంబంధించి గతంలో నిర్మించిన పాత మరుగుదొడ్డికి రంగులు అద్దగా... నరసమ్మ మరుగుదొడ్డి నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. ఇళ్ల నిర్మాణం చేసుకోలేని వారికి కాంట్రాక్టర్‌తో కట్టిస్తామని ప్రభుత్వ పెద్దలు, అధికారులు చెప్పిన మాటలు నమ్మి.. ఉన్న ఇళ్లను తొలగించి, నిర్మాణ పనులు చేపట్టామని లబ్ధిదారులు వాపోయారు. ప్రభుత్వం ఇచ్చే రూ. 5లక్షలకు అదనంగా రూ. 2 లక్షలు ఇస్తేనే నిర్మాణం సాధ్యమవుతుందని కాంట్రాక్టర్లు మొండికేయడంతో.. చేసేదేమీ లేక కొందరు లబ్ధిదారులు ముందుకొచ్చి ఆ కాంట్రాక్టర్లు అడిగినంతా చెల్లించారు. కానీ, పునాదుల వద్దే పనులు నిలిపేసి కాంట్రాక్టర్లు ఇబ్బందులకు గురిచేస్తున్నారని సున్నం సరస్వతి అనే లబ్ధిదారు ఆవేదన వ్యక్తం చేస్తోంది. ప్రస్తుతం బిల్లులు చెల్లింపుల్లో జాప్యం.. ఇళ్లు నిర్మిస్తున్న వారి అగచాట్లు చూస్తుంటే.. కొత్తగా ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు భయపడుతున్నామని మరికొందరు లబ్ధిదారులు చెబుతున్నారు.

తెలంగాణ సహా 4 రాష్ట్రాల నుంచి

పప్పు ధాన్యాలు, నూనె గింజల సేకరణ

15వేల కోట్లు కేటాయించిన కేంద్రం

న్యూఢిల్లీ, అక్టోబరు 27: తెలంగాణ సహా నాలుగు రాష్ట్రాల నుంచి పప్పుధాన్యాలు, నూనె గింజలు సేకరించాలని సోమవారం కేంద్రం నిర్ణయించింది. ఇందుకు రూ.15వేలకోట్లు కేటాయించింది. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా నుంచి పెసలు, మినుములు, కందులు, నూనె గింజలైన సోయాబీన్ సేకరణకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రూ.15,095.53 కోట్లు కేటాయించారంటూ అధికారిక ప్రకటన వెలువడంది. ఆయా రాష్ట్రాల వ్యవసాయ మంత్రులు, ఉన్నతాధికారులతో వర్చువల్ విధానంలో చర్చలు జరిపిన అనంతరం ప్రధానమంత్రి అన్నదాత ఆయ్ సంరక్షణ్ అభియాన్ (పీఎం-ఆశా) కింద ఈ నిధులు కేటాయించారు. తెలంగాణ నుంచి 4,430 టన్నుల పెసలు సేకరించనున్నారు. రాష్ట్రంలో ఉత్పత్తయ్యే పంటలో 25 శాతానికి ఇది సమానం. ఇందుకోసం ప్రైస్ సపోర్ట్ స్కీం (పీఎస్ఎస్) కింద రూ.38.44 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో పండే మొత్తం మినుములను 100 శాతం మేర కేంద్రం సేకరించనుంది. సోయాబీన్ సేకరణలో 25 శాతం తెలంగాణ నుంచే ఉండనుంది. ఒడిశాలో పండే మొత్తం కందులు 18,470 టన్నుల మేర కొనుగోలు చేయనుంది. మహారాష్ట్రలో పీఎస్ఎస్ పథకం కింద పెసలు, మినుములతో పాటు 18,50,700 టన్నుల సోయాబీన్‌ను సేకరించనుంది. సోయాబీన్ కోసం రూ.9,860.33 కోట్లు కేటాయించింది. మధ్యప్రదేశ్‌లో ప్రైస్ డిఫిసియన్సీ పేమెంట్ స్కీం (పీడీపీఎస్) కింద రూ.1,775.53 కోట్ల వ్యయంతో 22,21,632 టన్నుల సోయాబీన్‌ను సేకరించనుంది. రైతులకు ఆదాయం, గౌరవం లభించేలా ధరలు చెల్లిస్తామని మంత్రి చౌహాన్ చెప్పారు. నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్‌ల ద్వారా వీటిని సేకరించనున్నారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

సమంత మా ఇంటి బంగారం



సమంత అభిమానులకు ఆనందం కలిగించే వార్త ఇది. తన సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్‌లో కొత్త సినిమాని ప్రారంభించినట్లు సమంత ప్రకటించారు. ఈ చిత్రానికి 'మా ఇంటి బంగారం' అనే టైటిల్‌ని ఖరారు చేశామని, సన్నిహితులు, శ్రేయోభిలాషుల ఆత్మీయ కలయిక, ఆశీర్వాదాలతో ప్రాజెక్టు మొదలైందని పేర్కొన్నారు. ఈ చిత్రంలో సమంత, దిగంత్, గుల్షన్ దేవయ్య తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సీనియర్ నటి గౌతమి, మంజుషా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. నందినీ రెడ్డి దర్శకత్వం వహిస్తుండగా, సమంత, రాజ్ నిడుమోరు, హిమాంక్ దువ్వూరు నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే సినిమా షూటింగ్ ప్రారంభమైందని, మరిన్ని వివరాలను త్వరలోనే తెలియజేస్తామని మేకర్స్ తెలిపారు. బ్లాక్‌బస్టర్ హిట్ 'ఓ బేబీ' తర్వాత సమంత, నందినీ రెడ్డి కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రమిది.

పునరాగమనం ఆనందాన్నిస్తోంది



"బ్రహ్మ' సినిమా తర్వాత 'జటాధర'తో తెలుగు చిత్రపరిశ్రమలోకి తిరిగి అడుగుపెట్టడం చాలా ఆనందంగా ఉంది. ఇందులో డబ్బుపై అత్యాశ ఉండే శోభ అనే మహిళ పాత్రలో నటించాను. ఎలాగైనా సరే ధనవంతురాలిని అవ్వాలనే క్యారెక్టర్ ఇది. అంతేకాదు సినిమాలో నాది కీలకమైన పాత్ర కూడా' అని చెప్పారు శిల్పా శిరోద్కర్. సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రధారులుగా దర్శకద్వయం వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కించిన చిత్రమిది. ఈ సినిమాలో శిల్పా శిరోద్కర్ కీలక పాత్రలో కనిపించనున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంస్థలు సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ఉమేశ్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింఘాల్, నిఖిల్ నందా నిర్మించారు. నవంబరు 7న తెలుగు, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా శిల్పా శిరోద్కర్ మీడియాతో చిత్ర విశేషాలు పంచుకున్నారు.

● సుధీర్ బాబుతో కలసి పనిచేయడం గొప్ప అనుభవం. ఆయన ఎంతో అంకితభావంతో ఈ ప్రాజెక్టును పూర్తి చేశారు. నేటి తరం నటుల నుంచి చాలా నేర్చుకోవచ్చు.


● సుధీర్ బాబు మాకు బంధువే అయినప్పటికీ సెట్‌లో మేమిద్దరం ప్రొఫెషనల్‌గానే ఉండేవాళ్లం. మహేశ్ బాబుగారు ఈ చిత్రం ట్రైలర్‌ని ఆవిష్కరించడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఆయన పరిశ్రమలోకి నన్ను ఆహ్వానించడం చెప్పలేనంత సంతోషం కలిగించింది.

● గతంతో పోల్చితే, తెలుగు చిత్ర పరిశ్రమ చాలా అభివృద్ధి చెందింది. కంటెంట్ పరంగా, టెక్నికల్ పరంగా చాలా అడ్వాన్స్ అయ్యాము.

● 'జటాధర' ఒక సూపర్ నేచురల్ థ్రిల్లర్. ఇందులో అద్భుతమైన సన్నివేశాలు ఉంటాయి. భావోద్వేగాలు కూడా అంతే అద్భుతంగా పండాయి. మంచి సంగీతం ఉంది. ఒక్క మాటలో చెప్పాలంటే అన్ని వర్గాల ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే చిత్రమిది.

● వెంకట్, అభిషేక్ మంచి క్లారిటీ ఉన్న దర్శకులు. నటీ, నటుల నుంచి ఎం కావాలో వాళ్లకి తెలుసు. నాకు రొమాంటిక్ కామెడీలు అంటే చాలా ఇష్టం. మంచి సినిమాలు చేయడమే నా కల.

నేను వచ్చినాక ఒక్కటే జోన్



మాస్ మహారాజా రవితేజ అభిమానులతో పాటు అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'మాస్ జాతర' ట్రైలర్ వచ్చేసింది. రవితేజ అభిమానులు ఆశించే అసలు, సిసలైన మాస్ వేడుకలా ట్రైలర్ ఉంది. భారీ యాక్షన్ సన్నివేశాలు, పంచ్ డైలాగులు అదిరిపోయాయి. "ఇన్నాళ్లు నువ్వు నా లిమిట్‌లోకి రాక నీ దందా నడిచింది.

నేను రైల్వే పోలీస్ కాదు... క్రిమినల్ పోలీస్.. రైల్వేలో ఈస్ట్ జోన్, వెస్ట్ జోన్, నార్త్ జోన్, సౌత్ జోన్‌లు ఉంటాయి.. నేను వచ్చినాక ఒక్కటే జోన్.. వార్ జోన్" అనే రవితేజ పవర్‌ఫుల్ డైలాగ్స్ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చాయి. కథానాయకుడు, ప్రతి నాయకుడి మధ్య ఉత్కంఠభరితమైన సంఘర్షణ నేపథ్యంలో ట్రైలర్‌ని రూపొందించిన తీరు ఆకట్టుకుంటోంది. వాణిజ్య అంశాలతో నిండిన పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రానికి హామీ ఇచ్చేలా 'మాస్ జాతర' ట్రైలర్ ఉంది. నవీన్‌చంద్ర మరోసారి శక్తిమంతమైన ప్రతినాయకుడి పాత్రలో కనిపించారు. ఈ చిత్రంలో శ్రీలీల కథానాయికగా నటించారు. భాను భోగవరపు తెరకెక్కించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బేనర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈనెల 31న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

మంచి మ్యూజికల్ హిట్ అవుతుంది

\- సురేశ్ బాబు



'సినిమాపై ప్రేమతో మధుర శ్రీధర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నుంచి నిర్మాతగా మారారు. ఆయన ప్రయత్నం ఎప్పుడూ విఫలమవలేదు. 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమా పాటలు బాగున్నాయి. ఈ సినిమా మంచి మ్యూజికల్ హిట్ కావాలి' అని ఆకాంక్షించారు నిర్మాత సురేశ్ బాబు. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా సంజీవ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రమిది. మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బేనర్లపై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. నవంబరు 14న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన వేడుకలో 'తెలుసా నీ కోసమే...' అంటూ సాగే గీతాన్ని నిర్మాత సురేశ్ బాబు ఆవిష్కరించారు. దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ 'సందేశం ఇచ్చేలా చిత్ర కథ ఉండదు. ఆద్యంతం వినోదాత్మకంగానే సాగుతుంది' అని చెప్పారు. మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమాలో తరుణ్ భాస్కర్, వెన్నెల కిశోర్, అభినవ్ మంచి పాత్రలు పోషించారు' అని అన్నారు.

సరికొత్త ప్రేమ కథ



దేవన్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తోన్న సూపర్ నేచురల్ లవ్ స్టోరీ 'కృష్ణ లీల'. ధన్యబాలకృష్ణన్ కథానాయిక. బేబీ వైష్ణవి సమర్పణలో మహాసేన్ విజువల్స్ బేనర్‌పై జ్యోత్స్న జి నిర్మిస్తున్నారు. సోమవారం నిర్వహించిన వేడుకలో మేకర్స్ ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత సురేశ్ బాబు మాట్లాడుతూ 'అనిల్ చాలా అద్భుతంగా కథ రాశారు. తప్పకుండా సినిమా విజయవంతం అవుతుంది' అని ఆకాంక్షించారు. మాజీ సీబీఐ అధికారి జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 'యువత ఏది చేసినా ప్యాషన్‌తో చేయమని చెబుతుంటాను. దేవన్‌ని చూసిన తర్వాత ఎలాగైనా అతన్ని సపోర్ట్ చేయాలనిపించింది. ఈ సినిమా గొప్ప విజయం సాధించాలని కోరుకుంటున్నా' అని అన్నారు. దేవన్ మాట్లాడుతూ 'నిజాయితీగా సినిమా తీస్తే అందరూ సపోర్ట్ చేస్తారని 'కృష్ణ లీల' మరోసారి రుజువు చేసింది' అని చెప్పారు.

విడుదల ఖరారు



అల్లరి నరేశ్, డాక్టర్ కామాక్షి భాస్కర్ల జంటగా నటించిన '12ఏ రైల్వే కాలనీ' సినిమా విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు. ఈమేరకు నవంబరు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు తెలియజేస్తూ రిలీజ్ డేట్ పోస్టర్‌ని విడుదల చేశారు. ఈ చిత్రంతో నాని కాసరగడ్డ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బేనర్‌పై శ్రీనివాసా చిట్టూరి నిర్మించారు.

ముంబైలో ఏఐ చలనచిత్రోత్సవాలు

ఇప్పటివరకూ మనం ఎన్నో చలనచిత్రోత్సవాలను చూశాం. త్వరలో పూర్తిగా ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాంకేతికతతో రూపొందిన సినిమాలతో ఓ చలనచిత్రోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమానికి ముంబై వేదిక కాబోతోంది. ఇండియాలోనే అతి పెద్ద ఏఐ ఫిల్మ్ హ్యాకథాన్ ఈ నెల 31 నుంచి నవంబర్ 2 వరకూ మూడు రోజుల పాటు జరగనుంది. లోకల్ హోస్ట్ అనే సంస్థ నిర్వహిస్తోన్న ఈ పోటీలో భారతదేశం నలుమూలల నుంచీ, ప్రపంచవ్యాప్తంగా ఎంపికైన 50 మంది విడివిడిగా, బృందాలుగా పాల్గొంటారు. పోటీదారులు 48 గంటల్లో ఏఐ సాయంతో లఘు చిత్రాలను రూపొందించాల్సి ఉంటుంది. జోయా అక్తర్, కునాల్ కపూర్, షాకూన్ బాత్రా లాంటి పలువురు బాలీవుడ్ ప్రముఖులు జ్యూరీలో సభ్యులుగా ఉన్నారు. విజేతలకు పురస్కారాలతో పాటు రూ. 10 లక్షల నగదు బహుమతి అందజేస్తారు. నవంబర్ 2న రాయల్ ఒపేరా హౌస్‌లో రెడ్ కార్పెట్ ఈవెంట్‌ను ఏర్పాటు చేసి, ఏఐ చిత్రాల ప్రీమియర్ స్క్రీనింగ్, అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి పలువురు బాలీవుడ్ నటీనటులు, సాంకేతిక నిపుణులు హాజరవనున్నారు. ఏఐ సాయంతో ఎవరైనా తమ కథను సినిమాగా మలచవచ్చు, ఒక సినిమాకు అవసరమైన కథను, కథనాన్ని అభివృద్ధి చేయడానికి ఏఐ టూల్స్‌ను ఎంత వినూత్నంగా, ప్రభావవంతంగా ఉపయోగించుకోగలం అనేది తెలుసుకోవడం ఈ పోటీల ముఖ్య ఉద్దేశం అని లోకల్ హోస్ట్ సంస్థ తెలిపింది.

బిజినెస్
వరంగల్ ● మంగళవారం 28 అక్టోబరు 2025

'సుప్రీం'లో వొడాఫోన్‌కు ఊరట

ఏజీఆర్‌లపై కేంద్రానికి స్వేచ్ఛ

న్యూఢిల్లీ: పీకల్లోతు అప్పులు, నష్టాలతో కునారిల్లుతున్న వొడాఫోన్ ఐడియాకి సోమవారం సుప్రీంకోర్టులో పెద్ద ఊరట లభించింది. 2016-17 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కంపెనీ చెల్లించాల్సిన రూ.5,606 కోట్ల సర్దుబాటు చేసిన స్థూల ఆదాయ (ఏజీఆర్) నిర్ణయ అంశాన్ని సర్వోన్నత న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వానికి వదిలేసింది. వొడాఫోన్ ఇండియా దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, న్యాయమూర్తి జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వం ఈ ఏజీఆర్ మొత్తాన్ని తిరిగి లెక్కించి, కంపెనీకి ఓదార్పు ప్రకటించేందుకు మార్గం సుగమమైంది. ఈ ఆదేశాలతో సోమవారం బీఎస్ఈలో వొడాఫోన్ ఐడియా షేరు 3.88 శాతం లాభంతో రూ.9.99 వద్ద ముగిసింది.

పుదుచ్చేరిలో ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ఒలెక్ట్రా విద్యుత్ బస్సుల సేవలు ప్రారంభమయ్యాయి. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ (ఓజీఎల్) తయారు చేసిన 25 ఎలక్ట్రిక్ బస్సులను పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కే కైలాశ్‌నాథన్, ముఖ్యమంత్రి రంగసామి జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సులను మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) గ్రూప్ సంస్థ ఈవీట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్.. గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ (జీసీసీ) విధానంలో 12 సంవత్సరాల పాటు నడిపించడంతో పాటు వాటి నిర్వహణను చేపడుతుంది. ఈ ఎలక్ట్రిక్ బస్సులు ఒకసారి చార్జింగ్‌తో 200 కిలోమీటర్ల దూరం వరకు ప్రయాణిస్తాయి.

పీనట్‌బటర్ అండ్ జెల్లీ కంపెనీలో 51% వాటా: హెరిటేజ్ ఫుడ్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ తన ప్రీమియం ఐస్ క్రీమ్స్, డిజర్ట్స్ శ్రేణిని మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా ముంబై కేంద్రంగా పనిచేసే పీనట్‌బటర్ అండ్ జెల్లీ ప్రైవేట్ లిమిటెడ్ ఈక్విటీలో 51 శాతం వాటాను రూ.9 కోట్లకు కొనుగోలు చేస్తోంది. స్కై గేట్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ చేతిలో ఉన్న ఈ వాటా కొనుగోలు కోసం త్వరలోనే ఒప్పందం చేసుకోబోతున్నట్టు హెరిటేజ్ ఫుడ్స్ తెలిపింది. మిగిలిన 49 శాతం వాటా పీనట్‌బటర్ అండ్ జెల్లీ ప్రైవేట్ లిమిటెడ్ ప్రమోటర్ల చేతిలోనే ఉంటుంది.

అయితే వచ్చే ఏడాది మార్చి తర్వాత ఈ కంపెనీ ఈక్విటీలో మరో 20 శాతం వాటాను అప్పటి ధర ప్రకారం కొనుగోలు చేసే అవకాశం ఉంచుకున్నట్టు హెరిటేజ్ ఫుడ్స్ పేర్కొంది. పీనట్‌బటర్ అండ్ జెల్లీ ఆరోగ్యానికి హాని చేయని హై ప్రొటీన్‌తో కూడిన ఐస్ క్రీములు, డిజర్ట్‌ల తయారీలో మంచి పేరుంది. పంచదార లేకుండా సంప్రదాయ తీపి పదార్థాలతో విరిగిన పాల నుంచి తీసే ప్రొటీన్‌తో తయారు చేసే ఈ ఉత్పత్తులను పీనట్‌బటర్.. 'గెట్ ఏ వే' బ్రాండ్ పేరుతో విక్రయిస్తోంది.

ప్రభుత్వ బ్యాంకుల్లోకి 49% విదేశీ పెట్టుబడులు!

ప్రస్తుత 20% పరిమితిని పెంచేందుకు ప్రభుత్వం సన్నాహాలు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో (పీఎస్‌బీ) విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) పరిమితిని 49 శాతానికి పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ పెట్టుబడుల పరిమితి అంశాన్ని కేంద్ర ఆర్థిక శాఖ ప్రతిపాదించిందని.. దీనిపై భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ)ను కూడా అభిప్రాయం కోరినట్లు సీనియర్ ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు. అయితే, ఈ ప్రతిపాదన ఇంకా కొలిక్కి రావాల్సి ఉందన్నారు. ప్రస్తుతం పీఎస్‌బీల్లో విదేశీ పెట్టుబడుల పరిమితి 20 శాతంగా ఉంది. అంటే, ఈ పరిమితిని రెట్టింపునకు పైగా పెంచాలని కేంద్రం యోచిస్తున్నది. కాగా, ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో ప్రస్తుతం 74 శాతం వరకు విదేశీ పెట్టుబడులకు అనుమతి ఉన్న సంగతి విదితమే.

మరిన్ని విదేశీ పెట్టుబడులకు అనుమతివ్వడం ద్వారా దేశంలో పెరుగుతున్న రుణ డిమాండ్‌కు అనుగుణంగా పీఎస్‌బీలు మూలధన నిధులు సమకూర్చుకోగలుగుతాయని కేంద్రం భావిస్తోంది. ఈ పరిమితిని గణనీయంగా పెంచినప్పటికీ, కనీసం 51 శాతం వాటా కలిగి ఉండటం ద్వారా పీఎస్‌బీలపై నియంత్రణాధికారాలను మాత్రం ప్రభుత్వం కలిగి ఉండనుంది. ఈ సెప్టెంబరు 30 నాటికి విదేశీ పెట్టుబడులు అత్యధికంగా కెనరా బ్యాంక్‌లో 12 శాతంగా ఉండగా.. అత్యల్పంగా యూకో బ్యాంక్‌లో దాదాపు సున్నాగా ఉన్నాయి.



12 పీఎస్‌బీలు.. రూ.171 లక్షల కోట్ల ఆస్తులు

భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ), కెనరా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్ సహా దేశంలో డజను పీఎస్‌బీలున్నాయి. ఈ మార్చి నాటికి ఈ డజను పీఎస్‌బీల ఆస్తుల మొత్తం విలువ దాదాపు 1.95 లక్షల కోట్ల డాలర్లు. అంటే, మన కరెన్సీలో సుమారు రూ.171 లక్షల కోట్లు. దేశీయ బ్యాంకింగ్ రంగ మొత్తం ఆస్తుల్లో 55 శాతానికి సమానమిది.

దేశీ బ్యాంకులపై అమితాసక్తి

గడిచిన కొన్నేళ్లలో దేశీయ బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగంపై విదేశీ ఇన్వెస్టర్ల ఆసక్తి గణనీయంగా పెరిగింది. ప్రైవేట్ బ్యాంకింగ్ రంగంలోకి ఈ మధ్య కాలంలో వచ్చిన భారీ పెట్టుబడులే ఇందుకు నిదర్శనం. ప్రపంచంలో అతిపెద్ద ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజర్ బ్లాక్‌స్టోన్ గ్రూప్.. కేరళకు చెందిన ఫెడరల్ బ్యాంక్‌లో 9.99 శాతం వాటాను రూ.6,196 కోట్లకు దక్కించుకుంది. గల్ఫ్ ప్రాంత బ్యాంకింగ్ దిగ్గజం ఎమిరేట్స్ ఎన్‌డీబీ.. ఆర్‌బీఎల్ బ్యాంక్‌లో 60 శాతం వాటాను రూ.26,853 కోట్లకు చేజిక్కించుకుంది. యెస్ బ్యాంక్‌లో 20 శాతం వాటాను జపాన్‌కు చెందిన సుమిటోమో మిత్సుయి బ్యాంకింగ్ కార్పొరేషన్ (ఎస్ఎంబీసీ) రూ.13,483 కోట్లకు కొనుగోలు చేసింది. ఈ మధ్యనే తన వాటాను మరో 5 శాతం మేర పెంచుకుంది. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజాలైన వార్‌బర్గ్ పింకస్, అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ) కలిసి రూ.7,500 కోట్ల పెట్టుబడులు పెట్టాయి.

కాగా, గడిచిన కొన్నేళ్లలో మొండి బకాయిలు గణనీయంగా తగ్గడంతో పాటు ప్రైవేట్ బ్యాంకులకు దీటుగా లాభాలు ఆర్జిస్తుండటంతో ప్రభుత్వ బ్యాంకుల్లోనూ పెట్టుబడులకు విదేశీ ఇన్వెస్టర్ల ఆసక్తి పెరుగుతోంది. వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ప్రభుత్వ బ్యాంకింగ్ రంగాన్ని బలోపేతం చేయాలని కేంద్రం భావిస్తోంది. అందులో భాగంగా బ్యాంకింగ్ రంగంలో మరిన్ని సంస్కరణలు చేపట్టేందుకు కసరత్తు జరుగుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

పెట్రో ఎగుమతులను మించనున్న ఎలక్ట్రానిక్స్

ఐఫోన్ల ఎగుమతులతో మరింత దన్ను

న్యూఢిల్లీ: భారత్ నుంచి ఎలక్ట్రానిక్ వస్తువులు, ఉపకరణాల ఎగుమతులు శరవేగంతో పెరుగుతున్నాయి. గత మూడేళ్లలో దేశం నుంచి వీటి ఎగుమతులు 63 శాతం పెరిగి 2,350 కోట్ల డాలర్ల నుంచి 3,850 కోట్ల డాలర్లకు చేరాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లోనూ మన దేశం నుంచి 2,220 కోట్ల డాలర్ల విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు, ఉపకరణాలు ఎగుమతయ్యాయి. ఇందులో సగానికిపైగా వాటా యాపిల్ ఐఫోన్లదే ఉండడం విశేషం. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే.. ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగుమతి 42 శాతం పెరిగింది. ఇదే వృద్ధి రేటు కొనసాగితే, 2022-23తో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే సరికి వీటి ఎగుమతులు రెట్టింపై పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులను మించి పోతాయని అంచనా.

ఎగుమతుల లక్ష్యం సాధిస్తాం: అమెజాన్ ఇండియా

భారత్ నుంచి 2030 నాటికి లక్ష్యంగా పెట్టుకున్న 8,000 కోట్ల డాలర్ల ఎగుమతి లక్ష్యాన్ని సాధిస్తామని అమెజాన్ ఇండియా ప్రకటించింది. ఇందులో ఇప్పటికే 2,000 కోట్ల డాలర్ల ఎగుమతులు పూర్తి చేసినట్టు అమెజాన్ గ్లోబల్ సెల్లింగ్ ఇండియా ప్రధాన అధికారి శ్రీనిధి కాల్వపూడి చెప్పారు. గత పదేళ్లలో తమ ప్లాట్‌ఫామ్ ద్వారా దేశీయ ఎగుమతిదారులు అంతర్జాతీయ కస్టమర్లకు 75 కోట్లకు పైగా దేశీయ ఉత్పత్తులను విక్రయించినట్టు తెలిపారు.

సీనియర్ సిటిజన్స్ కోసం హైదరాబాద్‌లో రెండు ప్రాజెక్టులు

న్యూఢిల్లీ: సీనియర్ సిటిజన్స్ కోసం హైదరాబాద్‌లో రెండు రెసిడెన్షియల్ ప్రాజెక్టులు ఏర్పాటు కానున్నాయి. కొలంబియా పసిఫిక్‌కు చెందిన సెరీన్ కమ్యూనిటీస్, ప్రతిమ గ్రూప్‌తో కలిసి రూ.400 కోట్లతో ఈ రెండు నివాస ప్రాజెక్టులు చేపడుతున్నాయి. ఇందులో సెరీన్ బిల్వానీ వన్ పేరుతో ఒక హౌసింగ్ ప్రాజెక్టును శంకర్‌పల్లిలో 265 నివాసాలతో ఏర్పాటు చేస్తారు. వీటి ధర ఒక్కోటి రూ.60 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. కాగా రెండో ప్రాజెక్టను త్వరలోనే ప్రకటించనున్నారు.

విజయ మెడికల్ కేర్‌తో న్యూబర్గ్ డయాగ్నోస్టిక్స్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విశాఖపట్నం కేంద్రంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న విజయ మెడికల్ సెంటర్‌తో డయాగ్నోస్టిక్ చెయిన్ న్యూబర్గ్ డయాగ్నోస్టిక్స్ వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం కింద రాబోయే 60 రోజుల వ్యవధిలో ఉభయ సంస్థల సేవలను విజయ మెడికల్ సెంటర్ బ్రాండ్ కింద సమీకృతం చేయనున్నట్టు ప్రకటించాయి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని 18 జిల్లాల్లో ఉభయ సంస్థలు సేవలందిస్తుండగా రాబోయే రెండేళ్లలో మొత్తం 59 జిల్లాలకు సేవలు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. న్యూబర్గ్‌కు చెందిన అనుభవం, నాలుగు దశాబ్దాల విజయ విశ్వసనీయ వారసత్వం రోగులకు సమర్థవంతమైన సేవలందించేందుకు దోహదపడుతాయని పేర్కొన్నాయి. విజయ మెడికల్ ప్రస్తుతం ఏపీలోని 8 నగరాల్లో 18 కేంద్రాల ద్వారా పాథాలజీ, రేడియాలజీ, మాలిక్యులర్ ఇమేజింగ్ సర్వీసులు అందిస్తోంది. కాగా న్యూబర్గ్ తెలుగు రాష్ట్రాల్లోని 10 నగరాల్లో పాథాలజీ లాబ్స్‌తో పాటు కలెక్షన్ సెంటర్లను నిర్వహిస్తోంది.

వచ్చే ఏడాదిలో కొత్త ఆర్ అండ్ డీ కేంద్రం

సాయి లైఫ్ సైన్సెస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ సమీపంలోని శామీర్‌పేట వద్ద ఏర్పాటు చేస్తున్న కొత్త సమగ్ర పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) కేంద్రం వచ్చే ఏడాది సెప్టెంబరు నాటికి పూర్తవుతుందని సాయి లైఫ్ సైన్సెస్ లిమిటెడ్ తెలిపింది. పర్యావరణకు ఏ మాత్రం హాని చేయని రీతిలో లక్ష చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) విస్తీర్ణంలో కంపెనీ ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ కొత్త ఆర్ అండ్ డీ కేంద్రం కోసం కంపెనీ రూ.15 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్టు తెలుస్తోంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,24,480 ▼	1,14,100 ▼	1,69,000 ▼
విజయవాడ	1,25,000 ▼	1,18,000 ▼	1,49,000 ▼
విశాఖపట్నం	1,25,400 ▼	1,14,500 ▼	1,70,000 ▼
రాజమండ్రి	1,24,470 ▼	1,14,100 ▼	1,51,000 ▼
ప్రొద్దుటూరు	1,23,000 ▼	1,13,160 ▼	1,53,000 ▼
ముంబై	1,21,077 ▼	1,10,907 ▼	1,45,031 ▼



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

28వ తేదీ			
హైదరాబాద్	565	విజయవాడ	575
వరంగల్	567	గోదావరి	575
చిత్తూరు	593	విశాఖపట్నం	565
		డజను గుడ్లు రూ. 72	



ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	117	విజయవాడ	123
వరంగల్	117	గుంటూరు	126
కరీంనగర్	117	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	117	చిత్తూరు	112
కర్నూలు	117	నెల్లూరు	117
విశాఖపట్నం	119	అనంతపురం	117
గోదావరి	123		

సెన్సెక్స్ 567 పాయింట్లు అప్

ఇంట్రాడేలో 26,000 ఎగువకు నిఫ్టీ

ముంబై: అమెరికా-చైనా వాణిజ్య ఒప్పందంపై ఆశావహం, యూఎస్ ఫెడ్ రేట్లు మరింత తగ్గవచ్చన్న అంచనాలతో అంతర్జాతీయ మార్కెట్లతో పాటు దేశీయ ఈక్విటీ సూచీలూ సోమవారం లాభాల్లో పయనించాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల కొత్త పెట్టుబడులూ ఇందుకు దోహదపడ్డాయి. ఒక దశలో 720 పాయింట్లు ఎగబాకిన సెన్సెక్స్.. చివరికి 566.96 పాయింట్ల లాభంతో 84,778.84 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 26,000 ఎగువకు చేరిన నిఫ్టీ.. 170.90 పాయింట్ల వృద్ధితో 25,966.05 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 22 రాణించాయి.

● బంగారం, వెండి ధరలు మరింత తగ్గాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం ధర 10 గ్రాములకు రూ.700 తగ్గుదలతో రూ.1,25,900కు దిగివచ్చింది. కిలో వెండి ఏకంగా రూ.4,250 తగ్గి రూ.1,51,250కు పరిమితమైంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 4,015 డాలర్లకు, సిల్వర్ 47.60 డాలర్లకు దిగివచ్చాయి.

లెన్స్‌కార్ట్ ఐపీఓ ధరల శ్రేణి రూ.382-402

కళ్ల జోళ్ల విక్రయ సంస్థ లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ రూ.7,278 కోట్ల పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ఈ నెల 31న ప్రారంభమై నవంబరు 4న ముగియనుంది. ఐపీఓలో విక్రయించే షేర్ల ధరల శ్రేణిని కంపెనీ రూ.382-402గా నిర్ణయించింది.

స్పోర్ట్స్



లిఫ్టర్ ప్రీతిస్మితకు 'రికార్డు' స్వర్ణం

మనామా (బహ్రెయిన్): ఆసియా యూత్ క్రీడల్లో భారత లిఫ్టర్ ప్రీతిస్మిత భోయ్ ప్రపంచ రికార్డుతో పసిడి పతకం సాధించింది. బాలికల 44 కిలోల కేటగిరీలో 16 ఏళ్ల ప్రీతిస్మిత మొత్తం 158 (66+92) కిలోల బరువునెత్తి అగ్రస్థానంలో నిలిచింది. కాగా, క్లీన్ అండ్ జర్క్‌లో 92 కిలోల బరువునెత్తిన భోయ్ యూత్ క్రీడల్లో ప్రపంచ రికార్డుతో పసిడి దక్కించుకోగా.. స్నాచ్‌లో 66 కిలోలు లిఫ్ట్ చేసి రజతం సొంతం చేసుకొంది. చైనా అథ్లెట్ వు జిహోంగ్ 156 (68+88) కిలోలతో రజతం, వియత్నాం లిఫ్టర్ దావో తి యన్ 141 (64+77) కిలోలతో కాంస్యం సాధించారు.

గాయంతో సీజన్ మొత్తానికి సింధు దూరం



న్యూఢిల్లీ: తెలుగమ్మాయి పీవీ సింధు పాదం గాయంతో ఈ సీజన్‌లోని మిగిలిన అన్ని టోర్నమెంట్ల నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించింది. వైద్యుల సలహా మేరకు తగిన విశ్రాంతి తీసుకుంటున్నానని, అందుకే మిగిలిన బీడబ్ల్యూఎఫ్ టోర్నీల్లో ఆడలేకపోతున్నానని తెలిపింది. 'అథ్లెట్ల ప్రయాణంలో గాయాలు సాధారణమే. ఓపికను, సామర్థ్యాన్ని గాయాలు పరీక్షిస్తుంటాయి. తిరిగి బలంగా పునరాగమనం చేస్తా. ప్రస్తుతం వైద్యులు, నిపుణుల పర్యవేక్షణలో చికిత్సతో పాటు అవసరమైన శిక్షణ కూడా తీసుకుంటున్నా' అని సింధు తెలిపింది. ఇక, చివరగా సింధు గత డిసెంబరులో సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ సూపర్ ఓపెన్ టైటిల్ గెలిచింది.

ప్రతీకా రావల్ అవుట్



- జట్టులోకి షఫాలీ వర్మ
- మహిళల వన్డే వరల్డ్‌కప్

న్యూఢిల్లీ: మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో కీలక సెమీఫైనల్‌కు ముందు భారత్‌కు గట్టి ఝలక్ తగిలింది. ఫామ్‌లో ఉన్న ఓపెనర్ ప్రతీకా రావల్ గాయం కారణంగా టోర్నీకి దూరమైంది. ఆమె స్థానంలో మరో ఓపెనర్ షఫాలీ వర్మను తీసుకున్నారు. ఆదివారం బంగ్లాదేశ్‌తో జరిగిన భారత్ చివరి గ్రూప్ మ్యాచ్‌లో ప్రతీకా గాయపడింది. బౌండరీ లైన్ దగ్గర బంతిని ఆపే క్రమంలో కుడి చీలమండ మెలిక పడడంతోపాటు మోకాలికి కూడా గాయమైంది. దీంతో పెవిలియన్‌కు చేరిన రావల్‌ను వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు.

శ్రేయా‌స్‌కు తీవ్ర గాయం

- ప్లీహంలో అంతర్గత రక్తస్రావం
- ఐసీయూలో చికిత్స, అనంతరం ప్రత్యేక వార్డుకు తరలింపు
- సిడ్నీ ఆస్పత్రిలో అయ్యర్





సిడ్నీ: ఆస్ట్రేలియాతో మూడో వన్డేలో తీవ్రంగా గాయపడిన శ్రేయాస్ అయ్యర్ ఆరోగ్యంపై సర్వత్రా ఆందోళన నెలకొంది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో అలెక్స్ క్యారీ క్యాచ్‌ను అందుకుని కింద పడే క్రమంలో అతడి ఎడమ మోచేయి పక్కటెముకలకు బలంగా తాకింది. దీంతో విపరీతమైన నొప్పితో విలవిల్లాడిన శ్రేయాస్ మైదానం వీడాడు. మెరుగైన చికిత్స కోసం వెంటనే అయ్యర్‌ను ఆస్పత్రికి తరలించారు. 'స్కానింగ్ పరీక్షలో పక్కటెముకల వద్ద ప్లీహానికి తీవ్రగాయమై, అంతర్గతంగా రక్తస్రావమైనట్టు కూడా తేలింది. పరిస్థితి విషమించకముందే తనను ఐసీయూలో చేర్చాం. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉండడంతో పాటు వేగంగా కోలుకుంటున్నాడు. బీసీసీఐ వైద్య బృందం కూడా శ్రేయాస్ గాయంపై సిడ్నీ, భారత్‌లోని స్పెషలిస్ట్‌లను నిరంతరం సంప్రదిస్తోంది. టీమ్ డాక్టర్ కూడా శ్రేయాస్‌తో పాటు సిడ్నీ ఆస్పత్రిలోనే ఉండి రోజువారీ పురోగతిని పర్యవేక్షిస్తున్నాడు. వారం రోజులు అబ్జర్వేషన్‌లో ఉంచాలి' అని బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు శ్రేయాస్ ఆరోగ్యంలో పురోగతి కనిపించడంతో సోమవారం అతడిని ఐసీయూ నుంచి డిశ్చార్జి చేసి ప్రత్యేక వార్డుకు మార్చినట్టు సమాచారం.

బరిలోకి ఎప్పుడో?

వన్డే జట్టులో మాత్రమే ఉన్న శ్రేయాస్ అయ్యర్ తిరిగి బరిలోకి ఎప్పుడు దిగుతాడనే సందేహాలు నెలకొన్నాయి. ప్రాథమికంగా శ్రేయా‌స్‌కు మూడు వారాల విశ్రాంతి అవసరముంటుందని భావించారు. కానీ తాజా పరిస్థితుల నేపథ్యంలో తను బ్యాట్ పట్టేందుకు మరింత సమయం పట్టవచ్చని సమాచారం. నవంబరు 30 నుంచి దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్ ఉంది. అప్పటి వరకు కోలుకుంటాడా? అనేది చెప్పలేం. మరోవైపు భారత్‌కు వచ్చాక నేరుగా బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్సీ (సీఓఈ)లో చేరనున్నాడు.

ఆలస్యం అయ్యుంటే..?

శ్రేయాస్ గాయం తీవ్రతను సరిగ్గా అంచనా వేసిన బీసీసీఐ వైద్య బృందం అతడిని పెనుప్రమాదం నుంచి తప్పించింది. లేకుంటే పరిస్థితి విషమంగా మారేది. మైదానం నుంచి పెవిలియన్‌కు రాగానే అయ్యర్ గాయాన్ని మెడికల్ సిబ్బంది, ఫిజియో పరిశీలించారు. అంతలోనే అతను స్పృహ కోల్పోవడంతో ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ఆస్పత్రికి తరలించారు. లేనిపక్షంలో క్రికెటర్ ప్రాణాల మీదికి వచ్చివుండేదని బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. రక్తస్రావం ఆగకపోతే ఇన్‌ఫెక్షన్ ప్రమాదం ఉంటుంది కాబట్టి ఐసీయూలోనే రెండు రోజుల పాటు ఉంచారు. ప్రస్తుతం వేగంగా కోలుకుంటున్న శ్రేయా‌స్‌కు అండగా సిడ్నీలోని అతడి స్నేహితులు ఆస్పత్రిలోనే ఉన్నారు. అలాగే తల్లిదండ్రులు సైతం వీసా ప్రక్రియ పూర్తికాగానే ఆస్ట్రేలియాకు పయనం కానున్నారు. పూర్తిగా కోలుకున్న తర్వాతే అయ్యర్‌ను భారత్‌కు పంపాలనే ఆలోచనలో బోర్డు ఉంది.

ఫైనల్లో దబాంగ్ ఢిల్లీ



న్యూఢిల్లీ: దబాంగ్ ఢిల్లీ ప్రొ కబడ్డీ (పీకేఎల్) సీజన్-12లో ఫైనల్లోకి ప్రవేశించింది. సోమవారం హోరాహోరీగా జరిగిన క్వాలిఫయర్-1లో ఢిల్లీ-పుణెరి పల్టన్ జట్లు నిర్ణీత సమయం ముగిసేసరికి 34-34తో సమంగా నిలవడంతో మ్యాచ్ టైగా ముగిసింది. ఫలితం తేల్చేందుకు టైబ్రేకర్ నిర్వహించగా ఢిల్లీ 6-4తో పుణెరిను ఓడించి ఫైనల్ బెర్త్‌ను సొంతం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో ఓడిన పుణెరి జట్టు మంగళవారం జరిగే ఎలిమినేటర్-3లో గెలిచిన జట్టుతో బుధవారం జరగనున్న క్వాలిఫయర్-2లో తలపడనుంది. అంతకుముందు జరిగిన ఎలిమినేటర్-2లో పట్నా పైరేట్స్ 46-37తో బెంగళూరు బుల్స్‌ను ఓడించింది. ఆట ద్వితీయార్థంలో బెంగళూరు రైడర్ శుభమ్ ఒకే రైడ్‌లో ఏడు పాయింట్లు సాధించి పీకేఎల్‌లో సరికొత్త రికార్డు నెలకొల్పాడు. మంగళవారం జరిగే ఎలిమినేటర్-3 మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్‌తో పట్నా ఆడుతుంది.

7 నెలల గర్భవతి..145 కిలోలు ఎత్తి!

ఢిల్లీ కానిస్టేబుల్ అరుదైన ఘనత



న్యూఢిల్లీ: సంకల్ప బలం ఉండాలేగానీ.. సాధ్యం కానిదేమీలేదని ఓ కానిస్టేబుల్ నిరూపించింది. ఏడు నెలల గర్భిణి అయినా.. పోటీల్లో పాల్గొని ఏకంగా 145 కిలోల బరువునెత్తి ఔరా అనిపించింది. అమరావతిలోని విట్ విశ్వవిద్యాలయంలో జరిగిన అఖిల భారత పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్‌లో ఢిల్లీ కానిస్టేబుల్ సోనికా యాదవ్ ఈ ఫీట్ చేసింది. పవర్ లిఫ్టింగ్‌లోని స్క్వాట్స్‌లో 125 కిలోలు ఎత్తిన సోనిక.. బెంచ్ ప్రెస్‌లో 80 కిలోలు, డెడ్ లిఫ్ట్‌లో 145 కిలోలు ఎత్తి కాంస్యం సాధించింది. లూసీ మార్టిన్స్ అనే లిఫ్టర్ గర్భిణిగా ఇలాంటి ఫీట్ చేసినట్టు తాను నెట్‌లో వెదికి తెలుసుకొన్నట్టు యాదవ్ చెప్పింది. సోషల్ మీడియాలో మార్టిన్స్‌ను వెదికి ఆమె సూచనలు, సలహాలతో సాధన చేసినట్టు తెలిపింది. ప్రతి విషయంలోనూ డాక్టర్ల సలహాలను పాటించినట్టు పేర్కొంది.

రంజీలకు వర్షం దెబ్బ

- 25 ఓవర్లే సాధ్యమైన హైదరాబాద్ మ్యాచ్
- ఆంధ్ర ఆటలో ఒక్క బంతీ పడని వైనం

పుదుచ్చేరి: తెలుగు రాష్ట్రాల రంజీ మ్యాచ్‌ల మూడోరోజు వరుణుడు అడ్డు తగిలాడు. దీంతో పుదుచ్చేరితో హైదరాబాద్, బరోడాతో ఆంధ్ర జట్లు తలపడుతున్న మ్యాచ్‌లు డ్రా దిశగా సాగుతున్నాయి. కేవలం 25 ఓవర్లపాటు సాగిన మూడో రోజు ఆటలో పున్నయ్య (3/10)తోపాటు మిగతా బౌలర్లు రాణించడంతో.. గ్రూప్-డిలో పుదుచ్చేరితో రంజీలో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దిశగా సాగుతోంది. ఓవర్‌నైట్ స్కోరు 25/1తో ఆట కొనసాగించిన పుదుచ్చేరి 92/8తో కష్టాల్లో పడింది. హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 435 పరుగులు చేసింది. కాగా, వర్షం కారణంగా గ్రూప్-ఎలో ఆంధ్ర-బరోడా మధ్య ఆట పూర్తిగా తుడిచిపెట్టుకు పోయింది. బరోడా తొలి ఇన్నింగ్స్‌లో 363 పరుగులు సాధించగా.. ఆంధ్ర 43/2 స్కోరు చేసింది. ఈ మ్యాచ్ విజయనగరంలో జరుగుతోంది.

సుజీత్ పసిడిపట్టు



అండర్-23 వరల్డ్ రెజ్లింగ్

నోవి సాడ్ (సెర్బియా): అండర్-23 వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత రెజ్లర్ సుజీత్ కల్కల్ స్వర్ణం సాధించాడు. సోమవారం జరిగిన పురుషుల 65 కిలోల ఫైనల్లో కల్కల్ 10-0తో ఉమిడ్‌జోన్ జలోలోవ్ (ఉజ్బెకిస్థాన్)పై విజయం సాధించాడు. 4 నిమిషాల 53 సెకన్లపాటు సాగిన బౌట్‌లో ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన కల్కల్ టెక్నికల్ సుపీరియారిటీతో గెలిచాడు. ఈ క్రమంలో అండర్-23లో వరల్డ్ టైటిల్ నెగ్గిన నాలుగో భారత ఆటగాడిగా నిలిచాడు. ఇదే టోర్నీలో గతేడాది కాంస్యం దక్కించుకొన్న కల్కల్.. ఈసారి పసిడి పతకాన్ని ముద్దాడాడు. 2022, 2025లో అండర్-23 ఆసియా టైటిళ్లు సాధించాడు.

బరిలోకి బవుమా



జోహన్నెస్‌బర్గ్: గాయం నుంచి కోలుకున్న దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా భారత పర్యటనకు సిద్ధమయ్యాడు. దీంతో వచ్చే నెల 14 నుంచి భారత్‌లో జరిగే రెండు టెస్టుల సిరీస్‌కు అతడి నాయకత్వంలో జట్టు బరిలోకి దిగనున్నట్టు క్రికెట్ దక్షిణాఫ్రికా (సీఎస్ఏ) సోమవారం ప్రకటించింది. కోల్‌కతా, గువాహటిలో ఈ టెస్టులు జరుగుతాయి. ఇటీవల పాక్‌తో జరిగిన టెస్టు సిరీస్‌కు గాయం కారణంగా బవుమా దూరమయ్యాడు. ఆ సిరీస్‌లో పాల్గొన్న మెజారిటీ ఆటగాళ్లనే భారత పర్యటనకు ఎంపిక చేశారు. అంతకన్నా ముందు నవంబరు 2 నుంచి భారత్ 'ఎ' టీమ్‌తో దక్షిణాఫ్రికా ఆడనుంది.

జట్టు: బవుమా (కెప్టెన్), మార్‌క్రమ్, రికెల్టన్, స్టబ్స్, వెరీనె, బ్రెవిస్, హమ్జా, డి జోర్జి, బాష్, ముల్డర్, జాన్సెన్, కేశవ్, ముత్తుస్వామి, రబాడ, హార్మర్.

మద్రాస్ ఐఐటీ జేవీకే కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ బాధ్యత!

» ప్రభుత్వం సూత్రప్రాయ నిర్ణయం

హైదరాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు డిజైన్లతో పాటు సమగ్ర పునరుద్ధరణ ప్రణాళికను అందించే బాధ్యతను మద్రాసు ఐఐటీతో ఒప్పందం చేసుకున్న జాయింట్ వెంచర్‌కే అప్పగించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. బ్యారేజీల పునరుద్ధరణ డిజైన్లు సిద్ధం చేసే పనిని ఎన్ఐటీ లేదా ఐఐటీలతో ఒప్పందం చేసుకున్న సంస్థలకే అప్పగించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్దేశించింది. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ కోసం ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ(ఈఓఐ)ను కోరుతూ నోటీసు ఇవ్వగా... ఐదు సంస్థలు టెక్నికల్ బిడ్లు వేశాయి. ఇందులో ఆర్వీ అసోసియేట్స్, ఐఐటీ మద్రాస్, స్పెయిన్‌కు చెందిన సంస్థ కలిపి జాయింట్ వెంచర్‌గా బిడ్‌లు వేశాయి. ఆ తర్వాత నిప్పాన్ సంస్థ కూడా బిడ్ దాఖలు చేసింది. వీటిని షార్ట్‌లిస్ట్ చేసి, సోమవారం ప్రభుత్వానికి అందించగా ఐఐటీ లేదా ఎన్ఐటీతో ఒప్పందం చేసుకున్న సంస్థలనే పరిశీలించాలని స్పష్టం చేసింది. దాంతో మద్రాస్ ఐఐటీ జేవీ చేతికే పని లభించే అవకాశం ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల పునరుద్ధరణ విషయంలో జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీ తుది నివేదికలో చేసిన సిఫారసులకు అనుగుణంగా డిజైన్లు అందించాలని ప్రభుత్వం సూచించింది.

సచివాలయంలో కొత్త నిర్మాణాలు!

హైదరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయ భవనంలో కొత్త నిర్మాణాలు చేపట్టనున్నారు. ఇందుకోసం రోడ్లు, భవనాల శాఖ తాజాగా టెండర్లు ఆహ్వానించింది. సచివాలయంలోని 1, 2, 4వ అంతస్తుల్లోని గది నంబరు-5లో వాష్‌రూమ్ సదుపాయంతో డిప్యూటీ సెక్రటరీల కోసం చాంబర్లు ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఐదు అంతస్తుల్లో ఉన్న గది నంబరు-35లోని అధికారుల చాంబర్లలో వాష్‌రూమ్‌లను నిర్మించనున్నారు. ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు-విద్య) పేషీలో గాజు పలకలతో విడిగా గదిని ఏర్పాటు చేయనున్నారు. ఆరో అంతస్తులోని క్యాబినెట్ హాలు డోర్ ముందు కారిడార్ వద్ద తలుపు, కిటికీ ఏర్పాటు చేయనున్నారు. ఇక ఈ నిర్మాణాల కోసం రూ.39.13 లక్షలు వెచ్చించనున్నారు. అదనంగా జీఎస్టీ, ఇతరత్రా ఫీజులు కలుపుకొంటే రూ.45-50 లక్షల వరకు ఖర్చవుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు.. మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు నివసించే భవనాల మరమ్మతులు, నిర్వహణ వ్యయాల పరిమితిని సర్కారు పెంచింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల భవనాలకు రిపేర్ల వ్యయ పరిమితిని రూ.20 లక్షలకు పెంచగా.. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల భవనాలకు రూ.12 లక్షలు, ఇతర ప్రభుత్వ అధికారులు నివసించే భవనాలకు రూ.7 లక్షలకు పెంచారు.

'పోలీసింగ్‌పై సాంకేతికత ప్రభావం'లో పీహెచ్‌డీ

» ఐజీ రమేశ్‌కు డీజీపీ అభినందనలు

హైదరాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : 'తెలంగాణ రాష్ట్రంలో పోలీసింగ్ పనితీరుపై సాంకేతికత ప్రభావం' అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఐజీ ఎం.రమేశ్ పీహెచ్‌డీ పూర్తి చేసారు. ఈ పరిశోధనా గ్రంథాన్ని బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో సమర్పించారు. రోజువారీ పోలీసింగ్‌కు సంబంధించిన సీసీ టీవీలు, ఏఐ ఆధారిత విశ్లేషణలు, టీఎస్ కాప్, హాక్ ఐ, ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ వంటి సాంకేతిక సాధనాలు, ఫీల్డ్ ఆపరేషన్లు, పారదర్శకత తదితర అంశాల ఆధారంగా చేసిన పీహెచ్‌డీ 'స్మార్ట్ పోలీసింగ్‌'కు రోడ్ మ్యాప్‌గా నిలవనుంది. సాంకేతికతకు సమకాలీన సంబంధం ఉన్న విషయంపై పరిశోధన చేసినందుకు డీజీపీ శివధర్ రెడ్డి ఐజీ రమేష్‌ను అభినందించారు.

కులాల పేరుతో విద్వేషాలు రెచ్చగొడుతున్నారు

» డీజీపీకి ఈబీసీ నాయకుల ఫిర్యాదు

హైదరాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కులాల పేరుతో విద్వేషాలను రెచ్చగొడుతూ కొందరు తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని ఈబీసీ సంక్షేమ సంఘాల జేఏసీ చైర్మన్ వల్లపురెడ్డి రవీందర్‌రెడ్డి డీజీపీ శివధర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. బీసీ రిజర్వేషన్లపై కోర్టు తీర్పు తర్వాత కొందరు తమ కులాలపై తీవ్ర విమర్శలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలను దూషించిన వారిపై అట్రాసిటీ కేసులు పెట్టినట్లే తమను దూషించిన వారిపై కూడా కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు 18కుల సంఘాల నాయకులతో కలిసి డీజీపీకి వినతిపత్రం అందించారు.

ఈడీ ప్రాథమిక నివేదికపై ఏం చేశారు?

» నాగారం భూములపై పోలీసుల వివరణ కోరిన హైకోర్టు

హైదరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నాగారంలో వివాదాస్పద భూముల వ్యవహారంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఇచ్చిన ప్రాథమిక సమాచారం మీద ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేయాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలోని సర్వే నెంబర్ 181, 182లోని భూదాన్ భూములకు తప్పుడు రికార్డులు సృష్టించి అక్రమంగా బదిలీ చేసుకున్నారన్న ఆరోపణలపై విచారణ జరిపిన ఈడీ.. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు చేపట్టాల్సిన అవసరం ఉందని పోలీసులకు తెలిపింది. ఈడీ ఈ సమాచారం ఇచ్చి చాలా రోజులు అవుతున్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ సర్వే నెంబర్ 181లోని భూమిలో యాజమాన్య హక్కులు క్లెయిం చేస్తున్న దస్తగిరి షరీఫ్ అనే వ్యక్తి హైకోర్టులో తాజాగా పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ సోమవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం సమాధానం చెప్పాలని డీజీపీ, మహేశ్వరం డీసీపీ, మహేశ్వరం ఎస్‌హెచ్‌వోకు నోటీసులు జారీచేసింది. ఇందుకు వారం రోజుల సమయం ఇస్తూ విచారణను వాయిదా వేసింది.

నర్స్ ఉద్యోగ పరీక్షలు మార్కులు వెల్లడించండి

» మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్టాఫ్ నర్స్ ఉద్యోగాల కోసం పోటీపడిన పిటిషనర్లకు సంబంధించిన మార్కుల వివరాలు వెల్లడించాలని మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్ఎస్ఆర్బీ)ను హైకోర్టు ఆదేశించింది. నర్సింగ్ గ్రాడ్యుయేట్లయిన పిటిషనర్లు స్టాఫ్ నర్స్ పోస్టులకు అర్హత సాధించారా? లేదా? అని తెలియజేయాలని పేర్కొంది. ఆ బోర్డు ఆధ్వర్యంలో చేపట్టిన స్టాఫ్ నర్స్ నియామక ప్రక్రియను సవాల్ చేస్తూ పలువురు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం.. ప్రస్తుత పిటిషన్‌లో 11 పోస్టులు ఖాళీగా ఉంచాలంటూ ఇప్పటికే మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చామని తెలిపింది. పిటిషనర్ల మార్కుల వివరాలు వెల్లడించాలని, ఒకవేళ వారు అర్హత సాధించి ఉంటే వారిని నియమించే అంశాన్ని పరిశీలించాలని పేర్కొంటూ విచారణను ముగించింది.

రూ.వెయ్యి కోట్లతో ఓయూ అభివృద్ధికి ప్రణాళికలు

» యూనివర్సిటీలో పర్యటించిన అపెక్స్ కమిటీ

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని ప్రపంచస్థాయి విద్యాసంస్థగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో రూ.1,000 కోట్లతో సమగ్ర అభివృద్ధి ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఇందులో భాగంగా ఓయూలో పాడైపోయిన హాస్టళ్లు, కళాశాల భవనాలు, లైబ్రరీలు, క్రీడా వసతులకు ఆధునిక రూపం ఇవ్వనున్నారు. ఈ ప్రాజెక్ట్ అమలుకు ఏర్పాటు చేసిన అపెక్స్ కమిటీ అధ్యక్షురాలు ఎ.దేవసేన, కన్వీనర్ కుమార్ మొలుగరం, సభ్యులు ఈడబ్ల్యూఐడీసీ ఎండీ గణపతిరెడ్డి, ప్రొఫెసర్ గంటా చక్రపాణి, ప్రొఫెసర్ బషారత్ అలీ, ఆర్అండ్‌బీ మాజీ చీఫ్ ఇంజనీర్ టి.బాబు రాజు, మాజీ వీసీ తిరుపతి సోమవారం ఓయూలో పర్యటించారు. అనేక భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని గుర్తించి తక్షణమే పునరుద్ధరణ అవసరమని నిర్ధారించింది. అనంతరం కమిటీ సభ్యులు ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావుతో సమావేశమై భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించారు. రూ.1,000కోట్ల ప్రణాళికలో భాగంగా ఆధునిక తరగతి గదులు, సెంట్రలైజ్డ్ డిజిటల్ లైబ్రరీ, మెగా హాస్టల్ కాంప్లెక్సులు, ఆధునిక ఆడిటోరియంలు నిర్మించనున్నారు.

లక్కీ డ్రాలో కిక్కే కిక్కు

» సంగారెడ్డి జిల్లాలో ముగ్గురికి మూడేసి దుకాణాలు

» సూర్యాపేటలో దంపతులకు చెరో షాపు

» 2601 షాపులకు లాటరీ పద్ధతిన కేటాయింపు పూర్తి



సూర్యాపేటలో లక్కీ డ్రాలో రెండు దుకాణాలు దక్కించుకున్న భార్యాభర్తలు ఎలికట్టి భరత్-శ్రావణి

హైదరాబాద్, సంగారెడ్డి క్రైం, సూర్యాపేట (కలెక్టరేట్), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల కేటాయింపులో సంగారెడ్డి జిల్లాలో సంచలనాలు నమోదయ్యాయి! జిల్లాకు చెందిన రాజేశ్వర్ గౌడ్ అనే వ్యక్తి ఇద్దరు స్నేహితులతో కలిసి 24 షాపులకు టెండర్లు వేయగా.. లక్కీ డ్రాలో సంగారెడ్డి పట్టణంలోని 1, 3, 8 దుకాణాలు ఆయనకు దక్కాయి. పటాన్‌చెరుకు చెందిన వంశీధర్ రెడ్డి అనే వ్యక్తి వందకుపైగా దరఖాస్తులు వేసి మూడు దుకాణాలను లాటరీలో దక్కించుకున్నారు! జిల్లాకే చెందిన భూపతిరెడ్డి అనే మరో వ్యక్తికి కూడా లక్కీ డ్రాలో మూడు దుకాణాలు వచ్చాయి. మరోవైపు సూర్యాపేటలో ఎలికట్టి భరత్-శ్రావణి దంపతులకు లక్కీడ్రాలో రెండు దుకాణాలు దక్కాయి రాష్ట్రవ్యాప్తంగా 2620 మద్యం షాపులకుగాను. 95,137 మంది దరఖాస్తు చేసుకోగా.. వాటిలో 2601 దుకాణాలను సోమవారం అన్ని జిల్లాల్లో కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు లాటరీ పద్ధతిన కేటాయించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ, వీడియో రికార్డింగ్‌తో ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేసి డ్రా ప్రక్రియ నిర్వహించారు. మిగిలిన 19 దుకాణాలకూ తక్కువగా దరఖాస్తులు రావడంతో.. వాటి డ్రాను నిలిపివేశారు. వాటికి మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. వెంటనే దరఖాస్తులను కూడా స్వీకరించనున్నారు. నవంబరు 1 వరకూ దరఖాస్తులను స్వీకరించి.. 3వ తేదీన డ్రా తీయనున్నారు. ఈ 19 దుకాణాల్లో.. అత్యధికంగా 7 షాపులు కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ఉండగా.. ఆదిలాబాద్‌లో 6, జయశంకర్ భూపాలపల్లి 2, శంషాబాద్‌లో 3 సంగారెడ్డిలో ఒక మద్యం షాపు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లోని మద్యం వ్యాపారులు కుమ్మక్కై తాము తప్ప మరెవరూ దరఖాస్తు చేయకుండా అడ్డుకోవడంతో ఈ దుకాణాలకు తక్కువ దరఖాస్తులు వచ్చాయి. అక్కడ వ్యాపారులు సిండికేట్ అయ్యారని గ్రహించిన అధికారులు.. వారి ఎత్తుకు పైఎత్తువేసి.. ఆ దుకాణాలకు డ్రా నిలిపివేశారు! ఈ దుకాణాలకు మంగళవారం నుంచి దరఖాస్తులు స్వీకరించడానికి సిద్ధంగా ఉండాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ సంబంధిత జిల్లాల అధికారులను ఆదేశించారు.

ఆటో డ్రైవర్ల బతుకులు ఆగమాగం

వారికిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి: బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు

» ఆటోడ్రైవర్లకు మద్దతుగా ఆటోలో ప్రయాణించిన నేతలు

» కాంగ్రెస్ క్యాబినెట్ దండుపాళ్యం ముఠాయే.. పదిసార్లంటా

» రజక సంఘం సమ్మేళనంలో హరీశ్





ఆటోలో ప్రయాణిస్తున్న బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు

హైదరాబాద్/బంజారాహిల్స్/ఎర్రగడ్డ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ఆటో డ్రైవర్ల బతుకులు ఆగమాగం అయ్యాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ సీనియర్ నేత హరీశ్‌రావు అన్నారు. ఎన్నికల సమయంలో ఆటోడ్రైవర్లకు హామీలిచ్చిన కాంగ్రెస్.. గద్దెనెక్కిన తరువాత వారిని మోసం చేసిందని ఆరోపించారు. అధికారంలోకి వస్తే ఆటో కార్మికులకు ఏటా రూ.12 వేలు ఇస్తామని మ్యానిఫెస్టోలో పెట్టారని, దాని ప్రకారం ప్రతి ఆటోడ్రైవర్‌కూ రూ.24 వేల చొప్పున మొత్తం రూ.1500 కోట్లు ప్రభుత్వం బాకీ పడిందని తెలిపారు. ఈ మొత్తాన్ని సీఎం రేవంత్‌రెడ్డి చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఆటోవాలాలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు, ఆటోడ్రైవర్లకు మద్దతుగా నిలిచేందుకు సోమవారం జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి తెలంగాణ భవన్ వరకు కేటీఆర్ ఆటోలో ప్రయాణించారు. మరోవైపు హరీశ్‌రావు ఎర్రగడ్డలోని గోకుల్ థియేటర్ నుంచి తెలంగాణ భవన్ వరకు నుంచి ఆటోలో ప్రయాణించారు. అనంతరం ఆటో కార్మికులతో తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. తాను ప్రయాణించిన ఆటో డ్రైవర్ మస్రత్ అలీ తనతో ఎన్నో బాధలు పంచుకున్నారని తెలిపారు. 2023లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా రాహుల్ గాంధీ ప్రయాణానికి ఆటో ఇచ్చిన యజమాని.. రెండేళ్లలో తనకున్న రెండు ఆటోలు అమ్ముకున్నారని చెప్పారు. ప్రస్తుతం ఆయన డ్రైవర్‌గా మారి కిరాయిఆటోతో రోజుకు రూ.1000-1200 మాత్రమే సంపాదిస్తున్నారని, ఈ ఆదాయం ఆటో కిరాయి, పిల్లల చదువులు, ఇంటి ఖర్చులకు సరిపోవడంలేదని బాధపడ్డారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఇప్పటివరకు 161 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఇదే విషయాన్ని అసెంబ్లీలో కూడా ప్రస్తావించామని గుర్తుచేశారు. బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కేసీఆర్ హయాంలో ప్రవేశపెట్టిన రూ.5 లక్షల ప్రమాద బీమా పథకాన్ని కూడా ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. 4లక్షల మంది జూబ్లీహిల్స్ ఓటర్లు తీసుకునే నిర్ణయంతో 4కోట్ల తెలంగాణ ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో చనిపోయిన ఆటోకార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని తెలిపారు. ప్రతి ఆటోడ్రైవర్ కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆడవాళ్లకు ఉచిత బస్సు ప్రయాణం అంటూ.. మగవాళ్లకు మాత్రం టికెట్ రేట్లు రెండింతలు పెంచి కుటుంబంపై భారం వేశారని ఆరోపించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వ్యాఖ్యలపై హరీశ్‌రావు స్పందిస్తూ.. మంత్రివర్గంలో ఏం జరుగుతుందో అందరికీ తెలుసునన్నారు. తమ పార్టీ నేత కొప్పుల ఈశ్వర్ విసిరిన సవాల్‌ను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్వీకరించాలని, 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం వద్దకు రావాలని అన్నారు.

రజకుల ఆత్మగౌరవాన్ని పెంచింది కేసీఆరే..

రాష్ట్రంలోని రజకుల ఆత్మగౌరవాన్ని పెంచింది కేసీఆరేనని హరీశ్‌రావు అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించి ఆమె గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పారని తెలిపారు. సోమవారం తెలంగాణ భవన్‌లో రజక సంఘం ఆత్మీయ సమ్మేళనంలో హరీశ్‌రావు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రెండేళ్ల పాలనలో అక్రమాలు, బూతులు తిట్టడం తప్ప.. చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. జూబ్లీహిల్స్ ఓటర్లు బీఆర్ఎస్‌ను గెలిపించి.. రేవంత్‌రెడ్డి గూబ గుయ్యిమనిపించాలన్నారు. కాగా, ముధోల్ నియోజకవర్గ బీజేపీ నేత సిందే దీక్షిత్, ఆయన అనుచరులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి క్యాబినెట్ కచ్చితంగా దండుపాళ్యం ముఠాయేనని, ఈ మాట ఒక్కసారి కాదు.. పదిసార్లు అంటానని చెప్పారు. దక్కన్ యాజమాన్యాన్ని తుపాకీతో బెదిరించిన వ్యవహారంలో నిగ్గు తేల్చేందుకు సీబీఐ విచారణకు సిద్ధమా? అని సవాల్ చేశారు.

మా పదేళ్ల పాలన.. మీ 22 నెలల పాలనపై చర్చకు రెడీనా?

» కాంగ్రెస్‌కు సవాల్ చేస్తూ భారీ అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ హంగామా

» అడ్లూరి చర్చకు రావాలని కొప్పుల పిలుపు

» పలువురు బీఆర్ఎస్ నేతల అరెస్టు

ఖైరతాబాద్, హైదరాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పదేళ్ల పాలన, ప్రస్తుత కాంగ్రెస్ 22 నెలల పాలనపై చర్చకు సిద్ధం అంటూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ల మధ్య వాదోపవాదాలు జరిగిన నేపథ్యంలో సోమవారం భారీ అంబేడ్కర్ విగ్రహం వద్ద హంగామా జరిగింది. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎన్టీఆర్ మార్గ్‌లోని 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం వద్దకు వచ్చి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ చర్చకు రావాలని సవాలు విసిరారు. అక్కడ కొప్పుల ఈశ్వర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ నేతలు పుట్ట మధు, గజ్జెల నగేశ్, గజ్జెల ఆనంద్, కార్యకర్తలు పెద్ద ఎత్తున వచ్చి నినాదాలు చేయడంతో పోలీసులు అందరిని అరెస్టు చేసి సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు, కార్యకర్తలను గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులకు, నాయకులకు మధ్య వాగ్వాదం, తోపులాట జరగడంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ గడచిన 22 నెలల పాలనలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత వరకు తీర్చిందని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు లేవని, రైతులకు యూరియా కూడా ఇవ్వలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని విమర్శించారు. ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగాలిప్పిస్తామని మోసగించిందని విమర్శించారు. కాగా కాంగ్రెస్ రెండేళ్లపాలనపై చర్చకు రావాలని డిమాండ్‌చేస్తూ 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం వద్దకు వెళ్లిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను పోలీసులు అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీనేత ఎర్రోళ్ల శ్రీనివాస్ సోమవారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన అభివృద్ధి, రెండేళ్లలో కాంగ్రెస్ విధ్వంసంపై చర్చించే దమ్ములేకే కొప్పుల ఈశ్వర్‌ను అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారని విమర్శించారు. చర్చకు రమ్మంటే సీఎం, మంత్రులు ముఖం చాటేయడం సిగ్గుచేటు అని, రేవంత్‌రెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే కేటీఆర్, హరీశ్‌పై సూటిగా మాట్లాడాలని, చిల్లరగాళ్లతో మాట్లాడించడం తగదన్నారు.

ఐదేళ్లలోపు చిన్నారులపై సర్వే

» వారి ఆరోగ్య సమస్యలు గుర్తించేందుకు ప్రత్యేక యాప్

» ఆర్బీఎస్కే బృందాల ఆధ్వర్యంలో 42 ప్రశ్నలతో వివరాల సేకరణ

» వికారాబాద్ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు

హైదరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలోపు చిన్నారుల్లో తలెత్తే ఆరోగ్య సమస్యలను తెలుసుకునేందుకు సర్వే చేపట్టనున్నారు. ఇందుకోసం వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ విభాగం ప్రత్యేక మొబైల్ యాప్‌ను తెచ్చింది. దీని ద్వారా 0-5 వయసు పిల్లల ఆరోగ్యంపై సర్వే చేస్తారు. ఇందుకోసం వికారాబాద్ జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్టు వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలే లక్ష్యంగా ఈ సర్వే చేయనున్నారు. ఇందుకోసం రాష్ట్రీయ బాల స్వస్థ్ కార్యక్రమం (ఆర్బీఎస్కే) నిర్వహించే బృందాలను రంగంలోకి దింపారు. అప్పుడే పుట్టిన నవజాత శిశువుల నుంచి 18 ఏళ్లలోపు పిల్లలకు సమగ్ర ఆరోగ్య సంరక్షణ అందించడమే లక్ష్యంగా ఆర్బీఎస్కే నడుస్తోంది. కేంద్ర ప్రభుత్వ జాతీయ ఆరోగ్య మిషన్‌లో ఆర్బీఎస్కే ఒక ప్రోగ్రామ్. ఇది ప్రధానంగా పిల్లల్లో తలెత్తే నాలుగు రకాల డీ(డిఫెక్ట్స్ ఎట్ బర్త్, డెఫిషియెన్సీస్, డిసీజెస్, డెవలప్‌మెంట్ డిలేస్)లను పరీక్షిస్తుంది. ఆర్బీఎస్కే బృందం అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారుల ఆరోగ్య సమస్యలను అంగన్వాడీ టీచర్లు, అవసరమైతే పిల్లల తల్లులను కూడా అడిగి తెలుసుకుంటాయి. ఇందుకోసం మొత్తం 42 ప్రశ్నలను రూపొందించారు. ఇవన్నీ యాప్‌లో ఉంటాయని వైద్యవర్గాలు పేర్కొన్నాయి. చిన్నారి పేరు, ఊరు, ఆధార్, తల్లిదండ్రుల పేర్లను అందులో నమోదు చేస్తారు. అనంతరం అన్ని ప్రశ్నలను అంగన్వాడీ టీచర్, తల్లిని అడిగి తెలుసుకుంటారు. చిన్నారులు ఏం తింటున్నారు? ఎలా తింటున్నారు? వారి ప్రవర్తన ఎలా ఉంది? చెప్పేది సరిగ్గా వింటున్నారా? అడగ్గానే సమాధానం చెబుతున్నారా? ఆరోగ్య పరంగా ఏమైనా సమస్యలు వస్తున్నాయా? ఎంత చురుగ్గా ఉంటున్నారు? వారి మానసిక పరిస్థితి ఎలా ఉంది? ఇతర పిల్లలతో ఎలా ఉంటున్నారు? నిద్ర సరిగ్గా పోతున్నారా? వయసుకు తగ్గ ఎత్తు, బరువు ఉన్నారా? వంటి ప్రశ్నలు అడిగి జవాబులను యాప్‌లో నమోదు చేస్తారు. దీని ద్వారా పిల్లల ఆరోగ్య, మానసిక పరిస్థితిపై ఒక నిర్ధారణకు వస్తారు. శారీరక, మానసిక ఆరోగ్య పరిస్థితి సరిగా లేని పిల్లలను హైదరాబాద్‌కు తీసుకువస్తారు. ఇక్కడ వైద్యులు వారి పరిస్థితిని బట్టి వైద్య పరీక్షలు చేస్తారు. ఉదాహరణకు ఒక చిన్నారికి వినికిడి సమస్య ఉన్నట్లు గుర్తిస్తే.. ఈఎన్‌టీ వైద్యులకు సిఫారసు చేస్తారు. అక్కడ మరిన్ని పరీక్షలు చేశాక అవసరమైన కాంక్లియర్ సర్జరీలు లాంటివి చేస్తారు. ఆటిజం లాంటి సమస్య ఉన్నట్లు గుర్తిస్తే అందుకు తగ్గట్లుగా వైద్య సేవలందిస్తారు. చిన్న సమస్య లుంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, ఏఎన్ఎమ్‌లు, ఆశాల పర్యవేక్షణలో పరిష్కరిస్తారు. ఇలా ఐదేళ్లలోపే పిల్లల్లో అనారోగ్య సమస్యలను గుర్తించి అవసరమైన వైద్య సేవలను అందించనున్నారు.

మైలారం నుంచి సుందిళ్లకు టన్నెల్

ఖర్చు తగ్గేలా ప్రాణహిత-చేవెళ్ల పునరుద్ధరణ.. 1500 కోట్ల వరకూ ఆదా! .. సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

» ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కోసం హెలికాప్టర్‌తో జియో మ్యాగ్నటిక్ సర్వే

» అధికారులకు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలు



నీటిపారుదల ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి పునరుద్ధరణ పనులు తక్కువ ఖర్చుతో పూర్తయ్యేలా ప్రత్యామ్నాయాలు పరిశీలించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో.. సాగునీటి ప్రాజెక్టులపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష జరిపారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కడితే.. 71.5కి.మీ.ల దాకా (మైలారం గ్రామం వరకూ) గ్రావిటీతో నీరు చేరుతుందని, ఆ నీటిని ఎల్లంపల్లికి పంపింగ్ చేయాలంటే 30 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 12మోటార్లతో పంపింగ్ స్టేషన్‌ను నిర్మించాల్సి ఉంటుందని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు. అలైన్‌మెంట్ మంచిర్యాల నుంచి వెళ్లనుండటంతో భూసేకరణకు భారీగా నిధులు అవసరమవుతాయని తెలిపారు. అలాకాకుండా మైలారం నుంచి సుందిళ్లకు నీటిని నేరుగా గ్రావిటీతో తరలించవచ్చని, సుందిళ్ల బ్యారేజీకి మరమ్మతులు చేసుకుంటే ఇప్పటికే సిద్ధంగా ఉన్న పంప్ హౌస్‌ను వినియోగించుకోవచ్చని గుర్తు చేశారు. దీనికోసం 20.6 కి.మీ.ల మేర టన్నెల్ తవ్వాల్సి ఉంటుందని, ఆ తర్వాత నీటిని టేకుమట్ల వాగులో వేస్తే నేరుగా సుందిళ్లకు చేరుతాయని, అక్కడి నుంచి నీటిని ఎల్లంపల్లికి తరలించవచ్చన్నారు. ఈ అలైన్‌మెంట్‌తో ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయం 10-12 శాతం తగ్గుతుందని, భూసేకరణ సగానికి పైగా తగ్గుతుందని తెలిపారు. ఫలితంగా రూ.1500-1600 కోట్ల దాకా ఆదా చేయడానికి అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొనగా.. దీనిపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రికి ఈ ప్రతిపాదన గురించి నివేదించి, ఆయన అనుమతి అనంతరం సవరించిన డీపీఆర్‌పై మంత్రివర్గంలో చర్చిస్తామని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తుతో బ్యారేజీని కడితే గ్రావిటీతో నీటిని తరలించలేం కాబట్టి, 150 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ కట్టడానికి వీలుగా మహారాష్ట్ర అనుమతి తీసుకుందామన్నారు. మరోవైపు, సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఛత్తీస్‌గఢ్ అనుమతి కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. దీనికోసం ఆ రాష్ట్ర నీటిపారుదలశాఖ కార్యదర్శిని సమ్మక్కసాగర్ బ్యారేజీ పరిశీలన కోసం ఆహ్వానించాలన్నారు. శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ తవ్వకానికి వీలుగా హెలికాప్టర్‌తో జియో మ్యాగ్నటిక్ సర్వేను చేపట్టాలని ఆదేశించారు. సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ బ్యారేజీ, కాళేశ్వరం డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థకు నిధులు, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై కూడా సమీక్ష సమావేశంలో చర్చించారు.

ధాన్యం కొనుగోళ్లలో రైతులు నష్టపోవొద్దు!

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రైతులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని.. అవినీతి ఆరోపణలు వస్తే అధికారులు, రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ హెచ్చరించారు. ఇది రైతు పక్షపాత ప్రభుత్వమని, రైతులకు నష్టం కలిగితే చూస్తూ ఊరుకోబోదన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్లు, పౌరసరఫరాలశాఖ అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. మొంథా తుఫాన్ ప్రభావం రాష్ట్రంలోనూ ఉంటే అప్రమత్తంగా వ్యవహరించాలని, ధాన్యంతోపాటు మొక్కజొన్న, ఇతర పంట ఉత్పత్తులు దెబ్బ తినకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

తుమ్మిడిహెట్టి నుంచి నీటిని తరలించేదెలా!?

» నేరుగా ఎల్లంపల్లికా!? సుందిళ్ల నుంచి ఎల్లంపల్లికా!?

» నేడు ముఖ్యమంత్రి సమీక్షలో నిర్ణయం

» కాళేశ్వరంతో లింక్ చేస్తే మళ్లీ డీపీఆర్ అవసరం ఉండదని అధికారుల భావన

హైదరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కట్టిన తర్వాత నీటిని నేరుగా ఎల్లంపల్లికి తరలించాలా..? లేక సుందిళ్లకు తరలించి.. అక్కడి నుంచి ఎల్లంపల్లికి తరలించాలా!? ప్రస్తుతం నీటి పారుదల వర్గాలను వేధిస్తున్న ప్రశ్న ఇది. దీనిపై ముఖ్యమంత్రి నిర్ణయమే కీలకం కానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష చేయనున్నారు. ఆయన గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే సవరణ డీపీఆర్‌ను సిద్ధం చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఇందుకు కాళేశ్వరం డీపీఆర్‌ను సవరిస్తే చాలని అభిప్రాయపడుతున్నారు. నిజానికి, కాళేశ్వరం ప్రాజెక్టుతో సంబంధం లేకుండా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు డీపీఆర్ సిద్ధం చేయాలని ఇప్పటి వరకూ అధికారులకు సూచనలు వస్తున్నాయి. కానీ, కాళేశ్వరం ప్రాజెక్టును కూడా భాగస్వామ్యం చేసి డీపీఆర్‌ను సిద్ధం చేస్తేనే ప్రాజెక్టు బెనిఫిట్ కాస్ట్ రేషియో (ప్రాజెక్టు నిర్మాణానికి వెచ్చించేది ఎంత!? నిర్మాణం పూర్తయిన తర్వాత తిరిగి వచ్చేది ఎంత అనే అంచనా) కచ్చితంగా సరిపోతుందని అధికారులు భావిస్తున్నారు. కట్టిన లక్ష్యాన్ని చేరుకోవడంలో కాళేశ్వరం బ్యారేజీలు విఫలమయ్యాయని ఇప్పటికే సీడబ్ల్యూసీ కూడా గుర్తించిందని, ఈ మేరకు జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) నివేదికలు కూడా ఉన్నాయని, ఈ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రత్యామ్నాయంగానే తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కడుతున్నామని కేంద్రానికి నివేదిస్తే సానుకూల ఫలితాలు వచ్చే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. కాళేశ్వరంతో తుమ్మిడిహెట్టిని లింక్ చేస్తే.. మళ్లీ డీపీఆర్ సిద్ధం చేయాల్సిన అవసరం ఉండదని, మేడిగడ్డ బ్యారేజీ విఫలమైనందున, దాని స్థానంలో నీటి తరలింపునకు తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కడుతున్నామని ప్రతిపాదిస్తే సరిపోతుందని, అప్పుడు కాళేశ్వరం డీపీఆర్‌ను సవరించి, సీడబ్ల్యూసీ నుంచి క్లియరెన్స్‌లు తీసుకుని పనులు చేపట్టవచ్చని భావిస్తున్నారు.

కాళేశ్వరం పునరుద్ధరిస్తే 100 టీఎంసీలలోపే

కాళేశ్వరం ప్రాజెక్టులోని సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల నుంచి 195 టీఎంసీల నీటిని తరలించడానికి సీడబ్ల్యూసీ అనుమతులున్నాయి. కానీ, బ్యారేజీలు కట్టిన తర్వాత ఇప్పటి వరకూ ఆ మేరకు ఎప్పుడూ తరలించలేదు. బ్యారేజీల కుంగుబాటుతో ఇప్పుడు వాటిని పునరుద్ధరించాల్సి ఉంది. ఒకవేళ, వాటిని పునరుద్ధరించినా.. ఆ తర్వాత వాటి నుంచి ఏటా 100 టీఎంసీలకు మించి నీటిని తరలించలేమని అధికారులు గుర్తించారు. పునరుద్ధరణ తర్వాత నీటి నిల్వను గణనీయంగా తగ్గించుకొని.. కేవలం పంపింగ్‌కు అనుకూలంగా (పంపుల హెడ్‌కు నీరు తగిలేంత) ఉండేలా నిల్వ చేసుకొని, పంపింగ్ చేయాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వాడుకోవడానికే వీటిని ఉపయోగించుకోవాలని భావిస్తున్నారు. ప్రస్తుతం మేడిగడ్డ సామర్థ్యం 16.17 టీఎంసీలు కాగా.. పునరుద్ధరణ తర్వాత 5 టీఎంసీలకు మించి నిల్వ చేయడానికి అవకాశం ఉండదని అంచనా వేస్తున్నారు.

అపర్ణకు తక్షణమే వైద్య సేవలందించండి

- నిమ్స్ డైరెక్టర్‌కు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



బోనకల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): 'నా కూతురి ప్రాణాలు కాపాడండి' అన్న శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించారు. ప్రత్యేకమైన కేసుగా పరిగణించి అపర్ణకు తక్షణమే వైద్య సేవలందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన పేద విద్యార్థిని తాటికొండ అపర్ణ లివర్ దెబ్బతినడంతో ఇటీవల నిమ్స్‌లో వైద్య సేవలు పొందింది. అయితే ఆరోగ్యశ్రీ పరిమితి దాటింది. ఈ నేపథ్యంలో ఆమెకు తిరిగి ఆస్పత్రిలో వైద్య సేవలందించే విషయమై భట్టి విక్రమార్క సోమవారం నిమ్స్ డైరెక్టర్ బీరప్పతో మాట్లాడారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అపర్ణను ప్రత్యేకమైన కేసుగా పరిగణించి వైద్య సేవలందించాలని ఆదేశించారు. అపర్ణకు తిరిగి వైద్య సేవలందిచేలా కృషి చేసిన 'ఆంధ్రజ్యోతి'కి ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

తేమ ఎక్కువున్న పత్తిని కూడా సీసీఐ కొనాలి

- రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులను గుర్తించాలి
- కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌కు తుమ్మల లేఖ



హైదరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో తేమశాతం ఎక్కువగా ఉన్న పత్తిని కూడా సీసీఐ కేంద్రాల్లో కొనుగోలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు సోమవారం లేఖ రాశారు. అయితే కేంద్రం నుంచి అనుమతి వచ్చే రైతులు ప్రస్తుత నిబంధనలు పాటించాలని, పత్తిలో తేమ 12శాతం మించకుండా సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లాలని సూచించారు. పత్తి రైతులకు గరిష్ఠ మద్దతు ధర అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నదన్నారు. పత్తి అమ్మకం కోసం 'కపాస్ కిసాన్' యాప్‌లో రైతుల వివరాలను నమోదు చేసుకోవడానికి ప్రత్యేక అధికారుల బృందాలు జిల్లాల్లో పర్యటిస్తున్నారని, ఏఈవోలు, మార్కెట్ కార్యదర్శులు, జిల్లా మార్కెటింగ్ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఏవైనా సమస్యలు ఎదురైనా, సందేహాలున్నా రైతులు టోల్ ఫ్రీ నెంబరు-1800 599 5779 కు ఫోన్ చేయాలని, మార్కెటింగ్ అధికారులు సహకరిస్తారని నాగేశ్వరరావు చెప్పారు. ఇదిలా ఉండగా సోమవారం కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రైస్ సపోర్ట్ స్కీమ్(పీఎస్ఎస్) కింద ఉన్న పంటల కొనుగోలుకు వెంటనే అనుమతులు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో పండే పెసర, మినుములను మొత్తం, సోయాబీన్ ఉత్పత్తిలో 50 శాతం వరకు.. కనీస మద్దతు ధర(ఎమ్మెస్పీ)కు ప్రభుత్వమే కొనుగోలు చేసేలా అనుమతులివ్వాలని విజ్ఞప్తి చేశారు. మొక్కజొన్న, జొన్న పంటలను ప్రైస్ సపోర్టు స్కీమ్‌లో చేర్చాలన్నారు. ఈ ఖరీఫ్‌లో మక్కల కొనుగోళ్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2,500 కోట్లు వెచ్చిస్తున్నట్లు తుమ్మల తెలిపారు. యాసంగిలో జొన్న రైతులకు మద్దతు ధర కల్పించేందుకు రూ.520కోట్లు వెచ్చించి పంట కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రతి సంవత్సరం మొక్కజొన్న, జొన్న సేకరణతో రాష్ట్ర ప్రభుత్వంపై రూ.3 వేల కోట్ల భారం పడుతోందన్నారు. అందువల్ల మొక్కజొన్న, జొన్న పంటలను ప్రైస్ సపోర్టు స్కీమ్‌లో చేర్చాలని మంత్రి కోరారు. తుమ్మల విజ్ఞప్తిపై స్పందించిన కేంద్రమంత్రి శివరాజ్.. ప్రైస్ సపోర్ట్ స్కీమ్ కింద ఉన్న పెసర, మినుము, సోయాబీన్ కొనుగోళ్లకు రెండు, మూడు రోజుల్లో అనుమతులిస్తామని హామీ ఇచ్చారు.

తప్పుడు ప్రచారం చేస్తే పరువు నష్టం దావా వేస్తా

- నాపై ఓ వర్గం మీడియా, సోషల్ మీడియా దుష్ప్రచారం
- వికృత రాజకీయాలు చేసే వారిపై చట్టపర చర్యలు: జూపల్లి

హైదరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తనపై పని కట్టుకుని ఒక వర్గం మీడియా, సోషల్ మీడియా దుష్ప్రచారం చేస్తోందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. వికృత రాజకీయాలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. ఆర్టీఐ ద్వారా కొన్ని శాఖలకు సంబంధించిన సమాచారాన్ని అడిగించినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. తనపై నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రచురించిన కథనాల ద్వారా ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందని పేర్కొన్నారు. 'నా పరువుకు భంగం కలిగించేలా, నన్ను అప్రతిష్ఠపాలు చేసేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగా కుట్ర పన్నుతున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు వ్యక్తులు, వర్గాలు ఈ విధంగా అబద్ధాలను ప్రచారం చేస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ అసత్య ప్రచారంపై చట్టపరమైన చర్యలు ఇప్పటికే ప్రారంభించాం. ఆ వార్తను ప్రచురించిన సంస్థలు, సోషల్ మీడియా పోస్టుల వెనుక ఉన్న బాధ్యులైన వ్యక్తులపై పరువు నష్టం దావా వేస్తా. కేవలం వదంతుల ఆధారంగా కథనాలు రాయడం ప్రజలను తప్పుదారి పట్టించడమే అవుతుంది. నాపై కుట్ర వెనుక ఉన్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవు' అని ఓ ప్రకటనలో హెచ్చరించారు.

మేం కాదు దండుపాళ్యం బ్యాచ్.. మీరే బందిపోట్లు

- హరీశ్‌రావు తోకముడిచారు: మంత్రి అడ్లూరి

హైదరాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తాము దండుపాళ్యం బ్యాచ్ కాదని, పదేళ్ల రాష్ట్రాన్ని దోచుకున్న బీఆర్ఎస్ నేతలే స్టువర్ట్‌పురం దొంగలను మించిన బందిపోట్లని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆరోపించారు. కాళేశ్వరం, లిక్కర్ దందాలు దండుపాళ్యం కంటే ఘోరమైన దోపిడన్నారు. జూబ్లీహిల్స్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీతో కలిసి మంత్రి అడ్లూరి మీడియా సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ క్యాబినెట్‌ను దండుపాళ్యం బ్యాచ్ అని హరీశ్‌రావు, కేటీఆర్ వ్యాఖ్యానించడంపై ఆయన మండిపడ్డారు. దళితులు, బలహీన వర్గాల నేతలున్న క్యాబినెట్‌ను దండుపాళ్యం బ్యాచ్ అని పిలవడం దళితులను అవమానించడమేనన్నారు. మంత్రి వర్గం, సీఎంపై చేసిన వ్యాఖ్యలకు కేటీఆర్, హరీశ్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట దేవాలయంలో చర్చకు తాను విసిరిన సవాల్‌ను స్వీకరించకుండా హరీశ్‌రావు తోకముడిచారని, దమ్ముంటే మళ్లీ చర్చకు రావాలన్నారు.

పోలవరం-బనకచర్ల పీఎఫ్ఆర్ పరిశీలించొద్దు

- కృష్ణాబోర్డుకు తెలంగాణ లేఖ

హైదరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలవరం - బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టు ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదిక (పీఎఫ్ఆర్)ను పరిశీలించవద్దని కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఛైర్మన్‌ను తెలంగాణ కోరింది. ఈ మేరకు కేఆర్ఎంబీ ఛైర్మన్‌కు సోమవారం లేఖ రాసిన రాష్ట్ర నీటి పారుదలశాఖ ఈఎన్‌సీ (జనరల్) మహ్మద్ అంజద్ హుస్సేన్.. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై ముందుకెళుతున్న ఏపీ.. ఇటీవలే డీపీఆర్ తయారీకి టెండర్లు కూడా పిలిచారని ఆక్షేపించారు. సీడబ్ల్యూసీ 2010లో జారీ చేసిన మార్గదర్శకాలకు వరద జలాలతో ప్రాజెక్టు ప్రతిపాదించడం వ్యతిరేకమని గుర్తుచేశారు. 75శాతం డిపెండబిలిటీ ఆధారంగా ప్రాజెక్టు చేపట్టాలని ప్రణాళికాసంఘం కూడా సిఫారసు చేసిందన్నారు. కృష్ణా బేసిన్‌లో లోటు ఏర్పడటానికి.. కృష్ణా నదీ జలాలను ఏపీ సర్కారు ఇతర బేసిన్లకు తరలించడమేనని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికే గోదావరి నీటిని ఏపీ వినియోగిస్తున్నందున.. ఆ నీటిలో వాటాగా కృష్ణా నది నుంచి 64.75 టీఎంసీల వినియోగానికి అవకాశం ఇవ్వాలని కర్ణాటక కోరుతుందని, అదే జరిగితే కృష్ణాలో తెలంగాణ ప్రయోజనాలకు అన్యాయం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుపై పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ), గోదావరి బోర్డు, కేంద్ర పర్యావరణ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ నిపుణుల మదింపు కమిటీకూడా అభ్యంతరాలు వ్యక్తం చేశాయని మహ్మద్ అంజద్ హుస్సేన్ తెలిపారు కనుక ఈ ప్రాజెక్టు పీఎఫ్ఆర్‌ను పరిశీలించరాదని, టెండర్‌ప్రక్రియలో ముందుకెళ్లకుండా ఏపీని నిలువరించాలని కోరారు.

మైనార్టీలకు రిజర్వేషన్ల సాధనలో
షబ్బీర్ అహ్మద్ కృషి భేష్

మాజీ ఎమ్మెల్సీ కుటుంబాన్ని పరామర్శించిన సీఎం రేవంత్

పహాడిషరీఫ్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మైనారిటీలకు 4శాతం రిజర్వేషన్ల సాధనలో దివంగత ఎమ్మెల్సీ హఫీజ్ పీర్ షబ్బీర్ అహ్మద్ చేసిన కృషి మరువలేనిదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపాలిటీలోని షాహీన్‌నగర్‌లో ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన మాజీ ఎమ్మెల్సీ షబ్బీర్ అహ్మద్ కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. షబ్బీర్ అహ్మద్ తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ జమైతుల్ ఉలేమా హింద్ ప్రతినిధిగా ఉంటూ హిందూ-ముస్లింల ఐక్యతకు కృషి చేశారని సీఎం గుర్తు చేశారు. ఆయన కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. సీఎంతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు కూడా మాజీ ఎమ్మెల్సీ కుటుంబ సభ్యులను పరామర్శించారు.



రంగారెడ్డి జిల్లా జల్‌పల్లిలో మాజీ ఎమ్మెల్సీ షబ్బీర్ అహ్మద్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

జూబ్లీ ఫైట్!

(మొదటిపేజీ తరువాయి)



నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రచార రంగంలోకి దిగుతున్నారు. ఇప్పటి వరకు ఖరారైన షెడ్యూల్ ప్రకారం.. ఏకంగా ఐదు రోజులు ఆయన జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారానికి కేటాయించారు. ఒక సభతోపాటు రోడ్ షోలు నిర్వహించనున్నారు. ఆయన ఎన్నికల ప్రచారం సినీ కార్మికుల అభినందన సభతో మొదలుకానుంది. తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్, 24 కార్మిక సంఘాల ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో మంగళవారం సీఎం రేవంత్ రెడ్డికి అభినందన సభ జరుగుతోంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో సినీ కార్మికులు గణనీయ సంఖ్యలో ఉన్న నేపథ్యంలో.. ఇక్కడి నుంచే ఆయన ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. అలాగే, ఈనెల 31న వెంగళ్‌రావ్‌నగర్, సోమాజీగూడ డివిజన్లలో, నవంబరు 1న బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లు, నవంబరు 4న షేక్‌పేట-1, రహమత్‌నగర్ డివిజన్లు, 5న షేక్‌పేట-2, యూసుఫ్‌గూడ డివిజన్లలో ఆయన రోజుకు గంటపాటు రోడ్‌షోలు నిర్వహించనున్నారు. ఇవన్నీ సాయంత్రం 7 గంటలకు ప్రారంభమై 8 గంటలకు ముగుస్తాయి. ఇక, కాంగ్రెస్ పార్టీ తన ప్రచారాన్ని బైక్ ర్యాలీతో ముగించనుంది. ఈనెల 8, 9 తేదీల్లో అన్ని డివిజన్లను కవర్ చేస్తూ ఈ బైక్ ర్యాలీ జరగనుంది. దీని ముగింపు కార్యక్రమంలోనూ రేవంత్ రెడ్డి పాల్గొనే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రచారంలోకి సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా దిగడం ద్వారా ప్రచారాన్ని పతాక స్థాయికి తీసుకుపోనున్నారని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి హామీలిచ్చి ప్రజల్లో నమ్మకాన్ని కలిగించనున్నారని తెలిపాయి. ముఖ్యమంత్రి ప్రచారానికి సంబంధించిన ఏర్పాట్లు, కార్యాచరణను సమీక్షించేందుకు మంత్రుల క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో సోమవారం ఉదయం సమావేశం జరిగింది. ఇందులో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, డివిజన్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు. సభ నిర్వహణ, రోడ్ షో ఏర్పాట్లపై సమీక్షించారు. మరోవైపు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ సోమవారం ముఖ్య నాయకులతో టూరిజం ప్లాజాలో సమావేశమయ్యారు. ఇందులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, డివిజన్ల వారీగా బాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు పాల్గొన్నారు. ప్రచారం, పోల్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి చర్చించారు. ఓటర్లను పోలింగ్ బూత్ వరకూ రప్పించేందుకు ప్రతి వంద ఓటర్లకు ఒక నాయకునికి బాధ్యత అప్పగించాలని నిర్ణయించారు. నాయకులంతా సమష్టిగా కృషి చేసి అధిక మెజార్టీ సాధించాలని, అప్పగించిన బాధ్యతలను నెరవేర్చాలని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా చేయవద్దని మహేశ్ గౌడ్ దిశానిర్దేశం చేశారు.

ఉధృతంగా బీఆర్ఎస్ ప్రచారం

నోటిఫికేషన్ వెలువడడానికి ముందు నుంచే ప్రచార పర్వంలోకి దిగిన బీఆర్ఎస్.. ఇప్పుడు దానిని మరింత ముమ్మరంచేసింది. ఆ పార్టీ ముఖ్య నాయకులు కేటీఆర్, హరీశ్ రావు గత వారం రోజులుగా నియోజక వర్గంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కేటీఆర్ గేటెడ్ కమ్యూనిటీల్లోకి వెళ్లి మరీ సమావేశాలు నిర్వహించి ఓట్లు అడుగుతున్నారు. మంగళవారం కేటీఆర్, హరీశ్ రావు ఆటోల్లో ప్రయాణించి డ్రైవర్ల సాధక బాధకాలను అడిగి తెలుసుకున్నారు. ఆ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత, ఆమె కుటుంబ సభ్యులు ఇప్పటికే కాలనీలు, బస్తీలను చుట్టేస్తుండగా.. మాజీ మంత్రులు, ప్రజా ప్రతినిధులు విస్తృత ప్రచారం చేస్తున్నారు.

నేడు బీజేపీ మహా పాదయాత్ర

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక గెలుపును బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నియోజకవర్గంలోనే తిష్ఠ వేశారు. ఆయనతోపాటు ఆ పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. తాజాగా, ప్రచార వ్యూహంపై బీజేపీ సోమవారం ప్రత్యేక సమీక్ష నిర్వహించింది. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ పార్టీ స్థానిక నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఇంటింటి ప్రచారం ముమ్మరం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించడంలో భాగంగా 72 శక్తి కేంద్రాల సీనియర్ నాయకులకు బాధ్యతలు అప్పగించారు. మంగళవారం నియోజకవర్గవ్యాప్తంగా మహా పాదయాత్ర నిర్వహించనుంది. సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు జరిగే కార్యక్రమంలో బస్తీలు, కాలనీల్లోని స్థానికులను కలుసుకుంటారు.

నాయకుల మోహరింపు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు 14 రోజుల సమయముంది. ప్రచారానికి మిగిలింది 13 రోజులే. దాంతో ఆయా పార్టీల నాయకులు తమ తమ పార్టీ, అభ్యర్థికి సంబంధించిన సానుకూల అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్తూనే.. ప్రత్యర్థి పార్టీ, అభ్యర్థుల వైఫల్యాలను ఎండగడుతున్నారు. ఎదుటి పార్టీల ప్రచారంపై నిఘా ఉంచి.. తదనుగుణంగా ప్రచార ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల ఛైర్మన్లు, మాజీ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లనూ మోహరించారు. డివిజన్లు, ప్రాంతాల వారీగా ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసే బృందాలు కొన్నయితే.. రోజూ ప్రచార ప్రణాళికలను మరికొన్ని టీంలు చూసుకుంటున్నాయి. ప్రత్యర్థులు ప్రచారం చేసిన ప్రాంతాల్లో రెండు, మూడు రోజుల్లో తమ ప్రచారం ఉండేలా చూసుకుంటున్నారు. కాలనీలు, అపార్ట్‌మెంట్‌వాసులతో రహస్యంగా సమావేశమవుతున్నారు. యూసుఫ్‌గూడలోని ఓ అపార్ట్‌మెంట్‌లో మరమ్మతు పనుల వ్యయం భరించేందుకు ప్రధాన పార్టీ అభ్యర్థి ఒకరు సిద్ధమైనట్టు సమాచారం. ఓ బస్తీ నాయకులతో సమావేశమైన మరో అభ్యర్థి గంపగుత్తగా ఓట్లు వేయించేందుకు ఏం చేయాలో చెప్పాలని మంతనాలు సాగిస్తున్నట్టు సమాచారం. ప్రత్యర్థుల కోడ్ ఉల్లంఘనలను గమనించేందుకూ బృందాలనే ఏర్పాటు చేశారు. ప్రార్థన మందిరాల వద్ద బీఆర్ఎస్ ప్రచారం చేస్తోందని రిటర్నింగ్ అధికారికి కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది.

కాంగ్రెస్, బీఆర్ఎస్.. పరస్పర ఫిర్యాదులు

ఉప ఎన్నికల్లో ప్రచారానికి సంబంధించి సోమవారం కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నాయి. నమస్తే తెలంగాణ, టీ న్యూస్‌లో కాంగ్రెస్‌పైనా, పార్టీ అభ్యర్థిపైనా తప్పుడు ప్రచారం చేస్తూ బీఆర్ఎస్ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తోందని, ఆ రెండు పత్రికల్లో బీఆర్ఎస్‌కు అనుకూలంగా వచ్చే వార్తలను వ్యాపార ప్రకటనలుగా పరిగణించాలని రిటర్నింగ్ అధికారికి కాంగ్రెస్ ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ శ్రీ గణేష్ ఫిర్యాదు చేశారు. ఇక, సీఎం రేవంత్‌రెడ్డికి యూసుఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో సినీ కార్మికుల సన్మానం పేరిట సభను పెడుతున్నారని, దానికి అనుమతిని తక్షణం రద్దు చేయాలని సీఈవో సుదర్శన్ రెడ్డికి బీఆర్ఎస్ నాయకులు మధుసూదనాచారి, కె.కిశోర్‌గౌడ్, అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, పల్లె రవికుమార్ గౌడ్ వినతిపత్రం సమర్పించారు. సభను జరిపితే సీఎంపై కేసు నమోదు చేయాలని, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

మహిళా అధికారులను వేధిస్తున్న మంత్రులను బర్తరఫ్ చేయాలి

- రాత్రిపూట ఇళ్లకు, ఆఫీసులకు పిలిపించి మంత్రులు వేధిస్తున్నట్లు ఆరోపణలున్నాయి
- దీనిపై విచారణ చేపట్టాలి: బండి సంజయ్



కరీంనగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్యాబినెట్‌లోని కొందరు మంత్రులు మహిళా అధికారులను రాత్రి పూట ఇళ్లకు, కార్యాలయాలకు పిలిపించుకొని వేధిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయని, దీనిపై పత్రికల్లో కథనాలు వస్తున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. మహిళా అధికారులను వేధిస్తున్న ఆ మంత్రులను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే విచారణ జరిపించి, నివేదిక తెప్పించుకోవాలని కోరారు. కరీంనగర్‌లో బండి మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే కాంగ్రెస్ పాలన అంటే మహిళలు అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలన్నీ గాలికొదిలేశారని విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపు తప్పుతున్నాయని, పోలీసులపైనే దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. మజ్లిస్‌కు చెందిన రౌడీషీటర్లు పోలీసులను హత్య, హత్యాయత్నం చేసే స్థాయిలో పేట్రేగి పోతున్నారని.. అయినా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులోకి రావాలంటే రౌడీషీటర్లపై యూపీ తరహాలో ఉక్కుపాదం మోపాలన్నారు. జూబ్లీహిల్స్‌లో ఒక వర్గం ఓట్ల కోసం మజ్లిస్ కాళ్ల పట్టుకునే స్థాయికి కాంగ్రెస్ దిగజారిపోయిందని విమర్శించారు. అప్పట్లో బీఆర్ఎస్ కూడా ఎన్నికల్లో గెలిచేందుకు కాళ్లు మొక్కే దుస్థితిలో ఉండిందని పేర్కొన్నారు. ఈ రెండు పార్టీలు అధికారంలో ఉన్నప్పుడల్లా మజ్లిస్‌ను పెంచి పోషిస్తున్నాయని విమర్శించారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్ల రాజకీయాలు మానుకోవాలని, డీసీపీ చైతన్యపై హత్యాయత్నం చేసిన రౌడీషీటర్‌పై కఠినంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

వేధింపులపై నిగ్గు తేల్చండి

మహిళా కమిషన్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు

హైదరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కొందరు మహిళా అధికారులను.. మంత్రులు వేధింపులకు గురి చేస్తున్నారన్న వార్తలపై నిగ్గుతేల్చాలని బీఆర్ఎస్ మహిళా నేతలు సునీతా లక్ష్మారెడ్డి, పద్మా దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బీఆర్ఎస్ మహిళా నేతలు మహిళాకమిషన్ కార్యదర్శికి వినతి పత్రాన్ని అందజేశారు. కొందరు మంత్రులు మహిళా అధికారులను ఇంటికి పిలుచుకుని సమీక్షలు చేస్తున్నారంటూ వచ్చిన కథనాలను కమిషన్ సుమోటోగా స్వీకరించాలని వారు కోరారు. మహిళా హక్కులకు భంగం కలిగేలా వ్యవహరించొద్దని, రాజకీయ ప్రయోజనాల కోసం మహిళలను బలి చేయొద్దని హెచ్చరించారు.

జూబ్లీహిల్స్‌లో బీజేపీ-మజ్లిస్ మధ్యే పోటీ

కాంగ్రెస్ గెలిస్తే రాష్ట్రంలో రౌడీ రాజ్యమే.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ధ్వజం



హైదరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ-మజ్లిస్ మధ్యే పోటీ ఉంటుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు చెప్పారు. ఇక్కడి ఓటర్లు బీజేపీని గెలిపించకపోతే శాసనసభలో మజ్లిస్ సభ్యుల సంఖ్య 8 అవుతుందని అన్నారు. హైదరాబాద్‌లో మజ్లిస్‌ను అడ్డుకోవాలంటే బీజేపీ విజయం తప్పనిసరి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయలేకపోయిందని, కానీ జూబ్లీహిల్స్‌లో గెల్స్తే ఆ పార్టీ 'ఆరు కొత్త గ్యారంటీలు' కొత్త మేనిఫెస్టోలా అమలవుతాయని ఎద్దేవా చేశారు. 'ఆ ఆరు గ్యారంటీలు ఏమిటంటే.. జంట నగరాల్లోని రౌడీ షీటర్లపై కేసుల ఎత్తివేత - వసూళ్లకు రౌడీ షీటర్లకు ప్రత్యేక లైసెన్సులు - బెదిరింపులు, దౌర్జన్యాలపై కేసులు నమోదు చేయకపోవడం - వయసు పైబడిన రౌడీ షీటర్లకు నెలకు రూ.50,000 పింఛన్ - రౌడీ షీటర్లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు - భూకబ్జాలు, సెటిల్మెంట్లకు ప్రత్యేక లైసెన్స్ జారీ' అని రాంచందర్‌రావు తీవ్రంగా విమర్శించారు. సోమవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అంతకుముందు జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రచార వ్యూహంపై కేంద్ర కిషన్‌రెడ్డితో కలిసి రాంచందర్‌రావు సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలోని ఏడు డివిజన్‌లలో శక్తి కేంద్రాల వారీగా సీనియర్ నాయకులకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, పోలీసులకు కూడా రక్షణ లేకుండా పోయిందని అన్నారు. 'మొన్న హైదరాబాద్‌లో ఒక డీసీపీపై జరిగిన దాడి ఘటన విచారకరం. అయితే అంతకంటే దారుణమైన విషయం ఏమిటంటే.. పోలీసు అధికారులపై దాడి చేసిన వారిని ఎంఐఎం నాయకులు ఆసుపత్రిలో పరామర్శించడానికి వెళ్లడం' అని పేర్కొన్నారు. తెలంగాణాలో ఒకవైపు గన్ కల్చర్, హింస పెరుగుతుంటే, మరోవైపు కాంగ్రెస్ ఎంఐఎంతో కలిసి శాంతి భద్రతలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. 'బీఆర్ఎస్ ఇప్పుడు పూర్తిగా జీరో అయిపోయింది. 'కారు' రాజకీయంగా పంక్చర్ అయిపోయింది. ఆ కారు ఇప్పుడు షెడ్‌లోనే ఉండిపోయింది. అలాంటి కారులో నుంచి బయటికి వచ్చిన వాళ్లు ఏం మాట్లాడినా, దానికి స్పందించాల్సిన అవసరమే లేదు' అని విమర్శించారు.

బిహార్‌లో ఎన్డీయే కూటమిదే గెలుపు : లక్ష్మణ్

బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమిదే విజయమని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. బిహార్ అభివృద్ధిలో దూసుకుపోతోందని పేర్కొంటూ, కాంగ్రెస్ చేపట్టిన ఓట్ చోరీ నినాదం బూమరాంగ్ అయ్యిందని ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన మీడియాతో జూబ్లీహిల్స్ నియోజకవర్గ సమీక్ష సమావేశంలోనూ మాట్లాడారు. మజ్లిస్‌ను పెంచి పోషించడమే కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల ఎజెండా అని ఆయన దుయ్యబట్టారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ముసుగులో మజ్లిస్‌ను గెలిపించే ప్రయత్నం జరుగుతోందని లక్ష్మణ్ ఆరోపించారు. పోటీ కాంగ్రెస్- బీజేపీ-బీఆర్ఎస్ మధ్య నువ్వా? నేనా? అన్నట్లుగా ఉందన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో చొరబాటుదారులు, రోహింగ్యాలు పెత్తనం చెలాయిస్తున్నారని పేర్కొన్నారు. 'బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు రాష్ట్రాన్ని అవినీతిమయం చేశాయి. ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. యూపీ లాంటి మార్పు తెలంగాణలో కూడా రావాలి' అని లక్ష్మణ్ ఆకాంక్షించారు.

రూ.3 వేల కోట్ల ఆర్థిక మోసం కేసు నిందితుణ్ని..
రూ.2 కోట్లు తీసుకుని వదిలేసిన ఎస్‌ఐ

ముంబై నుంచి తీసుకొస్తూ మార్గమధ్యంలో డీల్.. అతడి కుటుంబసభ్యుల నుంచి డబ్బు వసూలు

- ఆపై అతడు పారిపోవడానికి సహకారం
- పరారయ్యాడని పైఅధికారులకు మస్కా
- అంతర్గత విచారణలో రట్టయిన గుట్టు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సుమారు రూ.3 వేల కోట్ల విలువైన ఆర్థిక మోసం కేసులో నిందితుణ్ని.. రూ.2 కోట్లు తీసుకుని వదిలేశాడో ఎస్‌ఐ! అతడు పరారయ్యాడంటూ పై అధికారులకు సమాచారమిచ్చాడు. అయితే.. సీపీ సజ్జనార్ ఆదేశాల మేరకు అధికారులు విచారణ జరపగా.. విస్తుపోయే విషయాలు తెలిసినట్లు సమాచారం. పోలీసు వర్గాలు తెలిపిన ప్రకారం.. సుమారు 3 వేల కోట్ల రూపాయల విలువైన ఆర్థిక మోసానికి సంబంధించి ఇటీవల ఒక కేసు నమోదైంది. పలు వ్యాపారాల్లో పెట్టుబడితే లాభాలిస్తామంటూ డబ్బు కొల్లగొట్టిన నిందితుణ్ని పట్టుకునేందుకు పోలీసులు ఒక టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేశారు. దర్యాప్తు చేసిన ఆ బృందం.. నిందితుడు మహారాష్ట్రలోని ఓ ప్రాంతంలో తలదాచుకున్నట్లు గుర్తించింది. అతణ్ని పట్టుకునేందుకు నిబంధనల ప్రకారం ఒక సీఐ నేతృత్వంలోని బృందాన్ని అక్కడికి పంపించాల్సి ఉండగా.. ఓ ఎస్‌ఐ నేతృత్వంలోని టీమ్‌ను పంపించారు. ఆ బృందం అతణ్ని పట్టుకుని హైదరాబాద్‌కు తరలించేందుకు సిద్ధమైంది. ఆ సమయంలోనే.. సదరు సీఐ ఒక మాస్టర్ ప్లాన్ వేశాడు. తన బృందంలోని ఇతర సభ్యులకు తెలియకుండా.. రూ.2 కోట్లు ఇస్తే వదిలేస్తానంటూ నిందితుడితో ఒప్పందం కుదుర్చుకున్నాడు.

వాహనాల మధ్య దూరం ఉండేలా..

నిందితుడితో డీల్ కుదుర్చుకున్న ఎస్‌ఐ.. తన బృందంలోని మిగతా సిబ్బంది అందరినీ ఒక వాహనంలో ఎక్కించి, తాను మాత్రం నిందితుడి వాహనంలో ఎక్కి హైదరాబాద్‌కు బయలు దేరాడు. ముందు బయలుదేరిన పోలీసు సిబ్బంది వాహనానికి.. తాను ప్రయాణిస్తున్న వాహనానికి మధ్య 30 కి.మీ దూరం ఉండేలా ప్లాన్ చేసుకున్నాడు. రూ.2 కోట్లు తీసుకుని ఫలానా హోటల్ వద్దకు రావాలంటూ.. నిందితుడి కుటుంబసభ్యులను ఫోన్ ద్వారా ఆదేశించాడు. వారు ఆ ఎస్‌ఐ చెప్పినట్టుగా ఒక హోటల్ వద్దకు వచ్చారు. నిందితునితో కలిసి ఆ హోటల్‌కు వెళ్లిన ఎస్‌ఐ.. వారి నుంచి డబ్బు తీసుకొని అతణ్ని వదిలేసినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం. అనంతరం.. తాను దారిలో వాహనాన్ని ఆపినప్పుడు నిందితుడు తప్పించుకు పారిపోయాడంటూ ఉన్నతాధికారులకు, టాస్క్‌ఫోర్స్ బృందానికి సమాచారం ఇచ్చాడు. టాస్క్‌ఫోర్స్ ఉన్నతాధికారులు 2-3 బృందాలను రంగంలోకి దింపి నిందితుణ్ని పట్టుకునేందుకు గాలింపు చేపట్టారు. దర్యాప్తు క్రమంలో.. ఎస్‌ఐ తీరుపై పోలీసు ఉన్నతాధికారులకు అనుమానం వచ్చింది. ఎస్‌ఐ ప్రమేయంతోనే నిందితుడు తప్పించుకొని ఉంటాడని అనుమానించిన అధికారులు డిపార్టుమెంటల్ విచారణకు ఆదేశించారు. ఈ విచారణలో.. ఎస్‌ఐ డబ్బు తీసుకుని నిందితుణ్ని వదిలేసినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయినట్లు తెలిసింది. ఆ డబ్బు ఎక్కడ తీసుకున్నాడు? ఎలా తీసుకున్నాడు? ఎక్కడికి తరలించాడు? అనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. 2020 బ్యాచ్‌కు చెందిన ఆ ఎస్‌ఐ తొలి నుంచీ అక్రమాలకు పాల్పడుతున్నట్లుగా పోలీసు దర్యాప్తులో వెల్లడైనట్టు సమాచారం. టాస్క్‌ఫోర్సు విభాగంలో చేరినప్పటి నుంచి అతడు గుట్టుగా అనేక దందాలు, సెటిల్‌మెంట్లకు పాల్పడినట్లు తెలుస్తోంది. అతడికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

అంగన్‌వాడీ కేంద్రంలో 4 ఏళ్ల బాలికపై బాలుడి అత్యాచారం

» వరంగల్ జిల్లాలోని ఓ తండాలో ఆలస్యంగా వెలుగులోకి..

ఖానాపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఓ అంగన్‌వాడీ కేంద్రంలో దారుణం జరిగింది. నాలుగేళ్ల బాలికపై 16 ఏళ్ల బాలుడు అత్యాచారానికి పాల్పడినట్లుగా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని ఓ తండాలో ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన ఓ వివాహిత బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో ఉంటోంది. తన నాలుగేళ్ల కుమార్తెను ఆ తండాలోని తన తల్లి వద్ద ఉంచింది. ఆ చిన్నారి నిత్యం తండాలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళుతోంది. ఎప్పటిలాగే శనివారం ఉదయం కూడా బాలిక అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లింది. కొద్దిసేపటికి అక్కడి అంగన్‌వాడీ టీచర్ బయటకు వెళ్లింది. ఆ సమయంలో అంగన్‌వాడీ టీచర్ కుమారుడు, బాలికను పక్క గదిలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. మర్నాడు ఉదయం బాలిక అమ్మమ్మ ఆ చిన్నారికి స్నానం చేయించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా పాప దుస్తులపై రక్తపుమరకలు, మర్మాంగం వద్ద గాయాలు కనిపించాయి. ఈ విషయాన్ని హైదరాబాద్‌లో ఉంటున్న బాలిక తల్లికి ఫోన్ చేసి ఆమె చెప్పింది. సోమవారం ఉదయం బాలిక తల్లి తండాకు చేరుకుంది. బాలికను తీసుకుని పోలీసుల వద్దకు వెళ్లి జరిగిన విషయంపై ఫిర్యాదు చేసింది. రంగంలోకి దిగిన పోలీసులు వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ఆ మైనర్ బాలుడు తరచుగా అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి అక్కడి పిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని స్థానికులు చెప్పారు.

లైంగిక దాడికి యత్నించిన వ్యక్తికి ఐదేళ్ల జైలు

» 50 వేల జరిమానా.. నల్లగొండ పోక్సో కోర్టు తీర్పు

నల్లగొండ క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి యత్నించిన కేసులో నిందితుడైన ఆటోడ్రైవర్ గొర్ల సైదులుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.50వేల జరిమానా విధిస్తూ నల్లగొండ న్యాయస్థానం సోమవారం తీర్పునిచ్చింది. జరిమానా సొమ్ము రూ.50వేలతో పాటు, ఉపశమనం కింద జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా మరో రూ.5లక్షల పరిహారాన్ని ఆ బాలికకు అందించాలని ఆదేశించింది. ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసుల ప్రత్యేక న్యాయస్థానం జడ్జి ఎన్.రోజారమణి ఈ తీర్పును వెలువరించారని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్ చెప్పారు. తిప్పర్తి గ్రామానికి చెందిన గొర్ల సైదులు 2019 మే 29న ఒక బాలికను కిడ్నాప్ చేసి లైంగికదాడికి ప్రయత్నించాడు. ఆ బాలిక కేకలు వేయడంతో తిరిగి తీసుకొచ్చి గ్రామ సమీపంలో వదిలివెళ్లిపోయాడు. అదే రోజు రాత్రి ఆమె తండ్రి తిప్పర్తి పీఎస్‌లో ఫిర్యాదు చేయగా.. పోక్సోతో పాటు ఇతర సెక్షన్ల కింద కేసు నమోదైంది. పోక్సో చట్టం సెక్షన్ 10 కింద ఐదేళ్ల జైలు శిక్ష, రూ.25వేల జరిమానా విధించింది. ఐపీసీ సెక్షన్-366(ఏ) కింద మరో ఐదేళ్ల జైలుశిక్ష, రూ.25వేల జరిమానా విధించింది. ఈ రెండు శిక్షలను ఏకకాలంలో అమలు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది.

బాలికల మూత్రశాలలో రహస్య కెమెరాలు

» పాఠశాల అటెండర్‌పై పోక్సో కేసు.. సస్పెన్షన్ వేటు

గంగాధర, భరత్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల అటెండర్ బాలికల మూత్రశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వీడియోలు చిత్రీకరిస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. దాంతో పోలీసులు అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని ఓ పాఠశాలలో వరంగల్ జిల్లాకు చెందిన యాకూబ్ పాషా అటెండర్‌గా పనిచేస్తున్నాడు. బాలికల మూత్రశాలలో గోప్యంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రెండేళ్లుగా వీడియోలు, ఫొటోలు తీస్తున్నాడు. వారం క్రితం కొందరు విద్యార్థినులు మూత్రశాలలో ఓ పరికరాన్ని గమనించి తల్లిదండ్రులకు చెప్పారు. ఈ ఘటనపై శుక్రవారం డీసీపీవో, డీడబ్ల్యువో, గంగాధర ఎంఈవో సభ్యులుగా త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసిన కలెక్టర్ విచారణకు ఆదేశించారు. అధికారుల విచారణ అనంతరం నిందితుడు యాకూబ్‌పై పోక్సో కేసు నమోదు చేశారు. యాకూబ్ పాషాను సస్పెండ్ చేస్తూ జడ్పీ సీఈవో శ్రీనివాస్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఈ సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పోలీసులను ఆదేశించారు.

భార్య కాపురానికి రావట్లేదని కానిస్టేబుల్ ఆత్మహత్య

కామారెడ్డి రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏడాదిన్నరగా భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన ఓ కానిస్టేబుల్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకున్న ఘటన కామారెడ్డి పట్టణంలో చోటు చేసుకుంది. జిల్లాలోని రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామానికి చెందిన రేకులపల్లి జీవన్‌రెడ్డి(37) ఫోరెన్సిక్ విభాగంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. జీవన్‌రెడ్డికి ముస్తాబాద్ మండలం మొరాయిపల్లికి చెందిన చందనతో 11 ఏళ్ల క్రితంవివాహం జరిగింది. వీరికి మోక్ష, కృతిక అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మూడేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. ఏడాదిన్నర క్రితం పుట్టింటికి వెళ్లిపోయిన భార్య.. ఎన్నిసార్లు అడిగినా కాపురానికి రాలేదు. ఇటీవల విడాకుల నోటీసులు పంపడంతో జీవన్‌రెడ్డి తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. సోమవారం ఉదయం 7:30 బైక్‌పై బయటకు వెళ్లిన జీవన్‌రెడ్డి.. అడ్లూర్ శివారులోని రాధాస్వామి సత్సంగ్ ఆశ్రమం వెనకాల పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. అటువైపుగా వెళ్తున్న పశువుల కాపరి మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. కామారెడ్డి ఎస్పీ రాజేష్‌చంద్ర, సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్యరెడ్డి, రూరల్ సీఐ రామన్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు.

ఏసీబీ వలకు చిక్కిన గ్రామ పరిపాలన అధికారి



ఏసీబీకి పట్టుబడ్డ గ్రామ పరిపాలనాధికారి శ్రీనివాస్‌నాయక్

ములకలపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి యాప్ వచ్చిన అనంతరం రిజిస్ట్రేషన్ కోసం వెళ్లిన ఓ రైతును పూసుగూడెం గ్రామ పరిపాలనాధికారి (జీపీవో) శ్రీనివాస నాయక్ లంచం ఇవ్వాల్సిందేనని పీడించాడు. దిక్కుతోచని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. సోమవారం వారు వలపన్ని నిందితుడిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. వివరాలివీ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలంలోని వేముకుంటకు చెందిన ఓ రైతు పూసుగూడెంలో 2.5ఎకరాల వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్‌కు 22న భూ భారతిలో స్లాట్ బుక్ చేసుకున్నాడు. తీరా అక్కడికి వెళ్లినపుడు పూసుగూడెం జీపీవో శ్రీనివాస నాయక్ లంచం డిమాండ్ చేశాడు. రూ.60వేలు ఇస్తేనే రిజిస్ట్రేషన్ అవుతుందన్నాడు. తొలుత ఆ రైతు నుంచి రూ.40వేలు తీసుకున్నాడు. అయినప్పటికీ పని చేయకుండా మిగిలిన రూ.20వేలు నగదు ఇవ్వాల్సిందేనంటూ ఇబ్బందులు పెట్టాడు. చివరకు రూ.15వేలు తీసుకునేందుకు అంగీకరించాడు. విసిగిపోయిన ఆ రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. పథకం ప్రకారం ఆ నగదును అందజేస్తుండగా.. ఏసీబీ అధికారులు నిందితుడిని పట్టుకున్నారు.

హెచ్‌ఆర్సీని ఆశ్రయించిన రియాజ్ కుటుంబం

» కానిస్టేబుల్ రూ.3 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆరోపణ

గన్‌పార్క్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లాలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన రియాజ్ కుటుంబసభ్యులు సంచలన ఆరోపణలతో మానవ హక్కుల కమిషన్‌ను (హెచ్‌ఆర్సీ) ఆశ్రయించారు. హత్యకు గురైన కానిస్టేబుల్ ప్రమోద్ కుమార్, రియాజ్ నుంచి ఏకంగా రూ.3లక్షలు డిమాండ్ చేశారని, ఇప్పటికే రూ.30వేలు చెల్లించాడని రియాజ్ కుటుంబం ఆరోపించింది. ఈ డబ్బుల లావాదేవీలే ఘర్షణకు మూలంగా మారాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం రియాజ్ తల్లి, అతడి సతీమణి కమిషన్ ఛైర్మన్ జస్టిస్ డా.షమీమ్ అక్తర్‌ను కలిసి పోలీసులపై ఫిర్యాదు సమర్పించారు. తమను తీవ్ర మానసిక, శారీరక వేధింపులకు గురిచేస్తున్నారని వారు ఆరోపించారు. ఈ ఫిర్యాదుపై వెంటనే స్పందించిన జస్టిస్ షమీమ్ అక్తర్ కీలక ఆదేశాలు జారీ చేశారు. రియాజ్ కుటుంబ సభ్యులపై పోలీసులు ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టకూడదని డీజీపీని ఆదేశించారు.

నేడు, రేపు భారీ వర్షాలు

» రాష్ట్రంపై మొంథా తుపాను ప్రభావం

» ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ

» పంటల కొనుగోళ్లపై అప్రమత్తంగా ఉండాలి

» అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు



హైదరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడ్డ తీవ్ర వాయుగుండం మరింత బలపడి ఆదివారం రాత్రి తుపానుగా మారింది. ఈ తుపానుకు మొంథా అనే పేరు పెట్టినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నెల 28(మంగళవారం) ఉదయానికి ఇది తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని తెలిపింది. మంగళవారం సాయంత్రం లేదా రాత్రి ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం, కళింగపట్నం మధ్య లో కాకినాడకు సమీపంలో ఏపీ తీరాన్ని దాటే అవకాశం ఉందని పేర్కొంది. దీని ప్రభావంతో తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. మంగళ, బుధవారాల్లో కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మంగళవారం పెద్దపల్లి, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో అతి భారీ వర్షాలు, నిర్మల్, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ రెండు రోజుల పాటు రాష్ట్రానికి ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. తెలంగాణకు భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో పంటల కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. ధాన్యం, పత్తి, మొక్కజొన్న పంటల కొనుగోళ్లు జరుగుతున్న నేపథ్యంలో రైతులకు నష్టం జరగకుండా, ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే సీఎం ఆదేశాలతో సోమవారం సాయంత్రం జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను నేపథ్యంలో దక్షిణమధ్య రైల్వే ముందస్తు జాగ్రత్తలు చేపట్టింది. జోన్ పరిధిలోని మొత్తం 92 ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసింది. వాటిలో హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే 10 ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఉన్నాయి. ఈనెల 28, 29 తేదీ ల్లో రద్దయిన రైళ్లలో లింగంపల్లి-విశాఖపట్నం జన్మభూమి ఎక్స్‌ప్రెస్, చర్లపల్లి-షాలిమార్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-హౌరా ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-భువనేశ్వర్-సికింద్రాబాద్(2) విశాఖ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్-భువనేశ్వర్-హైదరాబాద్ స్పెషల్స్(2), హైదరాబాద్-విశాఖపట్నం గోదావరి ఎక్స్‌ప్రెస్, మహబూబ్‌నగర్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-విశాఖపట్నం గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లున్నాయి. దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ విజయవాడలోని డీఆర్ఎం కార్యాలయంలో తుపానుపై భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.

అసంపూర్తిగా గిరిజన గురుకులాలు!

18 నెలల్లో చేయాల్సిన భవనాల నిర్మాణం.. అధికారుల నిర్లక్ష్యంతో ఏళ్ల తరబడి పెండింగ్

» 98 భవనాలకు పూర్తయింది 43

» 2016లో మంజూరైనా.. ఇంకా సాగదీత

» ప్రభుత్వంపై ఏటా 7% అదనపు భారం

» అద్దె భవనాల్లో సౌకర్యాల్లేక ఇబ్బందులు

» అధికారులు, కాంట్రాక్టర్ల కుమ్మక్కు.. నిబంధనలు గాలికి



కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేటలో అసంపూర్తిగా ఉన్న గురుకుల భవనం

హైదరాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యంతో గిరిజన గురుకులాల భవనాల నిర్మాణం పూర్తి కావడం లేదు. 18 నెలల్లో పూర్తి కావాల్సిన పనులు ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే ఉన్నాయి. నిధులు ఉన్నా సకాలంలో పూర్తి చేయకపోవడంతో ఏటా 7 శాతం ఎస్ఎస్ఆర్ ధర పెంపుతో ఖజానాపై అదనపు భారం పడుతోంది. అధికారులు, కాంట్రాక్టర్ల కుమ్మక్కై నిబంధనలకు నీళ్లొదిలారన్న ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు అద్దె భవనాల్లో సౌకర్యాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో 188 గురుకుల విద్యాసంస్థలు ఉన్నాయి. వాటిలో 98 గురుకులాల భవన నిర్మాణాలకు ప్రభుత్వం 2016-17, 2022-23లో రూ.463 కోట్లు మంజూరు చేసింది. ఒక్కో భవనానికి రూ.4.20 కోట్ల చొప్పున కేటాయించగా జీ ప్లస్ 3 భవనంతో పాటు ఓహెచ్ఎస్ఆర్, ప్రహరీగోడ, కిచెన్, డైనింగ్ నిర్మించాలి. ఇప్పటి వరకు రూ.164 కోట్ల ఖర్చుతో 43 భవనాల నిర్మాణం పూర్తి చేసినట్లు ఆ శాఖ నివేదికల్లో పేర్కొన్నా.. పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించకపోవడంతో వాటిలో చాలావరకు అందుబాటులోకి రాలేదు. ఇప్పటికీ మరో 51 భవనాల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. 2022-23లో రూ.195 కోట్లతో 45 పనులు మంజూరు కాగా వీటిలో ఒక్కటీ పూర్తి కాలేదు. 2016-17లో మంజూరైన వాటిలో సైతం చాలా వరకు అసంపూర్తిగానే ఉన్నాయి. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేటలో భవనం జీ ప్లస్ 2 వరకే పూర్తయింది. నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేయకుండా అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. ఇబ్రహీంపట్నంలో కూడా ఇలాంటి పరిస్థితే నెలకొంది. నల్గొండ జిల్లా దామరచర్లలో ఇటీవల పనులు మొదలుపెట్టి మొదటి అంతస్తు శ్లాబ్ వేశారు. అదనపు నిధులు మంజూరయ్యాకే పనులు కొనసాగిస్తామని కాంట్రాక్టర్ పనులు ఆపేస్తే.. అధికారులు మౌనంగా ఉండిపోయారు. రంగారెడ్డి జిల్లా కౌడిపల్లిలో స్థల సేకరణలో ఇబ్బందులను సాకుగా చూపుతూ పనులు మొదలు పెట్టలేదు. హైదరాబాద్, ఏటూరు నాగారం, భద్రాచలం, ఉట్నూరు, మెదక్ తదితర డివిజన్లలో కూడా భవనాలు పూర్తికాలేదు. ఈ పనులు మంజూరై 8 ఏళ్లు దాటిపోవడంతో ఏడాదికి 7 శాతం చొప్పున 56 శాతం ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడింది. అప్పటి ధరలకు అనుగుణంగా ఒక్కో భవనానికి రూ.4.20 కోట్ల చొప్పున నిర్ణయించగా అదనంగా రూ.2.50 కోట్లకుపైనే చెల్లించాల్సి వచ్చింది.

పునాదిలో రాయి కటింగ్‌కే రూ.కోటి!:

భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాల్సిన ఇంజినీరింగ్ అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై నిబంధనలను విస్మరించారు. అందుకు మెదక్ జిల్లా నర్సాపూర్, హైదరాబాద్‌లోని ఆసిఫ్‌నగర్ భవన నిర్మాణాలే ఉదాహరణ. నర్సాపూర్‌లో పునాదుల్లో రాయి కటింగ్‌కు సుమారు రూ.1.20 కోట్లు ఖర్చు చేశారు. వాస్తవానికి ప్రభుత్వం రాయి కటింగ్‌కు క్యూబిక్ మీటరుకు రూ.900 చొప్పున ధర నిర్ణయించగా ఇంజనీరింగ్ అధికారులు ఏకంగా రూ.2,200పైనే పెంచేశారు. ఈ ధర చాలా ఎక్కువని న్యాక్ అభ్యంతరం తెలిపినా పట్టించుకోలేదు. న్యాక్ నివేదికలను మాయంచేసి ఎక్కువ ధరకు బిల్లులు చేసినట్లు సమాచారం. భవనానికి కేటాయించిన రూ.4.20 కోట్లలో ఎక్కువ మొత్తం పునాదుల దశలోనే ఖర్చవడంతో నిధులు సరిపోవట్లేదంటూ పనులు ఆపి.. అదనపు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం కొసమెరుపు. ఇక ఆసిఫ్ నగర్‌లో భవన నిర్మాణ పనులు మొదలుకాలేదు. ఇక్కడ అనుమతి లేకున్నా 110 మీటర్ల ప్రహరిగోడ నిర్మాణానికి రూ.1.10 కోట్లు ఖర్చు చేశారు. డీపీఆర్ లేకుండానే ప్రహరి నిర్మించేసి.. నిధులు సరిపోవట్లేదని భవన నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేశారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఎంత లోపభూయిష్టంగా ఉందో చెప్పడానికి కూడా ఇవి నిదర్శనమన్న విమర్శలు వస్తున్నాయి.

త్వరలోనే జిల్లా స్థాయి అసైన్డ్ కమిటీలు

» పెండింగ్‌లో 1,75,000 పైగా దరఖాస్తులు

» డిసెంబరులోగా పరిష్కారం

హైదరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే నెలలో జిల్లా స్థాయి అసైన్డ్ కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం రాష్ట్రంలో అసైన్డ్ భూముల వివాదాలకు సంబంధించి 1,75,000 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిపై రెవెన్యూ అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. అసైన్డ్ కమిటీల ద్వారా డిసెంబరు 9లోపు ఈ దరఖాస్తులకు పరిష్కారం చూపాలని ప్రభుత్వం భావిస్తోంది. అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా అసైన్డ్ భూముల వివాదాలను పరిష్కరించే దిశగా కాంగ్రెస్ సర్కారు అడుగులు వేస్తోంది. ఈ మేరకు ప్రతి జిల్లాలో ఇన్‌చార్జి మంత్రి చైర్మన్‌గా, కలెక్టర్ కోచైర్మన్‌గా లేదా కన్వీనర్‌గా కమిటీలను ఏర్పాటు చేసేలా రెవెన్యూ శాఖ విధివిధానాలు రూపొందించింది. గతంలో ఉన్న మండల, నియోజకవర్గ స్థాయి కమిటీలను రద్దు చేస్తూ జిల్లా స్థాయిలో ఒకే కమిటీ ఉండాలన్న ప్రతిపాదనకే ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు తెలిసింది. ఆ కమిటీలో జిల్లాకు చెందిన ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు సభ్యులుగా ఉంటారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 25లక్షల ఎకరాల అసైన్డ్ భూములను పేదలకు కేటాయించగా.. చాలా వరకు పెద్దల చేతుల్లో ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై రెవెన్యూశాఖ జిల్లాల వారీగా కేటాయించిన అసైన్డ్ భూములు, సాగు దారుల వివరాలను సేకరించింది. అనర్హులు, ధనవంతుల చేతుల్లో అసైన్డ్ భూములు ఉంటే వాటిని స్వాధీనం చేసుకుంటామని రెవెన్యూ శాఖ ఇదివరకే ప్రకటించింది. రెవెన్యూ సదస్సుల్లో భూములు కేటాయించాలంటూ కొత్తగా దరఖాస్తులు పెట్టుకున్నవారూ ఉన్నారు. అసైన్డ్ కమిటీలు ఏర్పాటయ్యాక ఇలాంటి సమస్యలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అలాగే, ప్రభుత్వ భూముల్లో సాగు చేసుకుంటున్న నిరుపేదలకు పాస్ పుస్తకాలు, పీవోటీ చట్టం కింద కొనుగోలు చేసిన భూముల క్రమబద్ధీకరణ వంటి అంశాలపైనా ఈ కమిటీలు నిర్ణయం తీసుకోనున్నాయి.



విద్యా రుణం విషయంలో బ్యాంక్‌కు చుక్కెదురు

» యూనియన్ బ్యాంకు అప్పీలును కొట్టేసిన రాష్ట్ర వినియోగదారుల ఫోరం

» రుణబీమా విషయంలో బ్యాంకు నిర్లక్ష్యంగా వ్యవహరించిందని తీర్పు

» జిల్లా ఫోరం తీర్పును యథాతథంగా అమలుచేయాలని ఆదేశం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఓ విద్యా రుణానికి సంబంధించిన బీమా వ్యవహారాన్ని నిర్వహించడంలో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని పేర్కొంటూ బ్యాంకు అప్పీలును రాష్ట్ర వినియోగదారుల ఫోరం తిరస్కరించింది. విద్యా రుణంలో బకాయి మొత్తాలను రద్దు చేయడంతో పాటు రుణగ్రహీత తల్లిదండ్రులకు రూ.50 వేల పరిహారం, కోర్టు ఖర్చుల కింద మరో రూ.20 వేలను ఆదేశాలు అందుకున్న నాటి నుంచి 45 రోజుల్లోగా చెల్లించాల్సిందిగా గతంలో జిల్లా ఫోరం ఇచ్చిన తీర్పును సమర్థించింది. కేసు వివరాల్లోకి వెళ్తే, యూఎస్‌లో ఉన్నత విద్యనభ్యసించడం కోసం లతిక శ్రీదత్త నంబూరి అనే విద్యార్థి 2011లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద రూ.10 లక్షల విద్యా రుణం తీసుకున్నారు. ఆ మొత్తం రుణంపై జీవిత కాలానికి బీమా కూడా తీసుకున్నారు. ఆ సమయంలో అతడి తల్లిదండ్రులు తమ ఇంటిని సెక్యూరిటీగా చూపించారు. ఈ నేపథ్యంలో 2016లో అమెరికాలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో శ్రీదత్త మృతి చెందారు. దీంతో రుణాన్ని బీమా ద్వారా క్లెయిమ్ చేయాలని బ్యాంకును విద్యార్థి తల్లిదండ్రులు కోరారు. దానికి ఒప్పుకోని బ్యాంకు, బీమా గడువు 2014లోనే ముగిసిందని, తిరిగి రెన్యూవల్ చేయకపోవడంతో రుణం మొత్తాన్ని చెల్లించాలని లేకపోతే హామీగా పెట్టిన తమ ఇంటిని జప్తు చేస్తామని తెలిపింది. దీనిపై విద్యార్థి తల్లిదండ్రులు జిల్లా వినియోగదారుల ఫోరంను ఆశ్రయించగా.. రుణం మొత్తాన్ని రద్దు చేయాల్సిందిగా ఫోరం తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ బ్యాంకు, రాష్ట్ర ఫోరంను ఆశ్రయించింది. ఇరుపక్షాల వాదనలు విన్న రాష్ట్ర ఫోరం తీర్పునిస్తూ.. బ్యాంకు 2005లో జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం రుణానికి బీమా కవరేజీ జీవిత కాలానికి ఉండాలి, కానీ వినియోగ దారులకు తెలియకుండా దానిని బ్యాంకు మూడు సంవత్సరాలకు పరిమితం చేసిందని పేర్కొంది. బ్యాంకు పత్రాల్లో రుణానికి సంబంధించిన వివరాలు పూర్తిగా లేవని, పాలసీ కాపీని కూడా రుణగ్రహీతలకు బ్యాంకు అందజేయలేదని పేర్కొంది. దీంతో పాలసీ 2014లోనే ముగిసిందని బ్యాంకు చేసే వాదనలు చెల్లవని పేర్కొంటూ.. ఇలాంటివి రుణ వసూళ్ల వివాదాల కిందికి కాకుండా సేవల లోపం కిందికి వస్తాయని తెలిపింది. బ్యాంకు అప్పీలును కొట్టివేస్తూ.. జిల్లా ఫోరం ఇచ్చిన తీర్పును యథాతథంగా అమలు చేయాలని ఆదేశించింది.

‘ఫిల్మ్‌చాంబర్’ను కాపాడుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)



కావ్వొత్తులతో నిరసన తెలుపుతున్న సినీ ప్రముఖులు మురళీమోహన్, సురేశ్‌బాబు తదితరులు

తరలివచ్చిన సమయంలో ఫిల్మ్ చాంబర్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకోసం ఫిల్మ్‌నగర్ హౌసింగ్ సొసైటీ ఎకరా స్థలాన్ని చాంబర్‌కు 30 ఏళ్లకు లీజుకిచ్చింది. వచ్చే ఏడాది ఫిబ్రవరితో లీజు గడువు ముగుస్తుండడంతో ఆ స్థలాన్ని అభివృద్ధి చేయాలని సొసైటీ ప్రయత్నిస్తోంది. అక్కడ వాణిజ్య భవన సముదాయం ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పలువురు సినీ ప్రముఖులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సినీ పరిశ్రమ కోసం ఇచ్చిన స్థలాన్ని సినిమా బాగు కోసమే వాడాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నటుడు మురళీమోహన్ మాట్లాడుతూ.. తెలుగు చిత్ర పరిశ్రమ హైదరాబాద్ రావడం కోసం నాటి ఏపీ ప్రభుత్వం పరిశ్రమ కార్యాలయాల ఏర్పాటుకు స్థలాలు కేటాయించిందన్నారు. ఇందులోనే ఫిల్మ్‌నగర్ హౌసింగ్ సొసైటీని కూడా 40 ఏళ్ల కిందట ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నిబంధనల ప్రకారం ఫిల్మ్‌చాంబర్ భవనాన్ని చిత్ర పరిశ్రమకు సంబంధించిన కార్యకలాపాలకే వాడాలన్నారు. ప్రస్తుత నిర్మాతల మండలి మాత్రం డెవలప్‌మెంట్ పేరిట ఇతరులకు అప్పగించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఇందులో 75 శాతం నిర్మాణదారుడికి 25 శాతం నిర్మాతల మండలికి చెందేలా ఒప్పందం కూడా సిద్ధమైనట్లు తెలిసిందని.. ఈ విషయంపై సినీ పరిశ్రమకు చెందిన ప్రతి ఒక్కరు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. "అంగుళం కూడా బయటవాళ్లకు దక్కనివ్వం. ప్రతి అంగుళం సినీ పరిశ్రమకు సంబంధించిందే ఉండాలి తప్ప, బయటవాళ్లకు ఎవరికో డెవలప్‌మెంట్‌కు ఇవ్వడం కుదరదు. చాంబర్, కౌన్సిల్, దర్శకుల సంఘం, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, ఎడిటింగ్ రూమ్స్ ఇలా అన్నీ సినీ రంగానికి సంబంధించినవే ఉండాలి. బయటవి ఏవీ రావడానికి వీల్లేదు. ఈ భవనం కట్టి దాదాపు 40 ఏళ్లవుతోంది. దీన్ని నవీకరించి, పార్కింగ్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. సినీ పరిశ్రమకు చెందిన అన్ని సంస్థలూ ఇక్కడే ఉండేలా చూడాలి. ఏఐ లాంటి సాంకేతికత కోసం శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయాలి" అని మురళీమోహన్ సూచించారు.

ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే సహించేది లేదు

నిర్మాతల మండలి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని నిర్మాత సురేశ్‌బాబు చెప్పారు. నిర్మాతల మండలికి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి చేయాలనుకుంటే పూర్తిగా సినీ పరిశ్రమకు ఉపయోగపడేలా ఉండాలి తప్ప ఎవరికో ప్రయోజనం చేకూర్చేలా ఉండకూడదని స్పష్టం చేశారు. "ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌ను ఇంటర్నేషనల్ సినీ హబ్‌గా చేస్తామన్నారు. ఆయన చెప్పినట్లు దీన్ని పరిశ్రమ బాగుకు ఉపయోగించాలి" అని నటుడు, నిర్మాత అశోక్ కుమార్ అన్నారు. చెన్నై నుంచి వచ్చి సినీ పరిశ్రమ ఇక్కడ నిలదొక్కుకోవడానికి కారణం ఈ భవనమేనని చెప్పారు. దీన్ని కాపాడుకోవడానికి పెద్దలంతా కలిసి ఆలోచన చేయాలని కోరారు. 'చాంబర్ ఇక్కడే కొనసాగాలని అందరూ కోరుకుంటున్నారు. చిత్ర పరిశ్రమ అభివృద్ధికి దోహదపడేలా నిర్ణయాలు ఉండాలి' అని చాంబర్ మాజీ అధ్యక్షుడు కె.బసిరెడ్డి అన్నారు.

చర్చలకు సిద్ధం: సొసైటీ

సినీ ప్రముఖుల నిరసనపై ఫిల్మ్‌నగర్ హౌసింగ్ సొసైటీ స్పందించింది. అందులో పాల్గొన్నవారు నిర్మాతలు కాకముందే తమ సొసైటీ సభ్యులని, ఏమైనా అభ్యంతరాలుంటే జనరల్ బాడీ సమావేశంలో చర్చించవచ్చని సొసైటీ పాలకమండలి సూచించింది.

పరకామణి చోరీ కేసులో రాజీపై సీఐడీ దర్యాప్తు

» ఏపీ హైకోర్టు కీలక ఉత్తర్వులు

» నిందితుడు రవికుమార్ ఆస్తులపైనా విచారణ జరపాలని ఏసీబీకి నిర్దేశం

అమరావతి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) పరకామణిలో చోరీకి సంబంధించి నమోదైన కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడంపై సమగ్రంగా దర్యాప్తు చేయాలని సీఐడీని ఏపీ హైకోర్టు ఆదేశించింది. ఈ మొత్తం వ్యవహారంలో టీటీడీ బోర్డు, టీటీడీ అధికారులు, దర్యాప్తు అధికారి(ఐవో), పరకామణి అప్పటి అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి(ఏవీఎస్‌వో) సతీశ్‌కుమార్ పాత్రలపై దర్యాప్తు చేసి.. తదుపరి విచారణ నాటికి సీల్డ్ కవర్‌లో నివేదికను రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) ద్వారా తమకు సమర్పించాలని ఆదేశించింది. కేసు దర్యాప్తు కోసం సీఐడీలో డైరెక్టర్ జనరల్ (డీజీ) స్థాయికి తగ్గని అధికారిని దర్యాప్తు అధికారిగా నియమించాలని స్పష్టం చేసింది. అలాగే పరకామణిలో చోరీకి పాల్పడిన సీవీ రవికుమార్, ఆయన కుటుంబ సభ్యుల ఆస్తులపై సమగ్ర దర్యాప్తు చేయాలని అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)ని ఆదేశించింది. వారి స్థిర-చరాస్తులతో పాటు బ్యాంకు ఖాతాలను కూడా పరిశీలించాలని.. వారు ఆ ఆస్తులను వారి ఆదాయానికి తగినట్లే ఆర్జించారా అనే కోణంలో లోతైన దర్యాప్తు చేయాలని.. వారు ఆ ఆస్తులను రిజిస్ట్రేషన్, ఇతర మార్గాల్లో వేరొకరికి దఖలు పరిచారా అనే విషయంపైనా దర్యాప్తు చేయాలని స్పష్టం చేసింది. దర్యాప్తులో తేలిన అంశాల ఆధారంగా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో కూడా ప్రతిపాదించాలని తెలిపింది. సీల్డ్ కవర్‌లో నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది. ఏసీబీలో డీజీ ర్యాంకు స్థాయి అధికారిని దర్యాప్తు అధికారిగా నియమించాలని ఆదేశించింది. కేసు రాజీకి సంబంధించి లోక్ అదాలత్ జారీ చేసిన ఉత్తర్వుల చట్టబద్ధతను తేల్చాల్సింది ధర్మాసనమేనని.. అందువల్ల ఈ వ్యవహారాన్ని తేల్చేందుకు వీలుగా ఉత్తర్వుల ప్రతిని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముందుంచాలని రిజిస్ట్రీని ఆదేశించింది. సీజ్ చేసి తమకు సమర్పించిన 16 బండిళ్ల రికార్డులను సీఐడీ డీజీకి అందజేయాలని రిజిస్ట్రార్‌కు ఆదేశాలిచ్చింది.

చోరీ కేసులో రాజీ ఉత్తర్వులు జారీ చేసిన అప్పటి తిరుపతి మొదటి తరగతి రెండో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ వార్షిక రహస్య నివేదిక(ఏసీఆర్)లో ఉత్తర్వుల ప్రతిని పొందుపరచాలని రిజిస్ట్రార్ (విజిలెన్స్)ను హైకోర్టు ఆదేశించింది. న్యాయ వ్యవస్థలో పరిపాలనాపరమైన పారదర్శకత, సమగ్రత కోసం సదరు మేజిస్ట్రేట్‌ను తక్షణమే ప్రొటోకాల్ విధుల నుంచి పక్కనపెట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఈ వ్యవహారంలో తగిన చర్యలు తీసుకునేందుకు ఉత్తర్వుల ప్రతిని సంబంధిత పరిపాలనా కమిటీ ముందు ఉంచాలని రిజిస్ట్రార్(జ్యుడీషియల్)ను ఆదేశించింది. వ్యాజ్యంపై తదుపరి విచారణను డిసెంబరు 2వ తేదీకి వాయిదా వేసింది. మరోవైపు.. ఈ వ్యాజ్యంలో తమను ప్రతివాదిగా చేర్చుకుని వాదనలు వినిపించేందుకు అవకాశం ఇవ్వాలని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌పై కౌంటర్ వేయాలని నిందితుడు రవికుమార్, అప్పటి ఏవీఎస్‌వో సతీశ్‌కుమార్‌ను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ సోమవారం ఉత్తర్వులిచ్చారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.